





శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు



# హరి నీమయమే అంతాను

(సంపుటి - III)

## ఎన్నుకొన్న

## అన్నమయ్య మధురకీర్తనలకు

### ఉపోద్ఘాతము మరియు తాత్పర్యవివరణ

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

M.Tech.

# హరి నీమయమే అంతాను

(సంపుటి - III)

మొదటి ప్రచురణ

**అక్టోబరు 2013**

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

వెల : **అమూల్యం**

ప్రతులకు :

**ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,**

**హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360**

డి.టి.పి. ప్రింటింగ్ :

**కె.వి.ఆర్.**

**98495 79345**





## అంకితము

### దశరథుని కంటివెలుగు అయిన

# శ్రీరామచంద్ర మూర్తికి..



నా ఇష్టదైవము, శ్రీ వేంకటేశ్వరుని త్రేతాయుగ రూపమైన కౌసల్యానందనుడు దశరథుని కంటివెలుగు అయిన శ్రీరామచంద్రమూర్తికి...

మ॥ **నరుడై పుట్టి వసించ మానవునిగా నారాయణుండే ధరన్**
**పరమాన్నంబు భుజించ తాను కలిగెన్ పాపండు కౌసల్యకై**
**సిరితావచ్చెను సీతవోలె దనుజుల్ క్షీణించ లంకేశుతో**
**కరుణాసింధుని కంకితమ్ము నిడెదన్ కావ్యంబునిద్దానిన్.**

తా॥ మానవుడై పుట్టి జీవిస్తేగాని రావణాసురుడు తన చేతిలో చావడని శ్రీమన్నారాయణుడంతటివాడు పరమాన్నము తిన్న కౌసల్యకు పాపనివలె జన్మించాడు. లక్ష్మీదేవి సీతయై రాక్షస సంహార కార్యక్రమానికై తాను సిరులరాణియైకూడా కన్నీరు కార్చింది. ఆమెతో ఈయనా శోకించాడు. ఆ కరుణా సముద్రుడు శ్రీరామచంద్రునికి ఈ కావ్యం అంకితమిచ్చి తరించెదగాక!

# హరి నీమయమే అంతాను

**(సంపుటి - III)**

**ఎన్నుకొన్న అన్నమయ్య మధుర కీర్తనలకు**
**ఉపోద్ఘాతము మరియు తాత్పర్య వివరణ**

## విషయ సూచిక


| క్ర.సం. | విషయం | పేజి |
|---|---|---|
| 1. | అంచితపుణ్యులకైతేహరి | 83 |
| 2. | అందుకేమి దోసమా అట్టేకానీ | 179 |
| 3. | అతడే సకల వ్యాపకుడు | 145 |
| 4. | అన్నిటికీ కారణము హరి | 13 |
| 5. | అన్నిటా భాగ్యవంతుడ వాయమెరిగి | 43 |
| 6. | అన్నిచోట్లా బరమాత్మ నీవు | 119 |
| 7. | అమ్మలాల అక్కలాల అవిగో వింత సుద్దులు | 65 |
| 8. | అరిది సేతలే చేసి | 123 |
| 9. | అలమేలుమంగవు నీవన్నిటా నేర్పరివి | 115 |
| 10. | ఆకాశమద్దమా అవ్వలయు | 135 |
| 11. | ఆటదానికి పతితో అంతచెల్లునా | 27 |
| 12. | ఇంతమేటి వాడవై యింకా యేలజరసేవు | 55 |
| 13. | ఇంతకాకుగలదా | 103 |
| 14. | ఇంతటి దైవమవుమాకు | 79 |
| 15. | ఇంతసేయగా నీకిందుయేమి | 195 |







| | | |
|---|---|---|
| 16. | ఇంతసేసెబో దైవమింతలోనె | 131 |
| 17. | ఇందులో మొదటి కర్తయెవ్వడు | 25 |
| 18. | ఇదియే సులభంబిందరికే | 169 |
| 19. | ఇదెవీడె కంటి మమ్మయేతుల | 29 |
| 20. | ఇద్దరి గూర్చిన వారు ఇప్పుడు | 47 |
| 21. | ఇద్దరిమీజగడాలు యింక | 93 |
| 22. | ఇప్పుడిదె కొలువున్నాడు యింతున దానను | 51 |
| 23. | ఇన్నేసి వాపులతో యిందరి | 99 |
| 24. | ఎంత భక్తవత్సలుడ విటువంటి | 67 |
| 25. | ఎంతవొద్దులేదు నీకు | 147 |
| 26. | ఎక్కగా రాగారాగా యిందాక | 101 |
| 27. | ఎటువంటి వలపులో యిద్దరికి | 121 |
| 28. | ఎన్నడు గలుగు మరి యీ భాగ్యము | 21 |
| 29. | ఎగ్గో తప్పో యెఱగనిది | 31 |
| 30. | ఎప్పుడును నీకేలోనే | 175 |
| 31. | ఎవ్వరివాడో యెఱగరాదు | 91 |
| 32. | ఏమమ్మా యశోద యిదే నీ బిడ్డ | 129 |
| 33. | ఏమందుమిందుకు నెఱిగినదే | 177 |
| 34. | ఏమయ్యా రమణుడ ఇంత సేతురా | 15 |
| 35. | ఏమని చెప్పగవచ్చు నిదివో నీసుద్దులు | 59 |
| 36. | ఏమిటికి వేడుకొనేవింత | 39 |
| 37. | ఏమియు జేయగవద్దు యింతలోనె మోక్షము | 05 |

| | | |
|---|---|---|
| 38. | ఏలవచ్చీ ఏలపోయీ | 149 |
| 39. | కంటిని మన్ననలెల్లా | 81 |
| 40. | కంటేసులభమిది, కానకుంటే | 87 |
| 41. | కదనుండి చూచేనీకు | 33 |
| 42. | కానవచ్చీ గానరాదు కమలాక్ష నీమాయ | 37 |
| 43. | కొమ్మల జవ్వనములు కోరి | 139 |
| 44. | కొలువులోపలనున్న కొమ్మలెల్ల | 115 |
| 45. | కైవసపుదానగాని కపటిగాను | 23 |
| 46. | కొంచెమును ఘనము గనుగొన | 153 |
| 47. | గరిమతో వెరపేల కమలాక్ష | 181 |
| 48. | గొల్లెతల నింతసేసీ | 111 |
| 49. | ఘనుడతడే మముగాచుగాక | 199 |
| 50. | చంచలమతులకు సాత్విక | 95 |
| 51. | చదివి బ్రతుకరో సర్వజనులు | 157 |
| 52. | చిత్తగించురమణుడు | 171 |
| 53. | చెలినేడు తానేమి సేయనమ్మా | 143 |
| 54. | చేకొంటి నిహమే చేరిన పరమని | 45 |
| 55. | చూడ బిన్నవాడుగాని జూటుదనాలు | 85 |
| 56. | జగములెల్లా నీడేరె జయవెట్టి | 189 |
| 57. | తాపలేక మేడలెక్కదలచేము | 17 |
| 58. | తార బ్రహ్మమంత్రము తానై | 61 |
| 59. | తొడిబడసందుసుడి దొంగాడి | 155 |







| | | |
|---|---|---|
| 60. | దిక్కుల నీకతలెల్ల దెలిసెగాక | 03 |
| 61. | దైవమా పరదైవమా | 137 |
| 62. | దైవము పుట్టించినట్టితన | 97 |
| 63. | దొరకునా ఇతని కృప | 141 |
| 64. | నయగారిసటకాద నారసింహో | 187 |
| 65. | నాటిసుద్దులే వింటిమి నేటిసుద్దులు | 35 |
| 66. | నిక్కమమ్మ యశోద నియ్యాన | 191 |
| 67. | నిలువుల మేడలో నిలచున్నోడిదె | 151 |
| 68. | నీచేతిలో వారము నీవారము | 53 |
| 69. | నీవెప్పుడూ ఘనుడవే | 159 |
| 70. | నేరుపరి నీవైతే నెలతైతే | 73 |
| 71. | నేరుపరివౌదువమ్మ నిజము | 167 |
| 72. | పతిమీదటి మోహము | 133 |
| 73. | పరుసము సోకియుబ్రతుకవద్దా | 109 |
| 74. | పారిరి దానవులెల్లా పంచబంగాళమై | 193 |
| 75. | పొలతి దేహమే భూమండలమై | 183 |
| 76. | మందులు మాకులు మరియేల | 197 |
| 77. | బిగిసి యాపె నీకు బెట్టని కోట | 11 |
| 78. | మన జేతికి జిక్కె మగువలాల | 63 |
| 79. | మాటిమాటికి జూచి | 105 |
| 80. | మాయపుదనుజులు | 113 |
| 81. | మీఱరాదు దూరరాదు మేనవానవాన | 19 |

| | | |
|---|---|---|
| 82. | మొక్కెదమిదివో మూడు మూర్తులును | 49 |
| 83. | మొదలివేల్పు మామొరయాలించవె | 165 |
| 84. | మొఱవెట్టెదము మీకు మొగసాల | 71 |
| 85. | మేలెల్ల నొక్కటే మించుతీలూ | 161 |
| 86. | రాజపు నీకెదురేది | 125 |
| 87. | వట్టి బాతిపడినీపై వలపులు | 89 |
| 88. | వలపు గొరబుసేయవద్దే | 107 |
| 89. | వాకిలిగాచేయట్టి వనితలము | 77 |
| 90. | వింటిరటె చెలులాల వేడుక | 69 |
| 91. | విన్నవించితిమి నీకు వేడుక వేళ | 07 |
| 92. | వివేకమెఱగని వెఱ్ఱులము | 01 |
| 93. | వీదుల వీదుల నేగె విట్ఠలేశా | 163 |
| 94. | వెడలె వెడలెనదె వీథుల వీథుల | 57 |
| 95. | శరణమాతనికే సర్వభావాల | 173 |
| 96. | సంసారినైన నాకు సహజమే | 09 |
| 97. | సుఖమును దుఃఖమును జోడు కోడెలు | 75 |
| 98. | సేవింతురా ఇతని చెలగి | 127 |
| 99. | హరి నారాయణ కృష్ణ అదివో | 41 |
| 100. | హరి నీవాడనేకానా ఆదికాలమున | 185 |
| 101. | హరిమంగళము | 202 |




హరి నీమయమే అంతాను

# ప్రార్థన

కం॥ శ్రీహరి అంతా నీమయ-
మాహా! నా తరమెనీదు అతిశయ మెఱుగనే
ఈహల నీ భక్తులకే
ఊహించని రీతి నీదు ఉనికి తెలియుగా

మ॥ జలజాతాక్షుడు సాధువంద్యుడు మహాసామ్రాజ్యదక్షుండు శ్రీ-
లలనామానసమందిరాంగణమునన్ రంజిల్లు వైకుంఠుడున్
కొలువై సప్తగిరీంద్రుడుండ మదిలో కోరేది వేరుండునా
విలువేమున్నది భోగభాగ్య తతికిన్ వేంకన్న సిద్ధైనచో.

తరళము॥
వనజనాభుడు పత్నికోసమువంతనొందుచు కోనలన్
కనులగాంచక పుట్టలోపల కాలమంతయు బుచ్చెరా
తనకుపాలిడు కామధేనువు తానుగాచెను గొల్లనం-
ధునిగ జేసెను నెత్తురోడ్చుచు తూలి శ్రీగిరిజేరెరా.

సీ॥ అన్నమాచార్యులు వెన్నుని అలరించె
శృంగారకీర్తనజెప్పి చెప్పి
మోక్షప్రాప్తికి బాట మురవైరియని జెప్పి
భక్తి కీర్తన లెన్నొ పాడిపాడి
వైరాగ్యకీర్తన పరమాత్మమెచ్చగా
విరివిగా మ్రోగె వీధివీధి
జానపదులుమెచ్చు జానుతెలుగులోన
జాజరపాడెను సారె సారె

తే.గీ॥ నారసింహుడు, రఘుపతి, నగధరుండు,
చెన్నకేశుడు, వేంకట శిఖరపతియె,
రంగుదేలిన అలమేలుమంగ విభుడె
వివరణను వ్రాయు నాజన్మ విలువపెరిగె.

ఉ॥ నాటకమందరున్ నటులె నాకగుపాత్రను నేను దాల్చితిన్
దీటుగపుత్రుడైతిపుడు తీరిచి తొల్లిటి నేను యెవ్వడన్
ఏటికి చింతయే మృగము యేజలజంతువొయే ఖగంబునో
కాటికి పోకతప్పదవకాశము లేదుట కాదనన్ హరీ!

చ॥ ఘనమగు మాయ కమ్మి కనుగానరు లోకులుమంచి చెడ్డలన్
వినయము వందనంబులను వెన్నుని భక్తిని వేంకటేశునికి
చెనకరుపొట్ట నింపుటకు చేతులజాతుల జాతురు 'దేహి' అందురున్
వనితలు బిడ్డలంచు పలు బాధలు సైతురు జన్మజన్మకున్.

కం॥ మురిపించు మల్లెలందము
పరిమళ సంపెంగలిడు సువాసనలెసగన్
పురిగాన శృంగారంబిక
హరి వేంకటవల్లభుండు అతివల గూడున్





# ముందుమాట

"హరినీమయమే అంతాను" అనబడే ఈ సంకీర్తనా ప్రవంతిని మొదలుపెట్టినప్పుడు నా మనస్సులో వున్న ఆలోచన నా అంతిమ శ్వాసదాకా యెన్ని కీర్తనలు అన్నమాచార్యులవారివి వివరించగలిగితే అన్ని వివరిద్దామని మాత్రమే. గతంలో 1010 అన్నమాచార్యులవారి కీర్తనలను ఉపోద్ఘాత సహితముగా తాత్పర్యవివరణ ఇచ్చి, **భావయామి వేంకటేశం – హరి నామమే కదా! అన్నమయ్య వరము** అనే రెండు ప్రతులుగా 30 కాపీలు ప్రింటు (డి.టి.పి) చేయించి శ్రీ వేంకటేశ్వరుని ఆలయాలలో పంచిపెట్టాను. అంతకు మించి నాకు ఆర్థిక స్తోమత లేదు.

నాకు భగవత్కృప కలిగి తిరుమల సందర్శించటానికి వెళ్ళి నా వెంట కొన్ని ప్రతులను అక్కడి పెద్దలకిచ్చి కంప్యూటర్ సి.డి.నందించి నా అశక్తతను మొరవెట్టి దానిని వెలుగులోకి తేవలసినదిగా అర్థించాను. శ్రీవేంకటేశ్వరుడు ఆ మహానుభావుల రూపంలో నన్ను అనుగ్రహించి దానిని వెలువరించ నిశ్చయించారు. నా జీవితం ధన్యమయింది.

ఈ కార్యక్రమానికి నాలుగు నెలల సమయం పట్టింది. ఈలోగా 108 అన్నమాచార్యులవారి ప్రత్యేక కీర్తనలు యెన్నుకొని వాటికి ఉపోదాతసహిత తాత్పర్య వివరణనందించాను. అవి అన్నీ అతిపొడవైన (సుదీర్ఘమైన) అందుకనే ఆ నా ప్రయత్నానికి "పొడవుకు పొడవైన పురుషోత్తమా" అని పేరుపెట్టాను. దానిని "సుజనరంజని" హైదరాబాదు వారికి అందించాను. ఎందుకంటే "సుజనరంజని" వారి "అన్నమయ్య పదామృత వర్షిణి" నాకు మార్గదర్శకంగా తొలినాళ్ళలో నిలిచింది. అదే నాకు స్ఫూర్తి అయింది. ఏ చేతిని పట్టుకొని అడుగులేయటం నేర్చుకొని ఆ చేతిని మఱచేవాడు నా దృష్టిలో మనిషే కాదు. మనిషి స్వార్థ జీవి అనే మాట నిజమే కాని ప్రతిక్షణం బేరీజు వేసికొంటూ స్వార్థాన్ని నియంత్రించుకోవటమే "బ్రతకటం" అంటే.

ఈ నా ప్రస్తుత ప్రయత్నము “హరి నీ మయమే అంతాను” గురించి ముచ్చటిస్తాను. నాకు పద్యరచన అంటే చాలా మక్కువ. ఇది యే జన్మ సిద్ధియో నాకు తెలియదు. కబీరుదాసు దోహాలను ఆటవెలది పద్యాలుగా తాత్పర్యసహిత వివరణ నిచ్చినప్పుడు నాకు కలిగిన తృప్తిని మాటలలో వర్ణించలేను.

మనము చేసిన యే పనినైనా కాగితంపై పెడితే అది యేనాటికైనా, యెవరికో ఒకరికి, యేదో ఒక విధంగా వుపయోగిస్తుందని నమ్మే ఆశావాదిని నేను. అందుకనే నాచేత భగవంతుడు చేయించిన రచనలన్నింటినీ నా వెబ్‌సైట్‌లో పెట్టాను “గూగుల్” నెట్‌వర్క్ ద్వారా ప్రపంచంలో యెక్కడవున్నా దానిని మీరు చదువుకోవచ్చు. “geetadeeksha” అనే సైట్‌కి లాగ్‌ఆన్ అయితే చాలు. వినాయక చవితి వచ్చింది. మీకు ఒక్క శ్లోకమూ రాదు అనుకోండి వెంటనే నా వెబ్‌సైట్‌ను చూడండి. “భగవద్గీత” అంటే యేమిటి అనే జనరేషన్ రాబోతున్నది. మీ తర్వాతి జనరేషన్‌ను ఎలా కాపాడుకుంటారో మీ చేతిలోనే వున్నది. నన్ను నమ్మండి. సంస్కృతిని మరిచే వాడు, కన్నతల్లిని మరచేవాడు పుట్టినా ఒకటే చచ్చినా ఒకటే. లెక్కపెట్టలేనన్ని కోట్లు సంపాదించి జీవచ్ఛవాలలాగా బ్రతుకుతూ యెప్పుడు చస్తాడో తెలియని బ్రతుకు దేనికి? ఏ ఒక్కడికీ ఉపయోగించని జీవితం యెందుకు? అందుకని, ఇప్పటికైనా ఆ సర్వేశ్వరుడు మెచ్చే పనిచేద్దాం. తోటి వారికి సహాయం చేయండి. కనీసం వారికి మంచిని చెప్పండి. పరనింద చేయకండి. నేను చెప్పేదే కరెక్ట్ అనే మొండితనం మానండి. కళ్ళుమూసుకొనేది మీరే... కానీ ఆ కళ్ళు తెరుచుకోవాలంటే మనలోని అంతర్యామి అవుననాల్సిందే. లేకపోతే మూసిన కన్ను తెరుచుకోదు. ఇది సత్యం. కనుక “హరి నీమయమే అంతాను” అనుకొంటూ జీవించండి. చక్కటి మానసిక వైభవం పొందండి. నిరంతరం ఆనందంగా వుండండి. ఒక చక్కటి ఇంగ్లీషు సూక్తి వినండి. If it has to happen, it will happen.





Otherwise it will never happen. It is Gods will. ఈ సృష్టిలో సర్వమూ హరిమయమే. ఆయన చైతన్య స్వరూపుడు. ఆది మధ్యాంతరహితుడు. గుణాతీతుడు. అవదనుకొన్న పనిని అయ్యేట్లుగాను అవుతుందనుకొన్న పనిని అవకుండాను చేస్తాడు. అంటే యేమిటి? సంకల్ప వికల్పాలు ఆయనవే కాని మనవి కావు. మనం కేవలం నిమిత్తమాత్రులం. ఆయన కావాలనుకొన్నది, ఆయన అనుకొన్నప్పుడు, ఆయనకనుగుణంగా, ఆయనకెవరిపై దయగలిగితే వారితో చేయించుకోగలడు. వద్దనుకుంటే ఒకే ఒక్క సెకనులో సర్వమూ ఆపించగలడు. ఇంత తెలిశాక ఇంకా విచారము, ఆనందము, నిరాశ, ఆశ వేధిస్తాయా? ‘హరి నీమయమే అంతాను’ అని భావించేవాడు ఒక నాటికి రాగాతీతుడై నిత్యముక్తుడవుతాడు. వాడి శరీరం పడిపోవటం కేవలం ఒక పరిణామమవుతుంది అంతే.

నేటి నవీనయుగంలో జియ్యరులవంటి మహామహులకే సంఘంలో జరుగుతున్న పరిణామాలను అవసరం మేరకు ఖండించాల్సి వస్తోంది. శృంగేరివంటి పీఠాధిపతులకే సంఘంలో జరుగుతున్న అసామాన్యతలను తెగడవలసి వస్తోంది. సామాజిక అవసరాలు తీరక సంపాదన చాలక అక్రమాలు చేసేస్తున్నారు. చేయలేనివారు నిరాశా నిస్పృహలతో జీవిస్తున్నారు. కానీ శ్రీకృష్ణ భగవానుడు గీతలో చెప్పినట్లు యెవరినివారే ఉద్ధరించుకోవాలి. పక్కవాడు యెలాగైనా వుండనీ, నేను మాత్రం నిజాయితీతో వుంటాను అనే దృఢ నిశ్చయంతో ప్రతివాడూ వుంటే ఈ సంఘం చూస్తుండగానే బాగుపడుతుంది. అరే! వాడు లంచం తీసికొని బాగుపడుతున్నాడు నేను ఎదుగూ బొదుగూ లేకుండా అఘోరిస్తున్నాను అని ప్రతివాడూ అనుకోబట్టే లంచగొండులు పెరిగిపోయారు. మనిషి రక్తం రుచి మరిగిన పులుల్లా వీళ్ళు మనుష్యుల్ని పీక్కుతింటున్నారు. మరి వీరిలో ఒక్కడన్నా మారవలెనంటే ఒకే ఒక సాధనం భక్తి. ఆ భక్తి న్యాయంపైన వుండాలి. సంఘంపైన వుండాలి. తన గురువుపై వుండాలి. పరిపాలకులపై వుండాలి. అన్నిటినీ మించి

ఇంతటికీ కారణమైన దైవంపై వుండాలి. ప్రభుత్వంపై వుండాలి. తన యజమానిపై వుండాలి. తన వృత్తిపై వుండాలి. నేటి సమాజంలో ఇవన్నీ కొరవడుతున్నాయి కాబట్టే చెప్పిన మాటవినని ఉద్యోగులు, భార్యలు, పిల్లలు, సేవకులు పుంఖానుపుంఖాలుగా తయారవుతున్నారు. వీరందరి అంతరాత్ముడు శ్రీహరే. కాబట్టే వీరందరికీ తాము చేస్తున్నది తప్పు అని తెలుసు. కానీ అహంకారం అంతరాత్ముని నోరుమూయించి చెడగొడుతున్నది. ఆ అపరాధ భావననుంచి తప్పుకోవాలనే అందరి తాపత్రయం. బెంబేలెత్తిపోతున్న యువత మత్తుకు లొంగిపోయింది. స్త్రీత్వం విశృంఖలత నేర్చుకొన్నది. సామాన్య ప్రజ చట్టవ్యతిరేకి అయింది. ఇప్పుడేది దారి? వీటిలో యెన్నడూ చెడనివాడు దైవం ఒక్కడే. ఆయనను శరణనండి ముందు మీరు మారండి. ప్రతిదీ దానంతట అదే సర్దుకొంటుంది. "హరి నీమయమే అంతాను" అనుకున్నవాడు తన యెదురుగానే శ్రీహరి వున్నాడని యెన్నటికీ తప్పు చేయడు.

ఇందులో నేనెన్నుకున్న అన్నమయ్య కీర్తనలకు భావక్రోడీకరణతో వివరించిన పద్య వివరణ అనుబంధంగా ప్రతి కీర్తన చివరిగా యిచ్చాను. ఇది నా ఆత్మతృప్తికి నేనెన్నుకొన్న హరిమార్గం. తాత్పర్య వివరణలో కూడా కొంత వ్యత్యాసం చూపించాను. తెలియని పదములకు పాఠకులు అర్థం తేలికగా గుర్తుపట్టి అర్థం చేసికొనగలరు.

అలాగే ఉపోద్ఘాతంలో ఆ కీర్తన ప్రాశస్త్యం గురించి, ప్రత్యేకంగా నేర్వవలసిన సంగతుల గురించి తెలుసుకోవచ్చును. ప్రతి కీర్తనకు టి.టి.డి. సంపుటి సంఖ్య రోమన్ లెటర్సులోను కీర్తన సంఖ్య ఇంగ్లీషు సంఖ్యలలోనూ ఇవ్వబడింది. IV/209 అంటే. అన్నమయ్య కీర్తనల నాలుగవ సంపుటిలోని 209వ కీర్తన అని అర్థం. భక్తి కంటే తరించే మార్గం జ్ఞానం కానీ భక్తి లేని జ్ఞానం పరిమళంలేని పుష్పం. భక్తి జ్ఞానం రెండూ వున్నవాడికి మోక్షం ఇంకా సుగమం అవుతుంది. ఈ కీర్తనలు భక్తి ఇనుమడింపజేసికోవటానికి ఉపయోగపడితే వీటి తాత్పర్యవివరణ జ్ఞానం పెంపొందించుకోవటానికి దోహద పడుతుంది అనే మాట నిజం.





ఇకపోతే, ఈ సంపుటి- II గురించి రెండు మాటలు ప్రస్తావిస్తాను. అన్నమయ్య చేపట్టిన శృంగార వర్ణన అంతా అమలినమే. పైకి స్త్రీ, పురుష రతి సమాగమం వలె అనిపించినా అది ఆత్మ - పరమాత్మల ఐక్యమే. మనోవాక్కాయ కర్మలా పరమాత్మలో ఐక్యమవ్వాలని ఆత్మపడే తహతహలే, మనకి స్త్రీ పురుష విరహవేదనవలె అనిపిస్తున్నది. కాని అన్నమాచార్యులంతటి యోగికి రతిలీలా వర్ణన, ఆత్మ, పరమాత్మల అనుసంధానమే.

అందుచేత ఈ కీర్తనలను శృంగారకీర్తనలని కాక మధురభక్తి కీర్తనలు లేక మధుర కీర్తనలు అని వ్యవహరిద్దాం. అన్నమయ్యవలె నాకు పరమాత్మ తత్త్వం అవగతమే కాలేదు. నేను ఒక జగన్నాయకుని సేవలో తుదిశ్వాస విడువాలనే ఆశతో జీవిస్తున్న అసంఖ్యాకులలో అతి సామాన్యుడను. అన్నమయ్యకు కైవల్యాన్ని ప్రసాదించిన ఆ శృంగారరాయడు నాబోటివానిని కనీసం ఎవడురా వీడు అని చూస్తాడా అంటే... అవుననే అర్హతే లేదు. అయినా నా కర్తవ్యం నేను నెరవేరుస్తాను. ఫలితాన్ని ఆశించను. పరమాత్ముడైన శ్రీవేంకటేశ్వరుడు తన దేవేరితో గూడి రతులదేలి భారతావనిని నిరంతరం శాంతి సౌభాగ్యాలతో వుంచుగాక!

ఇంకొక్క విషయం మనః పూర్వకంగా మనవి చేస్తున్నాను. అన్నమయ్య వాడిని కొన్ని మాటలకి నిఘంటువుల్లో అర్థం లభించదు. అథవా లభించినా ఆ అర్థం సూటిగా అన్వయించలేము. కొన్ని కొన్ని ఆనాటి వాడుక పదాలు ఈనాడు వాడుకలోలేవు. అందుకని ఊహకూడా ఉపకారే అవుతుంది.









సంఖ్య: I/429 రాగం : బౌళి
కీర్తన : వివేక మెఱగని వెఱ్ఱులముగాక నేము

**బౌళి**

**1 వివేకమెఱఁగని వెఱ్ఱులముగాక నేము**
**దివారాత్రము నిన్నే ద్రిష్టించవలదా** ॥పల్లవి॥

**మానివోడ నమ్మి వొక్కమనుజుఁడు వార్ధి దాఁటి**
**నానార్థములుఁ గూర్చి నటించఁగాను**
**దానవారికృప నమ్మి తగినసంసారవార్ధి-**
**లోను చొచ్చి దాఁటి గెల్వ లోకులకుఁ జెల్లదా** ॥వివే॥

**జుట్టెఁడుయినుము నమ్మి సొరిది నొక్కఁడు భూమిఁ**
**గట్టిడిభయములెల్లఁ గడవఁగాను**
**నెట్టనఁ జక్రాయుధునినిజనామ మిటు నమ్మి**
**తట్టి భవభయములు తరి దాఁటఁజెల్లదా** ॥వివే॥

**వేలెఁడుదీపము నమ్మి వెడఁగుఁజీఁకటిఁ బాసి**
**పోలిమి నొక్కనరుఁడు పొదలఁగాను**
**ఆలించి శ్రీవేంకటేశుఁ డాత్మలో వెలుఁగఁగాను**
**మేలి మాతనిఁ గొలిచి మెరయంగఁవలదా** ॥వివే॥ **429**

**ఉపోద్ఘాతము:**

ఓ దేవదేవా! మేము వివేకములేని వెఱ్ఱివాళ్ళము. సరే. మరి మేము యేమిచెయ్యాలి? రేయింబవళ్ళు నీపై దృష్టిసారించి నీ ధ్యాసలో గడపవద్దా? చెక్కఓడ నెక్కి మనిషి సముద్రాన్ని దాటి రకరకములుగా ధనము సంపాదిస్తున్నాడు. దానవారి శ్రీహరికృప వుంటే సంసారవార్ధి తరించటం యేమి కష్టం చెప్పండి. ఇనుమును నమ్మి ఇనప ఓడలో





భూమియెల్లలు కనుక్కుంటున్నాడే చక్రాయుధుడైన హరి నామము నమ్మ భవసాగరం దాటలేమా అంటున్నారు అన్నమయ్య.

**తాత్పర్య వివరణ:**

ఓ శ్రీవేంకటేశ్వరా! మేము వివేకము (యుక్తాయుక్త విచక్షణ) నెరుగని వెఱ్ఱివాళ్ళము. కావున నేము (మేము) దివారాత్రములు (రేబవళ్ళూ) నిన్నే ద్రిష్టించ వలదా? (గమనిస్తూ వుండవలెను కదా!) అన్యముల ధ్యాస వదలిపెట్టవలెను కదా!

ఒక మనుష్యుడు మానివోడ నమ్మి (చెక్కతో చేసిన ఓడను నమ్ముకొని) దానిలో నానార్ధములు గూర్చి (అనేకరకములైన సంపదలు తీసికొని నటించగా (చాతుర్యముతో కూడిన ఆప్యాయత నటిస్తూ వాణిజ్యం జరుపుతాడు). కానీ వాడు సంసార సాగరాన్ని తరించటానికి మంచి నావయేమిటో తెలియక అందులో మునిపోతున్నాడు. దానవ వైరి అయిన శ్రీహరిని నమ్మి ఆ జలధిలో దూకితే తప్పక దాటి గెలుస్తాడు.

సొరిది (ఒక క్రమములో) ఒక్కడెవడో జుట్టెడు ఇనుమును (జానెడు ఇనుపలోహాన్ని) నమ్ముకొని దానితో వ్యాపారము చేద్దామని భయములెల్ల విడనాడి ప్రయాణించుటలేదా? ఎట్టయెదుటేనున్న చక్రపాణి శ్రీపతి నిజనామమును ఈవిధముగా నమ్ముకొంటే అంతకంటే భయావహమైన భవభయమును తొలగించి కడతేరిస్తే అది చెల్లదా? ఇక ఇవన్నీ యెందుకండీ!

దీపము యెంత పొడుగుంటుంది? మహా అయితే ఒక వేలెడు (వేలంతపొడుగు) ఉంటుంది. దాన్ని నమ్ముకొని మనిషి చీకట్లు దాటుకొని పొదలుతున్నాడుకదా! (అతిశయించుచున్నాడు కదా!) మనమొరలను ఆలకించి శ్రీవేంకటేశుడు మన ఆత్మలో ప్రకాశిస్తే, బంగారము వంటి ఆ స్వామిని కొలిచి మనమూ మెరిసిపోవద్దా?

**పద్యవివరణ:**

తే.గీ॥ **వెఱ్ఱులము నేము లేదు వివేకమైన**
**నిన్ను దిష్టించవలెనుగా నిశిబవళ్ళు**
**ఆత్మనెలకొన్న శ్రీవేంకటాద్రి విభుడు**
**మేలిమాతని గొలుచుచు మెఱయవలదె.**

సంఖ్య: XXI/419 రాగం : దేసాళం
కీర్తన : దిక్కుల నీకతలెల్లా దెలిసెగాక

**దేసాళం**

**2 దిక్కుల నీకతలెల్లాఁ దెలిసెఁగాక**
**వెక్కసాన నిన్ను నావెంటవెంటఁ దిప్పనా ॥పల్లవి॥**

**యితరులు పిలిచితే నెఁ(నెం?)తైనాఁ బలుకవు**
**సతిమాటకై తేను జవదాఁటవు**
**ప్రతినలాడుకోఁగా నీపలుకుల భ్రమయించి**
**వెతదీర నిన్ను నావెంటవెంటఁ దిప్పనా ॥దిక్కు॥**

**సరస మెవ్వరాడినా సరకుఁ గొనవుగాని**
**తరుణి నవ్వినంతనే తమకించేవు**
**సరవులు దప్పఁగాని చలపట్టి నే నిన్ను**
**విరివిగా వలపించి వెంటవెంటఁ దిప్పనా ॥దిక్కు॥**

**గొలువులో నెవ్వరున్నాఁ గూరిమిసేయవుగాని**
**కలికిఁ బొడగంటేనే కరఁగేవు**
**మెలఁగి శ్రీవేంకటేశ మీరఁగాని నిన్నుఁ గూడి**
**వెలయ సిగ్గులు మాన్పి వెంటవెంటఁ దిప్పనా ॥దిక్కు॥ 419**

**ఉపోద్ఘాతము:**

ఓ శ్రీవేంకటేశ్వరా! నీకతలన్నీ దిక్కుల మారుమ్రోగుతున్నాయి. ఇవన్నీ నాకు తెలుసు కాని యేమి చెయ్యను నిన్ను నా వెంట వెంట తీసికొనిపోలేనుకదా అంటున్నది నాయిక. పారవశ్యంతో అన్నమయ్య ఆ నాయికలో పరకాయప్రవేశం చేసినట్లు కీర్తననాలపిస్తున్నారు. నీవు మాయగాడవు స్వామీ!ఇతరులు నిన్ను పిలిస్తే వారితో పల్లెత్తు మాటైనా పలుకవు. సతిమాటను యెన్నడు జవదాటనంటావు. ఎన్నో ఒట్లు





పెట్టుకొంటావు. నీ పలుకులతో యెన్నో రకాలుగా భ్రమలో ముంచుతావు. ఇన్ని వేషాలు వేసే నిన్ను నమ్మక యేమి చెయ్యను? నిన్ను నావెంటవెంటనైతే తిప్పుకోలేనుకదా! అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ ప్రభూ! నీ కథలన్నీ దిక్కులంతా మారుమ్రోగిపోతున్నాయి. వెక్కసాన (నా ఆధిక్యము చూపించుకోటానికి) నిన్ను నా వెంటవెంట (వెనుకబెట్టుకొని) తిప్పనా (తిప్పుకోమంటావా?) ఇదియెంత తగనిపని?

ఎంత నటిస్తావు స్వామీ! ఇతరులెవరైనా నిన్ను పిలిచినా వారితో పలుకవు. నీ భార్య మాట జవదాటనే దాటవు- నీవు ప్రతినలాడుకోగా (ఎన్నో ఒట్లుపెట్టుకుంటే) ఎంత భ్రమలోపడ్డాను! ఇవ్వాళ నీవు నాకాళ్ళబేరానికి వచ్చావని నిన్ను నా వెంట వెంట దిప్పనా (తిప్పుకోనా?)

ప్రభూ! యేమి నీనటనా విలాసము! నీతో ఎవరు సరసమాడినా లక్ష్యపెట్టనట్టే వుంటావు. నీ భార్య నిన్ను చూచి నవ్విందో లేదో మైమపరచిపోతావు. సరవులు దప్పగాని (ఒక క్రమము తప్పంగానే) చలపట్టి (మత్సరముతో) నేను నిన్ను నా దర్పము చూపించుటకు నావెంటవెంట త్రిప్పుకోనా? ఇది ఉచితమైన పనియేనా?

ఓ దేవా! నీవు కొలువుదీరియున్నపుడు రాచఠీవి అభిజాత్యము ప్రదర్శించుచూ ఎవ్వరినీ లెక్కచేయవు. నీ భార్యను చూడంగానే కరిగిపోయి సభవాయిదా వేసేస్తావు. ఓ శ్రీవేంకటేశ్వరా! అతిశయించిన నిన్ను గూడితే వెలయ (శోభతో) నీ సిగ్గులన్నీ మాన్పి నావెంట వెంట తిప్పుకోమంటావా?

**పద్యవివరణ:**

ఆ.వె॥ **తెలిసె నాకు నేడు దిక్కులు యెల్లెడన్**
**వింటినీదు కతలు వెక్కసాన**
**నిన్ను వెంటవెంటనే తిప్పమందువా?**
**వెఱతు నేమిజేతు వేంకటేశ!**

సంఖ్య: I/430 రాగం : గుండక్రియ
కీర్తన : ఏమియు జేయగవద్దు యింతలోనె మోక్షము

**గుండక్రియ**

**3 ఏమియుఁ జేయఁగవద్దు యింతలోనె మోక్షము**
**దీమపువిజ్ఞానమే దివ్వెత్తుఫలము ॥పల్లవి॥**

**పాపచింత మదిలోనఁ బారకుండా నిలిపితే**
**చేపట్టి దానములెల్లాఁ జేసినంతఫలము**
**కోపానలములోన కోరికలు వేల్చితేనే**
**యేపున యజ్ఞాలు సేసి యేచినంతఫలము ॥ఏమి॥**

**కనకముపై యాస కాదని పోదొబ్బితేనే**
**తనకు వేవేలు ఘోరతపములఫలము**
**వనితల మోహములవలఁ బడకుండితేనే**
**దినము గోటితీర్థాలు దిరిగినఫలము ॥ఏమి॥**

**శ్రీవేంకటేశ్వరుఁ జేరి కొలుచుటే**
**ధావతిలేనియట్టితనజన్మఫలము**
**భావించి యాచార్యపాదపద్మమూలమే**
**సావధానమున సర్వశాస్త్రార్థఫలము ॥ఏమి॥ 430**

**ఉపోద్ఘాతము:**

అన్నమయ్య కాలంలో రాత్రిపూట దీపపుకాంతి ఎక్కువదూరం కనుపించాలని పొడుగాటి దీపస్తంభముమీద రాత్రి బాటసారులకోసం దీపమునుంచేవారు. దివ్వెత్తునవున్నది అంటే చాలా ఎత్తున ఉన్నతంగా వున్నదని అర్థం. జీవికి మోక్షము యెప్పుడు కలుగుతుందో ఆ తిరుమలేశునికి దక్క ఇంకెవరికి తెలుస్తుంది? మరి మోక్షం దొరకనివారు ఏ ఫలము పొందుతున్నారు? వారు దీమపు విజ్ఞానమును (నిబ్బరము కలిగించు భగవత్ జ్ఞానమును) తప్పక ఆ జీవుడు సాధిస్తాడు. అది రాబోయే జన్మలలో అతనికి





మోక్షప్రాప్తినిస్తుంది. అదే దివ్వెత్తు ఫలము (చాలా ఉన్నతమైన ఫలము) నిస్తుంది అంటున్నారు అన్నమయ్య. చివరికి జీవికి ఒక విశిష్టమైన జన్మ జన్మల ఫలమొకటి తప్పక దక్కుతుంది అదే శ్రీవేంకటేశ్వరునే కొలువవలెననే స్థిర చిత్తము.

**తాత్పర్య వివరణ:**

ఓ జనులారా! మీరు ఏమియు జేయనవసరము లేదు. చూస్తుండంగానే ఇంతలో మోక్షం దొరుకుతుంది. మరి అది దక్కనివారి జన్మ నిష్ప్రయోజనమా? ఎంతమాత్రమూ కాదు. వారికి దీమపు విజ్ఞానమే (నిబ్బరము కలిగించు భగవత్ జ్ఞానమే) దివ్వెత్తు ఫలము (ఉన్నతోన్నతమైనఫలము).

మనస్సులో పాపచింతన బారకుండా (పరుగులు పెట్టకుండా నిగ్రహించగలిగితే పూనుకొని అన్నిరకములైన దానములు చేసినంత ఫలము తప్పక కలుగుతుంది. ఎవరి క్రోధాగ్నిలో వారు తమ కోరికలను ఆహుతి చేయగలిగితే వరుసగా యజ్ఞాలు చేసినంత ఫలము సిద్ధిస్తుంది. తమాషా యేమిటంటే ఆ ఫలము యెలా కలుగుతుందో యెవ్వరికీ తెలియదు.

ఒకనికి బంగారముపై అత్యాశను నాకువద్దు అని పోదొబ్బితేనే (పొమ్మని త్రోసివేయగలిగితేనే) అనేకములైన ఘోరతపములనాచరించిన ఫలము దక్కుతుంది. వనితల మోహము అనే వలలో పడకుండా వుంటేనే ప్రతిదినము కోటి పుణ్యతీర్థాలలో పుణ్యస్నానమాచరించినంత విశిష్ట ఫలము దక్కుతుంది.

శ్రీవేంకటేశ్వరుని చేరుకొని ఆయనను కొలచుట అంత తేలికగా లభించే ఫలము కాదు. అది ధావతిలేనియట్టి (ఆయాసము లేకుండా) జీవికి కలిగే తన జన్మ జన్మల ఫలము. భావములో నిలుపుకొనిన ఆచార్యుల పాదపద్మముల మూలము చేకొంటే సావధానులై సర్వశాస్త్రములను అవపోసనబట్టిన ఫలము దక్కుతుంది.

**పద్యవివరణ:**

కం॥ **ఏమియు జేయగ వలదిక**
**దీమపువిజ్ఞాన మదియె దివ్వెత్తుఫలం**
**కామించు మోక్షపదమగు**
**నీమముతో హరినిగొల్వ నిజజన్మఫలం.**

సంఖ్య: XXI/133 రాగం : ఆహిరి
కీర్తన : విన్నవించితిమి నీకు వేడుకవేళ

**ఆహిరి**

**4 విన్నవించితిమి నీకు వేడుకవేళ**
**కన్నెను నీవు దయగా చేటి వేళ ॥పల్లవి॥**

**మచ్చికలు దయివారె మనసెల్ల జైవారె**
**వచ్చె జవ్వనానకు వసంతవేళ**
**చొచ్చి నిన్నుఁ బాసి తాప సూర్యుఁడెండగాయఁగా**
**విచ్చనవిడిగాఁ దోఁ చె వేసగివేళ ॥విన్న॥**

**సిగ్గులు మొలవఁజొచ్చె చెమటలేరులు హెచ్చె**
**కగ్గలేక మించె వానకాలపువేళ**
**వెగ్గళించి సెలవుల వెన్నెలలు చూపట్టి (ట్టె?)**
**వొగ్గి శరత్కాలము వొదిగె నీవేళ ॥విన్న॥**

**తత్తరపుచలి పొంచె తలపోఁతమంచు మించె**
**యెత్తి యలమేల్మంగకు హేమంతవేళ**
**బత్తితో శ్రీవేంకటేశ పైకొని కూడితి విట్టె**
**చిత్తజుకాఁకలు దేరె సిసి (శిశి?)రవేళ ॥విన్న॥ 133**

**ఉపోద్ఘాతము:**

మధురాతిమధురమైన శృంగారకీర్తన నాస్వాదించండి. ఆరు ఋతువులవేళలలోనూ ఆ కన్నియను స్వామి ఎలా కరుణించాలో విన్నవించుకొంటున్నారు చెలులు. మురిపెముతో ఆలకిస్తున్నాడు శ్రీనివాసుడు. ప్రభూ! ఆ కన్నియను నీవు కాచే వేళయిందయ్యా! ఇది నీవు వేడుకలతో గడుపువేళ. అందుకనే నీకు ఆమె మొరను విన్నవించుకొంటున్నాము. ప్రభూ! ఇది వసంతవేళ. మచ్చికలు దయివారె (ఒకరిపై ఒకరికి చనువు అతిశయించినది) మనసంతా పులకించింది.





ఆమె యౌవనమునకు కూడా వసంత వేళ వచ్చేసింది. ఇక నీకు ఆమెను కరుణించక తప్పదు, అంటున్నారు. ఇలా ఆరు ఋతువులలోనూ స్వామికి ఆమె అవస్థలను విన్నవించుకొంటున్నారు, అన్నమయ్య.

**తాత్పర్య వివరణ:**

ఓ తిరువేంకటేశ్వరా! నీకు ఈ వేడుకవేళ (సంతోషసమయమున) విన్నవించితిమి (విన్నపము జేసికొంటిమి). ఇదే నీవు ఆ కన్యామణిని దయజూచువేళ ఇంకా నిర్లక్ష్యము చేయుట తగదు ప్రభూ!

ప్రభూ! ఇది వసంతవేళ. మచ్చికలుదైవారినవి (చనువులు అతిశయించినవి) మనసెల్లా పులకరించినది. ఆమె యౌవనమునకు కూడా ఆమనివచ్చినది. నిన్ను విడచిన తాపమును తాళలేక సూర్యుడు విపరీతమైన ఎండలు కాయగా విచ్చలవిడిగా వేసంగి తనప్రతాపము చూపింది. అబ్బ ఏమి గ్రీష్మఋతువురా అని తపించింది లోకము.

ఇంతలో వర్ష ఋతువు వచ్చేసింది. యువతులకు చెమటలు ఏఱులై పారినవి. దాని ఫలితంగా మొలకలెత్తినవి సిగ్గులమొలకలే. అటువంటి వానాకాలము కగ్గలేక (ఏ లోపము లేక) అతిశయించినది. కొంచెము వానలు తగ్గుమొగం పట్టగానే శరదృతువు వచ్చిచేరినది. ఇది వెన్నెలమాసము. పండువెన్నెల కన్నులపండుగ చేస్తుంది. వెగ్గళించి (అతిశయించి) సెలవులవెన్నెల (మొలకవెన్నెలలు) కుదురుకొన్నవి.

ఇంతలో చలికాలము ముంచుకొచ్చేసింది. అంటే హేమంత ఋతువు వచ్చేసింది. ఆ చలితత్తర (త్వరపాటు) కలిగిస్తున్నది. ఆలోచనలలో కూడా మంచు కురిసి చల్లబడినవి. అలమేల్మంగమ్మ యెత్తి (ఆధిక్యముతో) మించినది. ఇక శ్రీవేంకటేశ్వరునికోసం ఎదురు చూచిన ఆమె అమిత బత్తితో (భక్తితో) ఆయనకు వశమైనది. ఓ దేవా! పైకొని నీవామెను కూడితివి. ఇక ఆ శిశిర ఋతువునందు మన్మధుడు తన వేడిమినంత చూపి తపింపజేస్తున్నాడు.

**పద్యవివరణ:**

ఆ.వె॥ **విన్నవించితిమిగ వేడుకవేళలో**
**కన్నె నీవు కరుణగాచువేళ**
**వేంకటేశ నీవు వెలది గూడితివిట్టె**
**శిశిరవేళ చెలలిగె చిత్తజుండు.**

సంఖ్య: I/491 రాగం : గుజ్జరి
కీర్తన : సంసారినైన నాకు సహజమే

**గుజ్జరి**

**5 సంసారినైన నాకు సహజమే**
**కంసారి నే నిందుకెల్లఁ గాదని వగవను ॥పల్లవి॥**

**నరుఁడనైననాకు నానాసుఖదుఃఖములు**
**సరి ననుభవించేది సహజమే**
**హరిని శరణాగతులైన మీఁదఁ బరాభవ-**
**మరయ నిన్నంటునని అందుకే లోఁగేను ॥సంసా॥**

**పుట్టిననాకుఁ గర్మపు పొంగుకు లోనైనవాఁడ**
**జట్టిగాఁ గట్టువడుట సహజమే**
**యిట్టే నీవారికి మోక్షమిత్తునన్ననీమాట**
**పట్టు వోయీనోయని పంకించే నే నిపుడు ॥సంసా॥**

**మాయకులోనైననాకు మత్తుఁడనై యిన్నాళ్లు**
**చాయకు రానిదెల్లా సహజమే**
**యీయెడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నీవు**
**మోయరానినేను నీకు మోపని వీఁగేను ॥సంసా॥ 491**

**ఉపోద్ఘాతము:**

దేవదేవా! జీవితంలో యెన్ని పరాభవాలు! యెన్ని సుఖదుఃఖాలు! ఎన్ని కర్మబంధాలు! నేను సంసారిని ప్రభూ! నాకివన్నీ అనునిత్యం సహజమే. ఇందుకు నేను ఏమాత్రమూ కాదని వగవను (విచారించను). నేనిన్నాళ్ళూ నీ మాయకులోనై మత్తులో వుండిపోయాను. మరిపైన చెప్పినవన్నీ నాకు అంతుపట్టక పోవటం సహజమే. ఆశ్చర్యమేమీ లేదు. ఇన్నాళ్ళకు నీకు





నాపై అనుగ్రహం కలిగి ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను నీవు యేలుకొన్నావు. నేనే ఇన్నాళ్ళూ నీకు మోయరాని భారాన్నేమోనని కొంచెం వెనకాడుతున్నాను. నీవు జగన్నాథుడవు నీకు ఒకరు భారమా?

**తాత్పర్య వివరణ:**

ఓ కంసారీ! సంసారినైన నాకు మానావమానాలు సహజమే. వాటిని త్రోసిరాజు అనటానికి వీలులేదు. నేనిందుకెల్లా (నేను దీనికంతా) కాదని (నాకు వద్దని) వగవను (వ్యాకులపడను).

నేను నరుడను. నాకు నానా సుఖదుఃఖములు కలుగుట సహజమే. వాటిని అనుభవించక తప్పదని నాకు తెలియును. హరిని శరణాగతి బొందినవానికి ఆపై పరాభవాగ్ని దహించదు. ఆ పరాభవము హరిని అంటుతుందేకాని ఆయన శరణాగతులని కాదు. అందుకే నేను లోగెదను (సంకోచించుచున్నాను). నామూలంగా నీవు, అవమానం జెందుట నాకు సమ్మతముగాదు.

పుట్టుకతోటే నాకు ఇష్టాయిష్టాలు కలిగి, కర్మపు పొంగులు (కర్మవశాత్తు కలిగే ఔన్నత్యములకు) లొంగిపోయాను. ఇట్లా జట్టిగా (సాటిగా) కట్టువడటం నాకు సహజమే. కానీ నీవు భగవద్గీతలో ఏమిజెప్పావు నీవారికి (నిన్నే దిక్కని ఆశ్రయించినవారికి) మోక్షమిత్తునని నీమాటగా జెప్పావు కదా! మరి నీమాటలలో పట్టుపోయినదా అని నేను నాతల పంకిస్తున్నాను (వంచుకొని భయపడుతున్నాను).

ఇన్నాళ్లూ నీమాయకు లోనైన నాకు మత్తులో భ్రమకలిగి జ్ఞానం చాయకు (బయటకు) రాకపోవటం సహజమే. ఇటువంటి ఆపత్కాలంలో ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను నీవు ఏలుకొన్నావు. అయితే ఇంకా నా సందేహమేమంటే నేను నీకు మోయరాని మోతబరువునేమో తండ్రీ!

**పద్యవివరణ:**

కం॥ **సంసారినైననాకివి**
**కంసారీ! సహజమేలె కాదని వగవన్**
**పుంసామోహనరూపా!**
**సంసారముమోయరాని సతమతమయ్యా!**

సంఖ్య: XXI/389 రాగం : సోమరాగం
కీర్తన : బిగిసి యాపె నీకు బెట్టనికోట

## సోమరాగం

**6 బిగిసి యాపె నీకుఁ బెట్టనికోట**
**యెగసక్కేలకు నీవు యేమిసేసుకొంటివి ॥పల్లవి॥**

**కోపగించుకోఁబోఁగా కొలిచి మొక్కవలసె**
**తీపులఁ దిట్టినందుకు దీవించవలసె**
**చూపుల జంకించఁగాను సూదుపెనఁగవలసె**
**యేపున నెంతకునెంత యేమిసేసుకొంటివి ॥బిగి॥**

**చేవట్టితియ్యఁగఁబోఁగా చెక్కులు నొక్కవలసె**
**చేవమీర నవ్వఁగాను సిగ్గువడవలసె**
**కావరించి పైకొనఁగా కైవశము గావలసె**
**యే(యీ?) విదాన నుండివుండి యేమిసేసుకొంటివి ॥బిగి॥**

**కాఁకలు సేయఁగబోఁగా గక్కనఁ గూడవలసె**
**పోఁకముడి యంటఁగాను భోగించవలసె**
**వేఁకపుశ్రీవేంకటేశ వెలఁదిఁ గలసి తిట్టె**
**యేఁకట నీయంత నీవు యేమిసేసుకొంటివి ॥బిగి॥ 389**

**ఉపోద్ఘాతము:**

ఓ శ్రీనివాసా! ఆమె బిగుసుకొన్నది. బింకము చూపుచున్నది. ఆమె శ్రీదేవి కనుక నీకు పెట్టనికోటవంటి రక్షణయే. నీ ఐశ్వర్యమే ఆమె. మరి నేడు పరిహాసములకుబోయి యేమైనదో గమనించు. ఆమె అలిగి కోపగించుతుంటే నీఅంతటివాడుకూడా కొలిచి మొక్కవలసి వచ్చింది. తీపిగా తిట్టితే ఆమె సహించుటలేదు. వెంటనే ఆమెను మురిపించుటకు దీవించవలసి వచ్చింది. ఆమె చూపులతో నిన్ను బెదిరిస్తుంటే ఆమె వైరం తీర్చటానికి





పెనవేయవలసివచ్చింది. ఆమె నీకు సమవుజ్జీ. ఎంతసేసుకొంటివయ్యా వేంకటేశా అంటున్నారు శృంగారశాస్త్రకోవిదుడు అన్నమయ్య.

**తాత్పర్య వివరణ:**

ఓ శృంగారరాయా! వేంకటరాయా! బిగిసిపోయిన (బింకము చూపుతున్న) ఆమె చిరుకోపము ప్రదర్శిస్తున్నా నీకు పెట్టనికోట (తులలేని రక్షణ వంటిది). ఆమె శ్రీదేవి. నీ ఐశ్వర్యమే ఆమె. కానీ నీవు నేడు యెగసెక్కేలకు పోయి (పరిహాసములకుపోయి) ఏమిసేసుకొంటివయ్యా?

ఆమె రుసరుసలాడుతూ నిన్ను కోపగించుకొంటుంటే, ఆమెను కొలిచి మొక్కవలసివచ్చింది కదా! తీపుల (చిలిపిగా) తిట్టినందుకు ఆమెను ఓదార్చుటకు జగదేకపతివై దీవించి సేదదీర్చవలసివచ్చింది. ఆమె చూపులతో నిన్ను బెదరించినా ఆమె వైరం పోగొట్టుటకు నీవే పెనవేయవలసివచ్చింది. నేడు ఆమె నీవు ఎంతకు యెంతైనా సమవుజ్జీయే. ఏమి సేసుకొంటివయ్యా?

ప్రభూ! నీవు ఆమెను చేపట్టి (స్వీకరించి) దగ్గరకు తీసికొనబోతే ఆమెకు బుగ్గలు సిగ్గుతో యెరుపెక్కినవి. నీవు అనునయంగా ఆమె చెక్కిలినొక్కవలసివచ్చింది. నీవు నర్మగర్భంగా నవ్వగా ఆమె సిగ్గులు చిందించినది. నీవు ఆక్రమించగా నీకు కైవశం కావలసివచ్చింది. ఈ విధంగా ఆమెకు చేరువయై యేమిసేసుకొంటివి స్వామీ!

ఆమె నీపై కాకలు సేయగబోగా (చిర్రుబుర్రులాడుతుంటే) ఆమె కోపము చల్లార్చుటకు గక్కున (తటాలున) ఆమెను కూడ వలసి వచ్చును. ఆమెననునయించునీ చిలిపి పని అది. నీవామె చీరపోకముడిని సవరించి శృంగార రసాస్వాదనకు తెరదీసితివి. ఇక నీకు భోగించక యెట్లా తప్పుతుంది? ఓ వేకపు (వెక్కసమైన) శ్రీవేంకటేశ్వరా! నీవు వుపాయంతో వెలదిని ఇట్టే గూడితివి. నీఅంతట నీవు ఏమిచేసికొంటివయ్యా!

**పద్యవివరణ:**

ఆ.వె॥ **బిగిసి ఆమె నీకు పెట్టనికోటాయె**
**ఆమెచెప్పినట్లె ఆడవలసె**
**యేమిసేసుకొంటి వెగసెక్కెములకీవు**
**వెలది ఇట్టె చేరె వేంకటేశ!**

సంఖ్య: I/470 రాగం : దేసాళం
కీర్తన : అన్నిటికి కారణము హరియే ప్రపన్నులకు

## దేసాళం

**7 అన్నిటికిఁ గారణము హరియే ప్రపన్నులకు,**
**పన్నినలోకులకెల్ల ప్రకృతి కారణము** ||పల్లవి||

**తలఁపు గారణము తత్వవేత్తలకును**
**చలము గారణము సంసారులకును**
**ఫలము గారణము పరమవేదాంతులకు**
**కలిమి గారణము కర్ములకును** ||అన్ని||

**తనయాత్మ గారణము తగినసుజ్ఞానులకు**
**తనువే కారణము తగ జంతువులకు**
**ఘనముక్తిగారణము కడగన్నవారికెల్లా**
**కనకమే కారణము కమ్మినబంధులకు** ||అన్ని||

**దేవుఁడు గారణముతెలిసినవారికెల్లా**
**జీవుఁడు గారణము చిల్లరమనుజులకు**
**దేవుఁడు వేరే కాఁడు దిక్కు శ్రీవేంకటేశుఁడే**
**పావన మాతనికృప పరమకారణము** ||అన్ని|| **470**

**ఉపోద్ఘాతము:**

అన్నిటికీ కారణము హరియేనని ప్రపన్నులు (శరణాగతులు) త్రికరణశుద్ధిగా నమ్ముతారు. కానీ అతితెలివిగల లోకులు సమస్త సృష్టికి ప్రకృతే కారణము అని నమ్మి చరించుతుంటారు, అంటున్నారు అన్నమయ్య. శ్రీవేంకటేశ్వరుని మాయవలన భ్రమ కలుగుతుంది. అప్పుడు తమని తాము వివేకవంతలమనుకొనేవారు ప్రతిదానికీ ఒక కారణముంటుందని విశ్లేషిస్తుంటారు. ఆ తర్కమేమిటో వివరిస్తున్నారు అన్నమయ్య. మొదటి





ఉదాహరణ చూడండి, తత్త్వవేత్తలకు కారణమెవరు? వారి తలపే (వారి ఆలోచనలే) వారు తాత్త్వికులవటానికి కారణం అవునా? కాని కాదు అన్నిటికీ కారణము శ్రీహరియే సుమా!

**తాత్పర్య వివరణ:**

అన్నిటికి మూలకారణము శ్రీహరియే, ప్రపన్నులకు (హరి శరణాగతులకు) శ్రీహరిదక్క వేరొకటి కారణము అనిపించదు. కానీ పన్నిన (ఎత్తుకు పైయెత్తులు వేసే) లోకులకు దేవుడేలేడు. వారు అన్నిటికి ప్రకృతియే కారణము అని అంటారు.

తత్త్వవేత్తలు ఆలోచనాపరులగుటకు కారణము వారితలపులు (ఆలోచనలు). సంసారమునకు కారణము జీవుల చపలస్వభావము. పరమవేదాంతులు ఆవిర్భవించుటకు కారణము ఫలము (వారు ఆకాంక్షించే ముక్తిఫలము). కర్మిష్టులు (కర్మకాండ యందు మక్కువ గలవారికి) కలిమి కారణము వారికి ధనార్జనపైనగల విపరీతమైన మక్కువ.

సుజ్ఞానులు పెంపొందటానికి కారణము వారి ఆత్మ (ఆత్మజ్ఞానము). జంతువులకు కేవలం శరీర పోషణే. క్షుధ, నిద్ర, భయ, మైధునాలే వాటి ఆవశ్యకత. అందుకని అవి శరీరంకోసం జీవిస్తాయి. కడగన్న వారికి (తమకు అంతము సమీపించేదాకా దైవధ్యానంలో గడిపే వారికి) కారణము వారు కాంక్షించే ఘనముక్తి. కమ్మిన బంధులకు (ఇంటజేరి నీసంపద కరిగించే బంధువుల రాకకు) కారణము నీవద్దనున్న కనకము (బంగారము).

తెలిసినవారికెల్ల (జ్ఞానులందరూ అన్నిటి కారణము అని భావించేది దేవుడు (పరమాత్మ). చిల్లర మనుజులకు (అజ్ఞానులైన మానవులకు) కారణము వారిలో జ్ఞానాపేక్షలేని వారి జీవుడు. వేరే ఏ దేవుడూ లేడు. అందరికీ దిక్కు శ్రీవేంకటేశ్వరుడే. పావనమైన ఆ స్వామి కృపయే అన్నిటికీ మించిన కారణము.

**పద్యవివరణ:**

కం|| **అన్నిటికి కారణము హరి**
**పన్నినలోకములకెల్ల ప్రకృతే తానౌ**
**యెన్నిన కారణమీవేం-**
**కన్నయె శరణాగతులకు కారణము కదా!**

సంఖ్య: XXI/445 రాగం : శంకరాభరణం
కీర్తన : ఏమయ్య రమణుడ యింత సేతురటవయ్యా

## శంకరాభరణం

8 **ఏమయ్య రమణుఁడ యింతసేతురటవయ్యా**
**కామిని నూరడించి కలయఁగరాదా** ॥పల్లవి॥

**పడఁతి కధరమిచ్చి పలుసోఁకించినది**
**బడి బడి విందువెట్ట పగలాయ**
**వెడవెడఁగా నవ్వి వెంగెమాడినది**
**తొడికేదోమటి పాలఁ దోడనే వేఁడాయ** ॥ఏమ॥

**తరుణి దప్పకచూచి తలవంచినది**
**అరిది నమ్మించి తప్పినట్లాయ**
**సరస మాడియాడి సరుగన దాఁగినది**
**పొరిఁబొరి మధ్యాహ్నానఁ బొద్దుగుంకినట్టాయ** ॥ఏమ॥

**మెలుఁత గాఁగిటఁ గూడి మేను మరచినది**
**నిలువునీడలలోన నివ్వెరగాయ**
**అలరి శ్రీవేంకటేశ ఆదరించినది**
**ఫలియించి పసిఁడిలోఁ బరిమళమాయ** ॥ఏమ॥ **445**

**ఉపోద్ఘాతము:**

ఈసరస శృంగార కీర్తనలో అన్నమయ్య శ్రీవేంకటేశ్వరునితో చనువుగా ఏమంటున్నారో ఆలకించండి. ఏమయ్యా రమణుడా! ఎక్కడన్నా ఇంత చేస్తారటయ్యా? ఈ కామినిని చూడు, యెంత కలత జెందియున్నదో గమనించు. నీ హృదయం కరుగుట లేదా? కాస్త ఆమెను ఊరడించవచ్చును కదా! ఆపైన ఆమెను కలియకూడదా? ఆమె నీ ప్రాణేశ్వరి కదా!అంటున్నారు. ఇందులో కొన్ని సామెతలు అవి చెప్పిన





వైనము నిజంగా అద్భుతం. చివరిగా నా విన్నపమేమంటే కొండొకచో నా భావము కొండెక్కియుండవచ్చు. అందుకు క్షంతవ్యుడను.

**తాత్పర్య వివరణ:**

ఏమయ్యా రమణుడా! ఎంతసేతురటవయ్యా(ఇంత చేస్తారుటయ్యా?) కామినిని (నీ ప్రియురాలిని) ఊరడించి (ఉపశమింపజేసి) కలియగరాదా? (ఆమెను రతుల దేల్చరాదా?)

ఆ పడతికి నీమధురాధరమిచ్చావు. బాగబాగు. కానీ ఆమెకు విపరీతంగా కన్నీటిని కూడా ఇచ్చావు కదా! గొప్పగొప్ప విందు భోజనం పెట్టి భోజనం చేశాక ఎవరన్నా తీరికగా పగదీర్చుకొంటారా? ఇంతకీ ఆమె చేసిన నేరమేమిటి? నిన్నుజూచి బిగ్గరగా నవ్వి వ్యంగ్యముగా మాట్లాడినది. అంతేకదా! "ఒలికిపోయిన పాలు వెంటనే వేడయ్యేవి" అన్నాడట వెనకటికొకడు. ఆ పాలు ఎలాగో నేలపాలేకదా! అవెంతవేడెక్కితే ఏంలాభం?

ప్రభూ! ఆ తరుణి అప్పటిదాకా వదలక నిన్నే చూస్తుండినది. నీవు చటుక్కున ఆమెను చూడగానే వెంటనే సిగ్గుతో తలవంచుకున్నది. నీ ఉత్సాహం నీరుకారినట్టయింది. నమ్మించి మాట తప్పినట్లు అయింది. ఆమె నీతో సరసమాడి ఆడి పరుగున వెళ్ళి యెక్కడో దాగికొనినది.నీ ఉత్సాహము చల్లబారినది. మిట్టమధ్యాహ్నమే సందె చీకట్లు కమ్మి పొద్దుగుంకినట్లయింది. నీకు అంత నిరుత్సాహం కలిగినది.

ఆ మెలత (జవ్వని)నీ కౌగిలిలో కరగిపోయి మేను మరచినది (తన ఒంటిని తానే మరచి పోయినది). నిలువ నీడలలోన (చీకటిపడేవేళ) నివ్వెరగాయ (భయంతో జలదరించినది). ఓ శ్రీవేంకటేశ్వరా! నీవామెపై జూపుతున్న ఈ ఆదరణ ఎట్లా వున్నదంటే బంగారానికి పరిమళమబ్బినదా! అని భావించినట్లయినది.

**పద్యవివరణ:**

చం॥ **రమణుడు ఇంతసేతురటరా! కలికిన్ ఇటుకాదనందురా?**
**సమయముజూచి కూడ్చుకొని సందిట వేగమె కూడ వచ్చునే**
**తమకముతోటి మైమరచు తన్వికి నివ్వెరగాయజూడగా**
**అమలుడ వేంకటాధిపుడ అంటెను బంగరుకున్ సుగంధమే.**

సంఖ్య: I/94 రాగం : లలిత
కీర్తన : తాపలేక మేడలెక్కదలచేము

**లలిత**

**9 తాప లేక మేడ లెక్కఁదలఁచేము**
**యేపులేనిచిత్తముతో యీహీహీ నేము ||పల్లవి||**

**ఎఱుకమాలినబుద్ధి యె(నె?)వ్వరైనాఁ బతులంటా**
**తెఱఁగెఱఁగక వీధిఁ దిరిగేము**
**పఱచైన జవరాలు పరులెల్లా మగలంటా**
**వొఱపునిలిపిన ట్లోహోహో నేము ||తాప||**

**యిందరును హితులంటా యెందైనా సుఖమంటా**
**పొందలేనిబాధఁ బొరలేము**
**మందమతివాఁడు యెండమావులు చెరువులంటా**
**అందునిందుఁ దిరిగిన ట్లాహాహా నేము ||తాప||**

**మేటివేంకటేశుఁ బాసి మీఁదమీఁదఁ జవులంటా**
**నాటకపు తెరువుల నడిచేము**
**గూటిలో దవ్వులవాఁడు కొండలెల్ల నునుపంటా**
**యేటవెట్టి యేఁగిన ట్లీహీహీ నేము ||తాప|| 94**

**ఉపోద్ఘాతము:**

ఇది ఒక అద్భుతమైన అధ్యాత్మకీర్తన. అన్నమయ్య వాడిన ప్రక్రియలో ఈ ధ్వని అలంకారం బహు అరుదుగా కానవచ్చే ప్రక్రియ. 'ఈహీహీ' అని నవ్వుతున్నారు. ఓహోహో! అని తమ వెఱ్ఱి తనానికి తామే నవ్వుకుంటున్నారు. ఇది ఒక తమాషా ప్రయోగము. మా చిత్తము ఏపులేనిది దీని తాపమునకు ఓర్వలేక మేడలెక్కదలచేము. అంతటితో చిత్తము శాంతిస్తుందా ఈహీహీ.





ఎంతపిచ్చితనము? జ్ఞానంలేని బుద్ధి ఎవ్వరైనా మొగుళ్ళేనంటూ వీధుల వెంట దారితెన్నులేక తిరిగిందిట. పడచుజవరాలు పరులంతా నా మగళ్ళేనని తాపముచెందినట్లు లేదూ? ఓహోహో!

**తాత్పర్య వివరణ:**

ఓ నరులారా! ఈ మాచిత్తము (మనస్సు) వున్నదే, దీనికి ఏపులేనిది (మంచీచెడ్డాలేదు). ఇది నేడు తాపలేక (ఓర్వలేక) మేడలెక్కదలచేము. మేడలెక్కితే మనశ్శాంతి కలుగుతుందా? ఈహీహీ!!

జ్ఞానములేని బుద్ధి ఎవ్వరైనా నా మొగుడే అంటూ దారితెన్నూ లేకుండా వీధులవెంట తిరిగిందట. పడుచు జవరాలు పరాయివాళ్ళంతా నా మగళ్ళే అని తాపము చెందినట్లు లేదూ మేము ఓహోహో! అని నవ్వకోక ఏమిచేస్తాము చెప్పండి.

ఈ మనిషి యెంత వెఱ్ఱివాడు. ఇందరునూ హితులంటా, యెక్కడున్నా నేను అనుభవిస్తున్నదే సుఖము అంటూ అంతూపొంతూ లేని బాధలలో బొరలేము (దొర్లేము). మందమతి అయినవాడు ఎండమావుల్ని చెఱువులని భ్రమతో తిరిగనట్లు లేదూ?వాడు అక్కడా ఇక్కడా వెతుకులాడితే తాగే నీళ్ళు దొరుకుతాయా? మేము ఎంత పిచ్చివాళ్ళము? ఓహోహో!!

మేటియైన శ్రీవేంకటేశుని వదలివైచి పైపైవన్నీ రుచికరమైనవి అని నటించే, మనుష్యులతో వాళ్ళ దారిలో తిరిగాము. దూరపు కొండలు నునుపు అన్నట్లు కొండలెక్కి తిరిగి శ్రమపడ్డట్లయింది. మేము ఎంత బుఱ్ఱలేనివాళ్ళము? ఈహీహీ!!

**పద్యవివరణ:**

తే.గీ|| **తాపలేక మేడలనెక్కదలతుమింక**
**ఏపులేని చిత్తంబిది హీహి హీహి**
**మేటివేంకటపతి బాసి మీదమీద**
**నాటకపు తెరవుల మేము నడుతుమయ్య!**

సంఖ్య: XXI/458 రాగం : దేశి
కీర్తన : మీఱరాదు దూరరాదు మేనవానివలెనాయ

**దేశి**

**10 మీఱరాదు దూరరాదు మేనవానివలెనాయ**
**ఆఱడి నీతోడిపొందు లగడాయ నిఁకను** ||పల్లవి||

**చేరి మాటలాడఁబోతే సెలవుల నవ్వు చిందీ**
**వూరకుంటే పెంజెమట లుమ్మగిలీని**
**యీరీతి ముందరనుయ్యి యెంచ వెనకఁ దగరు**
**యేరా నీతోడిపొందు యేమిసేతు నిఁకను** ||మీఱ||

**తప్పకచూడఁగఁబోతే తనువెల్లాఁ బులఁకించే**
**రెప్పలు మూసిన కాఁకరేఁగీని**
**విప్పకపట్టితే నుమ్మ విడిచి తేనెగారీ**
**తిప్పరానినీపొందు ద్రిష్టమాయ నిఁకను** ||మీఱ||

**మోవి చవిగొంటేను మోహ మగ్గలమయ్యీ**
**తావితములమందితే తమివుట్టీని**
**యీవేళ మందాఁ బాలు యింటాఁ బాశమాయ**
**శ్రీవేంకటేశ కూడితి చెప్పరాదు ఇఁకను** ||మీఱ|| **458**

**ఉపోద్ఘాతము:**

మేనరికము చుట్టరికములో వరుస అయినవారికి జన్మతః కొన్నిహక్కులు వుంటాయి. ఈ కీర్తనలో నాయిక స్వామిని దెప్పుతున్నది. బాగుందయ్యానీవరుస.నీమాట మీఱరాదు. నిన్ను పల్లెత్తుమాట దూఱరాదు. మేనరికపుజులుం చెలాయిస్తున్నావు. బాబోయ్ నీతో పొత్తు పెట్టుకుంటే ఇకఅంతా అగడులాయ (దహించుకు) పోవటమే. నీతో ఆరడి (గొడవ) నావల్లకాదు. నీ అధరము మధురమే. కానీ దానివల్ల కలిగే మోహం అగ్గలము అంటే నమ్ము. సుగంధ పరిమళ తాంబూలముకూడా





దాహం తీర్చటం లేదు. ఈవేళ ఓ వేంకటేశ్వరా! మందాబాలు యింటా (పాలుపోసే గొల్లవారింట) పాశమాయ నీకు (బంధుత్వాలొచ్చాయి) ఔరా?

**తాత్పర్య వివరణ:**

స్వామీ! నీతో గొప్ప చిక్కువచ్చిపడిందే. మీఱరాదు (నీమాట జవదాటకూడదా?) దూఱరాదు (నిన్ను పల్లెత్తు మాట అనకూడదా?) నాపని, మేనవావివలెనాయ (మేనరికం దాక్షీకం అనుభవించటం అయిందికదా!) వద్దు బాబూ! నీ పొందు, ఆరడి (రగడవంటిది). ఇక అది ఒక అగడాయ (వేదన అయిపోయింది).

నీతో మాటలు కలిపితే ముసిముసి నవ్వులు చిందిస్తావు. పోనీ ఊరకుంటే ఏమి జరుగుతుందోనన్న ఉత్కంఠతో ఒళ్ళంతా చెమటలు ఉమ్మగిల్లె (తుకతుక వుడికించాయి). ఈ విధంగా నాపని ముందుబోతే నుయ్యి (బావి) వెనక చూస్తే తగరు (కొమ్ములు తిరిగిన పొట్టేలు) అయింది. నీతో పొందువద్దు. ఓరీ! ఇక నాకేమి చేయాలో పాలుపోవడం లేదు.

ఇక తప్పదని నిన్ను చూడగబోతే నా తనువు అంతా పులకరించింది. నీవు వెనుక నుంచి వచ్చి నా కనురెప్పలు మూయంగానే నీ స్పర్శకి కాకలు రేగి ఉద్రేకంతో మేను వేడెక్కిపోయింది. విప్పక పట్టితే (రాజీకి రాక పట్టుమీదవుంటే) వేడి దానంతట అదే తగ్గి శృంగారం తేనెలూరుతుంది. తిప్పరాని నీ పొందు (కాదు అనటానికి వీలులేని నీతో పొత్తు) ద్రిష్టమాయ (అదృష్టమువలె పరివర్తన చెందినది).

నీ అధరామృతమును చవిగొంటే నా మోహము, అగ్గలమాయె (అధికమైనది). నీవిచ్చిన పరిమళ భరితమైన తాంబూలము నందుకోగానే తమిపుట్టీని (నా దాహము ఇనుమడించింది.) ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ రోజు మందాబాలు యింట (గొల్లవారి ఇంట) నీకు పాశమాయ (అనుబంధాలేర్పడినవి) నీవు నన్ను చెప్పరానివిధముగా కూడితివి.

**పద్యవివరణ:**

ఆ.వె|| **అగడులాయపొందులారడిబెట్టెను**
**మీఱ, దూఱరాదు మేనవావి**
**మోవిచవిని జూచి మోహమగ్గలమాయె**
**చెప్పరాదు సుఖము శ్రీనివాస!**

సంఖ్య: II/510 రాగం : లలిత
కీర్తన : ఎన్నడు గలుగుమరి యీభాగ్యము

## లలిత

11 ఎన్నఁడు గలుగు మరి యీభాగ్యము
సన్నిధాయ నితనికి శరణనరే ॥పల్లవి॥

అదె చంద్రుఁ డుదయించె నచ్చుతుఁడు జనియించె
అదనఁ గంసునిజన్మ మస్తమించెను
పొదలిరి దివిజులు పొలిసిరి రాక్షసులు
సదర మీశిశువుకు శరణనరే ॥ఎన్నఁ॥

పాండవకులము హెచ్చె బాలకృష్ణుఁ డిదె వచ్చె
చండిదుర్యోధనుమూఁక జల్లన విచ్చె
దండి గోకులము నిండె ద్రౌపదితపము వండె
చండప్రతాపున కిట్టె శరణనరే ॥ఎన్నఁ॥

రేపల్లె పుణ్యము సేసె శ్రీవేంకటేశుఁడు డాసె
గోపికలమనసుల కొఱత వాసె
కోపులధర్మము దక్కె గోవర్ధనగిరి నిక్కె
చాపలమేఁటి కితని శరణనరే ॥ఎన్నఁ॥ 510

**ఉపోద్ఘాతము:**

నేడు శ్రీకృష్ణాష్టమి. ఈ రోజు అన్నమయ్య విరచితమైన శ్రీకృష్ణావతారం గురించి పాడటం నాపూర్వజన్మ సుకృతమే. ఈ శ్రీకృష్ణ పరమాత్మకు శరణం అంటే ఆయన సన్నిధి తప్పక లభిస్తుంది అంటున్నారు అన్నమయ్య. ఆ స్వామి నిన్ను తన రక్షణలోకి యెన్నడు తీసికొంటాడు, ఆ భాగ్యము నీకెప్పుడు కలుగుతుంది అని చెప్పగలిగినవారెవరు? ఆ పరమాత్మే. అష్టమినాడు చంద్రోదయ సమయాన ఉదయించిన నల్లనయ్య రాక్షసాంతకుడు. మన





మనస్సులలో దాగివున్న రాక్షసుని నశింపజేయడానికి ఇతనికి శరణు అందాము. కౌరవులను శిక్షించి పాండవులను రక్షించిన శ్రీకృష్ణ భగవానుడు ద్రౌపదీమాన సంరక్షకుడు. ఆశ్చర్యమేమంటే ఈ కలియుగంలో ఆయనే మన శ్రీవేంకటేశ్వరుడు.

**తాత్పర్య వివరణ:**

ఓ దేవదేవా! మరి మాకు యీ భాగ్యము యెన్నడు కలుగును? ఇతనికి శరణనరే (శరణు అని అనండి) ఆయన మిమ్మల్ని తన సన్నిధికి ఆహ్వానిస్తాడు.

అదిగో అటుచూడండి. చంద్రోదయమవుతున్నది. అచ్యుతుడు జన్మించాడు. అదే అదనుగా కంసుని జన్మ కూడా అస్తమించుటకు ముహూర్తం నిర్ణయించబడింది. దివిజులు (దేవతలు) పొదలిరి (వర్ధిల్లిరి). రాక్షసులు పొలసిరి (దైత్యులు సర్వనాశనమయ్యారు.) క్రమముగా ఈ శిశువునకు శరణనరో (శరణువేడండి).

ఇదే శ్రీకృష్ణభగవానుడు వచ్చె (రంగములోకి దిగినాడు.) బాలకృష్ణుడైనాడు. ఇక శిష్టులైన పాండవకులమును రక్షించి అభిమన్యుని పుత్రుడైన పరీక్షిత్తును బ్రతికించినాడు. దుర్యోధనుని మూక అయిన కౌరవులు చీల్చి చండాడబడి వాళ్ళ గుండెలు ఝల్లని విచ్చుకొన్నాయి. గోకులమంతా దండితో (తృప్తితో) తనివారింది. ద్రౌపది మాన సంరక్షణ జరిగి ఆమె తపస్సు ఫలించింది. చండప్రతాపుడైన శ్రీహరికి శరణనరో!

రేపల్లె పుణ్యము ఫలించింది. శ్రీవేంకటేశుడు డాసె (సమీపమునకు వచ్చాడు). గోపికల మనస్సులలోవున్న కొఱత తీరింది. లోకంలో ధర్మము దక్కింది. గోవర్ధనము నిక్కె (పైకి లేచింది) కృష్ణుని చిటికెన వ్రేలిపై లేచింది. ఇంకా మీకు చాపల్యమెందుకు స్వామిని శరణనరో.

**పద్యవివరణ:**

కం॥ **ఎన్నడు కలుగును భాగ్యము?**
**సన్నిధిలబియించు? హరికి శరణనరేలో?**
**వెన్నుడె వేంకట విభుడట**
**సున్నగు చాపల్యమింక సుకృతమగుపో.**

సంఖ్య: IX/252 రాగం : కాంబోది
కీర్తన : కైవసపుదానగాని కపటిగాను

**కాంబోది**

**12 కైవసపుదానఁగాని కపటిఁగాను**
**చేవదేర వలచితిఁ జిత్తగించవయ్యా ||పల్లవి||**

**కాయపు కాఁకలచేతఁ గసరుదు నొకవేళ**
**పాయపు మదము చేతఁ బదరుదును**
**చాయల సన్నల నిన్ను సాదింతు నొకవేళ**
**చేయెత్తి మొక్కే నిందుకే చిత్తగించవయ్యా ||కైవ||**

**యిచ్చిన చనవునను యీసడింతు నొకవేళ**
**గచ్చుల నీవద్ద నుండి గర్వింతును**
**ముచ్చటలాడుచు గోరుమోపుదు నే నొకవేళ**
**చెచ్చెరఁ బంతమిచ్చేను చిత్తగించవయ్యా ||కైవ||**

**పాదములొత్తుచు నిన్ను భ్రమయింతు నొకవేళ**
**సోదించి శ్రీవెంకటేశ సొలయుదును**
**ఆదిగొని కూడితి ని న్నలమేల్మంగ నవుదును**
**సేదదేర మన్నించి చిత్తగించవయ్యా. ||కైవ|| 252**

**ఉపోద్ఘాతము:**

ఈ కీర్తనలో అలమేల్మంగ శృంగార నాయిక, స్వాధీనపతిక. ఈమె తన వల్లభునికి పూర్తిగా స్వాధీనమై తనని తాను అర్పించుకునే బేల. ఏ కపటమూ నెరుగని ఈ జవరాలు కైవసమై మనస్ఫూర్తిగా వలచి తనవలపులు నేలుకొని చిత్తగించమని వేడుకొంటుంది. ఏదో కోపంలో కసురుకొన్నాను. యౌవనమదముతో అదిరిపడుతున్నాను. రాత్రింబవళ్ళూ నీవు అలాలేవనీ ఇలా లేవనీ సాధిస్తూనేవున్నాను. ఇందుకే నీకు చేయెత్తి మొక్కుతున్నాను. చిత్తగింపుము ప్రభూ! ఓ వేంకటేశ్వరా! నేనూ తక్కువదానను కాదేమో. నీ





పాదములొత్తి నేను చాలా నమ్రతగలదానని భ్రమింపజేస్తున్నానేమో? లేదా నిన్ను శోధించీ శోధించీ విరసము చూపిస్తున్నానేమో? సేదదీర నన్ను మన్నింపుము స్వామీ! నన్ను చిత్తగింపుము.

**తాత్పర్య వివరణ:**

ఓ దేవదేవా! నేను కపటిగాను (మోసకత్తెనుకాను). కైవసపుదానను (నీకు పూర్తిగా స్వాధీనమైపోయినదానను). చేవదేర (ఎంతో ధైర్యముతో) నిన్ను వలచితిని నన్ను చిత్తగింపుము ప్రభూ!

కొద్దిగా నా అగచాట్లనుకూడా ఆలకింపుము ప్రభూ! నేను నిన్ను కాయపు కాకలచేత (శరీర సహజమైన కోపముచేత) చిరాకుతో కసరుకొంటుంటాను. వయస్సు మదముజేత వదరుదును (ఏవోవో వాగుతుంటాను). చాయల సన్నల (రేయింబవళ్ళూ) ఒకవేళ నిన్ను సాధించి ఇబ్బంది పెడుతున్నానేమో? ఇందుకే నేను నీకు చేయెత్తి మొక్కుతున్నానయ్యా! నన్ను చిత్తగింపుము.

ఒకవేళ నీవిచ్చిన చనువును దుర్వినియోగం చేసికొని నిన్ను ఈసడించుకొంటున్నానేమో (రోత ప్రదర్శిస్తున్నానేమో)? నీవద్దనే నా స్థానము అనే వైకల్యముతో గర్విస్తున్నానేమో? ఒకవేళ మాటామాటా పెరిగి నీపై నఖక్షతములను చేయుచున్నానేమో? చెచ్చెర పంతము నిచ్చేను (శీఘ్రముగా పంతం పడుతున్నానేమో?)

ఒకవేళ నేను నిజంగా అంత మంచిదానను కానేమో? నీ పాదములు ఒత్తుచూ నేనునీ దాసినని కేవలం భ్రమ కలిగిస్తున్నానేమో? లేదా ఒకవేళ శోధించీ శోధించీ నీపై సొలయుదునేమో (విరసత్వము ప్రదర్శిస్తున్నానేమో!) ఆదికొని (నాపై కన్నువేసి) నన్ను కూడితివి. ఓ వేంకటేశ్వరా! నేను పరాయిదాన్ని కానయ్యా! నీ అలమేల్మంగనే. సేదదీరునట్లు నన్ను మన్నించి నన్ను చిత్తగింపుము ప్రభూ!

**పద్యవివరణ:**

ఉ|| **కైవసమైనదాన, చిరకాలము నీకృప వేడుదానరా**
**కావలెనన్ననూ కపటిగానుర వేంకటశైలనాయకా!**
**చేవలుదేర నే వలచి చేరితి నన్నిటు చిత్తగించుమా**
**దేవులనేము నీకు శ్రమ దీరగ మన్నన జూపుమోప్రభూ!**

సంఖ్య: II/6 రాగం : ఆహిరి
కీర్తన : ఇందులో మొదలికర్త యెవ్వడు లేడుగాబోలు

**ఆహిరి**

**13 ఇందులో మొదలికర్త యెవ్వఁడు లేఁడుగాఁబోలు**
**ముందు కరివరదుఁడే ముఖ్యుఁడుగాఁబోలు** ॥పల్లవి॥

**ఆడితిఁబో బహురూపా లన్ని యోనులఁ బుట్టి**
**తోడనె బ్రహ్మాదులనేదొరలెదుటా**
**జాడలు మెచ్చాలేరు చాలునన్నవారు లేరు**
**వేడుక నడవిఁగాసే వెన్నెలాయ బ్రదుకు** ॥ఇందు॥

**అన్నికర్మములుఁ జేసి ఆటలో బ్రాహ్మణుఁడనైతి-**
**నన్ని వేదములనేటియంగడివీధి**
**నన్నుఁ జూచేవారు లేరు నవ్వేటివారు లేరు**
**వన్నెలసముద్రములో వానలాయ బ్రదుకు** ॥ఇందు॥

**సంసారపునాటకసాలలో ప్రతిమనైతి**
**కంసారి శ్రీవేంకటపతిమాయలోన**
**యింస లిన్నియుఁ దేరె నిందరుఁ జుట్టములైరి**
**హంసచేతిపాలునీరునట్లాయ బ్రదుకు** ॥ఇందు॥ **6**

**ఉపోద్ఘాతము:**

ఆదిపురుషుడు కరిరాజవరదుడు అయిన శ్రీహరి అందరికంటే ముందుగా ముఖ్యుడు కాబోలు. ఆయన పరమాత్మ. ఆయన తప్పించి తక్కినవారందరూ జీవులే. ఈ జీవులకు మొదలికర్త (బ్రహ్మ) యెవ్వడూ లేడు కాబోలు అంటున్నారు అన్నమయ్య. అంటేఇందులో జీవులందరూ వరుసగా రకరకములైన యోనుల బుట్టెడి వారే. రకరకములైన కర్మములు చేసే ఈ జీవులు కర్మ ఆడించినట్లు ఆడతారు. ఆ విధంగా కొందరు బ్రాహ్మణులైతే కొందరు అన్యులవుతారు. కానీ ఆ దేవదేవుని కృప కలిగేంతవరకూ బ్రతుకు సముద్రముపై కురిసిన వానలాగా బ్రతుకంతా





నిష్ప్రయోజనమే అంటున్నారు. సంసారమనే నాటకశాలలో నిలబెట్టిన ప్రతిమల్లాంటి మానవులు శ్రీవేంకటేశ్వరుని మాయలో చిక్కి ఆయన కృప కలిగేదాక కొట్టుమిట్టాడుతుంటారు.

**తాత్పర్య వివరణ:**

కరివరదుడు (గజేంద్రమోక్షము సంప్రాప్తింపజేసిన శ్రీహరి) పరమాత్మ. ఆయనే అందరికంటే ముఖ్యుడు. దేవుడు కాబోలు. అయితే మిగతావారంతా జీవులే. వీరికి మొదలి కర్త (బ్రహ్మ) యెవ్వడూ లేడు కాబోలు. ఎందుకంటే కర్మ చేయాలంటే సంకల్పం కలగాలి. అది జీవునికి దేవుడే కలిగిస్తాడు.

నేనొక జీవుడను. అన్ని యోనులందు పుట్టి అనేక రూపాలు ధరించి, ఆ దేహానికి అనుగుణంగా ఆడితిబో (ప్రవర్తించాను). బ్రహ్మాదులవంటి దేవతలు ఇచ్చిన జన్మను అనుభవించక తప్పలేదు. ఆ జన్మలో నామంచి మెచ్చినవారూ లేరు. ఇక నీకు జన్మలు చాలులేరా, అన్నవారూ లేరు. మరి ఆ జన్మ అంతా నిష్ప్రయోజనమేనా? బ్రతుకంతా అడవిలో కాసిన వెన్నెలలాగా నిరర్ధకమా?

ఈనాడు బ్రాహ్మణుని జన్మపొందాను. ఈ ఆటలో నేను అన్ని కర్మలనూ చేయాలి చేయించాలి. ఇది నిర్దేశించింది బహుశా ఆ దేవుడే అయి వుంటాడు. చతుర్వేదములను అంగడి వీధిలో (సభలలో) వినిపిస్తుంటాను. నేను చేస్తున్నది మంచి పనియా కాదా? నన్ను చూచి ప్రశంశాపూర్వకంగా నవ్వే వారెవరు? ఉన్నారా లేరా? బ్రతుకంతా సముద్రం మీద కురిసిన వానలాగా నిరుపయోగమా? అది తెలిసిన దేవుడు కనబడడాయె కదా!

ఈ సంసారమంతా ఒక గొప్ప నాటకశాల తగిన పాత్రలేనిచోట (కావలివాండ్లవంటి పాత్రలు) ప్రతిమలను (కొయ్యబొమ్మలను) నిలబెడతారు. జీవితంలో కొందరి పాత్రలంతే. ఇదంతా కంసమర్దనుడైన శ్రీవేంకటేశ్వరుని మాయాజాలము. ఈ నాటకములో యెంతో హింస చేశాను. దానివల్ల యెందరో చుట్టములయ్యారు. మళ్ళీమొదలు కర్మలూ జన్మలూ. పరమాత్మ హంస. అదిపాలనూ నీటినీ వేరుచేయగలదు. ఏమి బ్రతుకురా ఇది. ఇందులో పాలువుంటే కదా పరమాత్మ మెచ్చటానికి?

**పద్యవివరణ:**

ఆ.వె॥ **ఇందు మొదలికర్త యెవ్వడు లేడురా**
**ముందు కరివరదుడె ముఖ్యుడగును**
**వేంకటపతి మాయవెలయగ బంధాలు**
**జన్మపిదప జన్మ జరుగుచుండు.**

సంఖ్య: IX/220 రాగం : భైరవి
కీర్తన : ఆటదానికి పతితో నంతచెల్లునా

**భైరవి**

**14 ఆఁటదానికి పతితో నంతచెల్లునా**
**చీటికి మాటికి యంతసేసేవె నీవు** ||**పల్లవి**||

**పట్టినదె చల మని పంతములె నెరపేవు**
**అట్టె యాతని ప్రియము లంగవించవు**
**చిట్టకాలు వద్దనిన చెలుల మాటలు చెవిఁ**
**చెట్టవు నీకుఁ దగిన బీరములె కాని** ||**ఆఁట**||

**ఆడినదె మాటసేసి యట్టె నిలువఁ బెట్టేవు**
**జోడుగా నాతని మాట చొరనియ్యవు**
**తోడనె నే మిద్దరి చేతులుఁ బట్టి కూరిచిన**
**కూడియుఁ గూడవు నీ గుణములె కాని** ||**ఆఁట**||

**మొదలివొట్టుకు నీ మొనలు చూపేవు గాని**
**అదనైన మీఁద నింక నటు మెచ్చవు**
**యిదివో శ్రీవెంకటేశుఁ డిదె నిన్నుఁ గూడినాఁడు**
**చదురు లింకా నీవు సాధించేవు గాని.** ||**ఆఁట**|| **220**

**ఉపోద్ఘాతము:**

ఆడదానికి భర్తతో అంతపంతము చెల్లదు. నీవు చీటికిమాటికీ యింత రాద్ధాంతం చేస్తున్నావు. ఇది నీకు తగదు అని నాయికు హితబోధ చేస్తున్నారు. ఆమె చెలికత్తె అయిన అన్నమయ్య. నీవు చెప్పినదే చెల్లుబడికావాలి, అని ఎలాగైనా నీమాట నిలబెట్టుకొంటావు. అతని మాటలు నీ చెవిలో చొరనీయవు. మేము ఎలాగో అలా మీ ఇద్దరినీ దారికి తెచ్చి చేతులు కలిపి రాజీకుదిరిస్తే, నీ గుణములు మానవు. ఆయనతో కూడినట్లే వుంటావు కానీ





కూడవు, అని దేవిని మందలిస్తున్నారు. కీర్తన చరణాలలో మీకీ అర్థం ప్రస్ఫుటంగా కనబడదు. కానీ ఇంత మనోజ్ఞమైన భావం వున్నది.

**తాత్పర్య వివరణ:**

ఓ దేవీ! ఆటదానికి (స్త్రీకి) పతితో (భర్తతో) అంతచెల్లునా? (అంతపంతము చెల్లుతుందా?) నీవు చీటికి మాటికి (చిన్న విషయాలు ప్రతివాటికీ) ఇంత రాద్ధాంతము సేసేవె (చేసేస్తున్నావే!!)

దేవీ! నీవు పట్టినదే పంతమని తీవ్రమైన పట్టుదల చూపిస్తావు. అయినా ఆతని ప్రియములను అంగవించేవు (చూరగొనేవు). నీకు చిట్టకాలు (పరిహాసము తగదనిన మా చెలుల మాట పెడచెవిని బెట్టేవు. నీకు తగిన (తోచిన) బీరములే (గర్వోక్తులేకాని) ఆయన మనసు పరవశించేవిధంగా మాట్లాడవు.

దేవీ! నీవు ఆడినదేమాట (అన్నమాటే శాసనము అన్నట్లు) నిలువబెట్టేవు (ఎలాగైనా నీమాట నెగ్గించుకొంటావు). నీ జోడీగా (భర్త అయిన) అతని మాటలు నీ చెవిలోకి చొరనియ్యవు. మా చెలికత్తెలము మీయెడబాటుజూడలేక తోడనే (వెంటనే) మేము మీ ఇద్దరి చేతులు బట్టుకొని రాజీ కుదరిస్తే, కూడియు (దగ్గరైకూడా) గూడవు (ఒకటికావు). నీ గుణములే (నీ భావాలు నీవే) కానీ పరులమాట ఆలకించవు.

ఆ స్వామి మొదటి ఒట్టు వేసికొన్నదాకానీ మొనలు (వాడితనము) చూపేవు. కానీ అదనైనదాక (ఒక్కసారి అనుకూలత పెరిగాక) ఇంక ఆయనను మెచ్చుకొనేవు. ఓ దేవీ! ఇదిగో శ్రీవేంకటేశుడు నిన్ను ఇట్టే లొంగదీసికొని కూడినాడు. చదురులు (చతురోక్తులతో) నిన్ను సాధించినాడు, కాని నీకు నీవే సాటి.

**పద్యవివరణ:**

కం|| **పతితో పంతముతగునటె?**
**అతివకు చెల్లునటె అంత అతి బీరములున్**
**హితవగునె ఇంతసేయుట**
**ప్రతిదానికి తిరుమలయ్యపల్లెత్తనడే?**

సంఖ్య: II/508 రాగం : నాట
కీర్తన : ఇదె వీడె కంటిమమ్మ యేతులవాడు

నాట

15 ఇదె వీఁడె కంటిమమ్మ యేతులవాఁడు
కదలేసూర్యచంద్రులకన్నులవాఁడు ||పల్లవి||

సెలవినవ్వులవాఁడు చేక త్తిగోళ్ళవాఁడు
పలుపేగులజంద్యాల పంతాలవాఁడు
యెలమిఁ జెలిఁ దొడపై నిడుకొన్నట్టివాఁడు
చెలఁగిన ఘననారసింహుఁడటే వీఁడు ||ఇదె||

కొండగద్దెమీఁదివాఁడు గొప్పకిరీటమువాఁడు
దిండుపైఁడిచీరకాశ(సె?) తెక్కులవాఁడు
రెండురూపులొకటైన రీతుల మాయలవాఁడు
అండఁ బ్రహ్మాదవరదుఁ డాతఁడటే వీఁడు ||ఇదె||

భవనాసిపొంతవాఁడు భావించఁ దెల్లనివాఁడు
ఇవల శ్రీవేంకటాద్రినిరవైనాఁడు
జవళిపంతాలవాఁడు శంఖుచక్రములవాఁడు
తివిరిన అహోబలదేవుఁడటే వీఁడు ||ఇదె|| 508

**ఉపోద్ఘాతము:**

ఏ ఉపోద్ఘాతము అవసరంలేని మధుర కీర్తన అహోబల నారసింహునిపై వినిపిస్తున్నారు అన్నమయ్య. ఇది యెంత పొందికగా చెప్పిన కీర్తనంటే యధాతథంగా ఒక చక్కటి సీసపద్యములో ఇమిడిపోయింది చూడండి. “భవనాశి”నదీతీరాన వెలసిన ఈ పంతాల “హరి” (సింహం) కరుణాంతరంగుడైన శ్రీవేంకటేశుడే, అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ వనితలారా! ఇదె వీడె అహోబలనృసింహుడు. ఈయన యేతులవాడు (గొప్ప ఉద్ధతి కలవాడు). ఈయన నయనద్వయమే కదలే సూర్య చంద్రులు





ఈ స్వామి మొగము యెప్పుడూ సెలవి నవ్వులతో చిరునవ్వులు చిందిస్తూ వుంటుంది. ఈయన గోళ్ళు చేకత్తులవలె (బాకులవలె వుంటాయి). హిరణ్య కశిపుని చాలా పేగులను వానిపొట్ట చీల్చి తన మెడలో జంధ్యములవలె ధరించాడు. ఎలమి (అతిశయించి) తన చెలిమిగల భార్యను తొడపై బెట్టుకొని యున్నవాడై చెలగిన (విరాజిల్లుతున్న) ఘన నారసింహుని కనులారా దర్శించండి.

ఈ స్వామి, కొండ గద్దెమీదివాడు. అహోబలపు కొండయే తన సింహాసనముగా అధిష్ఠించినవాడు. ఈయన ధరించిన గొప్ప వజ్ర కిరీటము ధగధగమని కాంతులు విరజిమ్ముతున్నది. మెత్తటి దిండుపై సుఖాశీనుడైనాడు. పైడి చీరె (స్వర్ణ పీతాంబరమును) కాసె బోసి కట్టినాడు. ఈయన తెక్కులవాడు (యెన్నో కిటుకులు నేర్చినవాడు). ఆయన నరుడూ సింహమూ రెండూ ఒక్కటిగా రూపుదిద్దుకొన్నవాడు. ఎన్నో విధములైన మాయలు చూపినవాడు. బ్రహ్మాది దేవతలకు అండ అయి అనేక వరములనిచ్చాడు.

ఈ నరసింహుని నివాసము భవనాశి నదీతీరము. ఈయన ధవళవర్ణపు నృసింహుడు. ఇవల (ఈ తిరుమలలో) శ్రీవేంకటాద్రిని స్థానము చేసికొని యేలుబడి కొనసాగిస్తున్నాడు. ఈయనకు మొక్కుకొని మరచితే పంతముతో తనమొక్కు తీర్పించుకొంటాడు. శంఖ చక్రధారియైన ఈ అహోబల నారసింహుడు తివిరిన దేవుడు (త్వరగా వరములిడు దేవుడు)

**పద్యవివరణ:**

సీ|| **సెలవినవ్వులవాడు చేగోళ్ళ మొనగాడు**
**పేగులే జంధ్యంపు పోగువాడు**
**చెలిని వామాంకాన చేర్చి నిలుపువాడు**
**చెలగిన ఘన నారసింహుడితడు**
**కొండ గద్దియపైన గొప్ప కిరీటాన**
**రాజిల్లు కనకాంబరంబువాడు**
**రెండు రూపాలతో మెండు మాయలవాడు**
**అండ బ్రహ్మాదుల కయినవాడు**

ఆ.వె|| **కంటిమమ్మవీని ఘన అహోబల “హరిన్”**
**జమళి పంతగాడు సాధుప్రియుడు**
**సూర్య చంద్రనయను సొంపార జాడుడీ**
**శంకు చక్రధారి వేంకటపతి.**

సంఖ్య: IX/182 రాగం : సామంతం
కీర్తన : ఎగ్గో తప్పో యెఱగనిది

**సామంతం**

**16 ఎగ్గో తప్పో యెఱఁగ నిది**
**నిగ్గులు దేరఁగ నినుఁ బైకొందు** ॥పల్లవి॥

**పలుమరు నీతోఁ బంతము లాడను**
**అలసి సొలసి మాటాడుదును**
**కులికి కులికి నినుఁ గోపించి చూడను**
**నలుగడఁ గూరిమిఁనాఁటఁగ జూతు** ॥ఎగ్గో॥

**కమ్మర నీపై కాఁకలు చల్లను**
**సమ్మతి వలపులు చల్లుదును**
**దిమ్మరేఁచి తరితీఁపులఁ బెట్టను**
**కొమ్మని మేకులు కొనఁ బెట్టుదును** ॥ఎగ్గో॥

**పాసివుంటి వని బడలిక సేయను**
**ఆసల రతులనె ఆలయింతు**
**సేసలఁ గూడితి శ్రీవెంకటేశ్వర**
**వేసరించ నిను విడువ నెప్పుదును.** ॥ఎగ్గో॥ **182**

**ఉపోద్ఘాతము:**

నాయిక శ్రీవేంకటేశ్వరునితో నిక్కచ్చిగా చెబుతున్నది. స్వామీ! నేను చేసేది తప్పో ఒప్పో తెలియదు నిగ్గులు దేరిన నిన్ను పైకొనకుండా వుండలేను. ఇప్పుడు నాకు తెలిసివచ్చింది. ఇకపై నీతో పంతములాడను అలసి సొలసేదాకా మాట్లాడుతూనే వుంటాను. నా కులుకులన్నీ ఒలకబోసి నీపై కోపము ప్రదర్శించను. అన్నిరకములుగ నాకు నీపైగల అనురాగాన్ని





బట్టబయలు జేస్తాను. అదింకా నా గుండెల్లో నాటుకు బోయేట్లు చేస్తాను. ఎప్పుడూ లాగ నా కోపతాపాలు నీపై చూపించను. ప్రియాతిప్రియమైన వలపులు చల్లుదును. దిమ్మతిరిగి నిన్ను బాధబెట్టను. తగుదునమ్మా అని నిన్ను పరిహసించను అంటున్నది. అన్నమయ్య అద్భుత సృష్టి ఇది.

**తాత్పర్య వివరణ:**

శ్రీనివాసా! నేను చేస్తున్నది ఎగ్గో (సరియైనదో) తప్పో నాకు తెలియదు. నిగ్గులుదేరంగ (సరితూగునట్లుగా) నిన్ను పైకొందును (పెనవేయుదును గాక!)

స్వామీ! నాతప్పు నాకు తెలిసివచ్చింది. ఇకపై పలుమరు (ప్రతిసారీ) నీతో పంతములాడను. అలసినా సొలసినా నీకు తృప్తి కలిగేట్లు మాటలాడుదును. కులికీకులికీ (నాకులకులన్నీ చూపి) నాకోపమును ప్రదర్శింపను. నలుగడ కూరిమి నాటుదును (అన్నివిధములుగా నా ప్రీతిని నాటుకొనునట్లు చేయుదును).

ప్రభూ! మరల మరల నీపై నాకాకలు చల్లను. (నాకోప తాపాలను ప్రదర్శించను.) అంగీకారయుక్తమైన నావలపులను నీపై విరివిగా చల్లుదును. దిమ్మరేచి (మత్తు నెత్తికెక్కి) నిన్ను ఉపేక్ష జేయను. కొమ్మని (తీసికొనుమని) మేకులు కొనబెట్టుదును (పరిహాస పూర్వకముగా అవమానించను).

స్వామీ! దూరమై ఇన్నాళ్ళకు దగ్గరయ్యావని నా చిరాకు ప్రదర్శించను. ఆశలు దీరని రతులతో నిన్ను అలయింతును. (అలసిపోవునట్లు సేతును.) ఓ శ్రీవేంకటేశ్వరా! మంగళాక్షతలు ధరించిన నన్ను కూడితివి. ఇక నేనెప్పటికీ నిన్ను వేసరించి (విసుగుజెంది) నిన్ను విడనాడను. నేను త్రికరణశుద్ధిగా ఈ మాటలు చెబుతున్నాను.

**పద్యవివరణ:**

కం॥ **ఎగ్గో తప్పో యెఱుగను**
**నిగ్గులు దేరంగ నేను నినుపై కొందున్**
**సిగ్గులు మరచిన రతులన్**
**దగ్గరనీకవుదునయ్యా ధరణీనాథా!**

సంఖ్య: II/519 రాగం : దేసాళం
కీర్తన : కడనుంచి చూచేనీకు గనికరమైతే

## దేసాళం

17 కడనుండి చూచేనీకుఁ గనికరమైతేఁగన
బడి నన్నుఁ గావు నీతో బలిమేలే ||పల్లవి||

వొడలుమోచినయది యొకయపరాధము
అదరి సంసారినౌటె యపరాధము
బడి నివి పఱచినపాట్లఁ బడకపోడు(దు?)
యెడనీకు మొరవెట్ట నిఁక జోటేదయ్యా ||కడ||

అన్నపానములు గొన్న దది యొక్క నేరమి
వున్నతి సంపదఁ బొందు టొకనేరమి
యిన్నియు ననుభవించి యిఁక నొల్లనంటేఁ బోదు
విన్నపాలు సేసి నీతో విసుగఁ బోటేది ||కడ||

మదిలో నీవుండగాను మఱచిన దొకకల్ల
అదనఁ గర్మాధికారినౌటొకకల్ల
యెదుట శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గాచితివి
తుద కెక్కితిమి యింకఁ దొలఁగఁగవలెనా ||కడ|| 519

**ఉపోద్ఘాతము:**
భక్తి తొణికిసలాడే హరి శరణాగతి అన్నమయ్య వాణి ద్వారా ఆస్వాదించండి. శ్రీహరి కోటానుకోట్ల సంఖ్యలో వున్న తన శరణాగతులను తన కన్ను కొలుకులనుండి ఒక తృటి కాలం చూస్తాడట. అయితే మనధ్యాస అప్పుడు ఏ అనవసర రాజకీయాలపైననో వుంటుంది. ఆయన చూపు మన చూపు కలవదు. మరి ఆయన కృపయెలా కలుగుతుంది? మరి దారేమిటి? సర్వకాల సర్వావస్థలలో శ్రీహరి ధ్యానంలోవుండే వారికే అది సాధ్యం. మనం యెప్పుడూ హరిని తలుచుకొంటుంటే ఆయన 'కడనుండి' చూపు మన చూపుతో కలియగానే మోక్షమే. ఇప్పుడు కిటుకు అర్థమైనదా? అన్నమయ్య





అదేపని చేశారు. హరితో బలిమిలాభం లేదు శరణాగతే, ఆయన దాస్యమే సులభోపాయం. మరి మన అపరాధపెన్వరుస యెలా మన్నింపబడతాయి?

**తాత్పర్య వివరణ:**

ఓ దేవదేవా! నీతో బలిమియేలే? (నీతో బలిమి చూపుటెంత అవివేకము). నీ భక్తులను నీవు కడనుండి (కన్ను కొలుకులనుండి ఒక్క చిటికె వేసేటంతసేపు మాత్రమే చూస్తావట). నీకు కనికరమైతే నాకు కనబడి నన్ను గావుము (రక్షింపుము).

నేను కోట్లాదిగా అపరాధములను చేశాను. అంగీకరిస్తున్నాను. అసలు నేను ఒడలుమోచినయది (నా శరీరం పొందినదే పురాకృత పాపముననుభవించుటకు). ఈ శరీరపు కోర్కెలు తీర్చుకోటానికి సంసారినయ్యాను. అది ఇంకా పెద్ద అపరాధము. వీటన్నిటినీ పఱచిన (వదలివేసివుంటే) నాకు ఇన్ని పాట్లు వుండేవి కావు. ఈ సంసారంలోపడ్డ నాకు నీతో మొఱబెట్టుకొనే వీలే కలుగలేదు.

ప్రభూ! ఇది అన్నమునాసించే శరీరము. అన్నము సత్తువనిచ్చి నేరాలు చేయిస్తుంది. మరి నేను అన్నము గొనుటయే నానేరమా? బలవంతుడనై సంపదలను ఆర్జించాను. అది ఇంకా ఘోరమైన నేరము. ఆ సంపద వలన కలిగిన సమస్త భోగములను అనుభవించాను. ఇన్నాళ్ళూ ఆ భోగాలు అనుభవించి ఇవ్వాళ నాకక్కరలేదు అంటే నా శరీరం ఒప్పుకొంటుందా? ఇక విన్నపాలుచేసి నాకు ఈ భోగాలనుండి విముక్తి కావాలని విసుగు జూపుటకు అవకాశమేది?

ఓ శ్రీహరీ! నా అంతర్యామివై నా మదిలో నీవే వున్నావు. అయినా నేను నిన్ను మఱచాను. అది ఒక గొప్ప కల్ల (తప్పు). అందువల్ల నా కర్మలన్నిటికీ నేనే కర్మాధికారినయ్యాను. అది ఇంకా పెద్ద కల్ల (తప్పు) చివరికి ఎట్లాగో నీకు దయ కలిగి నన్ను కాచితివి. ఓ శ్రీవేంకటేశ్వరా! మేము జీవన్ముకులమైతిమి. ఇక తొలగిపోయాము.

**పద్యవివరణ:**

చం|| **కనికరమైనచో పనిచికానగ రమ్ము మహానుభావ! నీ**
**కనుకడనుండి చూతువట కాదన, నెట్టయినన్ తరింపగా**
**నను వడిగావుమయ్య! హరి! నాబలిమెంతటిదయ్య? దీనుడన్**
**విను అపరాధపెన్వరుస వేంకటనాయక నీశరణ్యుడన్.**

సంఖ్య: IX/191 రాగం : లలిత
కీర్తన : నాటిసుద్దులె వింటిమి నేటి సుద్దులు గంటిమి

**లలిత**

**18 నాటి సుద్దులె వింటిమి నేటి సుద్దులు గంటిమి**
**పాటింప నా వేడుకలు ప్రత్యక్షమైవున్నవి ॥పల్లవి॥**

**ఆ(అ?)దనఁ గోనేటిదండ హరి గూచుండి చూడఁగ**
**యెదుటనె జలకేలి నింతు లుండఁగా**
**కదిసి యమునలోన కందువైన గోపికలు**
**పొదిగి వలపుచల్లే పోలికయై వున్నది ॥నాటి॥**

**అంతలోనె వలువలు అందరుఁ గట్టుక వచ్చి**
**చెంత నితని కొలువు సేయఁగాను**
**చింతదీరఁ దొల్లి అందె చీర లిన్ని నిప్పించుక**
**సంతసాన నిట్లుండే సరవినే వున్నది ॥నాటి॥**

**అట్టె శ్రీవెంకటేశుఁ డలమేల్మంగనుఁ గూడి**
**నెట్టన పైఁడిమేడలో నిండు కుండఁగా**
**అట్టుగా వీ రిందరు నాఅడిసేసి నవ్వఁగాను**
**తెట్టెలై నాటి పొందులు తెలిపినట్లున్నది. ॥నాటి॥ 191**

**ఉపోద్ఘాతము:**

తిరుమలలో వేంకటేశ్వరుడూ అలమేల్మంగ, వసంతోత్సవంలో పాల్గొంటున్నారు. నేటి యీసుద్దులు మనం ప్రత్యక్షంగా వేడుకగా చూడగలుగుతున్నాము. హరి ఈనాడు కోనేటి ఒడ్డున అదన (అనువుగా) కూచుండి చూస్తుంటే ఇంతులు జలకేళిలో వున్నారు. ఇది ఎలా వున్నదంటే ఆనాడు యమునా నదిలో గోపికలు జలక్రీడలాడుతుంటే శ్రీకృష్ణుడు వలపులు చల్లుతూ వారిని చూస్తున్న పోలికలోవున్నది. ఈనాడు కోనేటిలో స్నానం చేసిన స్త్రీలు వలువలు కట్టుకొని





అందరూ కొలువు చేసికొని చక్కటి పాటలు పాడుతుంటే ఎత్తుకొనిపోయిన చీరెలను శ్రీకృష్ణుడు తిరిగి ఇవ్వగానే గబగబా వాటిని కట్టుకొన్న గోపికలు అమ్మయ్య! అని సంతోషించి శ్రీకృష్ణునిపై ప్రేమగీతికలు పాడినట్లు వున్నది. ఇది అన్నమయ్య అద్భుత ఊహా కదంబం అవునా?

**తాత్పర్య వివరణ:**

నాటి సుద్దులు (ఆనాడు బృందావనములో జరిగిన కథలు) విన్నాము. నేడు ఈ తిరుమలలో జరిగిన సుద్దులు కంటిమి (చూస్తున్నాము). పాటింప (పట్టింపుగా) ఆ వేడుక ఈ నాడు ప్రత్యక్షంగా చూస్తున్నట్లున్నది.

ఈనాడు అదన (అనువుగా) హరి (శ్రీవేంకటేశుడు) ఈ తిరుమల కోనేటి ఒడ్డున కూర్చొని చూస్తుండగా యెదటనే కోనేటిలో జలకేళి ఆడుచున్న వనితలను చూస్తే, ఆనాడు యమునలో గోపికలు మనోహరంగా వలపులు చల్లుతూ స్నానం చేసినపోలికయై కానవచ్చుచున్నది.

అంతలోనే తిరుమలేశుని సేవకు జాగు అవుతున్నదని స్త్రీలందరు వలువలు కట్టుకొని వచ్చి స్వామి చెంత నిలుచుని కొలువు చేయుచూ గీతికలు ఆలపిస్తుంటే ఎలా వున్నదంటే, తొల్లి (పూర్వము) చింతదీర (తమ దిగులు పోవునట్లు) తమ చీరెలనన్నింటినీ తిరిగి ఇప్పించుకొనిన గోపికలు సంతోషంతో ఇట్లాగే వలువలు ధరించారేమో అనిపించుచున్నది.

అంతేకాదు, నేడు శ్రీవేంకటేశ్వరుడు అలమేలుమంగను కూడి నెట్టున (నిండుగా) బంగారు మేడలో, నిండుకుండలా (గంభీరమూర్తులవలె) వుంటే, వీరందరూ (ఈ భక్తులందరూ) పెద్దగా అల్లరి చేస్తూ నవ్వుతుంటే యెలావున్నదంటే... ఆనాటి తన పొందులు (కూటముల) గురించి స్వామి చెబుతుంటే నవ్వులాగక నేడు వీరంతా నవ్వుతున్నారా అన్నట్లున్నది.

**పద్యవివరణ:**

తే.గీ॥ **నాటిసుద్దులు వింటిమి నయము మీర**
**నేటిసుద్దులు గంటిమి తేటకనుల**
**నీదువేడుకల్ పాటింప నీలవర్ణ!**
**ఎదుట ప్రత్యక్షముగనున్నవిది నిజంబు.**

సంఖ్య: II/513 రాగం : లలిత
కీర్తన : కానవచ్చీగానరాదు కమలాక్ష నీమాయ

**లలిత**

**19 కానవచ్చీఁ గానరాదు కమలాక్ష నీమాయ**
**తానే వెంటవెంటఁ దగిలీ నిదివో** ||పల్లవి||

**తొల్లి నీవు గలవు తోడనే నేఁను గలను**
**యెల్లగా నీప్రపంచము యింతాఁ గలదు**
**కొల్ల యెద్దు లెప్పటివే గోనెలే కొత్తలైనట్టు**
**చల్లనినేనొకఁడనే జన్మములే వేరు** ||కాన||

**వేదములు నాటివే వినుకులు నాటివే**
**ఆదినుండి చదివే నదియే నేను**
**వేదతో వెన్నవట్టి నేయి వెదకఁ బోయినయట్టు**
**దాదాత నా తెలివి యితరుల నడిగేను.** ||కాన||

**వైకుంఠమూ నున్నది వరములు నున్నవి**
**యీకడ శ్రీవేంకటేశ యేలితి నన్ను**
**కైకొని పువ్వు ముదిరి గక్కనఁ బిందె యైనట్టు**
**నీకు శరణనఁగాను నేనీడేరితిని** ||కాన|| **518**

**ఉపోద్ఘాతము:**

కమలనేత్రుడైన శ్రీకాంతుని మాయకు అబ్బురపడుతున్నారు అన్నమయ్య. ఒకసారి కానవచ్చీ వొకసారి కనరాదు. ఏమిటి నీమాయ! ఒకచోటవుండనీయదు. తానే మా వెంట వెంటబడి సతమతమవునట్లు చేస్తుంది ఇదివో నీమాయ దాటుటకు అసాధ్యము అని అంటున్నారు. అనాదిగా నేనూ వున్నాను, ఈ ప్రపంచమూ వున్నది. ఎద్దులెప్పటివే, వాటిమీద కప్పిన గోనెలే కొత్తవి. నేను వొక్కడినే నా జన్మలే లెక్కలేనన్ని వేదములనన్నీ ఈ జన్మలోనూ నేర్చాను. కానీ ప్రయోజనమేమిటి? వెన్న కావలసినంతవుండగా నేతికోసం యితరుల నడిగీ అడిగి ఆయాసపడ్డాను.





ఓ వేంకటేశ్వరా! నీవైకుంఠమూ అదే నీవరములూ అవే అవట్లా వుండనీ. నీవు ఈనాడు నన్ను అనుగ్రహించావు నీశరణాగతులను చెట్టుమీద పూలు పిందెలైనట్లు నీవే ఈడేరుస్తావు, అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ కమలనయనా! నీమాయ, వొక్కొక్కసారి కానవచ్చీ (తేటతెల్లముగా వున్నట్లుంటుంది). ఒకసారి కానరాదు (దిక్కు తెలియకుండా చేస్తుంది). ఇదిగో తానే మావెంటవెంట తగిలీ (తగులుకొంటుంది).

అనాదిగా పరమాత్మవైన నీవూ వున్నావు. జీవాత్మనైన నేనూ వున్నాను. సమస్తంతో కూడిన ఈ ప్రపంచమూ వున్నది. కాడికి గట్టిన ఎద్దులు యెప్పటివే (యెప్పుడూ వుండేవే). వాటి మీద అలంకారానికి కప్పిన గోనెలే (జనపనార వస్త్రమే కొత్తది. అంటే శరీరాలే కొత్తవి. లోపలి ఆత్మలు పాతవే అని భావము. మరి "నేను" జన్మలెత్తుతూనే వున్నాను.

ప్రభూ! వేదములూ ఆనాటివే. వాటి పారాయణా అనాదిదే. అనాదిగా వేదములనధ్యయనం చేసే నేనూ యెప్పటివాడనో తెలియదు. కానీ ఇవన్నీ దేనికి? నిన్ను తెలుసుకోవడానికేగా? దానికోసం ఇంతశ్రమ పడవలెనా? ఇంట్లో కావలసినంత వెన్నవున్నవాడు నేతికోసం వాడలో ఇల్లిల్లూ తిరిగినట్లు వుంది కదూ! కాస్త వెన్నవేడి చేసికొంటే కావలసినంత నెయ్యి నీదగ్గరే వుంది కదా!

ఓ శ్రీవేంకటేశ్వరా! నీవైకుంఠమూ అనాదిదే. నీవిచ్చే వరములూ అనాదివే. నాకే నీవు యెన్నోసార్లు వరములనిచ్చావు. కానీ ఈ జన్మలో నన్ను తిరుమల చేరునట్లు అనుగ్రహించి నన్ను ఏలుకొన్నావు. చెట్లమీదవున్న పూలూ పాతవే, పిందెలే కొత్తకొత్తవి పుట్టి పండ్లయి కొన్ని తీపివి కొన్ని చేదువి అవుతుంటాయి. నిన్ను శరణు అంటే నీవే ఈడేరుస్తావు కదా! చింతెందుకు?

**పద్యవివరణ:**

ఉ|| **కానగవచ్చు నొక్కపరి కానగరాదయె వొక్కసారి నీ**
**పూనిన మాయశాంతముగ వుండగ నీయదు వెంబడించు బో**
**నేనొకనాడు వేదమును నేర్చితి, వ్యర్థము, వేంకటేశ్వరా!**
**బానలవెన్నదాచుకొని వాడలనేతికి వేసరిల్లితిన్.**

సంఖ్య: IX/206 రాగం : ముఖారి
కీర్తన : ఏమిటికి వేడుకొనే వింతలో దమకించేవు

**ముఖారి**

**20 ఏమిటికి వేఁడుకొనే వింతలోఁ దమకించేవు**
**కామించి నీ వాడినట్టు కాదంటినా ॥పల్లవి॥**

**మచ్చరములెల్లఁ దీరె మంతనాన నీవు నాతో**
**యిచ్చకము లాడితేనె యియ్యకొంటిని**
**కుచ్చి కాఁగలించి నాచెక్కులు నొక్కే వేమిటికి**
**నిచ్చలు నీచెప్పినట్టు నేఁ జేయనంటినా ॥ఏమి॥**

**ఆనలెల్ల విడిచితి నంటఁబట్టి నీవు నాకు**
**తేనెమోవి యిచ్చితేనె తిరమైతిని**
**పూనిక నాకొంగువట్టి పొంచి యాలపెనఁగేవు**
**పూని నీతో పొందులు నేనొల్లనంటినా ॥ఏమి॥**

**మంకు లన్నియుఁ దొలఁగె మనసుమర్మములంటి**
**సంకెలు దీరిచితేనె సమ్మతించితి**
**కొంకక శ్రీవెంకటేశ కూడి యింకాఁ బొదిగేవు**
**పొందకమైన మీఁదాఁ దప్పులు వట్టేనా. ॥ఏమి॥ 206**

**ఉపోద్ఘాతము:**

తమకించు అంటే తొందరపడటం వంటి అనేకానేకార్థాలు వివరింపబడి సందర్భానుసారంగా వాడబడ్డాయి. ఇక్కడ నప్పే అర్థము జంకు కనబరచుట. నాయిక నాయకునితో అంటున్నది. దేనికోసం ఇంతగా వేడుకొంటున్నావు? మళ్ళీ ఇంతలోనే జంకుతావు. కోరికలతిశయించిన నేను నీవు చెప్పినట్లు కాదంటినా? నా మంకుతనమంతా నన్ను వదలివేసినది. నామనస్సులోని మర్మము గ్రహించి నా అనుమానాలన్నీ తీరిస్తే సమ్మతించి వెనుదీయక





వేంకటేశ్వరా! నన్ను కూడి కమ్ముకొనేవు. స్వామీ! నీకు చేరికయైనాక నీ నేరములెంచెదనా? అలా యెన్నటికీ చేయను అంటున్నది నాయిక. అన్నమయ్య వినిపించిన చక్కటి సరసకీర్తన ఇది.

**తాత్పర్య వివరణ:**

ప్రభూ! ఏమిటికి వేడుకొనేవు (దేనికి ఇంతగా ప్రాధేయపడుతున్నావు?) ఇంతలోనే, తమకించేవు (జంకుతున్నావు). నేను కోర్కెతో నీదాననైతిని. నీవాడినట్లు (నువ్వు చెప్పినదానిని) కాదంటినా (కాదని యెన్నడన్నా అన్నానా?)

నీవు నాకు చేరువయై యిచ్చకములు (ప్రియవచనములు) చెప్పగానే నేను పరవశించిపోతాను. మచ్చరములు (నా మత్సరాన్నంతా) విడిచి పెడతాను. మంతనాన (ఏకాంతమున) ఇష్టాగోష్టికి ఇయ్యకొంటిని (అంగీకరించితిని). ఇంతలోనే నన్ను గుచ్చి కౌగలించుకొని నా చెక్కిళ్లను నొక్కేవు. నా ఇచ్ఛతో నేనే నీవు చెప్పినట్లు చేస్తాను కదా! చేయనని ఎప్పుడన్నా అన్నానా?

ఆనలు (ఆంక్షలు) అన్నీ విడిచిపెట్టి, అంటబట్టి (వెంటబడి) నీవు నాకు నీ అధరామృతము నందిస్తేనే నేను స్థిమితపడ్డాను. ఒకసారి స్థిరచిత్తనై నీదాని నయినాక ఇంకా యెందుకు నా కొంగుబట్టి లాగి పెనుగులాడెదవు? నీతో పొందు నేనెన్నడైనా ఒల్లనంటినా (కాదన్నానా?). ఓ ప్రభూ! నా సర్వస్వమూ నీదేనయ్యా!

ఓ శ్రీవేంకటేశ్వరా! నా మత్సరము తొలగిపోయినది. మంకుతనము మాయమైపోయినది. నా మనస్సులోని మర్మము గ్రహించి, సంకెలు దీర్చితేనే (అనుమానములన్నింటినీ తొలగించితేనే) నేను సమ్మతించాను. కొంకక (వెనుదీయక) ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను కూడి పొదిగేవు (కమ్ముకొనెదవు). స్వామీ! పొంకమైన మీద (నీకు చేరిక అయినాక) ఇంకా నీ తప్పులువట్టేనా (నీ నేరములెంచెదనా?)

**పద్యవివరణ:**

కం॥ **ఏమిటికి వేడుకొందువు?**
**స్వామీ! తమకింతువింత జగపతివయ్యున్,**
**కామించి వేంకటేశా!**
**నామగడై రతుల గూడినావుగ ధన్యన్.**

సంఖ్య: II/501 రాగం : పాడి
కీర్తన : హరి నారాయణ కృష్ణ అదివో మావిన్నపము

**పాడి**

**21 హరినారాయణ కృష్ణఅదివో మావిన్నపము**
**తరవాతిమాట నీవే తలఁచుకోవయ్యా ॥పల్లవి॥**

**సడిఁబడ్డనాతలఁపుచక్కఁగాక వుండినాను**
**వొడయఁడవునీకృప వొగిఁ జక్కనే**
**గుడిగొన్నయే రెంత కొంకరవంకరలైనా**
**పుడమికి లోఁగొనకపోవునటవయ్యా ॥హరి॥**

**కాయకపునాభక్తి కడుఁ గొంచమైనాను**
**ఆయపునీవరములు అతిఘనమే**
**యేయెడ గుడి గొంచమయిన గుడిలోదేవుని-**
**కాయడ మహిమ ఘనమందురు గదవయ్యా ॥హరి॥**

**శ్రీవేంకటేశ నిన్ను జింతించక నేనుండినా**
**జీవాంతరాత్ముఁడవై చేకొంటి నీవే**
**ఆవటించి కీలుబొమ్మ అచేతనమై యుండినా**
**ఆవేళ సూత్రధారుఁ డాడించుఁ గదవయ్యా ॥హరి॥ 507**

**ఉపోద్ఘాతము:**

ఈ కీర్తన పల్లవిలోనే నా కలముఆగిపోయింది. ఓ హరీ నారాయణా! కృష్ణా! మా విన్నపము అదిగోనయా! దాన్ని ఆలకించి మమ్ము ధన్యులను చేయవయ్యా! అన్నారు అన్నమయ్య. బాగానే వున్నది. "తరువాతి మాట నీవే తలచుకోవయ్యా" అని పల్లవి ముగించారు. అంటే యేమిటి? నేను ఇలా భావిస్తున్నాను. ప్రతి జీవునికి అంతిమ లక్ష్యము ముక్తిని పొందటమే. ముక్తి అంటే వైకుంఠంలో నారాయణుని సన్నిధిలో వుండటమని, నారాయణునిలో ఐక్యమైపోవటమని రకరకాలుగా విశ్లేషించి జీవి అర్హతనుబట్టి పరమాత్మ ఇస్తాడంటారు.





తరవాతిమాట అంటే అంతిమ లక్ష్యమైన ముక్తి. ఆ ముక్తిని నాకు ప్రసాదించటం గురించి ఆలోచించవయ్యా! అంటున్నారు. ఇక మా పాపపుణ్యాల గురించి చెప్పాలంటే జీవులంతా కీలుబొమ్మలు. "మరలు" తిప్పి ఆడిస్తున్న సూత్రధారివి నీవు. ఆటా నీదే, ఆపుటా నీదే. మాదేముందయ్యా! అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ హరి నారాయణా! శ్రీకృష్ణా! అదిగో మా విన్నపము (మనవిని) ఆలకించవయ్యా! "తరవాతిమాట" (అంతిమ లక్ష్యమైన ముక్తిని) గురించి నీవే తలచుకోవయ్యా! (ఆలోచన చేయవయ్యా!)

దేవదేవా! నా తలపు (ఆలోచనలు) సడిబడ్డవి (అపకీర్తిపాలైనవి). అవి సవ్యంగా వున్నా లేకపోయినా, నీవువొడయడవు (పరమాత్మవు) కాబట్టి నీదయ జూపి పూనికతో వాటిని చక్కబెట్టవయ్యా! పారుతున్న ఏరు యెన్ని కొంకర్లు వంకరలు తిరిగినా భూమిమీదనే ప్రవహించాలి కదా! మేము ఎన్ని అడ్డదార్లు బట్టినా చివరికి నీదారికిరాక తప్పదు.

ప్రభూ! కాయకపు నా భక్తి (జీవన యాత్రలో తలమునకలైన నా భక్తి) చాలా స్వల్పమే అని నాకు తెలుసును. కానీ జీవముల నిలబెట్టే నీ వరములు అతిఘనమైనవే కదా! గుడి చిన్నది అయినంతమాత్రానదాంట్లో వున్నదేవుడూ చిన్నవాడై పోతాడా? ఆయన మహిమలు చిన్నవైపోతాయా? అవి ఘనమే అందురు కదా!

ఓ శ్రీవేంకటేశ్వరా! అతిశయంవలన, అజ్ఞానం వలన నేను నిన్ను చింతించక పోయినా నా జీవాంతరాత్ముడవై నీవే నన్ను స్వీకరించావు. మేము పరమాత్ముడవైన నీ చేతిలో నీవు ఆడించినట్లు ఆడే కీలుబొమ్మలము. మేము అచేతనులమే. నీవు మరలుతిప్పి ఆడమంటే నీ ఇష్టప్రకారం ఆడుతున్నాము. ఇంకా మాకు పాపపుణ్యాలుయెందుకు అంటగడుతున్నావు?

**పద్యవివరణ:**

కం॥ **హరినారాయణ! కృష్ణా!**
**పురిగొను మా విన్నపములు పొందిక వినుమా**
**తరవాతమాట నీవే**
**విరివిగనిక తలపుకిమ్ము వేంకటరమణా!**

సంఖ్య: IX/196 రాగం : మద్యమావతి
కీర్తన : అన్నిటా భాగ్యవంతుడ వాయమెరిగి కూడితి

### మద్యమావతి

**22 అన్నిటా భాగ్యవంతుఁడ వాయమెరిఁగి కూడితి**
**యెన్నికలు మీరితేను యెట్టుండునో సుద్దులు** ॥పల్లవి॥

**చింతలనె కొంతపొద్దు చెక్కిటిచేఁ గొంతవొద్దు**
**కాంతలతోఁ గొంతవొద్దు గడపెఁ జెలి**
**యింతలో నీవు విచ్చేసి తిన్నియును లెస్సలాయ**
**యెంతలేసి పను లౌనో యించు కూరకుండినా** ॥అన్ని॥

**యెదురుచూచేయాస నిల్లుసింగారించే యాస**
**వెదకేటియాసఁ గొంత వెలసెఁ జెలి**
**అద నెరిఁగి దగ్గరి అంతలో నీవు నవ్వితి**
**యెదుగా సరసమైతే నెన్నేసివిధులో** ॥అన్ని॥

**చూపులనె కొంతరతి సుద్దులనె కొంతరతి**
**యేపులనె కొంతరతి నెనసెఁ జెలి**
**పైపై శ్రీవెంకటేశ భామ నిట్టె కూడితివి**
**యీపొద్దు లివిదక్కె నింకా నెంతదక్కునో.** ॥అన్ని॥ **196**

**ఉపోద్ఘాతము:**

ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు అన్ని విధములుగా భాగ్యవంతుడవు. నీవామెను అదనెరిగి కూడితివి. ఎన్నికలు మీరితేను, అంటే గణనకు అసాధ్యమైన సుద్దులు (నీ కతలు) యెప్పుడు యెట్లుంటాయో, యెవ్వరు చెప్పగలరు, అంటున్నారు అన్నమయ్య. దేవా! ఆమె చూపులలోనే కొంత ప్రీతి, ఆమె చెప్పే కథలలో కొంత ప్రీతి, ఆమె విజృంభణములలో కొంత ప్రీతి ప్రదర్శించి, ఆ చెలియ చెలగినది. అటువంటి జవరాలిని కూడా ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు ఇట్టే కూడితివి. నీవు





నేర్పరివి. ఈ పూట నీకు ఈ అదృష్టం దక్కింది. ఇంకా నీకు యెంత మధురానుభూతి దక్కుతుందో యెవ్వరు చెప్పగలరు, అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ శ్రీనివాసా! నీవు అన్నిటా (అన్నిట్లోనూ) భాగ్యవంతుడవేనయ్యా! నీవు ఆ దేవిని ఆయమెరిగి (అదనెరిగి) కూడితివి. నీ సుద్దులు (నీ ప్రేమకథలు) యెన్నికలు మీరితే (గణనకు అసాధ్యమైనచో) ఎట్లుండునో, యెవ్వరు చెప్పగలరు?

ఆమెను ఒక్కసారి తిలకింపుము ప్రభూ! కొంత పొద్దు (సమయము) చింతలతో నెట్టుకొస్తున్నది. కొంత పొద్దు చెక్కిటిపై చేయిజేర్చి ఆలోచిస్తూ వుంటుంది. కాంతలతో (తన చెలికత్తెలతో) కొంతసేపు గడుపుతుంది. ఇంతలో నీవు విచ్చేసితివి. ఇన్నియును ఇప్పుడు ఆమెకు లెస్సగానే వున్నవి. ఒకవేళ నీవు ఆమెవద్దకు పోకుండా కొద్దిగా ఊరకుంటే ఎంతలేసి పనులౌనో యెవ్వరు చెప్పగలరయ్యా!

ఇంకా ఆమెను గమనింపుము తిరుమలరాయా! ఆమె కొంతసేపు ఏదో తెలియని ఆశతో నీకోసము, యెదురుతెన్నులు చూస్తుంది. కొంతసేపు ఆశతో ఇంటిని సింగారిస్తుంది, నువ్వు వచ్చి చూస్తావని. ఒకవేళ నువ్వు వచ్చి యెక్కడో నక్కివున్నావేమోనని కాలుగాలినట్లు తిరుగుతూ ఆశతో వెదకుతుంది. ఆ చెలి కొంతసేపు ఆ విధంగా నిర్వహిస్తుంది. ఇంతలో అదనెరిగి (సమయం చూసి) నీవు ఆమెను దగ్గరి (సమీపించి) నవ్వినావు. సరసములేయెదిగిపోతే ఆ చిలిపితనము యెన్నేసి విధములుగా వుంటుందో!!

దేవా! ఆమె చూసే చూపులలోనే కొంత రతి (ప్రీతి) తొంగి చూస్తుంటుంది. ఆమె నీకు చెప్పే తీపి మాటలలో కొంత రతి వుంటుంది. ఆమె నీపై చూపే యేపులలో (డాంబికములో) కొంత రతి వుంటుంది. ఈ విధంగా ఆ చెలి వర్ధిల్లుతుంది. అటువంటి ప్రియురాలిని నీవు ఇట్టే కూడితివి. ఓ శ్రీవేంకటేశ్వరా! ఈపూట నీకు ఈ అనుభవం దక్కింది. ఇంకా యెంత దక్కించుకొంటావో ఏమో?

**పద్యవివరణ:**

తే.గీ॥ **అన్నిటా భాగ్యవంతుడ వాయమెరిగి**
**కూడితివి నీవు రమణిని కూర్మిజూపి**
**ఎన్నికలు మీర సుద్దులు యెట్టలుండు**
**యెంత దక్కునో శ్రీహరీ! ఇంతిసుఖము!!**

సంఖ్య: II/517 రాగం : సాళంగం
కీర్తన : చేకొంటి నిహమే చేరిన పరమని

**సాళంగనాట**

**23 చేకొంటి నిహమే చేరినపరమని**
**కైకొని నీ విందు కలవేకాన ॥పల్లవి॥**

**జగమునఁ గలిగినసకలభోగములు**
**తగిననీప్రసాదములే యివి**
**ఆగపడునేఁబడియక్షరపంక్తులు**
**నిగమగోచరపునీమంత్రములే ॥చేకొం॥**

**పొదిగొని సంసారపుత్రదార లిల**
**వదలనినీదాసవర్గములే**
**చెదరక యేపొద్దుఁ జేయునాపనులు**
**కదిసిన నియ్యాజ్ఞాకైంకర్యములే ॥చేకొం॥**

**నలుగడ మించినాజన్మాదులు**
**పలుమరు లిటు నీపంపు లివి**
**యెలమని శ్రీవేంకటేశ్వర నీవిఁక**
**వలసినప్పు డీ వరముల నాకు ॥చేకొం॥ 517**

**ఉపోద్ఘాతము:**

అన్నమయ్య కీర్తనలలో పల్లవి అర్థంకాక చరణాలు తేలికగా వున్నవి కొన్ని అయితే, పల్లవి అలవోకగా వుండి చరణాలు అగమ్యగోచరంగా వుండేవి కొన్ని. ఈ కీర్తన మొదటి కోవలోకి వస్తుంది. చరణాలు సుగమంగానే వున్నాయి కానీ పల్లవి ఒకపట్టాన కొరుకుడు పడదు. ఆలకించండి. నేను ఈ విధముగా భావిస్తాను.

ఓ శ్రీహరీ! ఇహమూ పరమూ రెండూ నీ ప్రసాదములే. నన్ను చేరిన పరము అని భావిస్తూ నేను ఇహమునే స్వీకరించి అజ్ఞానంలో బ్రతికాను. ఇలా యెందుకు జరుగుతున్నది? ఎందుకంటే... పూనుకొని నీవు ఇందు కలిగి





ఉన్నావు కాబట్టి. నీ మాయవలన మేము ఇహమునే స్వీకరిస్తున్నాము. దాని వల్లనే భోగాసక్తి, భార్యాబిడ్డలపై వ్యామోహం కలుగుతున్నాయి. ఏ జన్మలోనైనా ఇదేగోల. ఎందుకంటే ఆ జన్మలన్నీ నీదు పంపులే (నీవు ఇచ్చినవే) కదా!

**తాత్పర్య వివరణ:**

ఓ ప్రభూ! చేరినపరమని పొందిన పరలోకమని భావిస్తూ నేను ఇహమునే చేకొంటిని (స్వీకరించితిని). ఇది అంతయూ నీ మాయ. ఎందుకిలా జరుగుతోంది అంటే... కైకొని (పూనుకొని) నీవు ఇందు (ఈ రెంటిలో) కలవేకాన (వున్నావు కాబట్టి).

ఈ ప్రపంచంలో వున్న భోగాలన్నీ తగినట్లుగా నీ ప్రసాదమే (నీవు ఇచ్చినవే). ఇన్ని మంత్రములున్నాయి. వీటిలో అన్నీ అక్షర పంక్తులే కదా! ఈ అగుపించే అక్షరాల వరుసలే నిగమగోచరపు (వేద వాఙ్మయములో) మంత్రములై భాసిస్తూ మా చేత వల్లెవేయబడుతున్నాయి.

మానవులు సంసారములో పుత్రులను, భార్యలను పొందుతూనే వుంటారు. వీరంతా ఎవరు? నీదాస వర్గములే (నీదాసులే) వీరు వదలరు. జన్మజన్మకూ వెంబడి వస్తూనే వుంటారు. నేను ఏ వేళనైనా చేసే నా పనులన్నీ నీ ఆజ్ఞగా నేను స్వీకరించినవే. అజ్ఞానం వలన అవన్నీ నా పనులే అని కైంకర్యము చేసికొంటున్నాను.

నలుగడ (నాలుగు దిక్కులలో) నాకు జన్మలు కలుగుతూనే వున్నాయి. ఇట్లు పలుమరు (అనేక పర్యాయములు) ఇవన్నీ నీ పంపులు (నీవు పంపిన పుట్టుకలే). అతిశయించిన ఓ శ్రీవేంకటేశ్వరా! నాకు కావలసిన వరములను అనుగ్రహించే నీ ప్రసాదములే ఈ జన్మలన్నీ. నీ అనుగ్రహం వుంటే ఏ జన్మ అయినా ఒక్కటే కదా!

**పద్యవివరణ:**

ఉ॥ **చేరినదే 'పరంబు' వడిచేకొని యుంటినిబో 'ఇహంబునే',**
**తీరుగపూని నీవు హరి! తేకొనివుంటివి యిందు నందుచే,**
**కోరిన భోగముల్, సుతులు, కూరిమి కాంతలు నీ ప్రసాదమే**
**ఆరడినాదు జన్మములు అన్నియు రాయడ! నీదు పంపులే.**

సంఖ్య: IX/198     రాగం : సౌరాష్ట్రం
కీర్తన : ఇద్దరి గూర్చినవారు యిప్పుడు మీరెకారా

**సౌరాష్ట్రం**

**24 ఇద్దరిఁ గూర్చినవారు యిప్పుడు మీరెకారా**
**వొద్దిక్క (క్కు?) నప్పటి నేల వొరపులాడేరే** ॥పల్లవి॥

**కచ్చుపెట్టి నే నతనిఁ గన్నులఁ బిలచితేను**
**యిచ్చటఁ జెలులు మీరు యేల నవ్వేరే**
**ముచ్చటమాటలఁ గడు మోహముపైఁ జల్లితేను**
**పచ్చారుచుఁ జెలు లేల పచ్చి సేసేరే** ॥ఇద్ద॥

**పాయక నే నాతనిపయిఁ జెయివేసితేను**
**చాయల మీలో నేల సన్న లాడేరే**
**ఆయము లెరిఁగి నే నాకు మడిచియ్యఁగాను**
**వేయేసిలాగుల నేల వెంగేలాడేరే** ॥ఇద్ద॥

**భావించి శ్రీవెంకటేశుపాదాలు నే నొత్తితేను**
**వేవేగ సిగ్గున నేల వెలి నుండేరే**
**ఆవటించి కూడితిమి అప్పుడే మీరు లోనికి**
**యీవేళ వచ్చితి రింక నిట్టెవుండరే.** ॥ఇద్ద॥ **198**

**ఉపోద్ఘాతము:**

ఓ చెలులారా! ఈ సతీపతుల నిద్దరినీ ఒక దగ్గరకు చేర్చినవారు మీరేకదా! పూర్వము మీరు చూపిన వినయము వదలి ఏల తంటాలు పెడుతున్నారే! అని ఈ పల్లవి భావము. అన్నమయ్య కీర్తనలలో పల్లవి తికమకపెట్టే కీర్తనలు లెక్కకు మిక్కుటమే. నా పతి డస్సిపోయాడని నేను ఆయన పాదాలు మెల్లగా ఒత్తుతుంటే, మీరు మితిమీరిన సిగ్గులతో యెందుకు బయట నిలుచుని వుండిపోతారు. మా ఇరువురి కూటమి అప్పుడే జరిగినది. స్వామి అలసి శయనిస్తున్నాడు. మీరేదో కొంపలు





మునిగిపోయినట్లు లోనికి చొరబడ్డారు. ఇక అట్టే వుండకండి మా ఏకాంతమును చెడగొట్టకండి, అంటున్నది నాయిక.

**తాత్పర్య వివరణ:**

ఓ చెలులారా! ఈ సతీపతులనిద్దరినీ కూర్చినవారు (ఒక్కచోటికి చేర్చినవారు) ఇప్పుడు, మీరేకారా మీరు మాత్రమే కదా! ఒద్దిక్కున్ (వినయములకు) అప్పటిన్ (పూర్వమువలె) కాక ఏల, ఒరపులాడేరే (మమ్ము యేల తంటాలు పెడుతున్నారే?)

ఓ చెలులారా! కుచ్చుపెట్టి (జతకలిపి) నేనతనిని కనుసైగలతో పిలిస్తే ఇక్కడ మీరంతా దేనికి నవ్వుతున్నారే? నేను ఆయనకు ముచ్చట కలిగించే తీయని మాటలతో కడు మోహింపజేస్తే, మీ చెలులంతా పచ్చారుచు (మా ఇద్దరి చుట్టూ పచారు చేస్తూ) ఏల పచ్చి సేసేరే (మమ్ము ఆరడి పెడుతున్నారే?)

ఓ చెలులారా! పాయక (విడువలేక) నేనతని చేరువ అవుదాములెమ్మని, ఆతనిపై నా చేయి వేయగానే చాయల (చాటుమాటున) మీరేల సన్నలాడేరే (సైగలు చేసికొంటున్నారే?) ఆయము లెరిగిన (వీలునెరిగిన) నేను తగిన సమయమున అతనికి ఆకుమడచియ్యగానే (తాంబూలము నిచ్చి నా సమ్మతి దెలుపగానే), వేయేసిలాగులన్ ఏల వెంగేలాడేరే (అనేకమైన పెనగులాటలతో మీరెందుకు నాతో యెకసెక్కము లాడుచున్నారు?)

ఓ చెలియలారా! నా పతి డస్సిపోయాడని నేను భావించి ఆయన పాదములనొత్తుతుంటే, వేవేగ (వేగ+వేగ) అనగా, వేగలేని సిగ్గులతో మీరు ఏల వెలినుండేరే (బయటనిలుచుంటారేల?) ఆవటించి (పొందుపరచుకొని) మేమిరువురము అప్పుడే కూడి అలసియున్నాము. ఇంతలో మీరులోనికి చొరబడ్డారు. ఇంక ఈవేళనిట్టే వుండరే (ఇట్లాగే వుండండి లోనికి రాకండి).

**పద్యవివరణ:**

ఆ.వె॥ **దంపతుల నిరువురి దరిజేర్చి మీరేల**
**ఒరపులాడుచుంటి రరులె చెలులు?**
**ఆవటించి కూడి హరి వేంకటేశునిన్**
**అలసినాము, రండు అడ్డమేమి?**

సంఖ్య: II/516      రాగం : బౌళి
కీర్తన : మొక్కెద మిదివో మూడు మూర్తులును

**బౌళి**

**25 మొక్కెద మిదివో మూఁడు మూర్తులును**
**వొక్కరూపమై వొనరెఁ జక్రము** ॥పల్లవి॥

**చెండినరావణుశిరో మాలికల**
**దండలపూజల తళుచుగను**
**మెండుగఁ గంసుని మెదడు గందముగ**
**నిండ నలఁదుకొని నిలిచెఁ జక్రము** ॥మొక్కె॥

**చించి హిరణ్యకసిపుపెనురక్తపు -**
**అంచనర్ఘ్యపాద్యమ్ములను**
**పంచజనఘనకపాలపుటెముకను -**
**పంచవాద్యములఁ బరగుచక్రము** ॥మొక్కె॥

**బలుమధుకై టభప్రాణవాయువుల**
**అలరిననైవేద్యంబులను**
**యెలమిని శ్రీవేంకటేశు హస్తముల**
**వెలసి నిలిచె నిదే విజయచక్రము** ॥మొక్కె॥ **516**

**ఉపోద్ఘాతము:**

శ్రీవేంకటేశ్వరుని హస్త భూషణమై వెలుగులజిమ్మే సుదర్శన చక్ర వైభవమును కీర్తిస్తున్నారు అన్నమయ్య. ఇదిగో త్రిమూర్తుల దివ్యశక్తి స్వరూపం అయిన సుదర్శన చక్రము. వారు ముగ్గురూ వొక్కరూపమై ఒనరిన చక్రము. దీనికిప్పుడే మొక్కెదముగాక! ఈ చక్రము తానే రామచంద్రుని కోదండమై, తానే కృష్ణుని బాహుబలమై, నృసింహుని వాడి గోళ్ళయి, పాంచజన్యుని కపాలపుటెముకయై, మధుకైటభ దైత్యుల ప్రాణ సంకటమై తన ప్రతాపమును





ప్రదర్శించినది. ఈ చక్రమునకు గల దివ్యశక్తి యెన్ని విజయములకో మూలమై విజయచక్రము అని పిలువబడుచున్నది, అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ భక్తులారా! మూడు మూర్తులును (బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులని పిలువబడే త్రిమూర్తులును) ఒక్క రూపమై ఒనరె (అతిశయించే) ఈ శ్రీహరి సుదర్శన చక్రము ఇదివో (ఇదిగో) మీకు దర్శనమిచ్చుచున్నది. దీనికిదే మొక్కెదము గాక!

దీనిని చూస్తుంటే రావణాసురుని పదితలలను చెండి (చీల్చి శిరోమాలికలు (శిరస్సుల దండవలె) ధరించి పూజలు గొనిన శ్రీరామచంద్రుని కోదండ ధనస్సు జ్ఞప్తికి వచ్చుచున్నది. కోదండమున కంత శక్తి సుదర్శనము నుండియే సంప్రాప్తించినది. దీనిని చూస్తుంటే, అలనాడు ద్వాపరయుగంలో కంసుని మెదడు యొక్క గంధముగ తన మేనినిండా (శరీరమంతా) మెండుగా (దట్టంగా) అద్దుకొని నిలిచిందా ఈ చక్రము!! అందుకే నిర్వీర్యుడై కృష్ణుని ఒక్క గుద్దుకే ప్రాణాలు పోయాయి అనిపిస్తుంది.

భీకరుడైన నరసింహుడు, హిరణ్యకశిపుని పేగులను చించి (చీల్చి) అతని రక్తప్రవాహము అంచన (పక్కన) దానితోనే అర్ఘ్యపాద్యములను స్వీకరించినాడు. పంచజనుని యొక్క ఘనమైన కపాలము (పుఱ్ఱె) యొక్క యెముకలతో చేయబడి, పంచవాద్యముల ధ్వనితో ఘూర్ణిల్లు శంఖమై శ్రీహరి చేతులలో శోభిల్లి ఆయనకు అనేక విజయములలో తోడ్పడినది.

బలవంతులైన మధుకైటభ దైత్యుల ప్రాణవాయువులను నైవేద్యముగా స్వీకరించి శ్రీహరి అలరినాడు. ఎలమి (అతిశయించి) శ్రీవేంకటేశ్వరుని హస్తములో వెలుగులు విరజిమ్ముతూ ఇదే ఈ విజయచక్రము నిలిచె (నిలిచినది).

**పద్యవివరణ:**

ఉ॥ **మొక్కెదమింక మేము వడి మూర్తులు మూడుగ దోచగా నిదో,**
**ఒక్కటె రూపమై చెలగెనొద్దిక మీరినదౌ సుదర్శనం**
**బిక్కడ వేంకటేశ్వరుని ఈప్సితహస్తపు భూషణం బహో!!**
**తొక్కెను కంస, రావణుల ద్రుంచె హిరణ్యుని, పాంచజన్యునిన్.**

సంఖ్య: XXIX/194 రాగం : సాళంగనాట
కీర్తన : ఇప్పుడిదె కొలువున్నా డింతులు దాను

### సాళంగనాట

26 ఇప్పు డిదె కొలువున్నాఁ డింతులు దాను
వుప్పతిలు మహిమల నుద్దగిరి కృష్ణుఁడు ॥పల్లవి॥

గోవులఁగాచెఁ గొన్నాళ్లు కొండ గొడుగగ
కావరించి మద్దులను గక్కన దొబ్బె
వావులు గలయ గొల్లవనితలఁ బొందుసేసె
వేవేలు చేఁతలవాఁడు వెన్నముద్ద కృష్ణుఁడు ॥ఇప్పు॥

మల్లులఁ గొందరి గొట్టె మరి కంసు బొరిగొనె
తొల్లె కోడెరాకాసుల దునిమివేసె
తెల్లమిగా వసుదేవ దేవకీనందనుఁ డాయ
వెల్లవిరై మెరసీని వెన్నముద్ద కృష్ణుఁడు ॥ఇప్పు॥

పొంతఁ బాండవులఁ గాచె భూ భార మణఁగించె
పంతముతో దేవతల బాలించెను
యింతట శ్రీవేంకటాద్రి నేలినాఁడు మమ్మిందరి
వింత వింత సొబగుల వెన్నముద్ద కృష్ణుఁడు ॥ఇప్పు॥ 194

**ఉపోద్ఘాతము:**
ఉద్దగిరిలో వెలసిన శ్రీకృష్ణునిపై మధురమైన కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. అప్పుడు ప్రాభవంలో వున్న దేవాలయాలు కనుమరుగయ్యాయి. పోషణ లేక పాడుపడి శిధిలమైనవి కొన్నయితే మూలవిరాట్టు మార్పు చెందినవి కొన్ని. ఆ రోజుల్లో కృష్ణునికి వెన్నముద్దలు నైవేద్యంగా పెట్టేవారని అనిపిస్తున్నది ఈ కీర్తన వింటుంటే. పడతులిద్దరు రుక్మిణీ సత్యభామలు. పాండవులనుగాచె నంటున్నారు కాబట్టి ప్రౌఢ కృష్ణయ్య ఈ ఉద్దగిరి కృష్ణయ్య





అని భావించవచ్చు. అన్నమయ్య ఆనవాయితీ ప్రకారం ఇప్పుడు వేంకటాద్రిని యేలినాడు వింత వింత సొబగుల వెన్నముద్ద కృష్ణుడు, అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**
ఓ భక్తులారా! ఉప్పతిలు మహిమల (అతిశయించిన మహిమలను చూపే) ఈ ఉద్దగిరి కృష్ణుడు ఇప్పుడు, ఇదే తన ఇంతులతోటి (భార్యలైన రుక్మిణీ, సత్యభామలతో) తాను వెలసి కొలువుదీరియున్నాడు.

ఆయన నందవ్రజమున కొన్నాళ్ళు గోవులను కాచాడు. ఆ రోజుల్లో ఇంద్రుడి వడగళ్ళబారి నుండి గోకులాన్ని రక్షించుటకు కొండ గొడుగుగా పట్టుకొన్నాడు (గోవర్ధన పర్వతాన్ని చిటికెన వ్రేలిపై నెత్తి గొడుగువలె దానిక్రింద వారికి రక్షణనిచ్చాడు). కావరించి (మదమెక్కి) మద్దులైన కుబేరుని పుత్రులకు గక్కున తొక్కి శాపవిముక్తులను చేశాడు. వావులు గలయ (వావి వరుసలేకుండా) గోపికలను పొందినాడు. ఈ వెన్నముద్ద కృష్ణుని చేతలు (లీలలు) వూహకందవు.

కొన్నాళ్ళకు ఆ కృష్ణయ్య కంసుని ఆహ్వానం మేరకు మధురానగరం వెళ్ళాడు. అక్కడ కొందరు మల్లులను మల్లయుద్ధంలోనే వధించాడు. పొరిగొన్న కంసుని (తనను వధించాలనుకొన్న కంసుని) సంహరించినాడు. అంతకు మునుపే ఆ క్రూరుడు పంపిన రాకాసులను అంతమొందించినాడు. తెల్లమిగా (స్పష్టముగా) తన తలిదండ్రులు దేవకీవసుదేవులని ప్రకటించినాడు. ఈ వెన్నముద్ద కృష్ణుడు మధురాతిపతియై పరిపాలించాడు.

అటుపిమ్మట ప్రౌఢ కృష్ణయ్య పాండవుల రక్షకుడై భారతయుద్ధము నిర్వహించి దుష్టరాజులోకాన్ని నిర్మూలించి భూభారాన్ని తగ్గించాడు. దేవతలందరినీ పాలించినాడు. ఇదిగో కలియుగం వచ్చేశిందని శ్రీ వేంకటాద్రిపై వెలసి అవనిని యేలుతున్నాడు. ఈయనే ఆనాటి వింతవింత శోభలు గల వెన్నముద్ద కృష్ణుడు.

**పద్యవివరణ:**
కం॥ **ఇప్పుడిదెకొలువుదీరెను**
**అప్పుడతులతోటి వెలసెనదె వుద్దగిరిన్**
**గొప్పగ "వేంకట" కృష్ణుడు**
**ఎప్పటికిని వెన్నముద్దలితనికి విందే.**

సంఖ్య: II/512 రాగం : సామంతం
కీర్తన : నీచేతలోవారము నీవారము

## సామంతం

**27 నీచేంతలోవారము నీవారము**
**యేచి నీకే చేత మొక్కే మిదియే మావ్రతము** ॥పల్లవి॥

**ఇన్నిటాఁ బూర్ణుఁడవు నీ వెరఁగనియర్థమేది**
**విన్నపము నేఁజేసేవిధమేది**
**మన్నించిననీమన్ననే మహిమలో మాబ్రదుకెల్ల**
**వున్నతి మీఁదాసిననే దొక్కటే మావ్రతము** ॥నీచేఁ॥

**ఘనదేవుఁడవు నీకుఁ గడమలు మరియేవి**
**గొనకొని నే నిన్నుఁ గొసరేదేమి**
**పొనుగక యేలితివి పుట్టినమాపుట్టుగెల్ల**
**ననిచి నిన్ను నమ్మిననమ్మికే మావ్రతము** ॥నీచేఁ॥

**శ్రీవేంకటేశుఁడ నీవు చిత్తగించనిది యేది**
**భావించి నేఁ బొందనిభాగ్య మేది**
**యేవల మాపరాభారా లింతయు నీ కెక్కినది**
**ఆవటించి నే నీశరణన్నదే మావ్రతము** ॥నీచేఁ॥ **512**

**ఉపోద్ఘాతము:**

తెలుగు భాష గొప్పతనం ఈ కీర్తనలో మరొక్కసారి ప్రస్ఫుటమవుతున్నది. నేను మొదట ఈ పల్లవిని "నీచేతిలోని వారము"గా ప్రారంభించి ఆయనకు లోబడివుండే ఆయన దాసులుగా అర్థం చెప్పాను. కాని పల్లవిలో నీచేతలో వారము అని అన్నమయ్య రచన. ఎంత తారతమ్మం వచ్చేసిందో చూడండి. నీచేతలో వారమంటే నీవు చేసిన దానిని కాదనలేని కర్మబద్ధులము, అశక్తులము అని అర్థం. ఏచినీకే చేతమొక్కేము. ఇదే మా వ్రతము అంటే... అతిశయించి, నీకే చేతులతో మ్రొక్కెదము మరియు ఇదియే మా నోము అని అర్థం. ఇహము మా కర్మవశమే



హరి నీమయమే అంతాను

అయినా పరము నీచేతిలోనిది. అది నీకేలోబడి మాకు యెక్కును. ఓ వేంకటేశ్వరా! శరణు శరణు... దానిని కాస్త తీర్చిదిద్దు అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ దేవదేవా! మేము, నీ చేతలోవారము (నీవు చేసిన దానిని కాదనలేని కర్మబద్ధులము). అయినా మేము నీ శత్రువులముకామయ్యా! నీవారము. ఏచి (అతిశయించి) నీకే మ్రొక్కెదము. మరియు అదే మా వ్రతము (నోము) అని నిశ్చయించుకొన్నాము.

ఇన్నిటా (ఈ విశ్వంలో) నీవే పూర్ణుడవు (సర్వశక్తి సంపన్నుడవు). నీవు యెఱంగని అర్థమేవుండదు. అటువంటప్పుడు నేను యేవిధముగా విన్నపము చేసికొనినా పర్వాలేదు. అది నీకు తెలుస్తుంది కదా! మేము నీ మహిమకులోబడి బ్రతికేవారము అది నీవు మాకు మన్నించి ఇఱఇచ్చిన మన్నన. అందుకనే నేను నీ దాసుడను. నీ దాస్యమొక్కటియే మావ్రతము.

దేవా! నీవు ఘనమైన దేవమవు. నీకు కడమ యెక్కడిది (కొఱత అనేది యెలా వుంటుంది?) నిన్ను కొసరి కొసరి అడుగవలసిన అవసరమే లేదు. నీవేది కావాలంటే యెంత కావాలంటే అంత ఇవ్వగలవు. పుట్టినదాదిగా మా పుట్టుకంతా నీవు మమ్ము పొనుగక (వెనుదీయక) యేలితివి (కాపాడినావు). నిన్ను నమ్మిన నమ్మికే మావ్రతము. నిన్ను దక్క మరి దేనినీ నమ్మను ప్రభూ!

ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు చిత్తగించని విన్నపము (నీ భక్తుల అభ్యర్థన) వుండనే వుండదు. భావించి (నేను కావాలనుకొని) నీనుండి పొందని భాగ్యమేది స్వామీ! మాపరభారాలు (మా పరము యొక్క గతిని తీర్చిదిద్దే భారము) మరి నీది కాక ఇంకా యెవరిది? అది నీకెక్కినది (నీ ద్వారా సిద్ధించవలసినదే.) ఆవటించి (కృతనిశ్చయములమై) మేము నీ శరణమన్నాము. ఓ సర్వేశ్వరా! నీ శరణాగతియే మా వ్రతము.

**పద్యవివరణ:**

కం॥ **నిక్కుచు నీవారము హరి!**
**మక్కువ నీ చేతలోన మసలుదుమయ్యా!**
**మొక్కేమిదె మావ్రతమగు**
**చక్కని శ్రీవేంకటేశ! శరణమె వ్రతమౌ**

సంఖ్య: XXIX/323 రాగం : శ్రీరాగం
కీర్తన : ఇంతమేలు వాడవై యింకా నేలజరసేవు

## శ్రీరాగం

**28 ఇంత మేలువాఁడవై యింకా నేల జరసేవు**
**సంతోసముతోడనే చనవియ్యరాదా** ||పల్లవి||

**చలిచిరునవ్వులనే చిత్తము గరఁగితివి**
**యెలమి నాపెతోఁ బంతా లే లాడేవు**
**కలికిచూపులకే కాయమెల్లాఁ జెమరించె**
**పెలుచుఁదనాల నేల పెనఁగులాడేవు** ||ఇంత||

**పెదవిపైమాఁటలకే పెద్దగా వలచితివి**
**యెదిరించి యాల యెలయించ వచ్చేవు**
**వుదుటు గుబ్బలకే వుబ్బి మొగమోడితివి**
**మదిరాక్షితో నేల మారుకొనేవు** ||ఇంత||

**అట్టెచే సన్నలకే ఆ సాసలఁ జొక్కితివి**
**దిట్ట సరసాలనే తిట్టఁ జూచేవు**
**గుట్టున శ్రీవేంకటేశ కూడితి వలమేల్మంగను**
**వొట్టుక యాకె నింతేల వొలలఁ బెట్టేవు** ||ఇంత|| 323

**ఉపోద్ఘాతము:**

ఓ శ్రీనివాసా! నీవు ఇంత హితుడవైకూడా ఇంకా వెనుకంజ యేల వేయుచున్నావు? సంతోషముతో ఆమెకు చనువు (అనురాగము) నందించవచ్చును కదా! అంటున్నారు అన్నమయ్య. ఆయన కాలంనాటి కొన్ని తెలుగు పదాలు నేడు వాడుకలో లేవు మొగమోడ్చడం, సాసలజొక్కటం, వొలల బెట్టటం వంటి పదప్రయోగాలు నిఘంటువుల్లో





కూడా కానరావు. అప్పుడేం చేయాలి? ఒక్కొక్కసారి భావించాలి. శ్రీనివాసుని కరుణవుంటే ఒక్కొక్కప్పుడు స్ఫురిస్తుంటుంది. నన్ను నమ్మండి.

**తాత్పర్య వివరణ:**

ఓ శ్రీనివాసా! నీవు ఇంతమేలువాడవై (మేలు కోరుకొనేవాడవై కూడా,) ఇంత జరసేవు (ఇంత వెనుకాడేవు యేలనయ్యా?) సంతోసముతోడనే చనువియ్యరాదా (ప్రేమించరాదా?)

స్వామీ! నిన్ను జూడబోతే ఆ చెలి చిరునవ్వులకే చిత్తము గరగితివి (నీ మనస్సు కరిగిపోయింది.) అటువంటప్పుడు ఆమెతో పంతములేల నాడెదవు? ఆ కలికి (యువతి) చూపులకే నీకాయమెల్లా జెమరించె (నీ శరీరమెల్లా చెమటతో చిత్తడి అవుతుంది). ఇటువంటి స్త్రీతో నీవు పెలచుదనముతో (పెంకితనముతో) యేల ఆమెతో పెనగులాడెదవు?

స్త్రీలు మనస్సులో ఒకటనుకొని పెదవులతో ఇంకొకటి అంటారు. ఓ శ్రీనివాసా! నీవు ఆమెపైపై మాటలకే పెద్దగా వలచితివి. మరియేల ఆమెను యెదిరించి జగడానికి పురిగొల్పుతావు. నీవు ఆమె వుబ్బినగుబ్బలు చూడగనే తబ్బిబ్బవుదువు. మరి అటువంటప్పుడు ఆ మదిరాక్షితో నేల మారుకొనేవు (యెదుర్కొని తలపడెదవు) స్వామీ!

ప్రభూ! ఆమె చేతి సంజ్ఞలకే నీవు శ్వాస తీసికోవటం మరచినంతగా నిశ్చేష్టుడవైతివి. మళ్ళీ సరససల్లాపములాడుతూ, కోపంలో నిందిస్తావు. ఓ శ్రీవేంకటేశ్వరగా నీవు గుట్టుతో నీసతి అలమేల్మంగను కూడినావు. ఏవేవో ఓట్లు వేసికొని ఇంకా ఆమెను వలలో వేసికొన ప్రయత్నింతువు?

**పద్యవివరణ:**

ఆ.వె|| **ఇంతమేలువాడవికనేల జరసేవు**
**సంతసమున సతికి చనువు నిమ్ము**
**ఒలల బెట్టనేల లలననుగూడక**
**వెంకటేశ! గుట్టు విప్పుటేల?**

సంఖ్య: II/515 రాగం : నాట
కీర్తన : వెడలె వెడలె నదె వీధులవీధుల

**నాట**

**29 వెడలె వెడలె నదె వీదులవీధుల**
**తొడికి దైత్యులనుఁ దుంచఁగను** ॥పల్లవి॥

**కోటిసూర్యు లొకకూటువ గూడుక**
**చాటువ మెరసేటిచక్రము**
**గాఁటపువేవేలు కాలరుద్రు లటు**
**నీటునఁ దొలఁకేటినిబిడచక్రము** ॥వెడ॥

**ప్రళయకాలముల బడబాగ్ను లొలుకు-**
**చలమరిప్రతాపచక్రము**
**కలకలరవముల కాలభైరవులు**
**కలసి మెలంగేటిగండచక్రము** ॥వెడ॥

**యమసహస్రములనంత మేకమై**
**సమరము గెలిచేటిచక్రము**
**అమరుచు శ్రీవేంకటాధిపుకరమునఁ**
**దెమలకయుండేటిదివ్యచక్రము** ॥వెడ॥ **515**

**ఉపోద్ఘాతము:**

శ్రీహరి దివ్యహస్తభూషణమైన సుదర్శనచక్రపు వైభవాన్ని కీర్తిస్తున్నారు అన్నమయ్య. నా భావన, తిరుమలలో సుదర్శన చక్రపు ఊరేగింపు సందర్భంగా పద కవితా పితామహుడు పాడిన కీర్తన అయివుండవచ్చును. కాలరుద్రుడు, కాలభైరవుల ప్రసక్తి అన్నమయ్యలో దాగివున్న శివతత్త్వ స్ఫురణ వెలువరిస్తున్నదేమో ననిపిస్తున్నది. వెయ్యిమంది యమధర్మరాజు అనంతముగ



హరి నీమయమే అంతాను

యేకమైనా వారిని యుద్ధములో జయించగల ధీశాలి ఈ సుదర్శన చక్రము. శ్రీవేంకటేశ్వరుని దివ్యహస్త భూషణము ఈ చక్రము అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ భక్తులారా! అదిగో చూడండి, అదే వీధుల వీధుల (తిరుమలలోని ప్రతివీధిలోను) శ్రీవేంకటేశుని సుదర్శనచక్రము ఊరేగింపుగా, వెడలె వెడలె (పోతోంది చూడండి). దేనికి వెడలింది? దైత్యులను (రాక్షస ప్రవృత్తిగలవారిని) తొడికి (ఒడిసిపట్టుకొని), తుంచగను (సంహరించుటకు) పూనుకొనినది కాబోలు.

చాటువమెరసేటి (ప్రసిద్ధిగల కాంతులీను) ఆ చక్రము, ఒక కూటువ (ఒక్కచోట) కోటిమంది సూర్యులు కూడుకొని వున్నారా అన్నంత తేజస్సు కలిగినది. వేవేల గాటపు కాలరుద్రులు (వేలకొద్దీ కఠినాత్ములైన కాలరుద్రులు) నీటున తొలకేటి (నిస్తేజులై చలించిపోయే) నిబిడ చక్రము (దట్టమైన కాంతిగల చక్రము).

విబుధులారా! ఈ సుదర్శనచక్రము చలమరి ప్రతాపము కలిగినది (మత్సరము తొంగిచూచే ప్రతాపసమాయుతమైనది). అందువలన ఇది ప్రళయకాలమున లోకమును కమ్ముకొని దహింపజాలిన బడబాగ్ని ప్రత్యక్షముగ వ్యాపించగా కలుగు వినాశనమును సృష్టించ గలిగినది. కాలభైరవులందరూ రణగొణ ధ్వని చేస్తూ కలిసి వస్తున్నారా అన్నట్లు సంచరించే శౌర్యము గల చక్రము ఇదే సుమా!

ఇక ఈ సుదర్శన చక్ర వీరత్వము చూడబోతే అసమాన్యము. అనంత సహస్ర యములు (లెక్కింపలేని వేలకొలది కాలయములు) ఏకమై ఒక్క దండుగా మీద బడినా కూడా సమరమున (యుద్ధమున) గెలవజాలిన చక్రము ఇదే. శ్రీవేంకటాద్రీశుని హస్తములో అమరుచు (శోభించుచూ) తెమలక (స్థిరముగా) వుండేటి దివ్య సుదర్శన చక్రము ఇదే భక్తితో మ్రొక్కండి.

**పద్యవివరణ:**

చం॥ **వెడలెను వీధులన్ అదియె విష్ణుని చక్రముచేరి మ్రొక్కుడీ**
**తొడుకుచు దుష్టదైత్యులను ద్రుంచగజాలును లిప్తపాటులో**
**వడిగల కోటి సూర్యసమభాసిత దివ్య సుదర్శనంబహో!!**
**విడువదు వేంకటేశ్వరుని వెక్కస హస్తపు భూషణంబిదే.**

సంఖ్య: XXIX/517    రాగం : సామంతము
కీర్తన : ఏమని చెప్పగవచ్చు నిదివో నీసుద్దులు

## సామంతం

30 ఏమని చెప్పఁగవచ్చు నిదివో నీ సుద్దులు
ఆముకొన్న నీ నటన లారడాయఁగదవే ॥పల్లవి॥

మొక్కు మొక్కరాఁగాను మునిగొప్పు జారెఁగదె
నిక్కి చూచితే సిగ్గులు నిండెఁగదవే
కక్కసించి నవ్వఁగాను కడుఁ జెమరించెఁగదె
ఇక్కడఁ బతి సంగాతా లింత సేసెఁగదవె ॥ఏమ॥

చెలుములు సేయఁగాను సేసలు పైఁబడెఁగదె
సొలయఁబోతే మతి చొక్కెఁగదవె
వెలిఁ గానుకియ్యఁగా చన్నులు గానవచ్చెఁగదె
యెలమి నీ చేఁతలే నిన్నింత సేసెఁగదవే ॥ఏమ॥

కదిసి కాఁగలించఁగా కళలు రేఁగెఁగదె
అదన మో వియ్యఁగా గంటేయఁగదవె
వదలక శ్రీవేంకటేశ్వరుఁడు తానె కూడె
యెదుటనే నీ భాగ్యా లింతసేసెఁగదవే ॥ఏమ॥ 517

**ఉపోద్ఘాతము:**

ఈ కీర్తన అన్నమయ్య నాయిక చెలికత్తెయై ఆలపిస్తున్నారు. ఓ దేవీ! నీ సుద్దులు యేమని చెప్పగవచ్చు నమ్మా? నీ నృత్యవిన్యాసము కైపెక్కునట్లు చేసినందువల్ల నీకు కొంత బాధ కలిగినది అని ఓదారుస్తున్నది, చెలికత్తె. ఈ కీర్తన తరచి తరచి ఆలోచిస్తేగాని వివరించలేము. నీవు నీ పతికి మొక్కుదామని ప్రయత్నిస్తే, తత్తరపాటులో మునికొప్పు జారిపోయింది కదమ్మా! అని నవవదువు పాట్లను వర్ణిస్తున్నారు. అంతదాకా యెందుకు? మీకు స్నేహం కలిసిన నాడే





శిరస్సున అక్షంతలుపడ్డట్లే, అయింది. నీ భాగ్యమేమని చెప్పేదమ్మా? శ్రీవేంకటేశుడే నీవాడు. నీకు లోటేముంది? అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ దేవీ! నీసుద్దులు (నీ వలపు కతల) గురించి ఏమని చెప్పనమ్మా! నీకు నీవే సాటి. ఇదివో నిన్ను ఆముకొన్న (అలసి వివశురాలవైనంతగా) నీ నటనలు (నీవు చేసే నాట్య విన్యాసములు) ఆరడాయె (నిన్ను శ్రమతో కూడిన బాధపెట్టాయి) గదవే (కదమ్మా?)

దేవీ! నీ అవస్థ వినవేడుకవుతున్నదమ్మా! నీవు నీ పతికి మొక్కు మొక్కెదనని వంగినంతనే నీ కొప్పుముని జారె గదె (నీ ముందట జారివ్రేలాడింది.) ఆయన నవ్వుతున్నాడేమో అనే అనుమానంతో నిక్కి (పైకిసాగి) చూస్తే చెలులంతా నవ్వారని సిగ్గులతో నిండిపోయావు. నువ్వు కక్కసించి (తిప్పలుపడి) ఆయన నవ్వుతుంటే కడు చెమరించె (నీకింకా చెమటలు పట్టింది) కదమ్మా? అది చూచి నీపై నీపతి ఇంకా చెలిమి చూపించాడు కదమ్మా?

దేవీ! చెలుములు సేయగానే (మీకు స్నేహితము కలిసిననాడే) సేసలుపైబడె గదె (మీపై అక్షతల జల్లు కురిసిందిగదమ్మా!) వివాహ సందర్భముగా సొలయబోతే (పారవశ్యము చెందుటచే) నీ మనస్సు (మోహపరవశతనొందింది). నీయౌవనాన్ని కానుకగా ఇచ్చినందుకు సంకేతముగా నీ స్తనసంపద కనువిందు చేసినది. నీవు యెవరినేమని లాభమేమిటమ్మా? ఎలమి (అతిశయించిన) నీ చేష్టలే నిన్నీ స్థితికి తెచ్చాయి.

సరే! అటుపిమ్మట శ్రీనివాసుడు దేవిని సమీపించి కాగలించినాడు. దానివలన ఆమెలోని కళలు రేగినవి (అందములన్నీ ఇనుమడించినవి) దేవీ! ఆయనకు నీవు నీ మోవినియ్యగానే, గంటి ఆయె (గాట్లు పడినవి) కదవే (కదమ్మా!) అయిననూ శ్రీవేంకటేశుడు వదలక నిన్ను కూడినాడు. ఇదంతా నీ సుకృతమమ్మా! నీ భాగ్యమునేమని పొగడగలము.

**పద్యవివరణ:**

తే.గీ॥ **చెప్పవచ్చునేమని యిదో చెలియ! సుద్దు-**
**లాముకొన్ననీ నటనలు ఆరడాయె,**
**కదిసి కాగలించగ నీదు కళలురేచె**
**భాగ్యమది వేంకటేశుడు పడతిగూడె.**

సంఖ్య: XXIX/197 రాగం : గౌళ
కీర్తన : తారకబ్రహ్మమంత్రము తానై వున్నాడు రాముడు

**గౌళ**

**31 తారకబ్రహ్మమంత్రము తానై వున్నాఁడు రాముఁడు**
**ధారుణిలోఁ జెలువొందె దశరథరాముఁడు ॥పల్లవి॥**

**కొండలంతలు వానరకోటులు గొలువఁగాను**
**దండితోఁ గొలువున్నాఁడు తగ రాముఁడు**
**అండనే సీతాదేవి యమరి కూచుండఁగాను**
**మెండుగ సింహాసనాన మెరసీని రాముఁడు ॥తార॥**

**వామదేవ కౌశిక వసిష్ఠాదులవిన్నపా-**
**లాముకొని వినుచున్నాఁ డదె రాముఁడు**
**గోమున భరత శత్రుఘ్నులు ఛత్ర చామరాలు**
**కామించి పట్టుకుండఁగా కడుమించీ రాముఁడు ॥తార॥**

**కనకపుష్పకము చెంగట వీరాసనముతో**
**ననిచి యానందాన నున్నాఁడు రాముఁడు**
**ఘన శ్రీవేంకటాద్రిపైఁ గల్పవృక్షము నీడ**
**హనుమంతుని చదువు లాలకించీ రాముఁడు ॥తార॥ 197**

**ఉపోద్ఘాతము:**

తారకరామునిగా వీరరాఘవుని కీర్తిస్తూ శ్రావ్యమైన శ్రీరామకథను వినిపిస్తున్నారు అన్నమయ్య. ఆయన దశరథనందనుని స్తుతి యెన్నిసార్లు వినిపించినా కొత్త శోభలు కనబడుతూనే వుంటాయి. వామదేవుడు, విశ్వామిత్రుడు, వసిష్ఠుడు తన గురువులైనందువల్ల చక్రవర్తికి తమ ధర్మం ప్రకారం విన్నవిస్తున్నా శ్రీరామచంద్రుడు దానిని ఆజ్ఞగానే తలదాల్చేవాడు. అదిగో బంగారు పుష్పకవిమానము కూడా ఆయన సింహాసనము





సమీపముననే వున్నది. ఈనాటి వేంకటాద్రి కల్పవృక్షము నాటి నుండి నేటికీ మారుతి స్తుతిస్తుంటే తన్మయత్వంతో వింటాడు.

**తాత్పర్య వివరణ:**

ఈ శ్రీరాముడు తారకబ్రహ్మ మంత్రము (మోక్షప్రాప్తినిచ్చు పరబ్రహ్మస్వరూపుడు) తానే అయివున్నాడు. ఈయన ధారుణిలో (భూమండలంలో) దశరథ రామునిగా చెలువొందినాడు (శోభిల్లుతున్నాడు).

ఈయన నేతృత్వం వహించిన వానరసేనలో కోట్లాది వానరవీరులు ఉన్నారు. వారి ప్రతాపము కొండలంతలు (ఉన్నతమైనవి). వారందరూ శ్రీరాముని భక్తితో కొలిచారు. అందుచేత శ్రీరాముడు తగ దండితో కొలువున్నాడు (తగినట్లు సమర్థతతో కొలువుదీరియున్నాడు.) ఆయనకు వామ భాగమున అండనే (అదే గద్దెపై) సీతాదేవి కూర్చుని వున్నది. ఆమెతోపాటు శ్రీరాముడు మెండుగ సింహాసనముపై ప్రకాశించినాడు.

ఆ శ్రీరామచంద్రుడు తన గురువులను యెనలేని గౌరవంతోటి సేవించేవాడు. ఆయన చక్రవర్తియైనందువల్ల గురువులు విన్నవించుకొన్నా, శ్రీరాముడు ఆజ్ఞలవలె నిర్వర్తించేవాడు. అదిగో ఆయన సమీపముననే శ్రీరాముని గురువులు వామదేవుడు, కౌశికుడు (విశ్వామిత్రుడు) వశిష్ఠుడు వున్నారు చూడండి. అదిగో ఆముకొని (శ్రద్ధగా) వినుచున్నాడు ఆ శ్రీరాముడు. గోమున (సౌకుమార్యంతో) భరత శత్రుఘ్నులు చత్రము, వింజామర ధరించి కామించి (ప్రేమతో) పట్టుకొని అతిశయించియున్నారు.

అదిగో చెంగటనే (సమీపముననే) బంగారు పుష్పక విమానము. వీరాసనముతో (సింహాసనముపై) ననిచి (ప్రీతితో) ఆనందాతిశయమున శ్రీరాముడు వున్నాడు. అట్టి శ్రీరామచంద్రుడు కలియుగంలో శ్రీవేంకటాధిపునిగా వెలసి కల్పవృక్షమైనాడు. ఆ కల్పవృక్షపు నీడలో హనుమంతుడు నేటికి వేదపారాయణం చేస్తుంటే తిరుమలయ్య ఆలకిస్తుంటాడు.

**పద్యవివరణ:**

ఉ॥ **తారకబ్రహ్మమంత్రమది తానుగ శోభిలే రామభద్రుడున్**
**ధారుణిలోననే చెలగి ధర్మసురక్షకుడాయె గద్దెపై**
**మీరక సత్యవాక్యమును మేదినినేలెను సీతతోడుతన్**
**వీరులసత్కరించెనట వేంకటరాముడు యేలె మారుతిన్.**

సంఖ్య: XXIX/322 రాగం : లలిత
కీర్తన : మనచేతికి జిక్కెను మగువలాల

**లలిత**

**32 మన చేతికిఁ జిక్కెను మగువలాల**
**వినయాన వేఁడుకోరే వీఁడె కాంతలాల ॥పల్లవి॥**

**వుబ్బుచుఁ గృష్ణుఁడు వాఁడే వుట్టులు గొట్టీ నదే**
**గొబ్బునఁ బట్టఁగదరే గొల్లెతలాల**
**అబ్బురపుఁ బాలు వెన్న లారగించి వారవట్టీ**
**దొబ్బి తీసుకోరమ్మా తొయ్యలులాల ॥మన॥**

**యింటింటి వాకిట వచ్చి ఇదె చక్కిలాలు దీసీ**
**అంటి పెనఁగులాడరే యంగనలాల**
**దంటయై గోపాలులుఁ దానూఁ బరువులు వెట్టీ**
**వెంటనే తగులరమ్మా వెలఁదులాల ॥మన॥**

**కాకుసేసి చన్నులంటి కాఁగలించుకొనవచ్చీ**
**యేకతాలకుఁ దియ్యరే యింతులాల**
**యీకడ నలమేల్మంగ నేలి శ్రీవేంకటేశుఁడు**
**మీ కోరి కిచ్చె మొక్కరే మెలుఁతలాల ॥మన॥ 322**

**ఉపోద్ఘాతము:**

అన్నమాచార్యులవారి పాండిత్యగరిమ ఈ కీర్తనలో ప్రతిఫలిస్తోంది. స్త్రీ అనే పదానికి యెన్ని పర్యాయపదాలు వాడారో చూడండి. ఈ చిలిపి కృష్ణయ్య యేమిచేస్తాడో తెలుసా? “కాకుసేసి చన్నులంటి కాగలించుకొంటాడట.” అణచిపెట్టి స్తనగిరులనంటుతూ ఆలింగనంచేసికొంటాడట. ఎంత రండగొండివాడో కదా! అంటున్నారు. అయినాసరే! ఓ ఇంతులారా! వీడితో ఏకతాలకుదియ్యరే (ఒంటరిగా మాత్రం దొరకకండి) అంటున్నారు. ఆ రేపల్లె





కోడెగాడే ఈ అలమేల్మంగావిభుడు శ్రీవేంకటేశ్వరుడు. భక్తితో మొక్కరండీ అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ మగువలారా! ఇదిగో కృష్ణుడు మన చేతికి చిక్కినాడు. ఓ కాంతలారా! వీనితో తలపడి నెగ్గలేము. వీనిని వినయముతో వేడుకొనండి.

అదె (అదిగో) వాడే కృష్ణుడు. ఉబ్బుచు (సంతోషముతో పొంగిపోతూ) వుట్టుల గొట్టీ (వుట్లలో గోపికలు దాచిన పాలు, వెన్నా కారిపోవునట్లు వీడు వుట్లను పగులగొట్టినాడు.) ఓ గొల్లపడుచులారా! వీనిని గొబ్బున (శీఘ్రముగ) పట్టుకొనుట అసాధ్యము. అబ్బురపు (ఆశ్చర్యకరంగా) పాలూ వెన్నా ఆరగించి (తిన్నంత తిని) వారకట్టి (పారబోసినంత పారబోసి) పాడుచేస్తాడు. ఓ తొయ్యలులారా! వీనిని దొబ్బి (తోసివేసి) పాలువెన్నా దక్కినంత తీసేసికోండి.

వీడు ప్రతిఇంటికీ వెళ్తాడు. వాళ్ళు వాకిట్లో వ్రేలాడగట్టుకొన్న చక్కిలాలు కనబడితే, వీడు వదలడు. ఓ అంగనలారా! వీడిని అంటుకొని పెనగులాడి చక్కిలాలు లాక్కోండి. దంటయై (స్వయంగా తోడుండి) తానూ తక్కిన గోపాలురూ ఎలా పరుగుతీస్తున్నాడో చూడండి. ఓ వెలదులారా! వాడి వెంటనే తగులరమ్మా (వెంటబడండమ్మా!) ఈ కృష్ణుడు అంత తేలికగా దొరకడు.

ఓ ఇంతులారా! ఈ కృష్ణుడు రండగొండివాడు. వీడు కాకుసేసి (అణచిపెట్టి) చన్నులంటి (స్తనయుగ్మమును తాకి) ఆపైన ఆలింగనము చేసికొంటాడు. ఓ ఇంతులారా! నా మాటవిని వీడిని ఏకతాన దియ్యరె (ఒంటరిగా పట్టుకోండి). ఈకడ (ఇప్పుడు) అలమేల్మంగను యేలిన శ్రీవేంకటేశ్వరుడు వీడే. మీ కోరికలు దెలిపి ఈయనకు మొక్కండి.

**పద్యవివరణ:**

ఆ.వె॥ **మగువలార! వీడె మనజేతికిని జిక్కె**
**వేడుకొనరె హరిని, వినయమొప్ప**
**కాకుసేసి చనులు కాగలించంటును**
**జంకు గొంకులేని వేంకటపతి.**

సంఖ్య: XXIX/321 రాగం : ముఖారి
కీర్తన : అమ్మలాల అక్కలాల అవిగో వింత సుద్దులు

**ముఖారి**

**33 అమ్మలాల అక్కలాల అవిగో వింత సుద్దులు**
**నెమ్మది వింటిరటరే నిచ్చనిచ్చ కొత్తలు ॥పల్లవి॥**

**అల్ల వాఁడే శ్రావణ బహుళాష్టమిని నడురేయి**
**చల్లఁగా రోహిణివేళ జనించినాఁడు**
**వెల్లవిరి దేవకిదేవికి వసుదేవునికి**
**మొల్లమిఁ గొడుకైనాఁడు ముద్దులకృష్ణుఁడు ॥అమ్మ॥**

**పొంచి యశోదానందగోపులకు సుతునివలెఁ**
**బెంచఁగా రేపల్లెలోనఁ బెరిగీ వీఁడె**
**ముంచి యీతనికంటేనె ముందే బలభద్రుఁడు**
**అంచెల రోహిణీదేవి కవతరించినాఁడు ॥అమ్మ॥**

**మొదల దేవతలకు మూలభూతి యితఁడట**
**యెదుట లోకములెల్లా నేలీనటా**
**అదిగో శ్రీవేంకటేశుఁడై యలమేల్మంగాఁ దాను**
**చెదరక కాఁపురాలు సేసీనటా ॥అమ్మ॥ 321**

**ఉపోద్ఘాతము:**

ఈ గోపాలకృష్ణుని 'కతలు' నిచ్చనిచ్చ కొత్తలు అంటున్నారు తానూ ఒక గోపీస్త్రీ అయిన మన అన్నమయ్య. ఓ అమ్మలారా! అక్కలారా! అవిగో ఆ వింత సుద్దులను నెమ్మదిగా విన్నారటమ్మా! అని అంటున్నారు. ఇక ఆ తరువాత శ్రీకృష్ణ జననం, రేపల్లె చేరిక, కంసుని ఆగ్రహం, పూతనాది రాక్షస సంహారం, దేవతల సన్నుతి, ఆ శ్రీకృష్ణుడే ఈ శ్రీవేంకటేశుడు అని కీర్తన ముగిస్తారు.





అయితే ప్రతి కీర్తనలోనూ ఏదో ఒక నూతనత్వం వుంటుంది. అదే అన్నమయ్య ప్రత్యేకత. ఇందులో బలరాముడు రోహిణీ తనయుడు అనే ప్రస్తావన వస్తుంది.

**తాత్పర్య వివరణ:**

ఓ అమ్మలారా! అక్కలారా! అవిగో వింత సుద్దులు (కతలు) నెమ్మది (శాంతచిత్తులై) వింటారటరే (విన్నారుటమ్మా!) అవి నిచ్చనిచ్చ కొత్తలు (ఏనాటికానాడు నిత్యనూతనంగా వుంటాయి).

అల్లవాడే (అదిగో అతగాడే) రోహిణీ నక్షత్రయుక్త శ్రావణ బహుళాష్టమి నాటి అర్ధరాత్రి వసుదేవుని పత్ని అయిన దేవకీదేవికి అష్టమ శిశువుగా చల్లగా జన్మించాడు. ఈ ముద్దులొలికె కృష్ణుడు (నల్లనయ్య), ఆ దేవకీదేవికి మొల్లమిన్ కొడుకైనాడు (తఱచుగా జన్మించు పుత్రుడైనాడు). ఈ శ్రీకృష్ణునిది నారాయణుని మూడవ జన్మ.

మరి అక్కడ మధురలో కారాగారంలో జన్మించినవాడు, పొంచి (రహస్యంగా) యశోద, నందగోపులవద్ద రేపల్లెలో పెంచబడి పెరిగి పెద్దవాడైనాడు. వీడే ఆ శ్రీకృష్ణుడు. ఈతని కంటే ముందుగానే దేవకి ఏడవ గర్భం స్రావమై ఆ బిడ్డ వసుదేవుని ఇంకొక భార్య రోహిణీ దేవి గర్భములో పెరిగి బలరాముడై జన్మించినాడు. ఈ విధంగా బలరామకృష్ణులు అన్నదమ్ములైనా, ఇద్దరు తల్లులచేత అన్నదమ్ములవలె ఒకేచోట పెరిగారు.

ఇంతకీ ఈ శ్రీకృష్ణుడు యెవ్వరనుకొన్నారు. ఈయన దేవతలకు మొదల మూలభూతి (మొదటి మూల పురుషుడు). ఆనాడు మధురను పరిపాలించాడు. నేడు ఈ తిరుమలనాథుడై యెల్ల లోకములను పాలించుచున్నాడు. ఈ శ్రీవేంకటేశ్వరుడు తన దేవేరి అలమేల్మంగతో గూడి చెదరక (స్థిరముగా) కాపురము చేయుచున్నాడట. చూచి తరించెదము గాక!

**పద్యవివరణ:**

కం॥ **అవిగో సుద్దులు వింతలు**
**అవి వినరే అమ్మలార! అక్కల్లారా!**
**భువినిత్యనూతనంబులు**
**ఇవి వేంకట కృష్ణమూర్తి యెఱుగనివటనే!**

సంఖ్య: I/473 రాగం : శంకరాభరణం
కీర్తన : ఎంత భక్తవత్సలుడ విట్టుండవలదా

### శంకరాభరణం

34 ఎంత భక్తవత్సలుఁడ విట్టుండవలదా
వింతలు నీ సుద్దులెల్లా వినఁబోతే నిట్టివే ॥పల్లవి॥

యిల నసురారియనే యాబిరుదు చెల్లె నీకు
బలివిభీషణాదులపాలికే చెల్లదు
కెలసి అవులే నీవు గెలుతు వెందరినైనా
తలఁచి చూడ నీదాసుల కోడుదువు ॥ఎంత॥

యిందరిపాలిటికిని యీశ్వరుఁడ వేలికవు
పందవై యర్జునుబండిబంట వైతివి
వందనకు నౌలే దేవతలకే దొరవు
అందపునీదాసులకు నన్నిటా దాసుఁడవు ॥ఎంత॥

కడుపులో లోకముకన్న తండ్రి విన్నిటాను
కొడుకవు దేవకికిఁ గోరినంతనే
తడవితే వేదములు తగిలేబ్రహ్మమవు
విడువనిమాకైతే శ్రీవేంకటాద్రిపతివి ॥ఎంత॥ 473

**ఉపోద్ఘాతము:**

శ్రీవేంకటేశ్వరుడు భక్తవత్సలుడు. ఆయన భక్తవత్సలత నిరూపించే భాగవతకథలన్నీ వినబోతే వింతలే. ఆనాడు నీవట్లా వుండి తోడూనీడై నీ శరణాగతులను గాచావు. ఇది కలియుగం. మేము ఇంకా బలహీనులం, బలహీనతలున్నవాళ్ళం. ఇప్పుడు కూడా నీవు ఇట్లాగే వుండకపోతే మా గతేమిటి ప్రభూ! అంటున్నారు అన్నమయ్య. ఆ స్వామి ఆయన శరణార్థియెవ్వడైనా సరే! కాపాడినాడు కదా! బలి, విభీషణుడు రాక్షసులని





త్యజించాడా? అర్జునుడికి రథసారథియై భీష్ముడి చేతిలో గాయాలపాలయ్యాడు కదా! ఆయన తన దాసుల చేతిలో ఓటమినైనా స్వీకరిస్తాడు. తన దాసులకు తానే దాసుడు. అంత భక్తసులభుడు అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ దేవదేవా! నీవెంత భక్తవత్సలుడవు (భక్తులను వాత్సల్యముతో చూచువాడవు.) నీ సుద్దులు (భాగవతగాథలు) యెల్లా వింతగొలుపునవే. వినబోతే అవన్నీ ఇట్టివే (ఇదే విషయం నిరూపిస్తున్నాయి.) ప్రభూ! ఇది కలియుగం. అయినా నీవు ఇట్టుండవలదా (ఇలాగే వుండాలి కదా!)

నీకు అసురవైరి అనే బిరుదు సరియైనది అనుకోనా అంటే నీవు ఆనాడు కృతయుగంలో బలిచక్రవర్తి, త్రేతాయుగంలో విభీషనుని వద్ద ఆ మాట చెల్లనే లేదు. నీవు ఆ ఇద్దరికీ రక్షకుడవైనావు. అవులే (ఔనులే) నీవు కెలసి (అవసరమొస్తే) యెవ్వరినైన గెలువగలవు. కానీ అదేమిటో నీదాసుల చేతిలో ఓడిపోతే నీకు సంతోషమే.

ఇందరిపాలిటి (ఇంతమందికీ) నీవే ఈశ్వరుడవు కదా! ఏలికవు (ప్రభువుకూడా నీవే కదా?) మరి ఆనాడు ద్వాపరయుగంలో అర్జునుడికి బండి బంటువై (రథముతోలేవాడివై) పందవై (భృత్యుడవైనావు). ఔలే (అవునులే) నీవేమో దేవతలకే, వందనకు దొరవు (నిత్యమూ స్తుతించే) యజమానివి. కానీ విశిష్టులైన నీదాసులకు మాత్రం నీవే దాసుడవు.

ఇన్నిటాను (ఈ సృష్టిలో అన్నిటికీ) నీవే కన్నతండ్రివి. లోకములలో యెక్కడైనా నీవే వున్నావు. కాని దేవకీదేవి కోరుకొనగానే ఆమెకు కన్నకొడుకువైనావు. తడవితే (ప్రస్తావనకు వస్తే) నీవే వేదములు తగిలే బ్రహ్మవు (నుతించే పరబ్రహ్మ స్వరూపుడవు.) మాకు మాత్రం యెన్నడూ తోడు విడువని శ్రీ వేంకటేశ్వరుడవు.

**పద్యవివరణ:**

తే.గీ॥ **ఎంత భక్తవత్సలుడ వుయిట్టులుండ-**
**వలదె? సుద్దులు వింతలు పట్టి వినగ**
**అసురగాచావు, తోలితి వరదమున్ను**
**వేద సంరక్షకుడ వీవు వేంకటేశ!**

సంఖ్య: XVII/27 రాగం : పళవంజరం
కీర్తన : వింటెరటే చెలులాల వేడుక సంతోసివార్త

పళవంజరం

**35 వింటిరటే చెలులాల వేడుక సంతోసవార్త**
**యింట నింట వూరనెల్ల యిదే సుద్ది ॥పల్లవి॥**

**కోమలి దేవకిదేవి కొడుకుఁ గంటే రేపల్లెఁ**
**బ్రేమతో వసుదేవుఁడు పెంచఁబెట్టి వచ్చెనట**
**గామిడై యశోదకూఁతుఁ గంసునికిఁ జూపెనట**
**ఆ మగువ కంసుని నద్దలించినదట ॥వింటి॥**

**శ్రావణబహుళాష్టమి సవరేతిరికాదను**
**ఆవేళ రోహిణి మంచిదైనొద్దానట**
**కావింప మేనమామకు గండమట యీతఁడే**
**దేవరట బాఁపలెల్లా దిక్కులఁ జెప్పిరి ॥వింటి॥**

**యిటమీఁద రాకాసుల నిందరిఁ గొట్టెనట**
**ఘటన సాధులనెల్లాఁ గరుణ రక్షించెనట**
**పటుగతి వీఁడు శ్రీవేంకటగిరికృష్ణుఁడట**
**నటించునలమేల్మంగ నాయఁకుడు దానట ॥వింటి॥**

**ఉపోద్ఘాతము:**
శ్రీకృష్ణుని లీలలను గోపికలు సుద్దులుగా (కతలుగా) చెప్పుకొంటున్నారు. కాని అన్నమయ్య రామకథనైనా, శ్రీకృష్ణ చరిత్రనైనా ఒక క్రమంలో ఆద్యంతాలు వదలక వినిపిస్తారు. శ్రీవేంకటపతి మకుటం యెలాగూ శిరోధార్యమే కదా! అనేక తడవలు ఇదే కీర్తన చదివినామా అనిపిస్తుంది. కాని పరిశీలనగా చూస్తే ప్రతి కీర్తన విభిన్నంగానే వుంటుంది. యశోద కూతురుని కంసునికి వసుదేవుడు చూపించాడట అని గోపికలు చెప్పుకొనే అవకాశం లేదు. అది కంసవధ దాకా అతి గోప్యం. కాబట్టి ఇది గోపికలు పాడినా... శ్రీకృష్ణుని తలచుకొంటూ ఆయన గాథలను నెమఱువేసికొంటున్నారని





భావించాలి. అప్పుడు సరిపోతుంది. ఆనాటి దుష్టశిక్షకుడే ఈనాటి శిష్టరక్షకుడైన శ్రీ వేంకటేశ్వరుడు అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ చెలియలారా! వేడుక (వినోదము) సంతోష (ఆనందమును) ఇచ్చే వార్తను వింటిరటే (విన్నారుటే). వూరనెల్ల యింటనింట (ఊరంతా, ఇల్లిల్లూ) యిదే సుద్ది (ఇదే ముచ్చట కదమ్మా!)

తన భార్య దేవకీదేవి మధురలో కొడుకును కంటే (ప్రసవిస్తే) వసుదేవుడు అర్ధరాత్రివేళ ఆ శిశువును యమునానది దాటించి రేపల్లెలో నందుని భార్య యశోద కన్న ఆడ శిశువుతో మార్పిడి చేశాడట. ఈ విధంగా ఆ బాలుని రేపల్లెలో పెంచబెట్టాడట. గామిడైన కంసునికి (దుష్ట కంసునికి) ఆమె కూతురును తనబిడ్డేనని చూపినాడు. ఆ స్త్రీ శిశువు యోగమాయయై కంసుని అద్దరించినదట (హెచ్చరించినదట).

చెలియలారా! బాఁపలెల్లా (బ్రాహ్మణులంతా) దిక్కులు జెప్పిరి. (అనేక చోట్ల రహస్యంగా చెప్పుకొంటున్నారట). శ్రావణ బహుళాష్టమి నాటికి సమరేతిరి (అర్ధరాత్రి) ఆ బాలుడు రోహిణీ నక్షత్రంలో పుట్టినాడట. ఆవేళ పుట్టిన వాడు తన మేనమామకు పెద్ద గండమట. ఈ శిశువే దేవరట (దేవదేవుడైన శ్రీహరియట). మరి మీరు రహస్యంగా వుంచండి.

ఇక ఇప్పుడేమి జరుగబోతున్నదో తెలుసా? యిటుమీద (ఇకపై) రాకాసుల నెల్లా (రాక్షసులను రాక్షసత్వంకలవారినీ) కొట్టెనట (వధించునట). సాధులనెల్ల (సజ్జనులనందరినీ), ఘటన (పూనికతో) కరుణజూపి రక్షించునట. వీడు (ఈ బాలుడే) పటుగతి (పట్టుదలతో) శ్రీవేంకటాద్రిజేరి కలియుగంలో శ్రీవేంకట కృష్ణుడైనాడట. నాట్య ప్రవీణురాలైన అలమేలుమంగ నాయకుడు తానేనట.

**పద్యవివరణ:**

కం॥ **వింటిరటే చెలులారా!**
**ఇంటింటా వూరనెల్ల యివె సుద్దులుబో!**
**తుంటరి ఆ కృష్ణయ్యే**
**జంటై అలమేలుమంగ స్వామైనాడే.**

సంఖ్య: I/506 రాగం : సాళంగం
కీర్తన : మొఱవెట్టెదము మీకు మొగసాలవాకిటను

## సాళంగం

**36 మొఱవెట్టెదము మీకు మొగసాలవాకిటను**
**మఱఁగుచొచ్చితి మీకు మముఁ గావరో ॥పల్లవి॥**

**యేపున మనసనియేటిమా పెంపుడు లేదు(డి)**
**పాపమనేయడవిఁ బడినది**
**రాపున హరికింకరపువేఁకకాండ్లాల**
**పైపైని మా కింకఁ బట్టియ్యరో ॥మొఱ॥**

**అంచెల మావిజ్ఞానమనెడి కామధేనువు**
**పంచేంద్రియపురొంపిఁ బడినది**
**మించి వైకుంఠానకేఁగేమేటి తెరువరులాల**
**దించక యెత్తెత్తి వెళ్లఁదియ్యరో ॥మొఱ॥**

**అండనే మోహాంధకారమనెడిమాదిగ్గజము**
**దండి మీదయనేటివోఁదానఁ బడెను**
**నిండి శ్రీవేంకటేశుఁడ నేటిమావటీనిచేత**
**గండికర్మపుకంభానఁ గట్టించరో ॥మొఱ॥ 506**

**ఉపోద్ఘాతము:**

"మొగసాల" అంటే, నగరముయొక్క తలవాకిటలో వుండే చావడి అని అర్థం. దీని వాకిట్లో ప్రజలు గుమికూడి నగరంలోని విశేషాలు ముచ్చటించుకొనేవారు. ఎవరన్నా యేదన్నా నగరంలోని న్యాయాధిపతికి చెప్పుకోవాలంటే మొగసాల యెక్కేవారు. ఈ కీర్తనలో అన్నమయ్య హరి కావలివాండ్లను, వైకుంఠానికి పోతున్న ముక్తులను, తిరుమలేశుని దాసులను ఉద్దేశించి మముగావరో అని పాడుతున్నాడు. మొగసాల వాకిట్లో మీకు మొఱబెట్టుకొంటూన్నాము. మీకుమఱగు జొచ్చి మీ ఆశ్రయంలో జేరాము.





మమ్ము రక్షింపరో అని పై ముప్వురినీ ఎలా వేడుకొంటున్నారో ఆలకించండి. ఒకటికి రెండుసార్లు చదివితేగాని ఈ కీర్తన అర్థం కాదని నా అభిప్రాయం.

**తాత్పర్య వివరణ:**

మీకు మొఱబెట్టుకుంటున్నాము. మొగసాల వాకిటను (మొగసాల చావడిలో) అందరి ముందు మా గోడు వినిపించుకొంటున్నాము. మీకు మఱగుజొచ్చితిమి (మీ ఆశ్రమంలో చేరాము). మముగావరో! (మమ్మల్ని రక్షించండయ్యా!)

మావద్ద ఒక పెంపుడు లేడి వున్నది. అదే మామనస్సు ఏపున (అహంకరించి) అది పాపము అనే అడవిలో చిక్కుబడిపోయింది. ఓ హరికింకపు వేకకాండ్లలారా! (దుస్సహులైన శ్రీహరికింకరులారా!) రాపున (ఘర్షణ పడియైనా) మాకు మా లేడిని, ఇంక పైపైనిబట్టియ్యరో (ఇకనైనా సునాయాసంగా మాకు దొరికేట్లు చేయండి).

మా విజ్ఞానము (భగవత్ జ్ఞానము) అనే కామధేనువు (గంగిగోవు) మా అంచెల (మా ఆశ్రయంలో) వుండేది. అది ఇవ్వాళ పంచేంద్రియాల పీడ అనే రొంపిలో (బురదగుంటలో) పడిపోయి దీనంగా అరుస్తున్నది. వైకుంఠానికి పోతున్న తెరవారులారా, ముక్తిమార్గంలో వున్నారు మీరైనా దానిని వదలక యెత్తెత్తి (నెమ్మదిగా పైకెత్తి) వెళ్ళదియ్యరో! (బయటకులాగి పుణ్యంకట్టుకోండయ్యా!)

అండనే (అక్కడే దగ్గర్లో) మా పట్టపుటేనుగు వున్నది. నాతోడున్నవాళ్ళే మోహాంధకారము అనబడే ఆ పట్టపుటేనుగును దండిమీద (ఒళ్ళు పొగరు) అనే గోతిలో పడవేశారు. అటువంటి దిగ్గజాలను బయటకు వెళ్ళదీయగల ఒక మేటి "మావటి" వున్నాడు. ఆయనే శ్రీ వేంకటేశ్వరుడు ఆయనను పిలిపించి, గండికర్మలు (బలమైన కర్మలు) అనే స్తంభానికి కట్టేయించండి.

**పద్యవివరణ:**

ఆ.వె॥ **మొఱలు వెట్టినాము మొగసాల వాకిటన్**
**మీకు దాసులమని మేము మొక్కి,**
**మఱగుజొచ్చినాము మముగావరో యని**
**వేడినాము శరణు వేంకటేశ!**

సంఖ్య: XVIII/78 రాగం : మంగళకౌశిక
కీర్తన : నేరుపరివినీవైతే నెలతై తే ముద్దరాలు

### మంగళకౌశిక

**37 నేరుపరివి నీవైతే నెలఁతై తే ముద్దరాలు**
**పేరునఁ బిలిచి నీవే పెనఁగఁగరాదా ॥పల్లవి॥**

**చిన్నదిగనక యింతి సిగ్గుతోడ నున్నది**
**అన్నిటా రట్టడివి మాటాడించరాదా**
**తన్నుఁదానె నీపై ప్రేమ దాఁచుకొని వున్నది**
**సన్నలనే నీమోవి చవిచూపరాదా ॥నేరు॥**

**జవరాలుగనక ఆసలఁ బొంచుకవున్నది**
**నవకపుజాణవు నవ్వించరాదా**
**వివరించి బత్తి వెల్లవిరి సేయకున్నది**
**చివురుకెంగేలు చాఁచి చిమ్మిరేఁచరాదా ॥నేరు॥**

**కొమరెగనక కడుగుట్టుఁతోడ నున్నది**
**నెమకి దిట్టవు మేలు నెరపరాదా**
**అమర శ్రీవేంకటేశ అండ వాయకున్నది**
**సమరతి నిట్లానే చనవియ్యరాదా ॥నేరు॥ 78**

**ఉపోద్ఘాతము:**

ముద్దరాలు అంటే ముగ్ధయైన స్త్రీ అని అర్థం. కొమరె అంటే యౌవనవతి అని అర్థం. ఇటువంటి పదములు ఈ కీర్తనలో అడుగడుగునా కనిపిస్తూనే వుంటాయి. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు నేర్పరివైతే ఆ నెలత ముగ్ధ. నీవు ప్రేమగా ఆమెను పేరుబెట్టి పిలిచావు. అటువంటి నీవే పెనగ (కౌగలించ) వచ్చు? అంటున్నారు అన్నమయ్య. ఆమె కొమరెగనుక కడుగట్టుతో వున్నది. నీవే ఆమె





ఎక్కడున్నదో కనుక్కొని ఆమెకు మేలుచేయరాదా? ఆమె నీ అండ బాసివుండలేదు. నీవే సమభోగమున ఆమె నలరించ సమర్థుడవు. ఆమెకు ఇట్లానే చనువియ్యవయ్యా!

**తాత్పర్య వివరణ:**

శ్రీనివాసా! నీవు నేరుపరివైతే (నేర్పరివి అయితే) మరి నీ నెలత (తరుణి) అయితే ముద్దరాలు (ముగ్ధ). నీవే ఆమెను పేరుబెట్టి బిలిచి పెనగగరాదా? (పెనవేసుకోవచ్చునుకదా!)

ప్రభూ! ఆమె చిన్నది (చిరుప్రాయముది). కనుక ఆ ఇంతి (యువతి) సిగ్గు అధికమైయున్నది. నీవు అన్ని విధములా రట్టడివి (తెగించినవాడవు). నీవె అనునయించి ఆమెను మాట్లాడించరాదా? ఆమెకు నీపై అత్యధికమైన అనురాగము వున్నది. అయినా తన్ను తానే ఆ ప్రేమను దాచుకొన్నది. సన్నలనే (సాయంసమయమునవే) నీ అధరామృతమునందించరాదా?

ఓదేవా! ఆమె జవరాలు (ప్రియురాలు) గనుక ఆశతో నీకై పొంచుకవున్నది (వేచివున్నది). నీవు నవకపు జాణవు (మృదుత్వముగల నేర్పరివి). ఆమెను సంతోషపెట్టరాదా? ఆమెకు నీవనిన అత్యంత భక్తి కలదు. కానీ దానినామె బహిర్గతము సేయలేకున్నది. చివురుటాకు వంటినీ చేయిజాచి, చిమ్మిరేచరాదా (చెలరేగరాదా)?

ప్రభూ! కొమరెగనక (ఆమె కౌమారములోనున్నది గనుక) యెక్కువ గుట్టుతో గుంభనముగానున్నది. నీవు దిట్టవు (సమర్థుడవు). నెమకి (ఆమె ఆంతర్యము కనుగొని) నీవే ఆమెకు మేలు నెరపరాదా (మంచి చేయవచ్చునుగదా!) ఓ శ్రీవేంకటేశ్వరా! నీవే ఆమె ప్రాణేశ్వరుడవు. అందుచేత అమరి ఆమె అండవదలకుయున్నది. సమభోగములో ఇట్లానే (ఇలాగే) చనువియ్యరాదా (ఆప్యాయత నివ్వరాదా!)

**పద్యవివరణ:**

కం॥ **నేరుపరివి నీవైతే**
**కోరిన ఆ నెలత నిన్ను కూరిమి చేరెన్,**
**చేరినది ముద్దరాలుర**
**పేరున బిలిచింక నీవె పెనగగదగునా?**

సంఖ్య: I/505 రాగం : బౌళి
కీర్తన : సుఖమును దుఃఖమును జోడుకోడెలు

**బౌళి**

**38 సుఖమును దుఃఖమును జోడుకోడెలు**
**అఖిలముఁగన్నవారు అడ్డమూడ రెపుదు ॥పల్లవి॥**

**యెందాఁకా సంసార మెనసి తాఁ జేసేను**
**అందాఁకా లంపటము లవి వోవు**
**కందువ జీవుఁడు భూమిఁ గాయ మెన్నాళ్ళు మోఁచె**
**అందుకొన్నతనలోనియాసలూఁ బోవు ॥సుఖ॥**

**అప్పటిఁ దనకు లోలో ఆఁక లెంతగలిగినా**
**తప్పక అందుకుఁ దగ దాహముఁ బోదు**
**అప్పు దనమీఁద మోచి అదె యెన్నాళ్లువుండె**
**ముప్పిరి వడ్డివారక మూలనుండినాఁ బోదు ॥సుఖ॥**

**దైవముపై భక్తిలేక తనకు నెన్నాళ్లుండే**
**దావతి కర్మపుపాటు తనకు బోదు**
**శ్రీవేంకటేశ్వరుని సేవ దన కెప్పు డబ్బె**
**వోవరి నందలిమేలు వొల్లనన్నాఁ బోదు ॥సుఖ॥ 505**

**ఉపోద్ఘాతము:**

సుఖదుఃఖాలు కాడెద్దులలాంటివి. అవెప్పుడూ జంటగానే వుంటయి. పూర్తిగా సుఖముకాని పూర్తిగా దుఃఖముకాని తటస్థించవు. ప్రపంచాన్నంతా అనుభవించినవారు ఈ సంగతి తెలియుటవలన యెప్పుడూ వాటికి అడ్డుచెప్పరు. అవి భగవదేచ్ఛననుసరించి వస్తూనే వుంటాయి పోతూనే వుంటాయి అంటున్నారు అన్నమయ్య. దైవభక్తిలేని మానవజన్మనెన్నాళ్ళున్నా వొరిగేదేముంది? కర్మలు చేయటం వాటి ఫలితం అనుభవించడం అంతే





గదా! శ్రీవేంకటేశ్వరుని శరణాగతితో సేవిస్తేనే మేలు కలుగుతుంది. ఆ మేలు యెంత విశిష్టమైనదంటే అదినాకొద్దు స్వామీ అన్నా జమ అవుతుంది.

**తాత్పర్య వివరణ:**

సుఖమును దుఃఖమును జోడు కోడెలు (బండికి కట్టిన యెద్దుల జంట వంటివి). అవి యెప్పుడూ జంటానే వస్తుంటాయి. ఈ సంగతి తెలిసినందునే అఖిలముగన్నవారు (ప్రపంచాన్నంతా అనుభవించినవారు) యెపుడు (యెప్పటికీ) అడ్డమాడరు (వాటికి అడ్డుజెప్పరు).

ఎంతవరకు సంసారం మీద మమకారంతో తాను చేస్తుంటాడో, ఆ నరునికి అది (ఆ సంసారం) లంపటములై పొమ్మన్నా పోవు. ఈ జీవుడు యెన్నాళ్ళు భూమిమీద శరీరాన్ని పొందివుంటాడో అన్నినాళ్ళూ ఆ జీవికి ఆ దేహానికి సంబంధించిన కోరికలు అంటుకొని పొమ్మన్నా పోవు. ఆ జీవికి ఆ ఆసలతో సతమతమవక తప్పదు.

ఎవ్వనికైనా ఆకలివేస్తే అది లోలో (వాడిలోపల్లోపలే) దహించివేస్తూ అప్పటి (విరసత్వము) యెంతైనా పెంచుతుంది. అది దాహము కింద పరిణామంచెంది ఆ తపన యెంతకీ పోదు. తనమీద మోచిన (భారమైన) అప్పు యెన్నాళ్ళున్నా, వడ్డీ రూపంలో పీడయై మనం యే మారుమూల దాగికొన్నా పోనేపోదు. ఆ వడ్డీ, ఋణం వున్నంతకాలమూ వుండేదే.

తనకు (మనిషికి) దైవభక్తిలేకపోతే యెన్ని జన్మలెత్తినా యెన్నాళ్ళు జీవించినా నిష్ప్రయోజనమే. దావతి కర్మ (దుఃఖము కలిగించే కర్మానుభవము పొందక తప్పదు). తనకు దాని పాటు పొమ్మన్నా పోదు. తనకు (ఆ జీవికి) శ్రీవేంకటేశ్వరుని సేవా భాగ్యము యెప్పుడు కలిగినా అప్పట్నుంచి అది చేసే మేలు పొమ్మన్నా పోదు.

**పద్యవివరణ:**

ఉ॥ **జంటగనున్న కోడెలివి సౌఖ్యము దుఃఖము వాయవెన్నడున్**
**జంటను, దీనినేర్చికద! సర్వముగాంచిన సాధులందరున్**
**అంటియు అడ్డమాడరెపు డావిధి సైతురు వేంకటేశ! చే**
**కొంటిని నీదు సేవయది కూర్చెడి మేళ్ళను బోవుతోసినన్**

సంఖ్య: XVIII/153 రాగం : ముఖారి
కీర్తన : వాకిలిగాచేయట్టివనితల మిదె నేము

**ముఖారి**

**39 వాకిలిగాచేయట్టివనితల మిదె నేము**
**జోకదప్పకురే మీరు సుదతులాలా ॥పల్లవి॥**

**మచ్చిక నాతఁడు నాకె మాటలాడుకొనఁగాను**
**అచ్చముగ మీరేల ఆలకించేరే**
**యిచ్చగించి వేడుకతో నేకతాన నుండఁగాను**
**కొచ్చి తెరయెత్తేరేలే కొమ్మలాలా ॥వాకి॥**

**కొత్తగా నద్దాలు చూచుకొని వారు నవ్వఁగాను**
**చిత్తిణిచేఁతలనేల చేరవచ్చేరే**
**హత్తి పందేలతోడుత నటు చదురంగమాడే-**
**రెత్తులేల చెప్పేరే యింతులాలా ॥వాకి॥**

**శ్రీ వేంకటేశుఁడు లోన దేవులఁ జెనకఁగాను**
**యీవేళఁ గానుకలేల యియ్యవచ్చేరే**
**వేవేలురతులఁ గూడి వెసఁ బీఁటపై నుండఁగా**
**బావంటాఁ బైకొనేరేలే పడఁతులాలా ॥వాకి॥ 153**

**ఉపోద్ఘాతము:**

అన్నమాచార్యులవారి నాటి తెలుగు నేటి తరం వారికి మింగుడు పడదనటానికి ఈ కీర్తనను మించిన ఉదాహరణ దొరకదు. ఈ కీర్తన చరణాలతో నేను చెప్పిన పద్యం వినండి. అది ఎన్నిసార్లు చదివినా కొరుకుడు పడదు. నాది అంత గొప్పభాషాపరిజ్ఞానం అనుకోరాదు. ఈ కీర్తనలోని భాష బిగువు అంతటిది. ఇంతకీ ఈ పల్లవి అర్థం వూహించగలరా? ఓ చెలికత్తెలారా! మేము వాకిటిలో కావలివున్న వనితలము. మీరేల మీ





మర్యాదనతిక్రమిస్తున్నారు? మంచీ మన్ననా తప్పకండి. తిరుమలేశుడు తన దేవేరితో ఏకాంతంలో వున్నాడు. అట్లా వారిని దొంగచాటుగా చూడవచ్చునా?

**తాత్పర్య వివరణ:**

ఇదెనేము (ఇదిగో మేము) వాకిటిలో కావలి వుండే స్త్రీలము. ఓ సుదతులాల (దేవేరికి ఆంతరంగిక చెలికత్తెలారా!) మీరు జోకదప్పకురే (మంచీ మన్ననా తప్పకండి).

ఆతడున్ ఆకె (స్వామివారు శ్రీదేవి) మచ్చికన్ (చనువుగా) మాట్లాడుకొంటున్నారు. మీరేల అచ్చముగా (మీ స్వంత వ్యవహారంలాగా) ఆలకించేరు (వింటున్నారు?) వేడుకతో (ఉల్లాసముగా) వారిరువరూ ఇచ్చగించి (కోరికలతో) ఏకతాననున్నారు (ఏకాంత మందిరంలో వున్నారు). మీరు కొచ్చి (తొలగించి) తెరమరుగును (తెరచాటును) తప్పు చేస్తున్నారు.

ఓ ఇంతులారా! ఆ గదిలో కొత్తగా బిగించిన అద్దాలలో తమను తాము చూచుకొని వారు నవ్వుకొంటున్నారు. మీరు చిత్తిణిజాతి స్త్రీల పనులు యెందుకు చేస్తున్నారే. ఇప్పుడు వారి దగ్గరకు పోవచ్చునా. వారిరువురూ (స్వామివారు శ్రీదేవి) హత్తి (పొందికతో) పందెములు వేసికొని చదరంగం ఆడుకొంటున్నారు. మీరు వారికి మీ స్వంత యెత్తులు చెప్పి వారిని చీకాకు పెడుతున్నారు. ఏంపని అది?

ఓ పడతులారా! లోన (వారి ఏకాంతంలో) శ్రీవేంకటేశ్వరుడు తన దేవేరి చెక్కిలనొక్కితే ఈ వేళ ప్రభూ! ఇవిగో ఇంకా కొన్ని కానుకలు వచ్చాయి అటూ ఇయ్యవచ్చేరా (ఇద్దామని లోపలికి వస్తారటమ్మా?) పలు సురతుల నలసిసొలసి వారు సేదతీరుతుంటే బావగారూ అని లోనదూరి ఆక్రమిస్తారా? బుద్ధిలేదా?

**పద్యవివరణ:**

తే.గీ॥ **వాకిలినిగాచు వనితలము కద! నేము**
**జోకదప్పకురే మీరు సుదతులాల!**
**తిరుమలేశుడు చెనకును దేవులనిక,**
**యిట్టివేళగానుకలేల యిత్తురమ్మ!**

సంఖ్య: I/504 రాగం : శుద్ధవసంతం
కీర్తన : ఇంతటిదైవమవు మాకు నిటు నీవు గలుగగ

## శుద్ధవసంతం

40 ఇంతటిదైవమవు మాకు నిటు నీవు గలుగఁగ
యెంతవారమో భాగ్య మేమిచెప్పే దిఁకను ॥పల్లవి॥

తలకొని వొకకొంతధనము గనినవాఁడు
వెలలేనిగర్వముతో విఱ్ఱవీఁగీని
బలువుతో వొకరాజుఁబట్టి కొలిచినవాఁడు
సలిగెతో నాకెవ్వరుసరి యనీని ॥ఇంత॥

వింతగా నొక పరుసవేది చేతఁగలవాఁడు
యెంతవారిఁ గైకోఁడు యెక్కుడంటాను
పొంత నొకమంత్రము పంపుసేయించుకొనేవాఁడు
అంతటికి గురుఁడంటానని మురిసీని ॥ఇంత॥

యెగువ నొకదుర్గము నెక్కుక యేలేవాఁడు
పగవారిఁ గైకొనక బలువయ్యీని
అగపడి శ్రీవేంకటాద్రిమీఁదనున్న నిన్నుఁ
దగ నమ్మినట్టివాఁడ ధన్యుఁడ నేను ॥ఇంత॥ 504

**ఉపోద్ఘాతము:**

ఇంతగొప్పదైవానివి నీవు మాకు ప్రాప్తించినావు. మా భాగ్యము యేమని చెప్పనయ్యా! మేమెంతవారము అని సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బవుతున్నారు అన్నమయ్య. కొంత మందికి ధనంవుందని గర్వం వుంటుంది. కొంతమందికి తాము రాజుగారికి కావలసినవారము అని అతిశయముంటుంది. కొంతమందికి పరుసవేది చేతిలోవుంటే (వారు ఏ లోహాన్ని తాకినా అది బంగారం అవుతుంది. వాడు నేనే అందరికంటే ఎక్కువవాడినని అందర్నీ





యెదిరిస్తుంటాడు) పొగరెక్కుతుంది. కొంతమందికి మంత్రవిద్యవుండి మురిసిపోతుంటారు. ఇవన్నీ ఐశ్వర్యాలే కానీ ఏం లాభం? వారందరికంటే శ్రీవేంకటేశ్వరుని నమ్మినవారే ధన్యజీవులు అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ శ్రీహరీ! నీవు ఇంతటిదైవమవు. మాకు నీవు ఇటు గలుగగ (ఈ విధంగా కలిగినందువల్ల) ఇకపై ధన్యులమయ్యాము. మేమెంత వారమయ్యామోకదా! మా భాగ్యమునేమని చెప్పను?

కొంతమంది దగ్గర తలకొని (సంప్రాప్తించి) ధనము వుంటుంది. వాళ్ళు చెప్పలేని గర్వంతో విఱ్ఱవీగుతుంటారు. బలవంతుడైన ఒక రాజుగారి ఆశ్రయం పొందినవాడు ఆయనను కొలుస్తూ సలిగెతో (ఎవ్వరినీ లెక్కచేయక) వుంటాడు. వాడు నాకెవ్వరు సమానులు అనే అతిశయంతో వుంటాడు. ఆ రాజు ఏదన్నా యుద్ధంలో మరణిస్తే వీడి బ్రతుకు కుక్క బ్రతుకే కదా!

కొంతమంది చేతిలో భాగ్యరేఖ “పరుసవేది”యై వుంటుంది. వాడు ఏ లోహాన్ని తాకినా అది బంగారమవుతుంది. వాడు యెంతటివారినైనా గైకోడు (లక్ష్యపెట్టడు) నేనే అందరికంటే ఎక్కుడు (గొప్పవాడిననుకొంటాడు). కొందరికి మంత్రవిద్య వస్తుంది. వాడు అంతటికీ నేనే గురుడంటా (గురువనని) మురిసిపోతుంటాడు.

కొంతమందికి ఒక దుర్గము (కోట) వారి అధీనములో వుంటుంది. వాడికి పగవారి భయము వుండదు. వాడు ఎవ్వరినీ యెదిరించకుండానే సుఖంగా వుంటాడు. కానీ పైవారందరికీ మరుక్షణం ఏమవుతుందో తెలియదు. కానీ శ్రీవేంకటేశ్వరుని నమ్మినట్టివాడు ధన్యుడు. వాడు యెన్నడూ చెడిపోడు. నేనుకూడా ధన్యుడనే ప్రభూ!

**పద్యవివరణ:**

ఉ|| **ఇంతటి దైవమీవు భువి ఏపున గొల్చితిమయ్య మాకుమే-**
**మెంతటి వారమయ్య యిపుడేమని చెప్పము భాగ్యవైభవం**
**బంతయు నీదు సత్కృపయె అద్రిజ సన్నుతవేంకటేశ్వరా!**
**చింతలు బాసి నమ్మితిని శ్రీగిరినాయక! నేను ధన్యుడన్.**

సంఖ్య: XVIII/403 రాగం : పాడి
కీర్తన : కంటిని మన్ననలెల్లా గడపరాయా

**పాడి**

**41 కంటిని మన్ననలెల్లాఁ గడపరాయ మొల-**
**గంట లెంతవాయించేవు కడపరాయ ॥పల్లవి॥**

**కప్పుర మీఁగదవోయి కడపరాయ మోవి-**
**కప్పు లేల రేఁచేవు కడపరాయ**
**కప్పవోయి పచ్చడము కడపరాయ నీకుఁ**
**గప్పము నావలపులు కడపరాయ ॥కంటి॥**

**గరిసించకు రతిఁ గడపరాయ నీ-**
**కరుణెల్లా నాసొమ్ము కడపరాయ**
**కరఁగించకు మనసు కడపరాయ నాకు**
**గరిడీ నీకాఁగిలి కడపరాయ ॥కంటి॥**

**కలసి కాఁగిట నిట్టె కడపరాయ నన్నుఁ**
**గలికిఁ జేసితి వింత కడపరాయ**
**కలకాలమును మాకుఁ గడపరాయ**
**కలవు శ్రీవేంకటాద్రి కడపరాయా ॥కంటి॥ 403**

**ఉపోద్ఘాతము:**

అన్నమయ్య కాలంలో స్త్రీలు అలంకారంగా మొలనూలు గంటలు ధరించేవారు. నడుము కదలికలకు చిరుగంటలు మ్రోగి అవిధరించినవారి కదలికలననుసరించి వింత వింత ధ్వనులు చేసేవి. కడపకు రాయడైన శ్రీవేంకటేశ్వరుని దేవేరి ధరించిన మొలనూలి గంటలు అదే పనిగా సవ్వడి చేస్తున్నాయి. ఎందుకో భావించండి. అన్నమయ్య ఏమంటున్నారంటే మొలగంటలెంతవాయించేవు కడపరాయా అని చిలిపిగ ప్రశ్నిస్తున్నారు.





అయితే అదంతా ఆ దేవికి మన్ననయేనట. ఎంత సరసశృంగారమో చూడండి. దేవి వలపులే స్వామికి కప్పములట. ఆయన కౌగిలి ఒక గరిడీ అట. అంటే ఏమిటో తెలుసుకోవాలంటే ఇదంతా చదవాల్సిందే.

**తాత్పర్య వివరణ:**

ఓ కడపరాయా! శ్రీవేంకటేశ్వరా! నీదేవేరినైనందువల్ల మన్ననలెల్లా కంటిని (ఎనలేని గౌరవమును పొందాను). తులలేని ఆనందం పొందాను. నా మొలగంటలు (మొలనూలుకు బిగించిన చిరుగంటలు) యెంతగా మ్రోగుతున్నాయో యేమి చెప్పమంటావు?

స్వామీ! నీ అంగీకార సంకేతమైన కర్పూరతాంబూలమును నాచేతికి అందించరాదా! నీవు వచ్చినవాడవు వూరకనే వుండవు. మోవికప్పు అధరముపై దంతక్షతములేల చేతువు? ఓ కడపరాయా! నాకు పచ్చడము (పట్టువస్త్రమును) కప్పుము. ఇంత మన్ననకు పులకించిన నేను కప్పముగా నా వలపులనే నీకు సమర్పించెదను. అంతకన్నా సర్వేశ్వరుడవైన నీకు నేను యీయగలదేమున్నది?

స్వామీ! నాతో సురతిని గరిసించకు (తిరస్కరించకు). నేను వేరే సొమ్ములు (ఆభరణాలు) ధరించవలసిన అవసరం లేదు. నీయొక్క కరుణే నాకు సొమ్ములు. ఓ కడపరాయా! నీ ఆప్యాయతతో నా మనస్సును వెన్నలా కరిగించకు. ఎందుకంటే నీ బిగికౌగిలిని తలుచుకొంటే నాకు గరిడీ (మల్లయుద్ధము చేసే వ్యాయామ మంటపము) తలపుకు వస్తుంది.

ఓ కడపరాయా! నీ చాకచక్యంతో నన్ను ఇట్టే కౌగలించి చేరువవుతావు. కన్నెనైన నన్ను కలికిని చేసినావు. నీకు స్వాధీనపతికను. నీవే తిరుమల శ్రీవేంకటేశ్వరుడవై మాకు కలకాలము కలవు ప్రభూ!

**పద్యవివరణ:**

కం॥ **కంటిని మన్ననలెల్లా**
**గంటలు వాయింతువెంత కడపకు రాయా!**
**ఉంటివి వేంకటపతిగా**
**జంటై అలమేలుమంగ జనులను బ్రోవన్.**

సంఖ్య: I/498 రాగం : దేసాక్షి
కీర్తన : అంచితపుణ్యులకైతే హరి దైవ మవుఁగాక

## దేసాక్షి

42 **అంచితపుణ్యులకై తే హరి దైవ మవుఁగాక**
**పంచమహాపాతకులభ్రమ వాప వశమా ॥పల్లవి॥**

**కాననియజ్ఞానులకు కర్మమే దైవము**
**ఆనినబద్ధులకు దేహమే దైవము**
**మాననికాముకులకు మగువలే దైవము**
**పానిపట్టి వారివారిభ్రమ మాన్పవశమా ॥అంచి॥**

**యేమీ నెఱఁగనివారి కింద్రియములు దైవము**
**దోమటిసంసారి కూరదొర దైవము**
**తామసులకెల్లాను ధనమే దైవము**
**పామరుల బట్టినట్టిభ్రమఁ బాపవశమా ॥అంచి॥**

**ధర నహంకారులకు తాఁదానే దైవము**
**దరిద్రుఁడైనవానికి దాత దైవము**
**యిరవై మాకు శ్రీవేంకటేశుఁడే దైవము**
**పరులముంచినయట్టిభ్రమఁ బాపవశమా ॥అంచి॥ 498**

**ఉపోద్ఘాతము:**

అంచితపుణ్యులు అంటే పూజార్హులైన పుణ్యాత్ములు అని అర్థం. వారికైతే శ్రీహరియే దైవము. ఇకపోతే పంచమహాపాతకాలు చేసే పాతకులు (పాపాత్ములు) వున్నారే వారి భ్రమ పోగొట్టటం యెవ్వరితరము అంటున్నారు అన్నమయ్య. ఈ ప్రపంచంలో ఎవ్వరికెవరుదైవమో ఉటంకిస్తున్నారు ఆలకించండి. ఇదంతా ఒక పట్టికలాగా వివరిస్తే రసాస్వాదన సిద్ధించదు. దానిని వివరణతోపాటు చెప్పాలి. ఏది యేమయినా యెవరికెవరు దైవమయినా నాకు మాత్రం తిరుమల





శ్రీవేంకటేశ్వరుడే దైవము అంటున్నారు అన్నమయ్య. కానీ ఆ స్వామి కల్పించే భ్రమను వదలటం అంత తేలిక అనుకోకండి.

**తాత్పర్య వివరణ:**

అంచితపుణ్యులకు (పూజనీయులైన పుణ్యాత్ములకైతే) శ్రీహరియే దైవము, అవుగాక (అయివుండుట నిక్కమే) కానీ మనలో శ్రీహరిని నమ్మని పంచమహాపాతకులు కొందరున్నారు. అట్టి భ్రష్టుల భ్రమలను వాపవశమా (తొలగింప శక్యమా?)

సత్యాసత్యములను కానని (చూడలేని) అజ్ఞానులుంటారు. వారికి తమ దైనందిన కార్యక్రమము నిత్యకర్మలే దైవము. దేహ భోగములకు బద్ధులైన (కట్టుబడిన కొందరుంటారు. వారికి తమ దేహమే దైవము. కామ పీడితులైన కాముకులు కొందరుంటారు. వారికి స్త్రీలే దైవము. పానిపట్టి (పూనుకొని) వారి భ్రమలను తొలగించ సాధ్యమా?

ఏమీ తెలియని మూర్ఖులు కొందరుంటారు. వారికి తమ ఇంద్రియములే దైవము. దోమటి (కపటత్వంగల) సంసారికి వాళ్ళ ఊరిలోనున్న దొరగారే దైవము. తామసప్రవృత్తి కల నరులకు వారివద్దనున్న ధనమే దైవము. అటువంటి పామరులు అనేక భ్రమలకు లొంగిపోతుంటారు. వారి భ్రమలను బాపవశమా (వదలించుట సాధ్యమయ్యే పనియేనా?)

ఈ ప్రపంచంలో అహంకారులకు తమరికి తామే దైవము. దరిద్రుడైనవాడు ఏ దాత దొరుకుతాడా తన దరిద్రం పోగొడతాడా అని యెదురుచూస్తాడు. కాబట్టి వాడికి దాతయే దైవము. ఎవరికెవరు దైవమైతే మాకేమిటి మాకు మాత్రం తిరుమలాధిపుడైన శ్రీవేంకటేశ్వరుడె దైవము. ప్రతివాడూ భ్రమలో వున్నా, ఆ సత్యం అంగీకరించడు. అటువంటివారి భ్రమ బాపవశమా?

**పద్యవివరణ:**

కం॥ **అంచిత పుణ్యులకున్ "హరి"**
**పొంచిన సంసారులకును పూరి దొరయునున్**
**యెంచగ దైవంబనెదరు**
**పంచమహాపాతకులకు భ్రమవోయీనా?**

సంఖ్య: XVIII/230 రాగం : బౌళి
కీర్తన : చూడ బిన్నవాడు గాని జూటదనాలు తనవి

**బౌళి**

**43 చూడఁ బిన్నవాఁడు గాని జూటుఁదనాలు తనవి**
**యేడఁజూచినాఁ దానే యేమని చెప్పుదునే ॥పల్లవి॥**

**దొంగాడుఁ గృష్ణుఁడు తొయ్యలుల మొగములు**
**తొంగిచూచీ ముంగురులు దూలాడఁగా**
**ముంగిట ముద్దులువెట్టి మోవితేనె లానుకొంటా**
**యెంగిలిసేసీ నిదె యిందరి నొక్కమాఁటె ॥చూడఁ॥**

**వెన్న ముద్దకృష్ణుఁడు వేడుకతో జవరాండ్ల-**
**చన్నులంటి సారె సారె సాము సేసీని**
**చిన్ని చేతు లటుచాఁచి సిగ్గులురేఁచి చెనకి**
**సన్నలుసేసి పిలిచి సరసములాడీని ॥చూడఁ॥**

**వుద్దగిరికృష్ణుఁడు వొడివట్టి మానినుల**
**అద్దుకొని కాఁగిలించి ఆసలురేఁచీ**
**వొద్దిక శ్రీవేంకటాద్రి నొనగూడి మాచేఁతలు**
**సుద్దులుగాఁ జెప్పి చెప్పి సొలసి నవ్వీనే ॥చూడఁ॥ 230**

**ఉపోద్ఘాతము:**

ఉద్దగిరిలో నెలకొన్న వెన్నముద్ద కృష్ణునిపై చిలిపి శృంగార కీర్తన నాలకించండి. ఇక్కడ పాడేది ఒక గోపిక కాబట్టి ఆ కృష్ణపీడిత గోపిక అన్నమయ్యే. ఓయమ్మో! ఈ ఉద్దగిరి కృష్ణుడు చూడటానికి పిల్లవాడు కానీ జాటుతనములోమాత్రము యెక్కడ చూచినా తానే అన్నట్లుగా యెంత తిప్పలు పెట్టాడమ్మా! ఏమని చెప్పుదుమమ్మా? నడి వాకిట్లో ముద్దులు పెట్టి మోవి





తేనెలారగించి అందరు గోపాంగనలను ఒక్కమాటే యెంగిలి చేశాడు. సైగలు చేసి పిలిచి సరసములాడతాడు. కౌగిళ్ళలో కరగించి కమ్మని ఆశలు రేపుతాడు. కానీ నేడు తిరుమలేశ్వరుడై ఆనాటి జ్ఞాపకాలకు నవ్వుల నొలకిస్తున్నాడు.

**తాత్పర్య వివరణ:**

ఓ చెలియలారా! యేమని చెప్పుదునే? (చెప్పమన్నారే!) ఏడ జూచినా దానే అయి (ఎక్కడ చూచినా తానే వున్నట్లు) ఎన్ని తుంటరి పనులు చేస్తున్నాడో చూడండి. చూడటానికి మాత్రం చిన్నపిల్లవాడే కాని జాటుదనాల (మోసగించటంలో) మొనగాడు.

దొంగ పిల్లవాడైన ఈ కృష్ణుడు కన్నెపిల్లల మొగములో మొగము పెట్టి తొంగి చూచి వాళ్ళముంగురులు దూలాడగా (యెగురుతుంటే) ఏమిచేస్తాడో తెలుసా? నట్టింట్లో ముద్దులు పెట్టి వారి మోవి తేనెలు జుఱ్ఱుకొంటాడు. ఒక్కదాన్నీ వదలకుండా ఒక్కమాటే అందరి పెదవులను యెంగిలి చేస్తాడు. ఎంత గడుగ్గాయో యేమని చెప్పమంటారు?

నిత్యమూ వెన్నముద్దలఆరగించే ఈ కొంటె కృష్ణుడు వేడుకతో జవరాంద్ర స్తనయుగ్మములను మాటిమాటికి అంటుకొంటూ అదే పనిగా అల్లరిపెడతాడు. తన చిన్ని చిన్ని చేతులను చాచి వాళ్ళని చెనకి (ఆ చేతులతో నొక్కి) సిగ్గులు రేపుతాడు. ఇంకా ఏమి వివరంగా చెప్పమంటారమ్మా!

ఈ ఉద్దగిరి కృష్ణుడు ఒడిసి పట్టుకొని యౌవనవతులను హత్తుకొని గుచ్చి కౌగలించుకొంటాడు. అంతులేని ఆశలలో తలమునకలు జేస్తాడు. కాని నేడు వొద్దికతో (అనుకూలుడై) శ్రీవేంకటాద్రి నొనగూడి ఆ కొంటెపనులన్నీ కథలు కథలుగా చెప్పి అలసిపోయేట్లు నవ్వుతాడు.

**పద్యవివరణ:**

ఉ॥ **చూడగ బిన్నవాడు పలు జూటదనంబుల సిద్ధహస్తుడున్**
**యేడను జూచినా యతడె యేమని చెప్పెద భామలార! ఈ**
**వేడుకకాడు వుద్దగిరి వెన్నలముద్దల దొంగకృష్ణుడై -**
**నాడిటు వేంకటేశునిగ నవ్వునుతల్చుచు నాటి సుద్దులన్**

సంఖ్య: I/479 రాగం : ముఖారి

కీర్తన : కంటే సులభమిది, కానకయుంటే దుర్లభ

**ముఖారి**

**44 కంటే సులభ మిది; కానక యుంటే దుర్లభ; -**
**మింటిలోననే వున్న దిహముఁ బరమును ||పల్లవి||**

**హరిదాసులు మెట్టినక్కడే పరమపద-**
**మరయ నిందుకంటె నవల లేదు**
**తిరమై వీరిపాదతీర్థమే విరజానది**
**సొరిది నన్ని చోట్లు చూచినట్టే వున్నది ||కంటే||**

**మచ్చిక వైష్ణవుల మాటలెల్లా వేదములు**
**యిచ్చుల నిందుకంటే నింక లేదు**
**అచ్చట వీరిప్రసాద మమృతపానములు**
**అచ్చమై తెలిసేవారి కఱచేత నున్నది ||కంటే||**

**చెలఁగి ప్రపన్నుల సేవే విజ్ఞానము**
**ఫల మిందుకంటే మఱి పైపై లేదు**
**తలఁప శ్రీవేంకటేశుదాసులే యాతనిరూపు -**
**లెలమి నెదుట నున్నా రెఱిఁగినవారికి ||కంటే|| 479**

**ఉపోద్ఘాతము:**

వైష్ణవ మత గురువుల సేవాభాగ్యం బెట్లుండునో ఈ కీర్తనలో వివరిస్తున్నారు అన్నమయ్య. ఇహము పరము మన ఇంటిలోనే వున్నవయ్యా! అంటున్నారు. అయితే మన ఇల్లు మనకు తెలియదా? అవి ఇంట్లో యెక్కడున్నాయంటారు అనుకొంటారు. ఇది సత్యమే. చక్కగా విశ్లేషించి కంటే అతి సులభంగా తెలుస్తుంది. కానకయుంటే ఇదే దుర్లభముగా వుంటుంది, అంటున్నారు. ఎక్కడైతే హరిదాసులు కాలుపెడతారో అక్కడే పరమపదము వున్నది. దీనిని మించిన పుణ్యస్థలము అవతల మరొకటి లేదు. వీరి పాద తీర్థమున్నది చూశారా... అది వైకుంఠంలో ప్రవహించే విరజానది అంత





పావనమైనది. కాని ఈ నది అన్ని చోట్లా చూచినట్లే వుంటుంది అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ జనులారా! ఇది (ఈ విషయం) కంటే (పరిశీలించి చూస్తే) చాలా సులభము. కానకుంటే ఇదే కడు దుర్లభమైనది. ఏమిటది? మనం అనుభవిస్తున్న ఇహము, మన మరణం తరువాత పొందబోయే పరము, ఈ రెండూ యెక్కడో లేవు మన ఇంటిలోనే వున్నవి సుమా!

హరిదాసులు మెట్టినక్కడే (ఎక్కడ అడుగు పెడతారో అక్కడే) పరమపదమ (వైకుంఠం) వుంటుంది. మళ్ళీ ఇంతకు మించి అవతల మరేమి లేదు. సుస్థిరమైన వీరి పాద తీర్థము వైకుంఠంలో ప్రవహించే విరజానది అంత పవిత్రమైనది. అయితే విరజానది కేవలం వైకుంఠంలో వున్నది. కానీ వీరి పాదతీర్థం యెక్కడైనా దొరుకుతుంది.

వైష్ణవ గురుపుంగవులున్నారే మచ్చికతో (ప్రేమగా) వారు చేసే బోధనలన్నీ మాటలు కాదు వేదమంత్రములు. ఇచ్చట (ఇహలోకములో) ఇందుకంటే (వీరి బోధల కన్నా) ఇంక (ఇంకొక ముక్తి మార్గము) లేదు. అమృతము తాగితే అమరత్వం సిద్ధిస్తుందట. అంత శ్రమ పడవలసిన పనిలేదు. వీరిచ్చే భగవత్ ప్రసాదము మన బోంట్లకు అమృత పానమువలె అమరత్వం సిద్ధింపజేస్తుంది. దాని కోసం మనం సాగరమథనం చేయనక్కరలేదు. స్వచ్ఛమైన జ్ఞానం నేర్చినవారి ఆ అమృతం అరచేతిలోనే వున్నది.

ప్రపన్నుల (భగవంతునియందు శరణాగతితో వున్నవారి) చెలగి (అతిశయించిన) సేవయే విజ్ఞానదాయకము. ఇందుకంటే ఫలము (వారి సేవ కంటే ఫలప్రదమైన మార్గము మరి పైపైలోకాలలో కూడా లేదు. శ్రీవేంకటేశుని దాసులందరూ ఆ శ్రీహరి రూపులే. దీనినెఱిగిన వారికి, ఎలమి (అతిశయించిన) మోక్షం యెదుటనే వున్నది.

**పద్యవివరణ:**

కం|| **సులభంబిది కంటే మరి**
**తెలియన్ కడు దుర్లభంబు తేకువ కనకన్**
**కలదిందులోనె ఇహమున్**
**విలసిల్లును పరముకూడ వేంకటనాథా!**

సంఖ్య: XIX/30 రాగం : రామక్రియ
కీర్తన : వట్టిబాతిపడి నీపై వలపులు చల్లేముగాక

**రామక్రియ**

**45 వట్టిబాఁతిపడి నీపై వలపులు చల్లేముగాక**
**యిట్టయితే మరియిఁక నేమిచెప్పేదయ్యా** ॥పల్లవి॥

**కాంతను నాయెదుటనె కాఁగలించుకొంటివి**
**పంతములాడఁగ నిఁకఁ బనియేది**
**వింతలుగా సిగ్గులెల్లా విడిచినమీఁదట**
**యెంతకొసరినా నందు నేమిగలదయ్యా** ॥వట్టి॥

**నావద్దనుండి యాకెతో నవ్వులు నవ్వితివి**
**భావించి చూచిన విఁకఁ బనియేది**
**వేవేలకు మతిలోనివెరపు దీరినమీఁద**
**చేవమీరినసుద్దులు చెప్పఁ జోటేదయ్యా** ॥వట్టి॥

**చలివాసి యాకెతోనే సరసములాడితివి**
**పలుమారుఁ బచ్చిసేయఁ బనియేది**
**అలమేల్మంగనైన న న్నట్టె యేలితివి**
**యెలమి శ్రీవేంకటేశ యెట్టు మెచ్చేదయ్యా** ॥వట్టి॥ **30**

**ఉపోద్ఘాతము:**

భ్రాంతి అనే పదానికి వికృతి "బాతి". అమ్మవారు స్వామితో అంటున్నది; "మేమేదో నిన్ను మా స్వంత చేసికొనవలెననే వ్యర్థమైన భ్రాంతి పడుతుంటాము, నీపై వలపులు చల్లి వశపరచుకోవాలనుకొంటాము. కానీ నీవు వలపుకి లొంగవు. ఇట్లయితే ఇక మరి ఏమి చెప్పేదయ్యా!" అన్నమయ్య అద్భుత సృష్టిని ఆస్వాదించండి. ఆ కాంతను నా యెదుటనే కౌగలించుకొంటివి. సిగ్గులెల్లా విడిచితివి. నేను యెదుటనేవున్నా ఆమెతో అదే





పనిగా నవ్వులు. ఇదేమి పద్ధతి. మనస్సులో బయంలేనివారు ఎన్ని మాయమాటలైనా చెబుతారు. సిగ్గు బిడియం వదలి, ఆమెతో సరసములాడుతున్నావు. కానీ నీవు శ్రీవేంకటేశ్వరుడవు. అలమేల్మంగనైన నన్ను ఇట్టే కరిగించివేస్తావు.

**తాత్పర్య వివరణ:**

ప్రభూ! మేము వట్టిబాతిపడి (వ్యర్థమైన భ్రాంతిజెంది) నీపై వలపులు చల్లేము (ప్రేమలు కుమ్మరిస్తుంటాము). కానీ అది యెంత నిరుపయోగమైన ప్రయత్నం? ఇట్లయితే ఇక మరి నీకు యేమి చెప్పేదయ్యా!

ఆ వనితను నాయెదుటనే కౌగలించుకొంటివి. ఇంకా నీతో పంతమునకు పోయి నేను సాధించేదేమిటి? వింతగా లోకాధిపతే సిగ్గుయెగ్గూ విడనాడితే మేము చేయగలిగిందేముంటుంది? యెంత కొసరినా (కసురుకొనినా) నీవేమైనా మారేదివుంటుందా? ఇంకా అందు ఏమిగలదయ్యా? (ఇంకా అందులో ప్రయత్నించవలసిందేముంటుంది?)

స్వామీ! ఇదేమన్నా బాగున్నదా? నావద్దనే వుండి యాకెతో (ఆమెతో) నవ్వులు కుమ్మరిస్తున్నావు. ఇంకా నేను భావించవలసిన (అనుమానించాల్సిన) పనేమున్నది. అంతా స్పష్టమే. వేవేలకు (ఏ తరుణములోనైనా) మనస్సులో భయమూ, సంకోచము వదలివేసిన వాడికి చేవమీరిన సుద్దులు (నిరుపయోగ మైన నీతులు) చెప్పినందువల్ల కంఠశోషే కానీ లాభమేముంటుంది?

ఓ శ్రీవేంకటేశ్వరా! చలివాసి (బిడియమును వదలిపెట్టి) నాయెదుటనే ఆమెతో సరసములాడితివి. ఇక నీతో పచ్చికొట్టి ఎవరైనా చేసేదేముంది? ప్రభూ! ఇంతకీ నేనెవరిననుకొన్నావు? నేను అలిమేలుమంగను. నన్నట్టే (లాఘవముగా) యేలితివి. నిన్ను ఏమని పొగుడుదునయ్యా?

**పద్యవివరణ:**

ఆ.వె॥ **ఇట్టె "బాతి" పడితి వలపుల జల్లితి**
**వేటి వశముగావు వేంకటేశ!**
**ఇట్లనైతే మరికనేమి చెప్పేదయ్యా!**
**నేను నీదు సతిని నిలిచి కనుము.**

సంఖ్య: I/472 రాగం : గుండక్రియ
కీర్తన : ఎవ్వరివాడో యెఱగరాదు

## గుండక్రియ

**46 ఎవ్వరివాఁడో యెఱఁగరాదు**
**అవ్వలివ్వలిజీవుఁ డాటలో పతిమే** ||పల్లవి||

**ధర జనించక తొలుత తనుఁ గానరాదు**
**మరణమందినవెనక మఱి కానరాదు**
**వురువడి దేహముతో నుండినయన్నాళ్లే**
**మరలుజీవునిబదుకు మాయవో చూడ** ||ఎవ్వ||

**యిహములో భోగించు నిందుఁ గొన్నాళ్లు**
**మహిమ పరలోకమున మలయుఁ గొన్నాళ్లు**
**తహతహలఁ గర్మబంధములఁ దగిలినయపుడే**
**అహహ దేహికిఁ బడుచులాటవో బదుకు** ||ఎవ్వ||

**సంతానరూపమై సాగు ముందరికి**
**కొంత వెనకటిఫలము గుడువఁ దాఁ దిరుగు**
**యింతటికి శ్రీ వేంకటేశుఁ దంతర్యామి**
**బంతి నితనిఁగన్నబదుకువో బదుకు** ||ఎవ్వ|| **472**

**ఉపోద్ఘాతము:**

ఈ జీవుడు ఎన్నటివాడో చెప్పలేము. ఇక నూరేళ్ళు మించి జీవించ నసాధ్యమైన మానవ దేహంతో వీడు యెన్ని జన్మలు పొందాడో ఆయా జన్మలలో ఎవరికి పుట్టాడో యెఱుగుట సాధ్యమా? వాడు చచ్చాక యేమి జరుగుతుందో, యెక్కడికి వెళతాడో, అదీ చెప్పలేము. ఇవ్వల భూలోకంలోనూ, అవ్వల పరలోకంలోనూ వాడి పూర్వాపరాలు తెలిసినవారెవరూ లేరు. వాడి జీవిత కాలమంతా ఆటలో ప్రతిమలాగే





నిమిత్తమాత్రంగా వుంటాడు, అంటున్నారు అన్నమయ్య. మళ్ళీ వాడి సంతానం యొక్క సంతతిలాగా వాడే పుడుతుంటాడు, చస్తుంటాడు అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

జీవుడు గతజన్మలో చేసిన పాపపుణ్యములను అనుభవించుటకు మరల జన్మనెత్తక తప్పదు. ఈ జన్మల చక్రభ్రమణంలో ఎందరో తల్లిదండ్రులు తోబుట్టువులు సతీసుతులు మారుతుంటారు. ఈ జన్మలో తల్లి వచ్చే జన్మలో తన అన్న అవవచ్చును. కాబట్టి ఈ జీవుడు ఎవ్వరివాడో ఎఱుగరాదు (తెలియలేము). అవ్వల (పరలోకంలో) ఇవ్వల (ఇహలోకంలో) జీవుడు కేవలం ఆటలో పతిమ (నాటకంలో ఒక పక్క నిలబెట్టిన విగ్రహం వంటి నిమిత్తమాత్రుడు).

వీడు పుట్టుక పూర్వం గోచరించడు. చచ్చిన వెనుక కనబడడు. ఉరువడి (నెఱవేరి) తను ఒక దేహంలో వున్నన్నాళ్ళే వాడి వునికి. ఇట్లా మారిపోయే జీవుడి బ్రతుకు మాయకాకపోతే మరేమిటి? ఇది మాయ చూడగా మాయయే.

ఈ ఇహలోకంలో జీవించియుండగా కొన్నాళ్ళు, భోగాలూ అనుభవిస్తాడు. పరలోకంలో ఆనందం కొంతకాలం అనుభవిస్తాడు. దేహంతో వున్నప్పుడు మాత్రమే తహతహలాడే కర్మబంధములలో తగులుకొని ఆటలన్నీ ఆడతాడు. అహహ! ఈ దేహికి పడుచువాళ్ళతో సయ్యాటలతోనే బతుకు వెళ్లమారుతుంది. ప్రతి జన్మలోనూ వీడి (ఈ జీవుడి) గతి ఇంతే.

ఇకపోతే చచ్చాక కూడా వీడి ఆత్మకు భ్రమలు ఆశలూ పోకపోతే తన పుణ్యమే ఖర్చుపెట్టుకొని సంతానరూపంలో తన వారికే జన్మిస్తాడు. మళ్ళీ ఆ జన్మ అలా ముందరికి సాగుతూనే వుంటుంది. కానీ వెనకటి జన్మలో చేసిన కర్మ ఫలం అనుభవించటానికి ఈ మరుజన్మలో ఉరుకులు పరుగులు పెడుతూనే వుంటాడు కానీ తన అంతర్యామిగా శ్రీవేంకటేశ్వరుడు ఉన్నాడని గ్రహించడు. ఈ బ్రతుకుల వరుసలో ఆయనను తెలిసినప్పుడే బ్రతుకు పండుతుంది.

**పద్యవివరణ:**

చం|| **తెలియగలేము జీవుడటుతేకొని యెవ్వరివాడొ ఈ భువిన్**
**అలయక జీవుడౌ పతిమ ఆటలనేపుగ అవ్వలివ్వలన్**
**తొలుతను జన్మముందతడు తోపడు చచ్చిన వెన్కయుండునా**
**కలుగును వున్నదేహమున కప్పిన పిమ్మట వేంకటేశ్వరా!**

సంఖ్య: XVII/66 రాగం : కొండమలహరి
కీర్తన : ఇద్దరి మీజగడాలు యింక మాకు పనిగాదు

## కొండమలహరి

47 **ఇద్దరి మీజగడాలు యింక మాకు పనిగాదు**
**తిద్దలేము నిను నాపె తిట్టుకుండేనా** ||పల్లవి||

**పెట్టరాని యానలెల్లాఁ బెట్టుకొని వచ్చితివి**
**యిట్టె కలసెనని యింతి తోడను**
**చుట్టి చుట్టి చెలులతో జూజమీద నాడేవు**
**రట్టు సేయ నీడ కాపె ఇట్టె రాకుండేనా** ||ఇద్దరి||

**చెప్పరాని యాకతాలు చెప్పితి వంతటిలోన**
**యిప్పుడువచ్చెనని యింతి తోడను**
**అప్పటి వసంతమాడే వతివలతోడ నీడ**
**చొప్పు లాపె మేడలెక్కి చూడకుండేనా** ||ఇద్దరి||

**అక్కఁర గాఁపురమెల్ల అండఁబెట్టి వచ్చితివి**
**యిక్కడనే వుండెనని యింతి తోడను**
**యిక్కువ శ్రీవేంకటేశ యేమి దలఁచోయీపెను**
**మిక్కుటమై కూడితివి మెచ్చకుండేనా** ||ఇద్దరి|| 66

**ఉపోద్ఘాతము:**

తాళ్ళపాక పెదతిరుమలాచార్యులవారు తన తండ్రి అన్నమాచార్యులవారి బాణీలో చెప్పిన సరస శృంగార కీర్తన ఇది. ఆయన తను అమ్మవారి చెలికత్తెగా భావిస్తూ చెబుతున్నారు. ఓ శ్రీవేంకటేశ్వరా! మీ ఇద్దరి జగడాలు యెప్పుడూ వుండేవే. వాటితో మాకు పనిలేదు. మీ ఇద్దరినీ సరిదిద్దలేమయ్యా! నీవు చేసే పనులు మాత్రం తక్కువైనవా? ఆమె నిన్ను తిట్టిందంటే, తిట్టకుండా





యెట్లావుంటుంది? నీవు చేసే పనులెలా వున్నాయి ఒక్కసారి ఆలోచించు. అక్కడ నీవు వనితలతో వసంతములాడుతుంటే ఆ దేవి తన మేడయెక్కి చూసింది. అక్కడ వైకుంఠంలో కాపురం వదిలిపెట్టినవాడివి ఇక్కడ చేయటం మానేసేవా? లేదే. శ్రీవేంకటేశ్వరా! నీవీమెను కూడితివికదా!

**తాత్పర్య వివరణ:**

ఓ శ్రీవేంకటేశ్వరా! మీ ఇద్దరి జగడాలు (పోట్లాటలు) ఇక మాకు పని లేదు. మీరు ఎంత పోట్లాడుకున్నా మేము తిద్దలేము (సరిదిద్దలేము). నిన్ను ఆమె తిట్టిందంటే తిట్టదూ.

ప్రభూ! పెట్టుకోకూడని ఆనలు (ఒట్లు) పెట్టుకొని ఆమె దగ్గరకు వచ్చావు. ఆమెయేమో కరిగిపోయి నిన్నిట్టే కలిసినది. ఇంతలో చుట్టి చుట్టి తిరిగి నీ చెలులతో జాజమీద (వసంతకేళి) ఆడుతూనే వున్నావు. ఆమె నీడలోకి ఇట్లా వచ్చిందో లేదో మీ గుట్టు రట్టయ్యింది. ఆమె రానేరాదని ఎలా అనుకొన్నావయ్యా?

అంతలోనే చెప్పరాని యాకతాయి (చెప్పనలవికాని కారణాలు) చెప్పితివి. పైగా ఇప్పుడే వస్తానని ఆవిడతో చెప్పావు. ఇక్కడికి వచ్చి అతివలతో అప్పటి (ఇది వరకు మాదిరిగానే) వసంతములాడుతున్నావు. నీవింత చేస్తుంటే నీ సంగతి తెలిసిన నీ దేవేరి మేడయెక్కి నీవు చేసే నిర్వాకం చూడకుండా వుంటుందా, ప్రభూ!

అక్కడ వైకుంఠంలో నీకాపురమెల్లా అక్కడే పెట్టేసి భూలోకానికి వచ్చేశావు. ఇక్కడనేవుండిపోతానని ఈ పద్మావతిని మాయజేశావు. ఓ శ్రీవేంకటేశ్వరా! ఏలీల ఆలోచించినావో కానీ ఆమెతో మిక్కుటముగా రతిలో గూడితివి. ఆమె మెచ్చక ఎలా వుంటుంది?

**పద్యవివరణ:**

కం|| **ఇద్దరి మీ జగడాలను**
**వద్దనివారించమాకు పనియేమయ్యా?**
**తిద్దగలేకే తిట్టెను**
**కద్దనె పెదతిరుమలయ్య కాంతుని చెనకెన్.**

సంఖ్య: X/15 రాగం : గుజ్జరి
కీర్తన : చంచల మతులకు తెలియునె సాత్త్విక ధర్మములు

**గుజ్జరి**

**48 చంచలమతులకుఁ దెలియునె సాత్త్వికధర్మములు**
**మంచమునీడవలె బహుమార్గములై తోఁచున్ ||పల్లవి||**

**తీపుల అల్పపుచదువుల తెలివేలా కలుగు**
**కాపై మిడుఁగురుఁబురువులఁ గడచునె చీఁకట్లు**
**పైపై ప్రాకృతద్రిష్టికి పర మేలా కలుగు**
**పాపము కనుమాయలవలె భ్రమయించుఁ గాక ||చంచ||**

**కొద్దెరఁగని జడునికి సద్గుణ మేలా కలుగూ**
**అద్దము చిలు ముబ్బినక్రియ అజ్ఞానము వొడమున్**
**నిద్దము కామాతురునకు నిజ మేలా తెలియూ**
**వద్దనె యండమావులవలెఁ దోఁచుఁ గాక ||చంచ||**

**అనువుగ నక్షయపుణ్యము అది యేలా చెడును**
**పెనఁగెటి తనవీడవలెనె పెడవాయదు యెపుడు**
**ఘనుఁడగుజీవుఁడు శ్రీవెంకటనాథునిఁ గని (నె?) నా**
**పనివడి రత్నము సానఁబట్టినగతిఁ జెలఁగున్ ||చంచ|| 15**

**ఉపోద్ఘాతము:**

అధ్యాత్మ కీర్తనలు చెప్పటంలో తాళ్ళపాక వారే వుద్దండులనటంలో సందేహం లేదు. చినతిరుమలయ్య తన తాత అన్నమయ్యకు సమవుజ్జీ అని దీనిని చదివిన తరువాత మీకే అర్ధమవుతుంది. పెద్ద వటవృక్షపు నీడలాగ, మంచముపైనుండి వచ్చే నీడ స్థిరంగా వుంటుందా? అది బహుముఖంగా వుంటుంది. అట్లాగే చంచల స్వభావం కలవారు సాత్వికులు కాలేరు వారి మనస్సు అస్థిరంగానే వుంటుంది అంటున్నారు. దాన్ని నిరూపించుటకు అద్భుతమైన పోలికలను చెబుతున్నారు. ఘనుడైన





జీవుడు శ్రీ వేంకటేశ్వరుని దర్శించగానే రత్నమును సానబట్టి నట్లు మిలమిల మెరిసిపోతాడు, అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

సత్త్వగుణప్రధానులైన సాత్వికులకు సాత్వికధర్మము అవగతమవుతుంది. చంచలమైన మనస్సు కలవారికి యెన్నటికీ సాత్విక ధర్మము తెలియదు. ఎట్లాగంటే... మంచముపైనుంచి పడే నీడ అనుక్షణం మారిపోతూ బహుమార్గములై మనకు నిరుపయోగం కదా!

తీపుల (యాతనబడు) అల్పబుద్ధులైనవారు యెంత చదివినా వారికి తెలివేలకలుగు (జ్ఞానము యెలా కలుగుతుంది?) కాపై (రక్షణకై) చీకటి పోవాలంటే మిణుగురుపురుగుల కాంతి, ఆ పని చేయగలదా? పైపై వ్యవహారముగా కేవలం ప్రాకృత దృక్పథంకల సామాన్యులకు పరము (పరలోక సుఖము) దక్కుతుందా? పాపులు మాయలోనేపడి కొట్టుమిట్టాడుతుంటారు. వారి భ్రమలు యెన్నటికీ తొలగవు.

కొద్దెరగని (మితినెరగని) జడునికి (మందబుద్ధికి) మంచి గుణము యెలా కలుగుతుంది చెప్పండి? చిలుము పట్టిన అద్దములో ప్రతిబింబం సరిగా వుంటుందా? నిద్దపు (చేరువకాగోరే) కామాతురునికి నిజము తెలుసుకొనే ఓపిక వుంటుందా? ఎందమావులు మన యెదురుగా వున్నట్లే భ్రాంతి కలుగదా చెప్పండి.

మనం చేసికొనిన అక్షయ పుణ్యము (తరగని పుణ్యము) యేనాటికీ చెడక నిరంతరం మనవెంటనే వుంటుంది. అది పెనగేటి (వెంటాడే) నీడవలె యెన్నడూ విడిచిపెట్టదు. ఘనుడైన జీవుడు శ్రీవేంకటేశ్వరుని దర్శించగానే రత్నమునకు సానబట్టినట్లు మిలమిలా మెఱసి పోతుంటాడు.

**పద్యవివరణ:**

కం|| **చంచల మతులకు దెలియునె**
**యెంచిన సాత్వికపు ధర్మమెవ్విధినైనన్**
**మంచపునీడైతోచును**
**మించెను చినతిరుమలయ్య మేలుగ తాతన్.**

సంఖ్య: I/476 రాగం : ముఖారి
కీర్తన : దైవముపుట్టించినట్టితనసహజమే కాక

**ముఖారి**

**49** దైవముపుట్టించినట్టి తన సహజమే కాక
కోవిధునికైనా జాలిగుణమేల విడుచు ||పల్లవి||

అరయఁ బంచదార నద్దుక తినఁబోతే
చేరరానిముష్టిగింజ చేఁదేల మాను
సారమైనచదువులు సారె సారెఁ జదివినా
గోరపుదుష్టునికి కోపమేల మాను ||దైవ||

నిప్పు దెచ్చి వొడిలోన నియమానఁ బెట్టుకొంటే
యెప్పుడును రాఁజుఁగాక యిది యేల మాను
ముప్పిరిఁ బాతకుఁడైనమూఢుఁ డెన్ని యాచారాలు
తప్పు కెంతసేసినాను దయ యేల కలుగు ||దైవ||

యింటిలోనఁ గొక్కు దెచ్చి యిరవుగఁ బెట్టుకొంటే
దంటయై గోడలు వడఁదవ్వ కేలమాను
గొంటరై శ్రీవేంకటేశుఁ గొలువకుండినవాఁడు
తొంటిసంసా రవుఁగాక దొర యేఁటి కౌను ||దైవ|| **476**

**ఉపోద్ఘాతము:**

"పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకతోగాని పోదు" అంటారు పెద్దలు. దేవుడు పుట్టించినప్పుడు తనకు సంక్రమించిన సహజగుణం వారి జీవితాంతం పోదు. అన్నీ తెలిసిన పండితునికి జాలిగుణము యొక్క ఆవశ్యకత తెలియదా? దానిని విడిచిపెట్టి చెడిపొమ్మంటే, వాడు చెడిపోతాడా అంటున్నారు అన్నమయ్య. పంచదార అద్దుకొని తింటే ముష్ఠిగింజ చేదురుచిని విడిచిపెడుతుందా. చదువుకొన్నంతమాత్రాన దుష్టుడు కోపమును వదిలేస్తాడా? నిప్పును ఒళ్ళో పెట్టుకుంటే కాలదా? ఒక పాపి మూర్ఖుడైతే ఏం చేసినా వాడికి జాలి





కలుగుతుందా? పందికొక్కును తెచ్చి పెంచుకొంటే మట్టిగోడల్లో బొరియలు చేయదా? వేంకటేశుని కొలవనివాడికి సంసారిగా రోదిస్తాడు కాని దొరవంటి యోగి యెలా అవుతాడు?

**తాత్పర్య వివరణ:**

దేవుడు మనని పుట్టించినప్పుడు మన పూర్వ జన్మల సుకృతమునుబట్టి కొన్ని జన్మతః సహజ గుణాలు కలుగుతాయి. కోవిదుడు (పండితుడు) తన జాలిగుణముతో పరులకు మేలు చేస్తూనే వుంటాడు. తన మంచితనం మానుకొమ్మంటే మానుకొంటాడా?

ముష్టిగింజ అని తినుటకు వుపయోగించని 'గింజ' ఒకటున్నది. అది తినబోతే చేరరాదు (తినుటకు చేదై, నిరుపయోగమైనది). దానిని ఎలాగైనా తినాలని పంచదారను అద్దుకొని తింటే ఏమన్నా లాభమా? ఘోరమైన దుష్టునికి కోపము వుంటే (క్రోధ స్వభావం కలవాడైతే,) సారమైన చదువులు (ఉన్నత విద్యలు) సారెసారె చదివినా (అనేకము చదివినా) దండుగే కదా!

నిప్పును తెచ్చుకొని ఒడిలోబెట్టుకొంటే కొంతసేపయ్యాక ఒళ్ళంతా కాలిపోదా? పాపం నన్ను జాగ్రత్తగా దాచుకొన్నాడని యెప్పుడైన రాజుకోక (నిప్పు అంటుకొని వ్యాపించక) ఎందుకు మానుతుంది? పాతకుడైన (పాపములు చేసే) మూర్ఖుడు (మూఢమతి) విడువకుండా యెన్ని ఆచారాలు పాటించినా దయగలవాడవుతాడా? ఎన్నటికీ కాదు.

మన ఇంట్లో కొక్కు (పందికొక్కు) ఒకటుంది అనుకోండి. దాన్ని ప్రేమగా చూచుకొని ఇంట్లో తిరుగనిస్తే దంటయై (దిట్టంగా) గోడలు తవ్వి బొక్కలు చేయకుండా వుంటుందా? గొంటరై (కుత్సితుడై) శ్రీవేంకటేశ్వరుని ఆరాధింపనని ఎన్నడూ కొలువనివాడు సంసారబంధాలలో చిక్కుకొని సతమతమవుతాడు, వాడు తొంటి సంసారి (మొట్టమొదటి సంసారి) అవుతాడు కాని, దొర (ముక్తుడు) ఎలా అవుతాడు?

**పద్యవివరణ:**

ఉ|| **దైవము పుట్టుకిచ్చెనని తానెటు మానును పుట్టు బుద్ధులన్**
**కోవిదుకైన అబ్బుదురకూడుచు జాలిగుణంబు యెన్నడున్**
**శ్రీవనితా మనోవిభుడ! శీఘ్రమె 'కొక్కు'ను తెచ్చి పెంచినన్**
**ఆవలమానునా సహజమైన గుణంబును గోడదవ్వదా?**

సంఖ్య: XIX/533 రాగం : శుద్ధవసంతం
కీర్తన : ఇన్నేసివావులతో నిందరిపాలగలిగె

### శుద్ధవసంతం

**50 ఇన్నేసివావులతో నిందరిపాలఁ గలిగె**
**పిన్నపెద్ద మేలుసేసీ పెంచరే యీబాలుని ॥పల్లవి॥**

**నరకాసురునితండ్రి నడురేయి జనియించె**
**అరుదుగఁ గంసుని కల్లుఁడాయను**
**నిరతి శిశుపాలునినెయ్యపుమఱఁది వుట్టె**
**పెరుగఁగా మేలుసేసీ పెంచరే యీబాలుని ॥ఇన్నే॥**

**వొద్దిక పాండవులకు నుదయించె మేనబావ**
**బుద్ధితో వసుదేవునిపుత్రుఁ డాయను**
**వుద్దండపుగొల్లెతల కొగి మగఁడు గలిగె**
**పెద్దవాఁడై మేలుసేసీ పెంచరే యీబాలుని ॥ఇన్నే॥**

**నేరనిదుష్టులకెల్లా నిందుచిచ్చురపిడుగు**
**నేరిచినశిష్టులకు నిధానము**
**యీరీతి శ్రీవేంకటేశుఁ డితఁడె బాలకృష్ణుఁడు**
**పేరడిగా మేలుసేసీ పెంచరే యీబాలుని ॥ఇన్నే॥ 533**

**ఉపోద్ఘాతము:**

ఈ బాలుడున్నాడు చూశారా! వీడికి ఇన్నిన్ని వావులు (బంధుత్వపు వరుస) వుండటం వలన ఈయన రాక్షసులకూ బంధువే, దేవతలకూ బంధువే, క్షత్రియులైన పాండవులకూ బంధువే. ఇక గొల్లవాళ్ళయిన గోపీ స్త్రీలకు సాక్షాత్తూ మగడు కూడా. ఈ బాలకృష్ణుడు కలియుగపు వేంకటేశ్వరుడై శిష్ట రక్షణా కార్యక్రమం కొనసాగిస్తూ దుష్టులకు చిచ్చురపిడుగైనాడు. ఇంత పెద్ద కార్యక్రమం వున్నది కాబట్టి ఈ





బాలకృష్ణుడు చేయవలసిన మేళ్ళు అనేకం వుండటం వలన యీ బాలుని కంటికి రెప్పలా కాపాడండి.

**తాత్పర్య వివరణ:**

ఈ బాలుడు విష్ణువు అవతారమైన శ్రీకృష్ణుడు. ఈతడు పిన్న పెద్ద (ఈనాటి చిన్నపాపడు పెద్దవాడై) మేలుసేసీని (అందరికీ మేలు చేస్తాడు.) ఇన్నేసి వావులతో (ఇన్నిన్ని చుట్టరికాలతో) ఇందరి పాలగలడు (ఇందరికి చెందియున్నాడు). వీనిని జాగ్రత్తగ పెంచండి.

ఇతనికి పలువురు దానవులు బంధువులుగా వున్నారు. నరకాసురునికి ఇతడు తండ్రి, ఇప్పుడు సరిగా అర్ధరాత్రి జన్మించాడు. ఇంకొక రాక్షసుడున్నాడు. వాడిపేరు కంసుడు. వాడు ఇతనికి స్వయంగా మేనమామ. శిశుపాలుడు అని ఇంకొక దుర్మార్గుడువున్నాడు వాడు ఈయనకి మేనత్త కొడుకు, (మరిదిగా) పుట్టాడు. పెరిగిన తరువాత వీరందరికీ క్రూరమైన ఆ జన్మలనుంచి విముక్తినిస్తాడు. ఈ బాలుని మేలు చేస్తాడు జాగ్రత్తగా పెంచండి.

ఈ జన్మలో దేవదేవుడు పాండవులకు మేనబావగా దగ్గరైనాడు. వృష్ణి వంశానికి చెందిన వసుదేవునికి కన్నకొడుకు అయ్యాడు. ఉద్దండపు (సాహసవంతులైన) రేపల్లె గొల్లభామలందరికీ ఉమ్మడిగా మగడు అయ్యాడు. పెద్దవాడయ్యాక ఇతని వల్ల అనేక మేళ్ళు జరగాలి. కాబట్టి ఈ బాలుని భద్రంగా పెంచండి.

ఈ బాలుడు నేరనిదుష్టులకెల్లా (దోషపూరితులైన దుష్టాత్ములకు) చిచ్చురపిడుగు (అగ్ని వర్షించే అశనిపాతము). నేరిచిన (జ్ఞానులైన) శిష్టుల పాలిట (మంచివారికి) నిధానము (పెన్నిధి). ఈ విధముగా ఈ బాలకృష్ణుడే కలియుగదైవమైన శ్రీవేంకటేశ్వరుడు. ఈతడు పేరడిగా (అధికముగా) మేలుచేస్తాడు. ఈ బాలుని కడు శ్రద్ధగా పెంచండి.

**పద్యవివరణ:**

చం॥ **కలుగగవావులిన్ని సిరికాంతడు బాలునివోలె జేరెరా**
**చెలువపుపాపడే పెరిగి చేయును మేళ్ళను పెంచరే హరిన్**
**కొలువుడు శిష్టరక్షకుడు గోపకిశోరుడు ద్రుంచుదుష్టులన్**
**కలియుగదైవమై మనల కావగ వచ్చెను వేంకటేశుడై.**

సంఖ్య: I/471 రాగం : లలిత
కీర్తన : ఎక్కెగా రాగా రాగా యిందాకా దగులు

**లలిత**

**51 ఎక్కెఁగా రాఁగా రాఁగా యిందాఁకాఁ దగులు**
**యిక్కువ శ్రీహరిమాయ నింకనెంతో తగులు** ||పల్లవి||

**తెగనికర్మమునకు దేహము దగులు**
**తగినదేహమునకు తరుణితో తగులు**
**సొగసి యారెంటికి సుతు లొక్కతగులు**
**అగడాయఁ గనకము అన్నిటితో తగులు** ||ఎక్కెఁ||

**యింతటిసంసారికి యిల్లొక్కతగులు**
**బంతికి నందు గలిగె పాఁడిపంట తగులు**
**చెంత నీలంపటానకు క్షేత్రము తగులు**
**సంతగూడేదాసదాసీజనులెల్లా దగులు** ||ఎక్కెఁ||

**మొదల జీవుఁ డొక్కఁడే మోపులాయఁ దగులు**
**వదలనిబంధములు వడ్డివారెఁ దగులు**
**వుదుటిహముఁ బరము నొక్కయందె తగులు**
**అదె శ్రీవేంకటపతి యంతరాత్మ తగులు** ||ఎక్కెఁ|| **471**

**ఉపోద్ఘాతము:**

"రాగ" అంటే అనురాగము. రాఁగ అధికమైతే అది తగులుగా మారుతుంది. చిక్కు అవుతుంది. వీడితో గొప్ప చిక్కు వచ్చిపడింది అంటే అదే నేటి భాషలో చీకాకు అయింది. ఈ విధంగా నేను భావిస్తున్నాను. అనురాగము యెక్కువైన కొద్దీ అది చిక్కుగా మారుతుంది. శ్రీహరి మాయ అంతా వ్యాపించి వుండటంచేత ఇంకా యెంతో "తగులు"తో జీవుడు అవస్థలుపడుతున్నాడు. ఇక ఈ తగులు ఒకటి ఇంకొకదాని క్రింద మారి బాధ పెడుతుంది అంటున్నారు అన్నమయ్య. మొట్టమొదట జీవుడొక్కడే వుంటే ఏ బరువు బాధ్యత లేకుండా వుంటాడు. కానీ





బంధాలు వడ్డీవలె వచ్చిపడి వాడి తగుళ్ళు పెంచుతుంది. వేంకటపతే తన అంతరాత్మ అని తెలసేదాకా వీడిగతి ఇంతే.

**తాత్పర్య వివరణ:**

ఓ మానవులారా! అనురాగము యెక్కువవటం వలన, ఇందాకా (ఇంతవరకు) అది తగులు (చిక్కుగా) మారుతుంది. ఇక్కువ (వ్యాపకుడైన) శ్రీహరి యొక్క మాయచేత, ఇంకా యెంతో తగులు కలుగుతుంది.

ఈ విచిత్రమైన అనుక్రమణ చూశారా? జీవుడు తెగని కర్మము (అంతులేని కర్మము) చేసివున్నాడు. అందువలన వాడికి ఈ దేహము తగులైనది. తగిన దేహము వచ్చిన పిదప తరుణి (స్త్రీ) ఒకతె వీడికి తగులైనది. ఈ రెంటికీ కోర్కె వలన సుతులు వారికి తగులైనారు. అగడాయె (నిందలపాలు చేయు) కనకము (బంగారం) అన్ని చిక్కులకు కారణము. అవునా?

ఇంతటి సంసారికి కూడా వాడి 'ఇల్లు' వొక పెద్ద తగులుగా పరిణమిస్తుంది. ఇక సంసారమన్నాక పాడిపంటా రాకుండా కుదరదు కదా! అదొకతగులై ఆ సంసారిని పీడిస్తాయి. ఇదొక లంపటముగా మారుతుంది. వీటితోపాటు వ్యవసాయ క్షేత్రము వచ్చి, అదొక తగులై తీరుతుంది. ఇక వాటన్నిటివెంట ఒక్కొక్కటిగా దాసదాసీ జనము చేరి భరింపలేని తగులై పరిణమిస్తుంది.

మొదలుపెట్టినప్పుడు జీవుడు ఒక్కడే వుండేవాడు. వాడికి ఏ బరువూ బాధ్యతలు తగులుకోక హాయిగా వున్నాడు. వాడికి వదలని బంధాలు వడ్డీ మీద వడ్డీ తగులుకొన్నట్లు "తగులు" అయ్యాయి. దానితో ఇహమూ పరమూ జమ అయినాయి. ఈ రెండూ ఒక్కదాంట్లోనే తగులైనాయి. అదే శ్రీవేంకపతే ఈ జీవుడి అంతరాత్మ అని తెలిసేదాకా, తగుళ్ళు తప్పవు మరి.

**పద్యవివరణ:**

కం|| **ఎక్కుడు రాగమె తగులౌ**
**ఇక్కువ శ్రీహరిది మాయయెంతో తగులౌ**
**ఉక్కిరి బిక్కిరి జేయను**
**మిక్కుటముగ వేంకటేశ! మించిన తగులై.**

సంఖ్య: XIX/32 రాగం : కురంజి
కీర్తన : ఇంతకాకు గలదా యేమోయి చెలులను

**కురంజి**

**52 ఇంతకాకు గలదా యేమోయి చెలులను**
**చెంతల మందెమేళాలు సేసుకొంటి విట్లా ॥పల్లవి॥**

**యేకతాన నీవు నాకు నిట్టె కతలు చెప్పఁగా**
**దాకొని సతులెల్లాను తామూ వినేరు**
**జోకతో నీవు విడేలు సొరిది నా కందియ్యఁగా**
**చేకొని తామూ నట్టె చేతులు చాఁచేరు ॥ఇంత॥**

**సరసమాడుచు నా చన్నులు నీవంటఁగాను**
**సొరిదిఁ దమచన్నులు చూపేరు నీకు**
**తెరలో నాకు నీ మోవితేనె విందువెట్టఁగాను**
**గరిమఁ దామును నట్టె కడునోరూరేరు ॥ఇంత॥**

**పలుమారు నీవు నాకుఁ బచ్చడము గప్పఁగాను**
**కలికికాంతలు తమ్మూఁ గప్పుమనేరు**
**అలమేల్మంగనైన న్నట్టె నీవు కూడితేను**
**నెలవై శ్రీవేంకటేశ నిన్నుఁ దామూ కూడేరు ॥ఇంత॥ 32**

**ఉపోద్ఘాతము:**

"ఏమోయీ, ఇంత బాధించుట కలదా? నేను నీ సతిని. నిరాదరణ చూపదగునా? సమీపంలో నేనున్నా చెలియలు నీపైపై బడుతున్నారు. ఇంత పరిహాసం ఇట్లా చేసికొంటున్నావు. ఇది తగునా?" అని ఈ పల్లవికి అర్థం. అన్నమయ్య కాలంనాటి జానపదుల తెలుగు అంత తేలిక వ్యవహారం కాదు. రవ్వా శ్రీహరి గారు మా బోంట్ల కొరకు అన్నమయ్య పదకోశం వ్రాయబట్టి మేము ఊపిరి పీల్చుకొన్నట్లయింది. ఈ కీర్తన నిండా ఇటువంటివే తారస





పడతాయి. కొసమెరుపులా శ్రీదేవి ఏమంటున్నదంటే, ఓ శ్రీవేంకటేశ్వరా! నేను నీ దేవేరి అలమేల్మంగను నీవు నన్నట్టే కూడితివి బాగానే వున్నది. కానీ ఈ నెలతలంతా తామూ నిన్ను కూడెదమంటారు, ఇదేమి చోద్యం?

**తాత్పర్య వివరణ:**

ఏమోయీ! ఇంతకాకు గలదా? (ఇంతగా బాధించుట యెక్కడన్నా వుందా?) సమీపములో, నేనున్నా మందెమేళాలు (పరిహాసము) ఇట్లా సేసుకొంటివి (ఈవిధంగా చేస్తున్నావు). ఇది నీకు తగునా?

నాథా! ఏకతాన (ఏకాంతంలో) నీవు నాతో చనువుగా కతలు (విశేషాలు) చెబుతుంటే, దాకొని (దాగికొని) ఈచెలియలందరూ, తాము వినేరు (వింటున్నారు). నీవు జోకతో (ఉత్సాహంతో) విడేలు సొరిది నాకందీయగా (తాంబూలము శీఘ్రముగా చేతికందీయగా) మాకూ ఇమ్మని వాళ్ళంతా నీ ముందు చేతులు చాస్తున్నారు. చెలికత్తెలకు ఇంత చనువు ఇయ్యవచ్చునా?

నాథా! సరసములాడువేళ నీవు నా స్తనయుగ్మమును స్పృశిస్తే సొరిది (క్రమంగా) వారూ వారి చనుగవ నీకు చూపుతున్నారు. తెరచాటున నీవు నామోవితీపి రుచి చూస్తుంటే సిగ్గుయెగ్గు లేకుండా వారూ గరిమ (మధ్యలో) వాళ్ళు తమకు నోరూరినట్లు పెదవులను తుడుచుకొంటున్నారు. చెలులకు ఇంత చనువీయదగునా?

నాథా! పలుమారు (అనేక పర్యాయములు) నీవు నాకు పచ్చడము (పట్టువస్త్రము) కప్పుతుంటే తమ మేలిముసుగు తొలగించుకొని మరీ నీముందుకు వచ్చి తమకు పట్టువస్త్రము కప్పమంటారు. ఈ కలికి కాంతలను యేమి చేయాలి? నీవు నేను నీ దేవేరి అలమేల్మంగ నవుట జేత నాతో ఇట్టే కూడితేను, సుస్థిరుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా నిన్ను తామూ సమీపించి కూడెదరు. ఎంత తెంపరులు!!!

**పద్యవివరణ:**

ఆ.వె॥ **ఇంతకాకుగలదె యేమోయి చెలులను**
**మందమేళమాడ మానవేమి?**
**కోరి వేంకటేశ! కూడు సతినినేను**
**తాము కోరనేల తరుణులంత?**

సంఖ్య: X/14 రాగం : వరాళి
కీర్తన : మాటి మాటికి జూచి మరపులేలె

**వరాళి**

**53 మాఁటిమాఁటికిఁ జూచి మరపులేలె**
**నీటునఁ బాటిగంప నీళ్లు మోచేవా** ॥పల్లవి॥

**తెలిపేగురుఁ డుండఁగ తెలియఁగ నేరవు**
**చిలుకచదువులేలో జీవుఁడా**
**అలవోక నెందైన ఆస మానలేవు**
**కల గన్నచోటి కెల్ల గంపయెత్తేవా** ॥మాఁటి॥

**వొబ్బిడైనవేదమార్గ మొల్లనిపుణ్య మంటేవు**
**జిబ్బిటాయతప మేలె జీవుఁడ**
**అబ్బురపువేడుకల నలసేవు పలుమారు**
**గబ్బివై పారేబండికిఁ గాలు చాఁచేవా** ॥మాఁటి॥

**వొల్లనె సంసారములో నూరకె గర్వించేవు**
**చెల్లఁబో రొయ్యకొవ్వేలె జీవుఁడా**
**నల్లని శ్రీవెంకటనాథునిబంటవైతివి**
**తల్లకిం దేల మేరువు తలగడనుండఁగా.** ॥మాఁటి॥ **14**

**ఉపోద్ఘాతము:**

ఇది అన్నమయ్య మనుమడు చేసిన అద్భుతమైన అధ్యాత్మ కీర్తన. ఓ జీవుడా ఈ సంసారపు పీకులాట మాటిమాటికీ చూస్తూనే వున్నావు. కాని ప్రతిసారి మరచిపోతున్నావు. గత జన్మలో నేర్చిన జ్ఞానం నశించి మళ్ళీ పరగడుపు ఆకలిగొన్నవానివలె ప్రవర్తిస్తున్నావు. ఎక్కడన్నా పాటిగంప చెత్త తీసికెళ్ళటానికి ఉపయోగపడుతుంది కానీ తాగే నీళ్ళు తీసుకుపోవడానికి పనికి వస్తుందా? కానీ నీవు అదే పని చేస్తున్నావు. వ్యర్థమైన ప్రయాస సంసారిక సుఖాలకోసం పడుతున్నావు. ఆ సుఖాలూ శాశ్వతం కాదు, సంసారమూ శాశ్వతం కాదు. కనీసం





ఈ జన్మలోనైనా శ్రీవేంకటేశ్వరుని బంటువై తరించు. ఆయన బంగరు మేరుపర్వతం. ఆయన్ని తలగడగా వుంచుకొని యెందుకు తలకిందులవుతున్నావు? అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ జీవుడా! మాటి మాటికి జూచి (ప్రతిసారీ ప్రత్యక్షంగా చూచి) కూడా మరపులేల (మతిమరపు తగునా?) నీటున పాటిగంప (చిన్న గంపలో) చెత్తయెత్తి పారయేయవచ్చుగానీ) నీళ్ళు మోయడానికి పనికివస్తుందా?

ఈ జన్మలో తెలిపే గురుడుండగా (తత్త్వజ్ఞానం బోధించే గురువు వున్నా) తెలిసికొనవైతివి. చిలుక పలుకులవంటి పనికిమాలిన చదువులు నేర్చావు. ఇంకా సంపాదించాలనే ఆశ మాన్పలేని ఆ చదువులెందుకు? కలగన్న చోటికెల్ల గంపనెత్తేవా? (కలగన్న ప్రతిదీ కావాలి అనుకొంటున్నావు). దీనివల్ల నీకు ప్రయోజనం శూన్యం.

ఎన్నో పుణ్యకార్యాలు చేశావు. కానీ అవేవీ వేద విహితములైన పుణ్యకర్మలు కావు. అవి ఒట్టిడైనవి (బాగైనవి) కావు. ఇక తపస్సులు ఒబ్బిడాయ (గబ్బిలం) మాదిరి చేసి ప్రయోజనమేమిటి? పలుమారు (అనేక తడవలు) అచ్చరువొందే వేడుకలలో మునిగి అలిసిపోయేవు. గబ్బివై (గర్వంతో) పరుగులెత్తే బండి కింద కాళ్ళు పెడుతున్నావు. జీవుడా అవిటివాడివవక యేమవుతావు?

ఓ జీవుడా! ఒల్లనె (అధికముగా) ఈ సంసారములో వూరకనే గర్వించుచున్నావు. చెల్లబో (సెబాష్!) ఈ సంసారంలో ఆనందం యెంతుంటుంది? రొయ్య కొవ్వంత (రొయ్యకు అసలు కొవ్వే వుండదు). నీ సుకృతంవల్ల ఈనాటికి శ్రీవేంకటేశ్వరునికి బంటువైనావు. ఇక నీకు బంగారు మేరుపర్వతాన్ని తలక్రింద తలగడగా పెట్టుకొన్నట్లే, మరి.

**పద్యవివరణ:**

తే.గీ॥ **మాటి మాటికి జూచియు మరపులేల**
**పాటిగంపలో నీళ్ళను పట్టగలమె?**
**నల్లనైనట వేంకటనాథు బంట్లు**
**చినతిరుమలయ్య చెదరని చెప్పినాడు.**

సంఖ్య: XVII/394 రాగం : గుండక్రియ
కీర్తన : వలపు గొరబు సేయవద్దే యింత

## గుండక్రియ

**54** వలపు గొరబు సేయ వద్దే యింత
యెలమిఁ జలపోరేవు యేమే నీవు ॥పల్లవి॥

సంకె లేక యాతఁడు సారెఁ జేసేచేఁతలకు
వంకలొత్త వచ్చేవు వద్దే యింత
వుంకువ నాపెనే వెంట నూడిగానకుఁ దిప్పఁగా
యింకాన న్నదిమేవు యేమే నీవు ॥వలపు॥

కాదని యాతనిఁ దారుకాణకు వేఁ బిలిచితే
వాదులాటకు వచ్చేవు వద్దే యింత
గోదిలి నావద్దఁ బేరుకొని యాపెఁ బిలువఁగ
యీదెస విను మనేవు యేమే నీవు ॥వలపు ॥

శ్రీవేంకటేశ్వరుతోడఁ జేయి వట్టి పెనఁగఁగ
వావి దెలుప వచ్చేవు వద్దే యింత
కావించి యాతఁడూ నేనుఁ గలసితే నాపెచేత
నీవేళ మొక్కించ వచ్చే వేమే నీవు ॥వలపు॥ **394**

**ఉపోద్ఘాతము:**
అన్నమయ్య సుపుత్రుడు పెదతిరుమలయ్య చెప్పిన మధుర శృంగార కీర్తననాస్వాదించండి. ఇంత వలపు గొరబుసేయవద్దే అంటున్నారు. ప్రేమను అల్లరిచేసికోవద్దని అంటున్నారన్నమాట. నీవు అతిశయించి మత్సరముతో ఇంత పోట్లాడుతున్నావేమే? అని ఈ పల్లవి రెండవ చరణానికి అర్థం. అదండీ సంగతి. పెద తిరుమలయ్య శ్రీదేవికి చెలికత్తెవలె ఈ కీర్తన పాడుతున్నారు. దాదాపు ప్రతి చరణంలోనూ ఏదో ఒక తిరకాసు వుంటుంది గమనించండి.





అందుకనే ఈ పెదతిరుమలయ్య తండ్రికి తగ్గ తనయుడు. వేంకటపతికి ఇంతకంటే ఉత్తమ సేవ వుంటుందా? మేమిద్దరమూ సురతుల నలసివుంటే ఈ వేళ ఆమెతో మొక్కించవచ్చేవేమే అని మందలిస్తున్నారు.

**తాత్పర్య వివరణ:**
ఓ దేవీ! వలపు ఇంత గొరబులు చేయవద్దే. (నీ ప్రేమను ఇంత అల్లరి చేసికొనకమ్మా!) నీవు ఈ వేళ యెలమిన్ (అతిశయించి) చలపోరేవు యేమే (మత్సరముతో పోట్లాడుతున్నావు దేనికమ్మా?)

ఓ దేవీ! సారె (ప్రతిసారీ) ఆతడు సంకెలేక (అసంఖ్యాకంగా) చేసే చేతలకు (ఇబ్బందికరమైన పనులకు) వంకలొత్త (వంకలు పెదదామని) వచ్చావా? ఎందుకుమా? నీకేమో ఆ చెలికత్తెపై అనుమానం. మరి ఆమె వుంకువ (కన్యాశుల్కముగా) వచ్చింది. ఇంకా ఆమెనే నీవెంట వూడిగమునకు తిప్పగా (వినియోగించి) నేడు నన్ను అదిమేవేమే (ఒత్తిడి చేస్తావేమమ్మా?)

దేవీ! కాదని (ఇలా కాదని) ఆతని (నీపతిని) తారుకాణకు (నిరూపణకు) వేబిలిచితే (ఉన్నట్లుండి పిలిపించితే) నాతో వాదులాటకు (పోట్లాటకు దిగుతావు) ఇంత చీకాకు వద్దమా! ఆమె ఒకరోజు నావద్ద ఓదిలి (గూఢముగా) స్వామిని పేరుతో వ్యవహరించిందని, నాతో ఇటొచ్చి రహస్యంగా వినమనేవు. ఎందుకమ్మా?

సరే అదట్టావుంచి నేడు శ్రీవేంకటేశ్వరుని నేను వారిస్తూ చేయిపట్టుకొని పెనుగులాడగా, నీవు చూచి వావిదెలుప వచ్చేవు (ఇది పద్ధతి కాదని చెప్పవచ్చేవు). ఇంతెందుకమ్మా అనుమానం? కానీ ఆతడే నాతో కూడినాడు. అది చూచినేడు ఆమె చేత (నీ చెలికత్తెలతో) స్వామికి మొక్కించవచ్చేవు. తిరుమలేశుడు అందరివాడమ్మా! నీవెరుగవా?

**పద్యవివరణ:**

కం॥ **వలపు గొరబుసేయంగా**
**వలదని పెదతిరుమలయ్య పలికెను రమకున్**
**చలపోరేవేమేయని**
**పలురీతుల మందలించె, పాడెను హరికిన్**

సంఖ్య: I/21 రాగం : శంకరాభరణం
కీర్తన : పరుసము సోకియు బ్రదుకవద్దా

### శంకరాభరణం

**55 పరుసము సోఁకియు బ్రదుకవద్దా**
**తిరిగి కర్మము లింక తీదీపులా ||పల్లవి||**

**పడిగాలువడియున్న ప్రాణాచారముల-**
**పడఁతుల నధములఁ బాలించితి**
**యిడుమలఁ బెడఁబాప నింకనేల తెగి కొంక**
**గడియించి తెచ్చియు నింకఁ గడ మున్నదా ||పరుస||**

**మితిలేనిధనములు మెరసి కానుకగొని**
**అతిపుణ్యు లిందరి నలరించితి**
**ధృతిహీనులకునెల్ల దిక్కయి కాతువుగాక**
**వ్రతముచెల్లిన నింక వట్టఁగట్లా ||పరుస||**

**పాలించి నావిన్నపమున వేంకటరాయ**
**లాలించితివి నే నీలలనఁగానా**
**యీలాగుననె లోకమింతాఁ గాతువుగాక**
**పాలుదాగినమీఁదఁ బైకుడుపులా ||పరుస|| 21**

**ఉపోద్ఘాతము:**

ఈ కీర్తన నిక్కడ నేను ఎన్నుకొన్న కారణమేమంటే అన్నమయ్య కీర్తనలలో కొన్ని ఉద్దండ పండితులకు కూడా మింగుడుపడవు అని చూపటమే. ఈ కీర్తనలో తెలుగు నేటి తరానికి కొరుకుడు పడదు. ఇందులో నేను భావించినదే యెక్కువ భాగము. తప్పొప్పులు ఆ వేంకన్నకే తెలుసును. పాఠకులకి మనం ఎంత భాషరాని వాళ్ళమో చూపటమే నా





ఉద్దేశ్యము. నిరుత్సాహపడకండి. ఇదే నిజం. మనకి తెలిసింది తక్కువ, తెలియందే ఎక్కువ. అయినా ప్రయత్నించాలి కదా!

**తాత్పర్య వివరణ:**

ఓ మానవులారా! పరుసము సోకియు బ్రతుక వద్దా (చేత్తో తాకిస్తే ఏ లోహమైనా బంగారం అయ్యే పరుసవేది విద్య చేతిలో వున్నవానిలాగా బ్రతికితే మంచిది కదా!) తిరిగి కర్మములింక తీదీపులా (మళ్ళీ మళ్ళీ కర్మలు చేసి బాధలు బదులు తెచ్చుకోవటం ఎంత పనికిమాలిన వ్యవహారం)!!

ప్రాణాచారము వేసినవానిలాగా పడిగాలుపడి (పడికాపులుకాసి) స్త్రీలను పొందాను. అధమాధములకు యజమానినయ్యాను. నేడు, ఇడుమల వెడబాపన్ ఇంకా యేల తెగి కొంక (కష్టాలన్నీ తొలగిపోయినాయి కదా! ఇంకా జంకు దేనికి?) ఇప్పటికీ అర్థంకాలేదా? గడియించి తెచ్చియు కడమున్నదా (ఎంత సంపాదించినా ఈ కొఱత తీరేదా ఏమన్నానా?)

నేను ఒక వెలుగు వెలిగిన రోజుల్లో మితిలేని ధనములు కొనుకగొని మెరిసిపోయాను. పుణ్యాత్ములనెందరినో సంతోషపెట్టాను. అందరికీ ఏదో విధంగా ఉపయోగపడ్డాను. ధృతి హీనులకు నెల్ల దిక్కయి గాతువు గాక (ధైర్యం కోల్పోయిన వారందరికీ దిక్కు అయ్యాను. ఇవాళ నాకెవరూ లేరు. వ్రతము చెల్లినన్ ఇంకా వట్టిగట్టా? (వ్రతము పూర్తి అయిపోయింది. వట్టిపోయిన గొడ్డు దగ్గర పాలు యెవడు పిండుకొంటాడు? ఎంత అవివేకం!!)

ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను నీ లలన శ్రీసతివలెనే లాలించవయ్యా! నా విన్నపములను పరిపాలించుము తండ్రీ! ఇదే విధంగా ఈ లోకంలో అందరినీ రక్షించవయ్యా! నేనింక ఎవ్వరినీ ఆశ్రయించను. కడుపునిండా పాలు త్రాగినవానికి ఇంకా చిరుతిండ్లు యెందుకయ్యా?

**పద్యవివరణ:**

ఆ.వె|| **బ్రతుకవలదె నరులు పరసమ్ము అంటిన**
**విధముగాను భువిని వేంకటేశ!**
**తిరిగి కర్మ జిక్కి తీదీపులేలనో?**
**తెలివిలేనివాని తీరునాయె.**

సంఖ్య: XIX/351 రాగం : సామంతం
కీర్తన : గొల్లెతల నింతసేసీ గోవిందుఁడు

## సామంతం

**56 గొల్లెతల నింతసేసీ గోవిందుఁడు**
**కొల్లకాఁడు రేపల్లెగోవిందుఁడు ॥పల్లవి॥**

**పలుకుల భ్రమయించె భావములఁ గరఁగించె**
**కొలనికరత నవ్వె గోవిందుఁడు**
**యెలయించి యప్పటి మాయింటిలోనే పవ్వళించె**
**కొలఁదిమీరినవాఁడు గోవిందుఁడు ॥గొల్లె॥**

**వూరక పువ్వుల వేసె నొకటొకటేసేసె**
**కూరిమిఁ దప్పకచూచె గోవిందుఁడు**
**చేరి మావారుండ వారు చెప్పరాదు తనదూరు**
**కోరి యశోద నీబిడ్డ గోవిందుఁడు ॥గొల్లె॥**

**సమ్మతించఁ జేయివేసె చన్నులతోనే రాసె**
**కుమ్మరించె వలపులు గోవిందుఁడు**
**దొమ్మిసేసి మమ్ముఁగూడె దొరవలె నదె వాఁడె**
**కొమ్మరో శ్రీవేంకటాద్రి గోవిందుఁడు ॥గొల్లె॥ 351**

**ఉపోద్ఘాతము:**

ఈ గొల్లభామలతో ఇంత అఘాయిత్యం చేసే ఈ గోవిందుడు రేపల్లెలో 'అపహరణలో' అందె వేసిన చేయి. ఆయన అపహరించేది గొల్లెతల మానములు అని ఈనాటి అజ్ఞానులు అనుకొంటారు కానీ అది నిజంకాదు. మాన రక్షణ అభిమాన రక్షణ, శరణాగతి చుక్కెదురు. పరమాత్మ మననుంచి ఆశించేది తొలినాళ్ళలో భయం, తరువాత భక్తి, తరువాత శరణాగతి చిట్టచివరిగా హరిదాస్యం. ఆ దారిలో నిష్ఠతో పోతుంటే ముక్తి లభిస్తుంది. ఇక ఆ జీవికి జననమరణాలు వుండవు. తమని తాము అర్పించుకోవటం ద్వారా





కైవల్యసిద్ధిని పొందిన ఆ గొల్లభామలని గోవిందుడు ఏమేంచేశాడో అన్నమయ్య మధుర కీర్తనలో వినిపిస్తున్నారు, వినండి.

**తాత్పర్య వివరణ:**

ఈ గోవిందుడు గొల్లెతలనింతసేసె (గోపికలను ఇంత అల్లరిపెట్టాడు). ఈ రేపల్లెలో గోవిందుడు కొల్లకాడు (అపహరణలో మొనగాడు). ఆతడు ఏమేం చేశాడో వినండి.

గోవిందుడు గొల్లభామలను తన పలుకుల (తీపి మాటలతో భ్రమలో ముంచేవాడు). వాటిలోని భావము అర్థంచేసికొంటే వాళ్ళ మనస్సులు కరిగిపోకుండా వుంటాయా? కొలనికరత నవ్వేను (కొలను ఒడ్డున దుశ్చేష్టలు చేసి నవ్వులొలికిస్తాడు). మా ఇంట్లో దూరి, అప్పటి పవ్వళించి (మరల మరల పడుకొని) యెలయించె (చేరువ అవుతాడు). ఈ గోవిందుడు కొలది మీరినవాడు (హద్దులు మీరినవాడు).

ఓ యశోదమ్మా! మీ గోవిందుడు అమాయకుడనుకొన్నావా? మా గొల్లెతలపై వూరకనే పువ్వులు చల్లుతాడు. ఒంటరిగా చేజిక్కించుకొంటాడు. ఆతని చూపులతో కూరిమి (విపరీతమైన ప్రేమను ముంచెత్తేట్లు చూస్తాడు.) మేము మావారితో ఏకాంతములోవుంటే తను కోరి (కావాలని) చేసిన దూరు (చెడ్డపనులు) మేము నోటితో చెప్పలేమమ్మా!

ఇదిగో ఇప్పుడు ఇంకొంచెం పెద్దవాడయ్యాడు కదా! ఆతని చేష్టలూ పెద్దవైనాయి. మమ్మల్ని సమ్మతించ (అంగీకరింపజేయుటకు) అనునయంగా మీద చేయివేస్తాడు. స్తనములకు రాపిడి కలిగిస్తాడు. వలపులను కుమ్మరిస్తాడు. మరి ఈ గోవిందుని గురించి ఏమి చెప్పము? తను మా దొరమాదిరిగా, దొమ్మిచేసి (బలవంతాన) కూడినాడు. కొమ్మరో (ఓ వనితామణీ!) వీడు యెవరనుకొన్నావు? వేంకటాద్రిపైనున్న గోవిందుడు.

**పద్యవివరణ:**

కం॥ **గొల్లెతల నింతసేసెను**
**అల్లరిగోవిందుడితడు అటురేపల్లెన్**
**ఉల్లములు కొల్లగొట్టెను**
**నల్లని యీ తిరుమలయ్య నగధరుడే పో!**

సంఖ్య: I/279 రాగం : సామంతం
కీర్తన : మాయపుదనుజులమదవైరి కపి

## సామంతం

57 మాయపుదనుజులమదవైరి కపి-
రాయఁడు వీఁడివో రామునిబంటు ॥పల్లవి॥

పెట్టినజంగయు పెంపుమిగుల మొలఁ
గట్టినకాసెయు గర్వమున
నిట్టనిలిచి పూనినచేత నడిమి-
దిట్ట వీఁడువో దేవునిబంటు ॥మాయ॥

నవ్వుచు లంకానగరపుదనుజుల-
కొ వ్వణఁచినకపికుంజరుఁడు
మువ్వురు వేల్పుల మొదలిభూతియగు-
రవ్వగు సీతారమణునిబంటు ॥మాయ॥

పంకజసంభవుపట్టముగట్టను
వుంకించిన తనవొడయనిచే
పొంకపుకలశాపురహనుమంతుఁడు
వేంకటరమణుని వేడుకబంటు ॥మాయ॥

**ఉపోద్ఘాతము:**

కలశాపురంలో వెలసిన హనుమంతునిపై రమణీయమైన కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. దనుజులమదమునకు శత్రువు హనుమంతుడు. వారు మాయావులు. రామచంద్రునిపట్ల నిరసన భావము కలవారు. ఆకారణాన రామునిబంటు అయిన ఈ కపిరాయుడు దనుజులను దండించాడు. ఈ హనుమ ఒక పాదమును చాచివుంచాడు. కాసెపోసి మొలదగ్గర వస్త్రమును బిగించికట్టాడు. నవ్వుతూనే లంకలో రాక్షసుల్ని మట్టుంబెట్టాడు, ఈ సీతారమణుని బంటు. నేడు తన





ఒడయడైన శ్రీవేంకటేశుని నమ్మిన బంటయినాడు అంటున్నారు. అంటే స్వామి నమ్మినబంటు.

**తాత్పర్య వివరణ:**

ఈ కలశాపుర హనుమంతుడు, మాయపుదనుజుల (మాయోపాయాలలో ఉద్దండులైన రాక్షసులకు) మదవైరి (మదమణచు శత్రువు). వీడివో (ఈయనే) రాముని బంటు శ్రీరామబంటు అని జగద్విఖ్యాతుడైన కపిరాయుడు (వానర శ్రేష్ఠుడు).

ఈయన ఆకారమును చూడండి. పెంపుమీర (అతిశయించునట్లుగా) తన జంగను (కాలిపిక్కను) అదిమిపెట్టి వుంచినాడు. మొలకు కాసె (గోచిలా బిగించికట్టిన వస్త్రము) కట్టినాడు. గర్వముతో తననడుముపై ఒక చేయి వుంచుకొని నిట్టనిలువుగా నిలబడినాడు. ఈ దేవుని నమ్మిన బంటు అయిన వీడే కదా! దిట్ట.

ఈ మహానుభావుడు ఎవరనుకొన్నారు. కపి కుంజరుడు (వానరులలో పట్టపుటేనుగువంటివాడు). నవ్వుతూనే లంకానగరములోని దానవుల క్రొవ్వును కరగదీసినాడు (గర్వము నణచినాడు). మువ్వురివేల్పుల మొదలిభూతి (త్రిమూర్తుల మూలపురుషుడైన పరబ్రహ్మ) యొక్క మానవావతారమైన శ్రీరామచంద్రుని బంటు. వజ్రమువంటి వీడేకదా! సీతారమణుని కాప్తుడు.

రాబోయే కాలములో సృష్టికర్తవుకమ్మని బ్రహ్మపట్టమున, తన ఒడయనిచే (తన స్వామి అయిన శ్రీరామునిచే) నియమింపబడినవాడు. పొందికపడు ఈ కలశాపుర హనుమంతరాయుడు మరెవ్వరో కాదు తిరుమలాధీశుడైన శ్రీవేంకటేశ్వరుని వేడుక బంటు (యెల్లప్పుడూ ఆనందము కలిగించు నమ్మినబంటు.)

**పద్యవివరణ:**

ఉ॥ **రాముని బంటువీడు కపిరాయడు, మాయలదైత్యమూకకున్**
**తా, మదవైరి నవ్వచునెధాటిగ వారల క్రొవ్వుదీసెరా**
**కోమలి సీతకాప్తుడయి కూలిచిలంకను బూదిజేసెరా**
**గోముగ వేంకటేశ్వరుని కూరిమిబంటయె, బ్రహ్మయౌ భళా!**

సంఖ్య: XIX/31 రాగం : మనోహరి
కీర్తన : అలమేలుమంగవు నీ వన్నిటా నేరుపరివి

## మనోహరి

58 **అలమేలుమంగవు నీ వన్నిటా నేరుపరివి**
**చలములేఁటికి నిఁక సమ్మతించవే ||పల్లవి||**

**విడియము చేతికిచ్చి విభుఁడు వేడుకపడి**
**వొడివట్టి పెనఁగగా నొద్దనకువే**
**వుడివోని వేడుకతో నుంగరము చేతికిచ్చి**
**యెడయక వేఁడుకొనఁగా నియ్యకొనవే ||అల||**

**చిప్పిలువలపుతోడ చెక్కులు నొక్కుచు మోవిఁ-**
**గప్పుర మందియ్యఁగాను కాదనకువే**
**కొప్పు దువ్వి బుజ్జగించి కొసరి మాటలాడి**
**అప్పసము నవ్వఁగాను అట్టె కానిమ్మనవే ||అల||**

**యిచ్చగించి శ్రీ వేంకటేశ్వరుఁడు నిన్నుఁ గూడి**
**మచ్చికఁ గాఁగలించఁగాను మారాడకువే**
**పచ్చడము మీఁదఁ గప్పి పట్టపుదేవులఁ జేసి**
**చిన్నలాన నేలుకొనె నీవూఁ గైకొనవే ||అల|| 31**

**ఉపోద్ఘాతము:**

ఓ దేవీ! నీవు స్వయంగా అలమేలుమంగవు. జగదేకపతి శ్రీవేంకటేశ్వరుని పట్టపురాణివి. నీవు అన్ని విద్యలలోనూ నేర్పరివి. నీకీ రుసరుసలు బుసబుసలు శోభనిస్తాయా చెప్పు తల్లీ! మత్సరము నీకు తగదమ్మా! సమ్మతించి నీపతిని అలరించవమ్మా! అంటున్నారు అన్నమయ్య. తాంబూలము నీచేతికిచ్చు నెపంతో నీవిభుడు వేడుకపడి నీతో పెనగులాడితే చిరునవ్వుతో ఆతని కోర్కెనొద్దనకు. అంతులేని వేడుకతో వుంగరము నీవ్రేలికి





తొడుగుతానని నీ చేయి తన చేతిలోనికి తీసుకొంటే సంబరపడి సమ్మతించవమ్మా! అంతటి మహద్భాగ్యం ఇంకెవరికి దక్కుతుందమ్మా? అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

దేవీ! నీవు అలమేలుమంగవు. నీవు అన్నిటా (అన్ని విద్యలయందు) నేరుపరివి (చాతుర్యము కలదానవు). ఆయన జగదేకపతియైన శ్రీవేంకటేశ్వరుడు. ఇక చలములేటికి (మత్సర భావము లెందుకు) ఆయనతో కూటమికి సమ్మతించవమ్మా!

నీ విభుడు విడియము (తాంబూలము) నీ చేతికిచ్చి నీ పతి వేడుకపడి వొడివట్టి పెనగగ (నడుముచుట్టూ చేతులు బిగించి పెనవేసికొనగా) వద్దనకువే (వద్దని చెప్పరాదమ్మా!) ఉడివోని వేడుకతో (తొలగని కుతూహలంతో) ఆయన నీ చేతికి ఉంగరము నిచ్చి స్వీకరించమని వదలక వేడుకొనినాడు. ఇప్పటికైనా దానిని గైకొని, ఇయ్యకొనవే (అంగీకరించవమ్మా!)

స్వామి నీపై చిప్పిలు వలపులు (పెల్లుబుకుతున్న ప్రేమను) నీ చెక్కిలి నొక్కుచు పరిమళ కర్పూరము నోటికందించగా కాదనకమ్మా! నిన్ను అనునయించడానికి ఆయన నీ సేవలు చేస్తాడు. నిన్ను అలంకరిస్తానని చక్కగా నీ కురులు దువ్వి బుజ్జగిస్తూ కొసరి కొసరి మాట్లాడతాడు స్వామి. అప్పసము (తనంతటతానే) నవ్వుతాడు. నువ్వుకూడా అలాగే కానిమ్మని సహకరించు. వద్దనకు.

ఇష్టముతో శ్రీవేంకటేశ్వరుడు నిన్ను గూడి చనువుగా పరిష్వంగ సుఖమందీయగా మారుమాట్లాడకుమమ్మా! ఆయన నీపై ప్రేమగా పట్టువస్త్రము గప్పి నీవే పట్టపురాణివని నిన్ను అనాదిగా యేలుకొంటున్నాడు. నీవు ఆయననూ చేతులు చాచి స్వీకరింపుము తల్లీ!

**పద్యవివరణ:**

కం|| **అలమేలుమంగవమా!**
**పలువిద్యల నేరుపరివి పటురాణివియున్**
**వలపించు వేంకటేశుని**
**చలమేటికి సమ్మతించి జతవగుమమ్మా!**

సంఖ్య: XIX/33 రాగం : దేసాళం
కీర్తన : కొలువులోపలనున్న కొమ్మలెల్లా నవ్వేరు

**దేసాళం**

**59** **కొలువులోపలనున్న కొమ్మలెల్లా నవ్వేరు**
**కొలఁదిమీరకువయ్య గోవిందరాజా** ॥పల్లవి॥

**పాదములొత్తేయట్టిపడఁతికి నిదివొ**
**ఆదిగొని చెమరించె నంగమెల్లాను**
**కాదనక పచ్చడము గప్పి మఱఁగుననె**
**పోదితో నాపెఁ దనివిబొందిఁచవయ్యా** ॥కొలు॥

**సరుసఁ గూచుండినట్టిసకియకు నిదివొ**
**సిరులుగాఁ బులకించె చెక్కులెల్లాను**
**తెరవేసుకొని సిగ్గుదేరిచి గుట్టుననె**
**గరిమతో లోలోనె కాఁగలించవయ్యా** ॥కొలు॥

**శ్రీసతికి భూసతికిఁ జేరి కూడఁగ నిదివొ**
**రాసి నిట్టూర్పులు మించె రతులలోనా**
**ఆసతోడుత శ్రీవేంకటాద్రిగోవిందరాజ**
**లేసుగా నిద్దరిని లాలించఁగదవయ్యా** ॥కొలు॥ **33**

**ఉపోద్ఘాతము:**

గోవిందరాజస్వామిపై సరసశృంగార కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఆయన (గోవిందరాజస్వామి) రసికుడని జగమెరిగిన సత్యమే కాని అవ్వ!! మరీ కొలువులోనే కొమ్మలతో కొలది మీరి ప్రవర్తించుట తగదయ్యా! ఆడవాళ్ళంతా నవ్విపోయేరయ్యా! గోవిందరాజా! అంటున్నారు. శృంగారకీర్తనలకు ఉపోద్ఘాతం వ్రాసినా శృంగారం





పరిమళిస్తుంది. నీకు పాదములొత్తి సేవచేస్తున్న సుందరీమణులకు చిరుచెమటతో తనువెల్లా చెమరించింది స్వామీ! నీవు వారిని ఆహ్వానిస్తూ పట్టువస్త్రము కప్పావు. బాగానే వున్నది కానీ కాస్త చాటుమాటుగా ఆమె తనివిదీర్చవయ్యా! శ్రీదేవీ, భూదేవీ వూరుకొంటారా ప్రభూ! అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ గోవిందరాజస్వామీ! వీరంతా నీ కొలువులో వున్న కొమ్మలే (స్త్రీలే) వీరు నీ సేవికలు. వీరితో కొలది మీరకుమయ్యా! (పరిమితిని దాటకు ప్రభూ!)

ఇదివో (ఇదిగో( ఓ గోవిందరాజా! నీ పాదములొత్తే పడతికి ఏమైనదో చూడవయ్యా! నీపై మధురోహలు కలిగి ఆమెనీపై ఆదిగొని (కన్నువేసి) యుండుటచే నిన్ను తలచి ఆమె శరీరమెల్లా చెమర్చినది. ఇక ఆమె అభ్యర్ధనను కాదనక ఆమెపై పట్టువస్త్రము గప్పి మఱగుననె (రహస్యప్రదేశమున) ఆమెను పోదితో (పొదివి పట్టుకొని) తనివిదీరా సుఖించవయ్యా! ఆమె కోర్కె తీర్చుము.

ఓ గోవిందరాజా! నీసరుసనె (చెంతనే) ఒక చెలికత్తె కూర్చొని వున్నది. నీవు పై ఉవిదతో చేసిన సరాగము గమనించి ఈమెకూ అధికముగ తనువు పులకించినది. ఆమె చెక్కిళ్ళు సిగ్గుతో ఎఱుపెక్కినవి. అతి త్వరగా తెఱమఱుగునకు ఆమెను కొనిపోయి గుట్టుగా ఆమె సిగ్గులు మొగ్గలు పూయించవయ్యా! అతిశయించి లోలోపలనే ఆమెను కౌగలించవయ్యా!

ఇది చూచినారో యేమోకానీ నీ ఇద్దరు సతీమణులు శ్రీదేవి భూదేవి నీకు చేరువై కూడినారు. మీ రతులలో నిట్టూర్పులరాసి అధికమైనది. శ్రీవేంకటేద్రి గోవిందరాజా ఆశపడి చేరిన వారినిద్దరినీ లేసుగా (సులువుగా) లాలించవయ్యా!

**పద్యవివరణ:**

తే.గీ॥ **కొలువులోపలనున్నట్టి కొమ్మలెల్ల**
**నవ్విపోయేరు వోరయ్య! నడతజూచి**
**సుందరీమణులెదట గోవిందరాజ!**
**కొలది మీరకు సిరి, భూమి కలతజెంద**

సంఖ్య: I/278 రాగం : ముఖారి
కీర్తన : అన్నిచోట్లఁ బరమాత్మ నీవు

**ముఖారి**

**60 అన్నిచోట్లఁ బరమాత్మ నీవు**
**యిన్ని రూపుల భ్రమయింతువుగా** ॥పల్లవి॥

**పాలజలనిధి నుండి బదరీవనాన నుండి**
**ఆలయమై గయలోఁ బ్రయాగ నుండి**
**భూలోకనిధివై పురుషోత్తమాన నుండి**
**వేలసంఖ్యలరూపై విచ్చేతుగా** ॥అన్ని॥

**వుత్తరమధురలో నయోధ్యలోపల నుండి**
**సత్తైననందవ్రజాన నుండి**
**చిత్తగించి పంచవటి సింహాద్రిలోన నుండి**
**వత్తుగా లోకములు పావనము సేయఁగను** ॥అన్ని॥

**కైవల్యమున నుండి కమలజలోకాన**
**మోవఁగ శ్రీరంగమున నుండి**
**యీవల నావల నుండి యీవేంకటాద్రిపై**
**నీవే నీవే వచ్చి నెలకొంటివా** ॥అన్ని॥

**ఉపోద్ఘాతము:**

పరమాత్మునికి ఒక్క రూపమేమిటి? ఒక్క చోటేమిటి? ఇందుగలడందు లేడని సందేహమెందుకు? అన్నిచోట్లా ఆయనే. నీవే యిన్ని రూపముల భ్రమయింతువుగా అంటున్నారు అన్నమయ్య పాలజలనిధిలో ఆదిశేషుడు పట్టె మంచముగా పవ్వళించి కొందరిని అలరించాడు. బదరీవనమున గయ క్షేత్రము, ప్రయాగలోన, అనేకమైన అర్చావతారములలో ఆ





పరమాత్మే వున్నాడు. మధురలో, అయోధ్యలో, నందవ్రజలములో, పంచవటిలో, సింహాచలములోనూ ఆయనే వివిధ రూపములలో వున్నాడు. నేడు తిరుమలలో శ్రీవేంకటేశ్వరుడై నెలకొనియున్నాడు, అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ పరమాత్మా! నీవే అన్నిచోట్లా ఇన్ని వివిధ రూపములలో వున్నట్లు భ్రమయించుచున్నావు. నీవు లేని చోటేదయ్యా!

పాలసముద్రమున శ్రీహరివై పవ్వళించివున్నది నీవే. బదరీవనమున లక్ష్మీనారాయణుడై వెలసినావు నీవు. గయలో శివరూపములో ప్రయాగలోనూ శివకేశవుడివే. భూలోకనిధివై పురుషోత్తమానవున్నావు. వేల సంఖ్యలలోనున్న వివిధ రూపములతో విచ్చేసితివి.

ఉత్తరమధురలో శ్రీకృష్ణస్వామిగా, అయోధ్యలో శ్రీరామచంద్రునిగా, నందవ్రజమున గోపాల కృష్ణునిగా, పంచవటిలో శ్రీరామునిగా, సింహాద్రిలో అహోబల నృసింహునిగా ఈ లోకమును పావనము చేయుచున్న పరమాత్మవు నీవే.

ఇక ఊర్ధ్వలోకాలలోనూ నీవే కదా! కైవల్యముననున్నదీ నీవే. బ్రహ్మలోకమున బ్రహ్మదేవుడవై సృష్టిని జేయుచున్నావు. శ్రీరంగము అని పేరుబడిన వైకుంఠ నగరమున నీవే శ్రీమన్నారాయణుని రూపమున లోకములను పాలించుచున్నావు. నేడు కలిపీడితులై ఆకలి పీడితులై ఆర్తులైన మాబోంట్లను కాపాడుటకు తిరుమల శ్రీవేంకటేశ్వరుడవై నీవే నీవే వచ్చి నెలకొంటివి తండ్రీ!

**పద్యవివరణ:**

కం॥ **పరమాత్మ! అన్నిచోట్లన్**
**నరులను భ్రమయింతువయ్య! నానాగతులన్**
**తిరుమల వేంకటపతివై**
**స్థిరముగ నెలకొంటివయ్య! సిరితో నీవే.**

సంఖ్య: XIX/161 రాగం : ఆహిరి
కీర్తన : ఎటువంటివలపులో యిద్దరకిని

**ఆహిరి**

**61 ఎటువంటివలపులో యిద్దరికిని**
**చిటుకంటే మెచ్చేవు శ్రీనరసింహా** ॥పల్లవి॥

**గిరులెక్కి లకిమమ్మ కిన్నెర వాయించుకొంటా**
**పరగ నీమోము తప్పక చూడఁగా**
**సరుగన నీవు వచ్చి సంగడినే కూచుండి**
**సిరులతోఁ బొగడేవు శ్రీ నరసింహా** ॥ఎటు॥

**యెదురుమేడపై నెక్కి యెలుఁగెత్తి పాడిపాడి**
**వుదుటునఁ దామరపూవుల వేయఁగా**
**పొదిగి నీవంతలోనే బుజముపైఁ జేయివేసి**
**చెదరక చెక్కంటేవు శ్రీనరసింహా** ॥ఎటు॥

**పఱపుపై నీకె నీపైపరాకునఁ జెలితోడ**
**అతిముతి నిన్నుఁ జూపేకాంత మాడఁగా**
**మెఱయ శ్రీవేంకటాద్రిమీఁద వచ్చి కూడితివి**
**చెఱఁగువట్టి చొక్కుతా శ్రీ నరసింహా** ॥ఎటు॥ **161**

**ఉపోద్ఘాతము:**

నరసింహుడు ఆగ్రహానికి మారణకాండకు ప్రతీక. అన్నమయ్య అటువంటి రౌద్రమూర్తిని శృంగార నాయకునిగా భావనచేసి అసంఖ్యాకమైన కీర్తనలు చెప్పారు. ఇది అటువంటిదే. తేలికగా అర్థంకాని కీర్తన అనిచెప్పవచ్చును. మీ ఇద్దరికీ ఎటువంటి వలపు కలిగిందయ్యా! ఆమెను చిటుక్కుమని చిటికవేసినంతలోనే మెచ్చేవు. ఓ శ్రీ నరసింహా!





నీవు 'లకిమమ్మ' (లక్ష్మీదేవి) వీణ వాయిస్తుంటే చూచి రయమునవచ్చి ఆమె సరసన కూర్చొని వైభవంగా ఆమెను పొగడటం మొదలుపెట్టావు. నేడు వేంకటాద్రిపై వారినీ కరుణించుచున్నావు అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ శ్రీనరసింహా! మీ ఇద్దరివి ఎటువంటి వలపులు స్వామీ! ఆమెను చిటుక్కుమని చిటికెవేసినంతలోనే మెచ్చేవు (ప్రశంసించావు). ఆమెకు చేరువైనావు.

గిరులెక్కి (ఈ అహోబలంకొండపైన) లకిమమ్మ (లక్ష్మీదేవి) కిన్నెర (వీణను) వాయిస్తూ పరగ (అతిశయించి) నీ వదనము పరికించగా, నీవు సరుగనవచ్చి (త్వరగా విచ్చేసి) ఆమె సంగడినే (ప్రక్కనే) కూర్చొని యుండి, వైభవముగా ఆమెను పొగడేవు (ప్రశంసించెదవు). ఓ శ్రీనరసింహా! ఆమె యనిన నీకెంతటి వలపు స్వామీ! క్షణంలో పరవశింపచేసింది.

ఓ శ్రీనరసింహా! యెదురుమేడపై (ఎదుటనున్న) మేడపై (భవనముపై) నెక్కి చాలాసేపు గీతికల నాలపించి, ఇలాకాదని ఒక్కసారిగా నీపై తామర పుష్పములను ఆమె చల్లినది. పరవశించిన నీవు ఆమెకు చేరువయై అంతలోనే ఆమె భుజముపై ప్రేమగా చేయివేసేవు. నీకు ప్రేమ అధికమై ఆమె చెక్కిళ్ళను నిమిరినావు.

ఈకె (ఈమె) పఱపుపై (శయ్యపై) నీపై పారవశ్యమున తన చెలికత్తెకు నిన్ను త్వరగా చూపించినది. నీపై అనురాగాన్ని చూపి మాడగా (మాట్లాడగా) నీవూ వశమైనావు. ఆమెను తీసికొని శ్రీవేంకటాద్రి చేరి ఆమెను చేరికయె కూడితివి. శ్రీనరసింహుడవై అతిశయించితివి.

**పద్యవివరణ:**

ఆ.వె॥ **ఎట్టి వలపులోయి ఇద్దరికిని జూడ**
**చిటుకుమంటె మెచ్చు జేతువయ్య!**
**చెఱగువట్టి సతిని శ్రీనారసింహుడ!**
**కూడినావు సరసగాడవయ్య!**

సంఖ్య: I/294 రాగం : ముఖారి
కీర్తన : అరిదిసేతలే చేసి తల్లాడ నిల్లాడ

**ముఖారి**

**62 అరిదిసేఁతలే చేసి తల్లాడ నిల్లాడ**
**సరిలేక వుండితివి జలరాశికాడ ||పల్లవి||**

**పొలియఁ బీర్చితి వొకతెఁ బురిఁటిమంచముకాడ**
**నలచితి వొకని గగనంబుకాడ**
**బలిమిఁ దన్నితి వొకని బండిపోతులకాడఁ**
**దులిమితివి యేడుగురఁ దోలి మందకాడ ||అరి||**

**తడవి మోదితి వొకని తాటిమాఁకులకాడ-**
**నడిచితివి వొకనిఁ బేయలకాడను**
**పిడిచివేసితి వొకని బృందావనముకాడ**
**వొడిసితివి వొకని నావులమందకాడ ||అరి||**

**పటపటన దిక్కులు పగుల పగతులఁ దునిమి**
**నటియించితివి మామనగరికాడ**
**కుటిలబహుదైత్యాంతకుఁడవు వేంకటరాయ**
**పుటుమెగసితి జగంబుల యింటికాడ ||అరి||**

**ఉపోద్ఘాతము:**

అరిది సేతలు అంటే వింతైన లీలలు అని అర్థం. అల్ల+ఆడన్ అల్లాడన్ అంటే అదిగో అక్కడ అని అర్థం. ఇల్ల+ఆడ ఇల్లాడ. అంటే ఇదిగో ఇక్కడ అంటే ద్వాపరయుగంలో అక్కడ రేపల్లెలోనూ నేటి కలియుగంలో ఇక్కడ తిరుమలలోనూ నీకు సాటి లేక జలరాశియైన సాగరముపై శయనించినట్లు నారాయణునివలె అన్ని యుగాలలోనూ వున్నావు అని అంటున్నారు అన్నమయ్య. కృష్ణలీలల క్రమంలో ఏయే రాక్షసుల్ని కృష్ణయ్య





తుదముట్టించింది చెబుతున్నారు. బహుదైత్యాంతకుడైన ఆ కృష్ణయ్యే నేటి శ్రీవేంకటేశ్వరుడు అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ దేవదేవా! అల్ల, ఆడ (అదిగో అక్కడ) రేపల్లెలోనూ ఇల్ల,ఆడ (ఇదిగో ఇక్కడ తిరుమలలోనూ) అరిది సేతలే చేసితి (అరుదైన లీలలనే జేసినావు). జలరాశికాడ (సాగరమున) సరిలేక (సాటిలేక) వుంటివి.

పురిటిమంచము మీదనే నీకు పాలుకుడుప ఒకతె వచ్చింది. అది పూతన అనే రాక్షసి. పొలియ (అది మరణించునట్లు) దాని చనుబాలతోపాటు దాని రక్తాన్నంతా పీల్చివేసినావు. ఒకనిని ఆకాశమున అలచితివి (మట్టుబెట్టావు). వాడే తృణావర్తుడనే రాక్షసుడు. ఒకని బలంగా తన్ని శకటపు చక్రంవద్ద వ్రయ్యలు చేసినావు. వాడే శకటాసురుడు. ఆవుదూడల మందవద్దకు తోలి ఏడుగురు రాక్షసులను తుదముట్టించితివి.

ఒక రాక్షసుని తాటిచెట్లవద్ద తడవి మోదితివి (చేతులతో యెత్తి కొట్టి చంపితివి.) ఒకని ఆవుదూడలవద్ద సంహరించితివి. వాడే వత్సాసురుడు. ఒకని బృందావనము దగ్గర పిడిచివేసితివి (తొక్కిహూనం చేసినావు). వాడే కాళీయుడనే సర్పరాజు. ఆవులమందలో ఒకనిని ఒడిసితివి. ఆవుల మందలోనున్న ఒక రాక్షసుని ఒడిసి పట్టుకొని నేలకు కొట్టి చంపితివి. వాడే ధేనుకాసురుడు.

మామనగరమైన మథురలో పటపటమని దిక్కులు పగులునట్లుగా పగవారైన మల్లులను సంహరించి నర్తించావు. కుటిలురైన దైత్యులను తుదముట్టించి, తుదకు కంసుని పీచమడచితివి. నేటి కలియుగంలో వేంకటపతివై జగములన్నింటికీ ఇల్లు అయిన తిరుమలలో, పుటమెగసితివి (వన్నెయెక్కితివి) ప్రభూ!

**పద్యవివరణ:**

తే.గీ|| **అరిది సేతలే చేతువు ఆడనీడ,**
**సరియనేది లేకుంటివి జలధిపైన**
**కలియుగంబున నీవె వేంకటవిభుడవు**
**పుటమెగసితివి తిరుమల పుణ్యగిరుల**

సంఖ్య: XIX/165 రాగం : దేవగాంధారి
కీర్తన : రాజపు నీకెదురేది రామచంద్ర

### దేవగాంధారి

**63** **రాజపు నీకెదురేది రామచంద్ర**
**రాజీవనయనుఁడ రామచంద్ర** ॥పల్లవి॥

**వెట్టిగాదు నీవలపు వింటి నారికిఁ దెచ్చితివి**
**అట్టుసేయఁ బనిలేదు యిట్టె రామచంద్ర**
**గుట్టుతోడ జలనిధిపై గొండలు ముడివేసితి-**
**వెట్టు మఱవఁగవచ్చు నివి రామచంద్ర** ॥రాజ॥

**బతిమితోడుతఁ బైఁడిపతిమెఁ గైకొంటివి**
**రతికెక్కె నీచలము రామచంద్ర**
**మితిమీరి జవ్వనము మీఁదుకట్టితివి నాకై**
**యితరు లేమనఁగల రిఁక రామచంద్ర** ॥రాజ॥

**నావంటిసీతను నాఁగేటికొనఁ దెచ్చితి**
**రావాడితమకముతో రామచంద్ర**
**యీవేళ శ్రీవేంకటాద్రి నిరవై నన్నుఁ గూడితి**
**చేవదేర గండికోట శ్రీరామచంద్ర** ॥రాజ॥ **165**

**ఉపోద్ఘాతము:**

గండికోటలో వెలసిన శ్రీరామచంద్రునిపై గొప్పకీర్తన చెబుతున్నారు, అన్నమయ్య. నీవు రాజసము మూర్తీభవించిన రాజీవలోచనుడవు. ఓ రామచంద్రా! నిన్నెదుర్కొనే మొనగాడెవరయ్యా! అంటున్నారు. నీవు ఏకపత్నీ వ్రతుడవు. సీతాదేవిపై నీవలపు వెట్టగాదు. దానిని వింటినారికి దెచ్చినావు. దానిని నాబోంట్లు నేడు రట్టు సేయవలసిన పనిలేదు అది జగద్విదితమే కపులతో కూడా చెలిమి చేసి మానవ జాతికి ధర్మవర్తన నేర్పావు. ఈ భావాలు





కీర్తన వినంగానే అర్థంకాదు. సీతాదేవి ఈ కీర్తన వినిపిస్తున్నది, అని మనం భావించాలి. నీవు ఏకపత్నవ్రతుడవు. సీతాదేవిపై నీ వలపు వెట్టగాదు. దానిని వింటినారికి దెచ్చినావు. దానిని నాబోంట్లు నేడు రట్టు సేయవలసిన పనిలేదు అది జగద్విదితమే. కపులతో కూడా చెలిమి చేసి మానవ జాతికి ధర్మవర్తన నేర్పావు. సీతాదేవి ఈ కీర్తన వినిపిస్తున్నదని మనం భావించాలి.

**తాత్పర్య వివరణ:**

ఓ రామచంద్రా! రాజపు నీకు (రాజసము మూర్తీభవించిన నీకు) యెదురేదయ్యా? నీవు రాజీవలోచనుడవు (కమలాక్షుడవు) రామచంద్రా!

వెట్టి (ట్ట) గాదు నీవలపు (నీ ప్రేమ వేసవి యెండవంటి తాపం కలిగించేది కాదు). కానీ లంకావాసమున నావలపును వింటినారికి దెచ్చి యుద్ధంతో పూర్తిచేశావు. ఇంత రట్టు (రగడ) చేయవలసిన పనిలేదయ్యా! రావణ సైన్యానికి అంతు చిక్కకుండా రహస్యంగా సాగరముపై వారధి నిర్మించావు. దానికోసం కొండలను తెప్పించి ముడివేసినావు. ఇవి (ఈ ఘనకార్యములను) యెట్లు మఱువగలమయ్యా శ్రీరామచంద్రా!

నీవు ఏకపత్నీవ్రతుడవైనందువలన పైడిపతిమ (సీతాదేవి బంగారు విగ్రహాన్ని) అశ్వమేధయాగములో నీ పత్నివలె మహారాణిని చేశావు. నీ చలము (మాత్సర్యభావన) అసామాన్యము. నాకోసం (సీతకోసం) నీ యవ్వనమంతా మీదుకట్టితివి (అడవిగాచిన వెన్నెల చేశావు). ఇక నిన్ను ఇతరులు యేమనగలరయా, రామచంద్రా!

రామచంద్రా! నాపేరేసీత (నాగేటిచాలులో దొరికినది). నన్ను నాగేటికొన దెచ్చితివి. రావాడి (కఠినాత్ముడవై) నాగలితో పొడిచినట్లు నా తమకముతోనే నేను నిష్క్రమించాను. చేవమీరి గండికోటలో రామచంద్రుడవై నిలిచావు. కానీ నీప్రేమ నిరుపమానము. కలియుగంలో కూడా శ్రీవేంకటేశ్వరుడవై నన్ను కూడితివి.

**పద్యవివరణ:**

ఆ.వె॥ **రాజసమ్ములొలక రాజీవలోచనా!**
**ఏమి నీకు యెదురు రామచంద్ర!**
**చెలగె గండికోట శ్రీరామచంద్రుడే**
**తిరుమలందు చేరి యిరవునొందె**

సంఖ్య: I/293 రాగం : ముఖారి
కీర్తన : సేవింతురా యితని జెలగిపరు; లిట్లనే

**ముఖారి**

**64 సేవింతురా యితనిఁ జెలఁగి పరు;లిట్లనే**
**కావించె మమ్ము నెక్కుడిదైవ మితఁడు** ॥పల్లవి॥

**పాలచవి యితఁడెఱుఁగు పాలఁ బవళించ గో-**
**పాలుఁడని నే మితని భజియించఁగా**
**పాలుపడి తల్లిచనుఁబాలుసహితంబు నే-**
**కాలమునుఁ బాపె నెక్కుడిదైవ మితఁడు** ॥సేవిం॥

**పుట్టింపఁ దానె మఱి పురుషోత్తముఁడు మంచి-**
**పుట్టు వొసగీననుచుఁ బూజించఁగా**
**పట్టుకొని మముఁ దెచ్చి బలిమిఁ బుట్టువులెల్లఁ**
**గట్టిపెట్టించె నెక్కుడిదైవ మితఁడు** ॥సేవిం॥

**కర్మకర్తారుఁడని కడలేనిపుణ్యముల-**
**కర్మఫలములు దనకుఁ గైకొలుపఁగా**
**కర్మగతిఁ దెచ్చి వేంకటవిభుఁడు మావుభయ-**
**కర్మములఁ జెరిచె నెక్కుడిదైవ మితఁడు** ॥సేవిం॥

**ఉపోద్ఘాతము:**

మేము ఈ వేంకటనాథుని మా సర్వస్వము అని నమ్మి సేవించాము. మమ్మల్ని ఈయన కృతార్థులను చేశాడు. అన్యులు ఆయననిటులనే సేవించగలరా అని ప్రశ్నిస్తున్నారు అన్నమయ్య. కన్నబిడ్డకు చనుబాలు ఇవ్వటం మానేసి అన్నం తినిపించగానే తల్లికి చనుబాలు మాయమైపోతాయి. ఈ విధానము నిర్దేశించిన దైవమీ వేంకటేశ్వరుడే.





తన శరణాగతులకు పుట్టుకలు లేకుండా చేస్తాడు. ఆయన ఆశ్రితుల కర్మములు జెరిచెనంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

మేము ఈ దేవుని ప్రాణసమానముగా సేవించితిమి. ఈయన మమ్ము కావించె ఇట్లనే (ఈవిధముగా ధన్యులను చేసినాడు). పరులు (అన్యులితనిని) చెలగి (అతిశయించి) ఇట్లా సేవించగలరా?

పాలబవ్వళించ (పాలసముద్రమున పవ్వళించుట చేత) ఇతనికి పాలరుచి యేమిటో బాగుగా తెలియును. అందుకనే ఇతనిని మేము గోపాలుడని ఆరాధించితిమి. పాలుపడి (పూనుకొని) తల్లియైన స్త్రీకి చనుబాలు సహితంబు (పూర్తిగా) ఏ కాలమును పాపె (ఏ సమయంలో ఎండిపోవాలో ఆ సమయంలో) యెండిపోయేట్లు చేస్తాడు. ఈతడు యెక్కుడి దైవము (ఎటువంటి దైవమో చూశారా?)

పురుషోత్తముడని కీర్తింపబడుతున్న ఈ దేవదేవుడు, పుట్టింపదానె (పుట్టించే వాడు ఆయనే). మంచి పుట్టుకనిచ్చావు స్వామీ! అని కృతజ్ఞతతో పూజిస్తే ఆయన మాకెంత ఉపకారము చేశాడో తెలుసా? బలిమితో మా చేత పుట్టుకలను కట్టిపెట్టించె (నీకు పునర్జన్మవుండదురా) అని ఆశీర్వదించాడు. ఇతడు యెక్కుడి దైవమయ్యా?

కర్మకర్తారుడని (జీవుల కర్మఫలప్రదాతయని) అంతులేని పుణ్యము కలగునట్లు ఇతనికి నా కర్మఫలము కైకొలుపగా (ధారాదత్తము సేయగా) ఈ శ్రీవేంకటేశ్వరుడు మా కర్మగతి తెచ్చి (కడతేర్చి) మా ఉభయకర్మలు (ఆగామి, సంచిత కర్మలు) తొలగించాడు. ఎట్టి దైవమో కదా!

**పద్యవివరణ:**

కం॥ **ఈ విధిపరులెవ్వరునూ**
**సేవింతురె చెలగియిటుల శ్రీపతిహరినిన్**
**కావించెమమ్మునెక్కుడు**
**దైవంబననితడె జుమ్మి తరతరములకున్.**

సంఖ్య: XIX/258 రాగం : శంకరాభరణం
కీర్తన : ఏమమ్మ యశోద యిదె నీ బిడ్డడు

## శంకరాభరణం

65 ఏమమ్మ యశోద యిదె నీ బిడ్డఁడు
గామిడితనాలఁ గదిసీ వీఁడే ॥పల్లవి॥

గొల్లలుఁ దానును గోపికలిండ్ల
కొల్లగా నుట్లు గొట్టీ వీఁడే
పల్లదాన వారిపాలిండ్లమీఁదట
చిల్లరచేఁతలు చేసీ వీఁడే ॥ఏమ॥

పాలువెన్నలును బానలతోడుత
కేలు చాఁచి యారగించీ వీఁడే
మేలిమిసతుల మేనబావనంటా
కోలుముందుగాఁ గూడీ వీఁడే ॥ఏమ॥

అట్టులుఁ జక్కిలా లడుకులు వేలఁ-
గట్టినఁ గోలలఁ గొట్టీ వీఁడే
దిట్టయి శ్రీవేంకటాద్రి నలమేల్మంగఁ-
గట్టుక దేవుఁడై కడఁగీ వీఁడే ॥ఏమ॥ 258

**ఉపోద్ఘాతము:**

శ్రీకృష్ణరసామృతాన్ని మనబోంట్ల జేతకడుపునిండా త్రాగిస్తున్నారు అన్నమయ్య. గామిడితనమంటే దుష్టత్వము. వీడు దుష్టుడమ్మా! ఓ యశోదమ్మా! నీ బిడ్డడి ధూర్తత్వముతో తగులుకొన్నాడంటే ఇక వదలడమ్మా! అంటున్నారు. ఇక ఆపై పితూరీవలెనే శ్రీకృష్ణలీలలు వర్ణిస్తున్నారు. నేడు కలియుగంలో అలమేల్మంగను కట్టుకొని





శ్రీవేంకటేశ్వరుడై తగులుకొన్నాడు అంటున్నారు. ఎవర్ని తగులుకొన్నాడు? ఇంకెవర్ని, మనబోటి భక్తకోటిని.

**తాత్పర్య వివరణ:**

ఓ యశోదమ్మా! ఇదేమిటమ్మా! నీ బిడ్డడగు వీడేగామిడితనాల (ధూర్తత్వంతో) కదిసీ తగులుకొన్నాడు.

వీడు తానూ, మిగిలిన గొల్లపిల్లవాండ్రతో కలిసి, గోపికల ఇండ్లలోగల ఉట్లను కొల్లగా గొట్టీరమ్మా! (దోచుకున్నాడమ్మా!) ఇక నీకొడుకు, వీడువున్నాడే పల్లదాన (దౌష్ట్యముతో) గోపికల స్తనగిరులపై చిల్లర పనులు చేస్తాడమ్మా! ఇంత దుష్టప్రవర్తన గలవానిని మేమింత వరకు చూడలేదంటే నమ్ము మా మాట.

పెద్ద పెద్ద బానల్లో మేము పాలు వెన్నలను దాచుకొంటే చిన్న చిన్న చేతులు చాచి ఎలాగో అందుకొని ఆరగించీ (తింటాడమ్మా!) బంగారంవంటి గోప స్త్రీలను చూపి, వారి మేనబావనంటూ కోలుముందుగా (మున్ముందుగానే) వీడుకూడీనమ్మా! (సంగమిస్తాడమ్మా!) ఇంత తెంపరి వాడిని మేమెక్కడా చూడలేదమ్మా!

మా ఇంటివారు తినుట కొఱకు మేము అటుకులు, చక్కిలములు, అట్టులు (అట్లు) వ్రేలాడగట్టి దాచుకొంటే కోలలతో (కఱ్ఱలతో) వాటిని కొట్టి క్రింద పడ్డాక, తినేస్తాడమ్మా! శ్రీవేంకటాద్రిపై శ్రీవేంకటేశ్వరుడై వీడే అలమేల్మంగను కట్టుకొని (పెండ్లాడి) దేవుడై (అందరూ కొలిచే భగవంతుడై) వీడే కడగీ (వర్ధిల్లుతున్నాడు).

**పద్యవివరణ:**

కం॥ **ఏమమ్మ! యశోదమ్మా!**
**గామిడితనములను మించె గదిసీవీడే**
**నీమాయదారి బిడ్డడు**
**లేమా! వేంకట విభుండులే, తెలియంగన్.**

సంఖ్య: I/282 రాగం : కన్నడగౌళ
కీర్తన : ఇంతసేసె బో దైవమింతలోననే అయ్యో

## కన్నడగౌళ

**66 ఇంతసేసెఁ బో దైవ మింతలోననే అయ్యో**
**సంతపాక లంజఁదెచ్చి సన్యాసిఁ జేసె ॥పల్లవి॥**

**పరిగెలేరేటివానిఁ బట్టపురాజుఁగా**
**నిరతభోగము లిచ్చి నిలిపినట్లు**
**ధరలోన నతిపాతకుని నన్ను నిట్లు**
**అరయ నిత్తడిఁ దెచ్చి యపరంజిఁ జేసె ॥ఇంత॥**

**కుక్కలవండుకతినే కులహీనునిఁ దెచ్చి**
**వెక్కసపుఁబాఁపనిఁ గావించినయట్లు**
**దిక్కులెఱఁగఁగఁ గష్టదేహిని నన్నుఁ దెచ్చి**
**గక్కనఁ దెలుకపిండి కస్తూరి సేసె ॥ఇంత॥**

**చెదుగైనదోమఁ దెచ్చి సింహపుఁగొదమఁగా**
**బెడిదంపుఁ బ్రేమతోడఁ బెంచినయట్లు**
**కడునధముని వేంకటపతి నను నిటు**
**చిడిపిరాయి దెచ్చి చింతామణి సేసె ॥ఇంత॥**

**ఉపోద్ఘాతము:**

"సంతపాకలంజ" అంటే బజారులో వెలకు దొరికే పడుపుకత్తె. నేను అటువంటి నీచపు బ్రతుకుగడుపుతుంటే ఓ దైవమా! అయ్యో అని అనుకొని నన్ను సన్యాసినిని జేసి ఇంతటి జన్మసాఫల్యమునిచ్చావు. నీకు మరి నేనేమి ప్రత్యేపకారం చేయగలను? పరిగెలేరు కొనేవాడిని దెచ్చి పట్టపురాజుని చేశావు. ఇత్తడి వంటి పాతకుని నన్ను దెచ్చి బంగారం





చేశావు. కుక్కల్ని వండుకొని తినే కులహీనునిదెచ్చి సద్బ్రాహ్మణుని చేసినట్లు దిక్కుతెలియకుండా కష్టపడుతున్న ఈ దేహిని నన్నుతెచ్చి తెలకపిండిని కస్తూరిగా మార్చినావు. ఈ కీర్తనలోని ఉపమానములన్నీ అత్యద్భుతం. చదవండి మరి...

**తాత్పర్య వివరణ:**

ఇంతలోననే (ఇట్లు చూస్తుండంగానే) దైవము ఇంతసేసెబో (ఇంతటి పని చేసినాడుపో) అయ్యో! సంతపాకలంజను (పచ్చి వెలయాలిని) దెచ్చి సన్యాసిని జేసె సాధువు వంటి సన్యాసిని గావించినాడు.

పరిగెలేరేటివాణ్ణి (చెత్తాచెదారము ఏరుకొనే హీనుణ్ణి తీసుకొనివచ్చి పట్టాభిషిక్తుడైన రాజుని చేసినట్లు, శ్రేష్టములైన భోగభాగ్యములను ఇచ్చి నిలబెట్టినట్లు ఈ లోకంలో అతిపాతకుడనైన (మిక్కిలి పాపాత్ముడనైన నన్ను తీసికొనివచ్చి ఉన్నతుని జేసినావు. చూడబోతే ఇది ఇత్తడిని బంగారము చేసినట్లున్నది.

కుక్కలవంటి నీచజంతుమాంసము తినే కులహీనుణ్ణి తీసికొనివచ్చి అధికుడని పిలువబడే సద్బ్రాహ్మణుని చేశావు. దిక్కుతెలియక తిరిగే కష్టజీవియైన ఈ శరీరిని నన్ను తీసికొనివచ్చి కంపుకొట్టే తెలకపిండిని పరిమళభరిత కస్తూరిగా మార్చినావు.

అల్పమైన దోమను తీసికొనివచ్చి కొదమసింహము (సింహ కిశోరమును) చేసి ఎంతో బెడిదంబు ప్రేమ (అధికమైన అనురాగముతో) పెంచినట్లు, ఓ శ్రీవేంకటేశ్వరా! మిక్కిలి అధముడనైన నన్ను ఇట్లు చేసినావు. చిల్లరరాతి ముక్కను నన్ను దెచ్చి ఇంద్రుని కిష్టమైన చింతామణిని చేశావు కదా! ప్రభూ!

**పద్యవివరణ:**

ఆ.వె॥ **సంతపాకలంజ సన్యాసిగావించి**
**ఇంతసేసె దైవమింతలోనె**
**అయ్యో! వేంకటేశ! అధమునిననుదెచ్చి**
**అధికుజేసినావు అంతలోనె.**

సంఖ్య: XVII/220 రాగం : భైరవి
కీర్తన : పతిమీదటిమోహము సతి కిట్టుండ వద్దా

**భైరవి**

**67** **పతిమీఁదటిమోహము సతి కిట్టుండ వద్దా**
**సతతము నీ హితవే సారెఁ గోరీఁ దాను** ||పల్లవి||

**బలిమిఁ బయ్యదకొంగు పట్టి నీవు దీసితేను**
**నెలఁతకొప్పువిరులు నీపై రాలెను**
**అల మరుఁ డందులకు నమ్ములు గురిసె నంటా**
**కలికి భ్రమసి నిన్నుఁ గౌఁగలించుకొనెను** ||పతి||

**వొట్టి నీ వాపెతోను వొరసి పెనఁగితేను**
**తొట్టి నా మైకప్పురపుధూళి నిన్నంటె**
**నెట్టనఁ జందురుఁడు వెన్నెలచొక్కు చల్లె నంటా**
**గట్టిగాఁ దెలియలేక కౌఁగలించుకొనెను** ||పతి||

**యిమ్మల శ్రీవేంకటేశ యీపె నీవు గూడితే**
**నెమ్మిఁ జెమటబొట్టులు నీమై నిండెను**
**చిమ్మియందు నించిన సేసలు పైకొనె నంటా**
**కమ్మర నచ్చెరు వంది కౌఁగలించుకొనెను** ||పతి|| **220**

**ఉపోద్ఘాతము:**

శృంగారకీర్తనలు చెప్పటంలో తండ్రికి తగ్గ తనయుడనిపించుకొన్నారు అన్నమయ్య సుపుత్రుడు, పెదతిరుమలాచార్యులవారు. పతిమీద సతికి మోహము ఇట్లుండవద్దా అని అడుగుతున్నారు. ఎట్లావుండాలిట? ఎల్లప్పుడూ నీ హితవునే కోరుతూ తాను వుండవలెను సుమా! అంటున్నారు. నా ఉద్దేశ్యంలో చతురతలో కూడా ఈయన తక్కువ తినలేదు. శ్రీవేంకటేశుడు, దేవిని కూడితే ఆమె చెమటబిందువులు స్వామిపై రాలినవట. మొదట





ఆవిడ అవి తనపై చల్లిన అక్షతలు అనుకొన్నదట. ఆ తరువాత అసలు సంగతితెలిసి ఆశ్చర్యమూ ఆనందమూ అతిశయించగా ఆయనను సందిట బంధించినదట. ఔరా!

**తాత్పర్య వివరణ:**

సతికి తనపతిమీద మోహము ఇట్లుండవద్దా? సారె (ప్రతిపర్యాయము) సతతము (త్రికాలములలో సర్వావస్థలలోనూ) తాను ఆతని హితము (మంచి) కోరీ (వాంఛించునదై వుండవద్దా?) ప్రభూ!

బలిమి (బలవంతంగా) నీవు ఆమె పయ్యెదకొంగు బట్టి లాగితే, ఆ కదలికలకు నెలత కొప్పులోని పూవులు నీపై రాలినవి. అది చూచి ఇదే తగిన సమయమని యెంచి మరుడు (మన్మథుడు) అమ్ములగురిసెనంటా (తన పుష్పబాణాలు వేసినట్లై) సంభ్రమముతో నిన్ను గాఢాలింగనము గావించినది.

ఆమె సరసన బవ్వళించి నీవు ఆమెతో పట్టి పెనవేస్తే ఆమె తన మేనిపై (శరీరముపై) అలదుకొన్న మెత్తని కర్పూరధూళి, నిన్నంటె (నీకు అంటుకొన్నది). అది చూచి ఆమె నెట్టన (నడినెత్తినవున్న) చంద్రుడు తన వెన్నెలచొక్కు (మత్తును కలిగించే తన వెన్నెల) నీపై జల్లులుగా కురిపిస్తున్నాడా అనుకొని గట్టిగా దెలియలేక (నమ్మకంగా తెలియరాక) చల్లగా వుంది చాలని నిన్ను బిగియార కౌగలించినది, ప్రభూ!

ఇమ్మ (మ్ము)ల ఓ శ్రీవేంకటేశ్వరా! ఆమె నీవు జతచేరితే, ఆమె స్వేదబిందువులు నీపై రాలినవి ప్రభూ! నీమేనువాటితో నిండిపోతే, వసంతములాడెడి నీళ్ళు చిమ్ముగొట్టముతో, సేసలు (తలంబ్రాలు) నీపై కురిసినవా అని సంభ్రమంతో గాఢముగా కౌగలించినది. ప్రభూ! నీవు ఆమె పరిష్వంగానందమునట్లు బొందితివి. చమత్కారివయ్యా!

**పద్యవివరణ:**

కం|| **పతిమీదటి మోహంబులు**
**సతికిని యిటులుండవలదె సంతతంబగుచున్**
**చతురుడు పెదతిరుమలయనె**
**హితవేతను కోరవలెను ఇకనాతనికిన్.**

సంఖ్య: I/288 రాగం : భూపాళం
కీర్తన : ఆకాశమడ్డమా అవ్వలయు నడ్డమా

### భూపాళం

68 ఆకాశమడ్డమా అవ్వలయు నడ్డమా
శ్రీకాంతు భజియించు సేవకులకు ॥పల్లవి॥

పాతాళ మడ్డమా బలిమథనుదాసులకు
భూతలం బడ్డమా పుణ్యులకును
సేతుకైలాసములు చిరభూము లిన్నియును
పైత్రోవలట పరమభాగవతులకును ॥ఆకాశ॥

అమరావతడ్డమా హరిదాసులకు మహా-
తిమిరంబు లడ్డమా దివ్యులకును
కమలాసనునిలోకం బదియు నడ్డమా
విమలాత్ములై వెలుఁగువిష్ణుదాసులకు ॥ఆకాశ॥

పరమపద మడ్డమా బ్రహ్మాండధరుఁడైన-
ధర వేంకటేశ్వరునిదాసులకును
యిరవైనలోకముల నిన్నిటా భోగించి
వరుసలను విహరించువరవైష్ణవులకు ॥ఆకాశ॥

**ఉపోద్ఘాతము:**

శ్రీవైష్ణవుడై రామానుజులవారి శిష్యుడైన అన్నమాచార్యులవారు విశిష్టాద్వైతమత వ్యాప్తికి యెనలేని కృషి చేసి వైష్ణవుల ప్రాశస్త్యంపై అసంఖ్యాకమైన కీర్తనలు చెప్పారు. వాటిలో ఇదీ ఒకమచ్చుతునక. వైష్ణవులకు సృష్టిలోగల ఏ లోకమైనా అడ్డము కాదు అంటున్నారు. శ్రీకాంతుని భజించే హరి సేవకులకు ఏదీ అడ్డము కాదు అంటున్నారు.





శ్రీవేంకటేశుడే అవనికి దిగివచ్చిన శ్రీహరి. ఆయన భృత్యులైన వైష్ణవులకు పైన, క్రిందనున్న ఏలోకమైనా భోగించి విహరించుటకు స్థానములే అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

శ్రీకాంతుడైన నారాయణుని భజించే సేవకులకు (దాసులకు) ఏది అడ్డమౌతుంది చెప్పండి? ఆకాశం అడ్డమవుతుందా, లేక దానికి అవ్వల (అవతలివైపున) ఏమన్నావుంటే అది అడ్డమా?

పోనీ పాతాళము కానీ అవతల వితల, సుతల, రసాతలం వంటి అధోలోకాలు బలిచక్రవర్తిని మథించిన శ్రీహరి దాసులకు అడ్డమవుతాయా? ఆ పుణ్యాత్ములకు భూతలములో ఏదన్నా అడ్డమవుతుందా? కైలాసము అడ్డగలదా? ఊర్ధ్వలోకాలలో ఏదన్నా అడ్డమవుతుందా? పరమభాగవతులైన మహాత్ములకు ఏలోకమూ ఏ ప్రాంతమూ ఇన్నిటిలో ఏదీ అడ్డము కాదు.

అమరావతీనగరము ఇంద్రుని దేవేంద్రలోకానికి రాజధాని అయినా అదీ అడ్డము కాలేదు. హరిదాసులైన వారికి ఆ లోకాలకావలనున్న 'పెనుజీకటి' కూడా అడ్డము కాదు. ఎందుచేతనంటే వారు దివ్యులు. ఆ తరవాత బ్రహ్మదేవుని సత్యలోకమున్నది. అదికూడా పవిత్రాత్ములై వర్థిల్లే విష్ణుదాసులకు అడ్డము కానేరదు.

ఆవల పరమపదము అని ప్రసిద్ధినొందిన వైకుంఠము వున్నది. బ్రహ్మాండమును ధరించియున్న భగవంతుడు శ్రీవేంకటేశ్వరుడై కలియుగంలో తిరుమల శిఖరాలపై యున్నాడు. ఆయన దాసులైన వారికి, ఇరవైన (నెలకొనియున్న) లోకములన్నియు భోగించుటకు విహారస్థలములై వరప్రసాదులైన వైష్ణవుల స్వాధీనములో వుంటాయి.

**పద్యవివరణ:**

ఉ ॥ ఆకసమడ్డమా, ఆవల ఐనను అడ్డమ, క్రిందనున్న ఆ
**లోకములడ్డమా బలికి లోకమునిచ్చినవాని బంట్లకున్**
**నాకము అడ్డమౌనె హరినామము వీడని భృత్యుకోటికిన్**
**ఆకడ వైష్ణవుండయిన అడ్డముకాదుర సృష్టినెద్దియున్.**

సంఖ్య: I/291 రాగం : లలిత
కీర్తన : దైవమా పరదైవమా

**లలిత**

**69 దైవమా పరదైవమా**
**యేవగింతలు నాకు నెట్టు దెచ్చేవో** ॥పల్లవి॥

**పాపకర్మునిఁ దెచ్చి పరమియ్యఁదలఁచిన**
**మేపులకే పోక మెయికొనీనా**
**తీపులు రూపులుఁ దివిరి నావెనువెంట-**
**నేపొద్దు నీ వేఁడఁ దెచ్చేవో** ॥దైవమా॥

**అధమాధమునిఁ దెచ్చి యధికుని జేసేనంటే**
**విధినిషేధములు వివరించునా**
**నిధినిధానములు నిచ్చునిచ్చులుఁ బెక్కు-**
**విధముల నెటువలె వెదచల్లెదవో** ॥దైవమా॥

**అతికష్టుఁడగునాకు నలవిగానియీ-**
**మత మొసఁగిన నేను మరిగేనా**
**ప్రతిలేనివేంకటపతి నీదునామా-**
**మృత మిచ్చి నను నీవే మెరయింతుగాక** ॥దైవమా॥

**ఉపోద్ఘాతము:**

పరదైవము అంటే పరమునొసగే దేవుడు లేక మోక్షప్రదాత అని అర్థము. దైవమా! నాకెందుకయ్యా! ఈ చీదరింపులు? తీసుకు వస్తున్నావు? అని నేరుగా వేంకటపతినే ప్రశ్నిస్తున్నారు అన్నమయ్య. పాపకర్ముడను, అధమాధముడను, అతి కష్టుడను అయిన నన్ను





తీసికొనివచ్చి విశిష్టాద్వైతమనే మహత్తరమైన మతమునిచ్చి రక్షించావు నీవు. అది ఏవగింతలు తెచ్చినా సరే.

**తాత్పర్య వివరణ:**

దైవమా! పరదైవమా! (మోక్షప్రదాతవైన వోదైవమా) నాకు ఏవగింతలు (ఛీత్కరింపుల) నన్నింటిని యెట్టు దెచ్చేవో (ఎందుకు తెస్తున్నావయ్యా!)

పాపకర్ములు చేయుటయందే ప్రీతికలిగిన తెచ్చి, పరమీదలంచిన (మోక్షమిచ్చెదమని అనుకొనినా) వాడు మేపులకె పోక (తిండిమీద వున్న యావ వదలిపెట్టి) మెయికొనేనా (శరీరత్యాగం చేయగలడా?) దీనికి తోడు నీవే తీయటి సుఖాలూ, చక్కటి రమణులను కావాలని అంటగట్టితే ఏ పొద్దునైనా నీవెందుకు గుర్తువస్తావు?

నాబోటి అధమాధముని (పనికిరానివాళ్ళ అందరిలోనూ పనికిరానివాడిని) తెచ్చి ఉత్తముడిని చేద్దామనుకొంటే విధినిషేధము మీరగలడా? దీనికితోడు నీవే వాడికి నిధులు నిధానము (ఐశ్వర్యములు నిక్షేపములు) అంటగట్టితే? పెక్కు విధములైన భోగాలు వెదజల్లితే, ఇంకా వాటివెంట పోకుండా యెట్లా వుంటాడు? మరి ఇప్పుడు నన్ను ఏవగించుకొంటే ఏమి లాభం?

అతి కష్టుడయిన (కష్టభూయిష్టమైన జీవితం గడుపుతున్న) నాకు అలవిగాని (దుస్సాధ్యమైన) ఈ మతము (విశిష్టాద్వైతమతమును) ఇచ్చినంతమాత్రాన నేను దానిపై ఆసక్తిగలవాడినవుతానా? సాటిలేని శ్రీవేంకటేశ్వరా! నీ నామసంకీర్తన నాకు అందుకే ఇచ్చావు. దానిని ఇక వదలను. ఆ నామామృతం జుఱ్ఱుతూనే వుంటాను.

**పద్యవివరణ:**

తే.గీ॥ **దైవమా! పరదైవమా! తెచ్చేదేల?**
**ఏవగింతలు నాకిన్ని యెట్టులయ్య!**
**వేంకటేశ్వరా! ప్రతిలేని వేలుపీవు**
**నీదు నామామృతంబిచ్చి నిలిపినావు.**

సంఖ్య: XVII/444 రాగం : పాడి
కీర్తన : కొమ్మల జవ్వనముల కోరువట్టేవా

**పాడి**

**70 కొమ్మల జవ్వనములు కోరువట్టేవా**
**కమ్మర మా కోరికెలు గాదె బోసేవా ॥పల్లవి॥**

**నామనసు అడుగ నేల నమ్మించ నీ కేల**
**కోమలపు మాగుణాలు కొలవట్టేవా**
**యేమీ మాకుచగిరు లెంత లెంత లాయ నేమి**
**లేమల చక్కఁదనాలు లెక్క వ్రాసేవా ॥కొమ్మల॥**

**యెక్కువ మా కనుఁగవ లెంత ఘన మాయ నేమి**
**కక్కసించి యిందులో సుంకము గొనేవా**
**చక్కని మాగోళ్ళివి సరి గానీ బేసి గానీ**
**పక్కన వినియు నాతో పందె మాడేవా ॥కొమ్మల॥**

**మంతనాలు నెరపేవు మరురాజ్యపదవికి**
**యింతటికీ నన్నుఁ బట్ట మేలించేవా**
**చెంతలఁ గూడితి విదె శ్రీవేంకటేశ నీవు**
**సంతనాన గోరి లచ్చన వెట్టేవా ॥కొమ్మల॥ 444**

**ఉపోద్ఘాతము:**
సరస శృంగారకీర్తనలు చెప్పటంలో తన తండ్రి అన్నమయ్యవలె పెదతిరుమలయ్యదికూడా అందె వేసిన చెయ్యి. ఓ శ్రీవేంకటేశ్వరా! కొమ్మల జవ్వనములు వంతుల ప్రకారం కాజేసేవా? అటుపిమ్మట మాకోరికలు కూడబెట్టేవా స్వామీ అని కీర్తిస్తున్నారు. పెదతిరుమలయ్య ఇంకా క్లిష్టమైన భాష ఉపయోగించాడని నా భావన. స్వామీ! నీవు సంతనాన గోరి లచ్చన వెట్టేవా అంటున్నారు అంటే యేమిటో ఊహించగలరా? అయితే మీరు పెదతిరుమలయ్య కీర్తనలు ఈ వివరణ లేకుండా తెలుసుకోగలరని నమ్మకంగా చెప్పవచ్చును.





**తాత్పర్య వివరణ:**
ఓ శృంగారరాయా! కొమ్మల జవ్వనమును తరుణములోనున్న భామల యౌవనమును కోరువట్టేవా (వంతులుగా కాజేస్తావా?) కమ్మర (అంతకు మించి) మా కోరికలు గాదె బోసేవా? (ఒక్కుమ్మడిగా కూడబెట్టి అలరించేవా)

స్వామీ! నీకు నామనస్సుతో పనేముంది. దాన్ని అడుగవలసిన అవసరమేముంది! నన్ను నమ్మించవలసిన పనేమున్నది? నేడు అనవసరంగా మా గుణగణాలను కొలవట్టేవా? (యెంచెదవా) మా కుచగిరులు యెంతెంత ఉన్నతమైనవైతే నీకేమయ్యా? ఆడవాళ్ళ చక్కదనాలు లెక్క వ్రాయుటయే నీ ఉద్యోగమా యేమి? నీ అంత రసికుడు దొరకలేదని మేమెంతో కంగారుపడుతున్నామా యేమి?

మా కనుగవ (రెండు కళ్ళూ) యెంత విశాలమైనవి అయితే నీకేమయ్యా? కక్కసించి (పట్టుబట్టి) ఇప్పుడు మా దగ్గిర ఇందుకు సుంకము (ట్యాక్స్) తీసికొంటావా యేమి? మేము ఏదో స్త్రీలము, మా ఆటలు మేము ఆడుకొంటుంటే నువ్వు మధ్యలో పైపందేలు కాస్తావా (అటుతిరిగి చేతివేళ్ళు చాస్తే ఎన్ని గోర్లు కనబడుతున్నాయో చెప్పాలన్నమాట. ఇందులో కనిపించే గోళ్ళ సంఖ్యపై పందెము వుంటుంది. కొమ్మలు స్వామిని ఏమి పితూరీ చేస్తున్నారంటే, నీవు వాళ్ళ మాట విని పందెం కాస్తావా?

స్వామీ! నీవు మరురాజ్యపదవికి మంతనాలు నెరపేవు (మన్మథ సామ్రాజ్యము నేలుటకు మంత్రాంగం చేస్తున్నావా? అందుకోసం నన్ను పటిమేలించేవా (దానికోసం నన్ను వలపింతువా?) ఇది మరీ బాగుంది. ఓ శ్రీవేంకటేశ్వరా! నాచెంతకు చేరి నన్ను కూడినావు సంతనాన (హక్కు భుక్తముగా) నన్ను కోరుకొని, లచ్చనవెట్టేవా (నాకు ఖ్యాతి తెస్తావా ప్రభూ!)

**పద్యవివరణ:**
కం॥ **కొమ్మల జవ్వనములు నీ**
**సొమ్మని నువు కోరువట్టి సుఖియించేవా**
**క్రమ్మర పెదతిరుమలయనె**
**పోమ్మోయీ! కోర్కెగాదె బోసేవు హరీ!**

సంఖ్య: I/358 రాగం : సామంతం
కీర్తన : దొరకునా యితనికృప తుదిపదంబు

### సామంతం

**71 దొరకునా యితనికృప తుదిపదంబు**
**అరిదివిభవము లొల్లమనినాఁ బొదలు** ॥పల్లవి॥

**సొంపలర నితఁడు కృపఁజూచు టరుదనికాక**
**యింపు సామాన్యమా యితనికరుణ**
**లంపటముఘనమైన లక్ష్మీకటాక్షములు**
**సంపదలు తోడనే చల్లువెదలాడు** ॥దొర॥

**తగ నితనిపై భక్తి తగలు టరుదనికాక**
**నగుట సామాన్యమా ననిచి యితఁడు**
**జగదేకహితములుగ సరసతలు సౌఖ్యములు**
**దిగులువాయఁగ నితఁడు దిప్పు దీరాడు** ॥దొర॥

**తిరువేంకటాద్రి సిద్ధించు టరుదనికాక**
**మరుగఁ దను నిచ్చునా మరియొకరిని**
**యిరవైనభోగములు యిష్టసామ్రాజ్యములు**
**విరివిగొని యితనిదయవెంటనే తిరుగు** ॥దొర॥ **358**

**ఉపోద్ఘాతము:**
గొప్ప భక్తిరసప్రధానమైన కీర్తన అన్నమయ్య వినిపిస్తున్నారు, ఆస్వాదించండి. ఓ మానవులారా! మేము శ్రీవేంకటేశ్వరుని దాసులము. మాకు భోగభాగ్యములు, సిరిసంపదలు సామ్రాజ్యవైభవములు యెందుకు? ఈయన కృప మేము తుదిపదమైన మోక్షమును సాధిస్తే చాలును. అన్యములు మాకు అనవసరము. సొంపలరగా ఈ దేవదేవుడు కృపజూడాలేగాని ఏ మహాసామ్రాజ్యము దక్కినా అచ్చెరువందవలసిన పనిలేదు. కానీ వచ్చిన చిక్కేమిటంటే ఆ వైభవాలతో అనేక





లంపటాలు కూడా చుట్టుకొంటాయి. ఈయన మరుగు దక్కితే ఇంకా మరియొకరిని దేబిరించాల్సిన పనేమిటి అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ మానవులారా! ఈతని (ఈ శ్రీహరి) కృప దొరుకుట సాధ్యమా? అది దొరికితే ఇక తుది పదము (మోక్షప్రాప్తి) దొరికినట్లే. అయితే ఈతని కృప కలుగగానే మోక్షముకంటే ముందే అరుదైన వైభవములు ఒల్లమనినా (మాకు వద్దు స్వామీ అన్నా) తగులుకొని అనేక చిక్కులు తెస్తాయి.

సొంపలర (సొంపుమీర) ఈతనికృప దొరుకుటే అరదు. మహాసామ్రాజ్యములు కూడా మీకు సుసంపన్నమవుతాయి. అయితే ఆ లక్ష్మీకటాక్షంతోపాటు అనేక లంపటాలు కూడ మెడకు చుట్టుకుంటాయి. దానికి తోడుగానే మరికొన్ని సంపదలు వెదచల్లుతాడు. ఇక దాంట్లోంచి బయటపడేదెన్నడు?

ఇతనిపై భక్తి తగలుట అరుదుగా ఏ జన్మలోనైనా సుసంపన్నమవుతుంది. ఇతడు ననిచి (మనపై అనురాగము కలిగి మనల్ని చూచి చిరునవ్వు నవ్వటం అంత సామాన్యంగా జరిగే పనికాదు.) ఒకవేళ జరిగితే, జగములో అనేక హితవులు సౌఖ్యములు, సరసతలు (ఐశ్వర్యములు) దిగులనేదే యెరుగనంతగా ఈతడిస్తాడు. ఆ విధంగా స్వామి తన ఆశ్రితులను తిప్పుదీరాడు (తీర్చిదిద్దుతాడు).

తిరువేంకటాద్రి సిద్ధించటం బహు అరుదుగా దక్కే సిద్ధి. ఈతని మరుగు (రక్షణ) దక్కితే ఇంకా మరియొకరిని దేబరించాల్సిన పనేమున్నది చెప్పండి. సుస్థిరంగా నెలకొన్న భోగములు ఇష్టమైన సామ్రాజ్య వైభవములు యితని దయ యెక్కడ వుంటే అక్కడకు తిరిగి తిరిగి విరివిగా వచ్చి చుట్టుకొంటాయి. తస్మాత్ జాగ్రత్త!!

**పద్యవివరణ:**

చం॥ **దొరకునె వీని సత్కృపయు తుట్టతుదిన్ అది ముక్తి బాటయై**
**అరిది సుఖంబులొద్దనిన అంటియె తీరును చుట్టుముట్టుచున్**
**తరుగనిలంపటంబులవి దాపగు భక్తిని నిల్వనీదురా**
**తిరుమల వేంకటేశ్వరుని దీవెన బొందుటె యెక్కుడన్నిటన్**

సంఖ్య: I/359 రాగం : ఆహిరి
కీర్తన : చెలినేడు తానేమిసేయునమ్మా!

**ఆహిరి**

**72 చెలి నేఁడు తానేమిసేయునమ్మ**
**చెలి యేమిసేయు నీచెలు లేమిసేయుదురు**
**చెలువైనవిభుమేనిచెలు వింత సేయఁగా** ||పల్లవి||

**సతి నేఁడు బంగారుచవికెలోఁ జిత్రంపు-**
**గతులెంత చూపినఁ గడకంటఁ జూడదు**
**అతనిఁజూచినమంచియబ్బురపుఁజూపులు**
**అతనివెంటనే పోయ నటుగాఁబోలును** ||చెలి||

**తేనియలూరేటి మంచి తియ్యని మాటలు మంత్ర-**
**గానములుగా వినుపించి కడువేసరితిమి**
**వానిమాటలు విన్నవలనైనముదమున**
**వీనులు ముద్రించినవిధముగాఁబోలును** ||చెలి||

**నిచ్చళపుమోమున నెయ్యము దైలువారె**
**బచ్చనచేఁతలు గుబ్బలపైనిండనొప్పెను**
**అచ్చపువేడుక వేంకటాద్రీశుఁడీ రేయి**
**నెచ్చెలికి నిచ్చినట్టి నేరుపుగాఁ బోలును** ||చెలి||

**ఉపోద్ఘాతము:**

అద్భుతమైన సరస శృంగార కీర్తన నావిష్కరిస్తున్నారు అన్నమయ్య. బాలబాలికలకు ఈ కీర్తన అసంగతమే. కాబట్టి వారు తరువాత కీర్తనకు వెళ్ళవచ్చును. ఒక చెలికత్తెగా మారిన అన్నమయ్య మిగతా చెలికత్తెలకు పెళ్ళి అయిన రెండు మూడు రాత్రులతో ఈ పద్మావతీదేవి, శృంగారరాయడైన తన విభుని నుంచి సర్వమూ నేర్చుకొన్నది. ఆమె చూపులలో ఇప్పుడు యేవేవో సమాచారములు బయటపడుతున్నాయి. మంచి చిత్తరువు గీయవమ్మా అంటే తీర్చిదిద్దిన చెవ్వుల బొమ్మల వేస్తుంది మరి ఆయన చెవులంత





ఆకర్షించినవేమో! ఆమె గుబ్బలపై ఆయన బచ్చన చేతల వేడుకయెంతవున్న తన వదనము నెంత నిర్వికారంగా పెట్టిందో చూడండి. మరి ఈ నేర్పులన్నీ ఇంకా ఎవరు నేర్పారమా? అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ సఖీ! ఈ చెలి (పద్మావతీదేవి) నేడు తాను యేమి సేయగలదమ్మా! ఈవిడే యేమీ చేయలేని స్థితిలో వుంటే, ఇక ఆమె స్వంత చెలికత్తెలు యేమిసేయుదురు? చెలువైన (అందగాడైన) విభుని, మేని చెలువు (శరీర సౌందర్యము) ఆమెనింత జేసింది, మరి.

ఆ సతి పద్మావతి నేడు తన బంగారు చవికెలో (సౌధములో) చిత్రమైన గతులు (చేష్టలు) మేము ఆమెను నవ్వించుటకు చూపినా, కడకంట (కను కొలుకుల) నుండి కూడా చూచుటలేదు. అతనిని చూచినంత సంభ్రమకర మైన చూపులు అతని వెంటనే పోయినవేమో అన్నట్లు బిత్తర చూపులు చూస్తున్నది.

ఆమెకు తన ప్రియుని మాటలు, తేనెలూరే తియ్యందనము గలవైనందున అవి తన కళ్యాణమున మంత్రములుగా పురోహితులు గానము చేయుచున్నట్లు అనిపించి తానూ చదివి అలిసిపోయింది. ఆమె స్థితిని చూచి మేమూ నీరసించిపోయాము. వాని మాటలు వినివినీ నేడు చిత్రలేఖనము చేసే ఆమె హంసతూలికనుండి వీనుల (చెవుల) చిత్తరువులే గీయుచున్నది. అందుకే కాబోలు ఆమె చిత్రకళాభ్యాస మందిరము నిండా చెవుల బొమ్మలే కనుపించుచున్నవి.

ఈ పద్మావతీదేవి యొక్క నిశ్చలమైన, మోమున (వదనమున) నెయ్యము (ప్రేమ) దైలువారె (అతిశయించినది). ఆమె విభుని చిత్రవిచిత్రములైన చేతలు చనుగవపై నెరపి అతిశయించినవి. అచ్చమైన (మెండైన) వేడుకలతో శ్రీవేంకటేశ్వరుడు, ఈ రేయి ఆమెకు నేర్పిన జాణతనము వలన కాబోలు ఆమె యెంతో గుంభనముగానున్నది.

**పద్యవివరణ:**

ఆ.వె|| **చెలియనేడు తాను సేయునమ్మా! యేమి?**
**నీ చెలులును యేమి నెరుపగలరు.**
**విభుని మేని చెలువు వింత సేసీనమ్మ!**
**నేర్చె వేంకటేశు నెలతయన్ని.**

సంఖ్య: I/3 రాగం : సామంతం
కీర్తన : అతడే సకలవ్యాపకు డతడే యాతురబంధువు

## సామంతం

73 అతఁడే సకలవ్యాపకుఁ డతఁడే యాతురబంధువుఁ-
డతఁడు దలఁపులముంగిట నబ్బుట యెన్నఁడొకో ॥పల్లవి॥

సారెకు సంసారంబనుజలనిధు లీఁదుచు నలసిన-
వారికి నొకదరిదాపగువాఁ డిఁక నెవ్వఁడొకో
పేరినయజ్ఞానంబనుపెనుఁజీఁకటి తనుఁగప్పిన
చేరువవెలుఁగై తోఁపెడిచెలి యిఁక నెవ్వఁడొకో ॥అత॥

దురితపుకాననములలో త్రో వటుదప్పినవారికి
తెరు విదె కొమ్మని చూపెడిదేవుఁ డి (డ?) దెవ్వఁడొకో
పెరిగినయాశాపాశము పెడగేలుగఁ దనుఁగట్టిన
వెరవకుమని విడిపించేటివిభుఁ డిఁక నెవ్వఁడొకో ॥అత॥

తగిలినయాపదలనియెడిదావానలములు చుట్టిన
బెగడకుమని వడినార్పెడిబిరు దిఁక నెవ్వఁడొకో
తెగువయుఁ దెంపును గలిగినతిరువేంకటవిభుఁ డొక్కఁడే
సొగసి తలంచినవారికి సురతురువగువాఁడు ॥అత॥ 3

**ఉపోద్ఘాతము:**

"ఆతురబంధువు" అంటే రోగార్తులకు బంధువువంటివాడు అని అర్థం. ఓ భక్తులారా! ఆ శ్రీహరియే సర్వవ్యాపకుడు. అతడే రోగార్తులకు చేయూత. ఆ మహానుభావుడు నా తలపుల ముంగిట అమరియుండే భాగ్యము నాకెన్నడు కలుగుతుందో కదా! అంటున్నారు అన్నమయ్య. మేము సంసారసాగరాన్ని ఈదలేకపోతున్నాము. అజ్ఞానపు పెనుజీకట్లలో మగ్గిపోతున్నాము. చేసిన పాపములనెడి చిట్టడవిలో దారితప్పినాము. మా





రెండు పెడరెక్కలను ఆశాపాశం విరిచికట్టేసింది. ఆపదలు అనెడి దావాగ్నిలో మండి మసి అవబోతున్నాము. ఇటువంటి దుస్థితిలో మాకు రక్షకుడు తిరువేంకటేశ్వరుడు కాక ఇంకెవ్వరు? అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ భక్తులారా! అతడే (ఆ శ్రీహరే) సకలవ్యాపకుడు (అంతటా వ్యాపించియున్నాడు). ఆ దేవదేవుడే అతడేమన ఆతురబంధు (మనలో రోగార్తులకు దగ్గర చుట్టము). అతడు మన తలంపుల ముంగిట అబ్బుట (అమరియుండుట) యెన్నడొకో (ఎప్పుడు తటస్థపడుతుందో కదా!)

ప్రతిసారీ సంసారసాగరమున బడి ఈదుచు అలసిపోతూనేవున్న నన్ను ఆ వార్ధిలోని నన్ను ఒక ఒడ్డుకు చేర్చగల వాడిక యెవ్వరున్నారు? పేరుకుపోయిన అజ్ఞానము అనే చీకట్లు చుట్టుముట్టితే, దగ్గరలోనే వున్న వెలుగు రేఖయై త్రోవ చూపెడి చెలికాడు ఇంకొకరెవ్వరున్నారు?

దురితపు కాననముల (మనము చేసిన పాపములనబడే అడవులలో) దారితప్పితే మనబోటివారికి ఇదే సరియైన దారిరా ఇటుపో అని దిక్దర్శనము చేసెడి దేవుడింకొకడెవరయ్యా! అమితమైన ఆశాపాశమున పెడరెక్కలు విరిచి కట్టేస్తే భయపడకు నాన్నా! అని వచ్చి విడిపించే నాథుడు మరొకరున్నారా? లేరుగాక లేరు.

తగులుకొన్న ఆపదలు అను దావానలము (కార్చిచ్చు) చుట్టుముట్టినప్పుడు బెగడకు (భీతి చెందకు) అని ధైర్యం చెప్పినట్లు వేగముగా వాటిని ఆర్పివేయగల బిరుదు (ఉద్దండుడు) యెవ్వడొకో? తెగువ తెంపు కలిగిన శ్రీవేంకటేశ్వరుడు ఒక్కడే అని గ్రహించండి. సొగిసి (ఇంపుగా) తలచి ధ్యానించినవారికి ఆ కొండలయ్య సురతరవగువాడు (కోరికలను తీర్చే దేవలోకపు కల్పవృక్షమువంటివాడు).

**పద్యవివరణ:**

కం॥ **అతడే సకలవ్యాపకు-**
**డతడే ఆతురల బంధుడతడు తలపులం-**
**దతిచేరువయై యొప్పెడి**
**గతినాకెన్నడొకొయనుచు కనలెదను హరీ!**

సంఖ్య: XVII/446 రాగం : ముఖారి
కీర్తన : ఎంతవొద్దులేదు నీకు నేమి సేయరాదు నన్ను

**ముఖారి**

**74 ఎంత వొద్దు లేదు నీకు నేమి సేయరాదు నన్ను**
**మంతనమైనదాఁకా మన్నించరాదా** ||పల్లవి||

**నగి నగి యలపయ్యీ నవ్వుల నీ మాటలకు**
**మగటిమిఁ గొంతవడి మానరా యింక**
**చిగురించిఁ జెనకఁగ సిగ్గయ్యీఁ గడుంగడు**
**వెగటు మానినదాఁకా విడువరాదా** ||ఎంత||

**చూచి చూచి సొడగిలి సొంపుల నీ చేఁతలెల్ల**
**తాచి తెరమాఁటుకైనా దలఁగరాదా**
**వాచవిమాటలాడఁగ వాడె నిదె నా మోవి**
**చేచేత దగ్గరుదాఁకా సెలవియ్యరాదా** ||ఎంత||

**కూడి కూడి నిద్ర వచ్చీఁ గూరిమి నీ రతులను**
**వూడనికౌఁగిట గొంత వుండఁగరాదా**
**జాడతో శ్రీవేంకటేశ సరుసఁ బెండ్లాడితివి**
**యీడుజోడాడినదాకా నియ్యకొనరాదా** ||ఎంత|| **446**

**ఉపోద్ఘాతము:**

ఓ శృంగారరాయా! నీకెంత వొద్దికలేదయ్యా? నీతో చెలిమి చేస్తున్న నన్ను యేమి చేయరాదు? కనీసం ఏకాంతం దొరికేవరకన్నా నన్ను మన్నించరాదా? అంటున్నది నాయిక. పెదతిరుమలాచార్యులు చెప్పిన కీర్తననాస్వాదించండి. కొంచెం శ్రమపడితేగాని ఇటువంటి శృంగారకీర్తనలు వివరించలేము. స్వామీ! ఆమెనిప్పుడేకదా పెండ్లాడినావు.





ఈడుజోడు ముచ్చట పూర్తి అయ్యేదాకా నామాటలకు అంగీకరించరాదా? అంటున్నది నాయిక. కొంచెం శ్రమపడక తప్పదు మరి.

**తాత్పర్య వివరణ:**

ఓ శ్రీవేంకటేశ్వరా! యెంతవొద్దు లేదు నీకు (నీకెంత ఒద్దికలేదయ్యా?) నీకింతటి చనువిచ్చిన నన్నేమిసేయరాదు? (ఏమైనా చెయ్యవచ్చును). మంతనమైనదాకానైనా (మనిద్దరికీ ఏకాంతం దొరికే దాకా) నన్ను మన్నించవయ్యా!

నీ చిలిపి మాటలు విన్న తరువాత నాకు యెంత నవ్వు వస్తోందంటే నవ్వినవ్వి నాకు యలపయ్యీని (అలసట వచ్చేసింది). చిగురులువంటి నా అధరములను నీవు చెనకగా (తాకగానే) నాకు సిగ్గుముంచుకు వచ్చేసింది. వెగటుమానినదాకా (నీ చొరవకు అలవడేదాకా) నన్ను విడిచిపెట్టకూడదా?

చూడగా చూడగా సొంపైన నీ చేతలన్నీ సొడగిలినట్లున్నవి. (నేను సోలిపోవునట్లు వున్నవి. నీ చిలిపితనము దాచిపెట్టి కాస్త తెరచాటునైనా చూసుకొనవద్దా? ప్రియసంభాషణలు చేసిచేసి నా ఓష్టము యెండిపోయినది. నన్ను నీదగ్గరకు పంపేదాకా నాకు కాస్త సెలవియ్యరాదా!

ఓ శృంగారరాయా! నీవు కూడికూడి నాకు నిద్ర వచ్చేస్తున్నది. నీకూరిమి రతులకు అలిసిపోయాను. ప్రభూ! వూడని కౌగిట (బిగి సడలని పరిష్వంగములలో) కొంత వుండగ రాదా (ఒకింత తడవు వుండరాదా?) ఓ శ్రీవేంకటేశ్వరా! నా జాడ తెలిసికొని నా సరసకు జేరి పద్మావతీ పరిణయమని జగద్విఖ్యాతి దెచ్చినావు. కాసేపయ్యాక ఈడూజోడూ అనే ముచ్చట జరుగుతుంది. అది ఆడేదనుకనైనా ఇయ్యకొనరాదా (సమ్మతించరాదా)?

**పద్యవివరణ:**

ఆ.వె|| **ఎంతవొద్దులేదు ఏమోయి నీకు న-**
**న్నేమిసేయరాదు? యేమిటయ్య!**
**మంతనమగు దాకమన్నించరాదొకో!!**
**వేంకటేశ! యనెను పెదతిరుమల.**

సంఖ్య: I/299    రాగం : భూపాళం
కీర్తన : ఏలవచ్చీ యేలపోయీ నెందుండీ ప్రాణి

**భూపాళం**

**75 ఏలవచ్చీ యేలపోయీ నెందుండీఁ బ్రాణి**
**తోలుతిత్తిలోనఁ జొచ్చి దుంక దూరనా** ||పల్లవి||

**పుట్టులేక నరకాలపుంగుడై తా నుండక యీ-**
**పుట్టుగున కేల వచ్చీ పోయీఁ బ్రాణి**
**పుట్టుచునే కన్నవారిఁ బుట్టినవారి నాసలఁ**
**బెట్టిపెట్టి దుఃఖములఁ బెడరేఁచనా** ||ఏల||

**భూతమై యడవిలోఁ బొక్కుచుఁ దా నుండక యీ-**
**బూతుజన్మమేల మోఁచెఁ బుచ్చినప్రాణి**
**రాతిరిఁబగలు ఘోరపుఁబాటు వడిపడి**
**పాతకాలు చేసి యమబాధఁబడనా** ||ఏల||

**కీటమై వేంకటగిరి కిందనైన నుండక యీ-**
**చేటువాటుకేల నోఁచె చెల్లఁబో ప్రాణి**
**గాటమైనసంపదల కడలేనిపుణ్యాల-**
**కోటికిఁ బడగెత్తక కొంచెపడనా** ||ఏల|| **299**

**ఉపోద్ఘాతము:**

మన శరీరం ఒక తోలుతిత్తి వంటిది. ప్రాణి అని పిలువబడే ఈ జీవుడు ఈ తిత్తిలోనికి దూరినాడు. ఎట్లాదూరాడు, దానికున్న దుంకదూరినాడు (రంధ్రములలో యేదో ఒక రంధ్రములోంచి దూరినాడు). ఎందుకు వచ్చాడో, యెందుకు పోతాడో యెవరికీ తెలియదు. ఇది అన్నమయ్య కీర్తన. అంత తేలిక కాదు.

పుట్టుకలేక నరకాలలో పడివుండక ఈ ప్రాణి యెందుకు పుడుతున్నాడో తెలియదు. పుడుతూనే తన వాళ్ళకి ఆశలు కలిగిస్తాడు. అందరికీ ఆశలు



హరి నీమయమే అంతాను

పెట్టీపెట్టీ తీరనిదుఃఖము మిగిల్చి కనుమరుగవుతాడు. వాడి దురాశాపూరిత పాపకర్మలవల్ల కీకారణ్యములో వస్త్రాలు కూడా లేని జంతు జన్మలో మగ్గుతాడు. రాత్రింబవళ్ళూ మళ్ళీ యమబాధలు అనుభవిస్తాడు. దానివల్ల కీటకమై ఎలాగో వేంకటాద్రి చేరి స్వామిని చూచి కోటికి పడగలెత్తే జన్మపొందుతాడు. ఈసారియైనా శ్రీహరిని నమ్మితేనే భక్తి ఆపై ముక్తి.

**తాత్పర్య వివరణ:**

మానవుని శరీరం తోలుతిత్తి వంటిది. దీనికి దుంకలు (రంధ్రములు) తొమ్మిది వున్నాయి. ప్రాణి (ఆత్మ) ఈ దేహంలోకి ప్రాణమువలె దూరుతుంది. ఏలవచ్చీ (ఎందుకువస్తుందో) యేల పోయీ (ఎందుకు పోతుందో) ఎందుండి వస్తుందో ఎవ్వరికీ తెలియదు.

పుట్టుకలేని ఆత్మలుండే చోట అది నరకమైనా అక్కడే తానుండక పుట్టుటకోసం ఎందుకు ఈప్రాణి వస్తూ పోతూ వుంటాడో, యెవ్వరికీ తెలియదు. పుడుతూనే కన్నవారికి తనవారికీ అంతులేని ఆశలు పెట్టీ పెట్టీ (కలిగించి) చివరికి నిష్క్రమిస్తాడు. అదీ యెందుకో, యెప్పుడో, యెలాగో ఎవ్వరికీ తెలియదు.

భూతమై (ప్రేత రూపమున) అడవిలో కనపడినదానిని బొక్కుచు అలాగే వుండక ఈ బూతు జన్మలో (వస్త్రములే ధరించని జంతు జీవితంలో) మోచేతులపై దేకుతాడు. రాత్రింబవళ్ళూ ఘోరమైన పాట్లు పడీపడీ పాతకాలు ఇంకా చేసి దానివల్ల ఇంకా యమబాధలు పడతాడు.

చివరికి ఎలాగో అలాగ శ్రీవేంకటాద్రిపై కీటకమై జన్మిస్తాడు. అక్కడ అలా వుండక శ్రీవేంకటేశ్వరుని దర్శిస్తాడు. చెల్లబో! (అమ్మయ్య) ఇక అలా వుండక ఆ పుణ్యం వలన. అంతులేని సంపదలున్న జన్మ పొందుతాడు. ఆ జన్మలో కూడా అంతులేని పుణ్యం చేసి శ్రీహరి శరణాగతుడైతే, ముక్తి పొందుతాడు. లేదా సిరిసంపదలలో చెడిపోయి మళ్ళీ కథ మొదటికే వస్తుంది.

**పద్యవివరణ:**

కం|| **ఎందుండి యిటకు వచ్చెను?**
**ఎందులకది వచ్చె? ప్రాణి యేటికి బోయెన్**
**కందువ శ్రీహరి తలపగ**
**అందిన యీ తోలుతిత్తి యందున దూరెన్.**

సంఖ్య: XX/321 రాగం : శ్రీరాగం
కీర్తన : నిలువుల మేడలో నిలుచున్నా డిదె

### శ్రీరాగం

**76 నిలువుల మేడలో నిలుచున్నాఁ డిదె**
**పిలువవే రమణునిఁ బ్రేమముతోడ** ||పల్లవి||

**చలివేఁడిచేమటల జలకమార్చవే**
**అలసి వచ్చెఁ బతి యందుండి**
**పలుకుల కపురపుబాగా లీవే**
**తలఁపుల తమకపుదాహము గొనెను** ||నిలు||

**తనుపులకవిరులఁ దగఁ బూజించవే**
**తనకుఁదనకె నినుఁ దగిలీని**
**కనుఁగొన నవ్వులగందము పూయవే**
**వెనకటి విరహమపువేదన దీర** ||నిలు||

**పోరి మోవితేనెబువ్వము దొడుకవే**
**గరిమరతుల నాఁకలి గొనెను**
**మరిగి యితనితో మంతనమాడవే**
**యిరవుగ శ్రీవేంకటేశుఁడు గూడె** ||నిలు||

**ఉపోద్ఘాతము:**

ఎత్తైన మేడమీద నిలుచుని వున్నాడే, ఆ నా విభుని పిలవండమ్మా! ప్రేమముతో నా రమణుని నామాటగా ఆహ్వానించండి. శ్రీదేవి పలుకులను అన్నమయ్య ఈ శృంగార కీర్తన ద్వారా వినిపిస్తున్నారు. ఎండన బడి వచ్చే పతి సేదయెలా తీర్చాలో వివరిస్తున్నారు. నీ అధరామృతమునే ఆయనకు ఆహారముగా నివ్వవమ్మా! అర్ధరాత్రి వేళ రతుల అలసట చేత





ఆకలివేయవచ్చును. అది చెప్పటానికి స్వామి కాస్త ఇబ్బంది పడుతుండవచ్చును. ఆయనతో రహస్యంగా సంప్రతించి కనుక్కోవమ్మా! శ్రీవేంకటేశుడిదె నిన్ను కూడి మురియుచున్నాడు, అంటున్నారు. చరణాల వివరణ కావాలంటే తాత్పర్య వివరణ చదవాల్సిందే.

**తాత్పర్య వివరణ:**

ఓ చెలియా! నా రమణుడు నిలువెత్తు మేడలో పైననే నిలుచునియున్నాడు. ఇదే ఆయనను పిలువవే. కాస్త ప్రేమగా పిలువవే నా రమణుని.

చలికాలంలో ఎండ వేడిమి ఇంకా వుబ్బబెట్టి చెమట అధికమవుతుంది. ఆ తడి ఒళ్ళు ఆర్చవమ్మా! (పొడి చేయవమ్మా) అందుండి (అక్కడెక్కడనుండో) నీ పతి అలసిపోయి వచ్చాడు, మరి. నీపై వచ్చిన తలపుల వలన (ఆలోచనల మూలంగా) పారవశ్యంతో ఆయనకు దాహము వేసి నోరు యెండిపోయింది. నములుటకు కర్పూరపు పలుకులుగల వక్కపొడిని అందించవమ్మా!

నీ తనువు పులకరించుటవలన ఆ పులకలు విరులవలె (పూవుల మాదిరి) తేలినవి. అవే పువ్వులన్నట్లు ఆయనను పూజించవే. తనకు తానే నీకు తగులు అవుతాడు. ఇక నిన్ను వదలడు. నీ నవ్వులే పరిమళ గంధముగా ఆయనకు బూయవే. వెనకటి విరహము (తొలిరాత్రిముందు విరహం) కూడా తీరిపోతుందమ్మా!

పోరి (క్రమముగా) అధరామృతమనే (పెండ్లి భోజనం), దొడకవే (గ్రహింపవే). రతుల మధ్యలో ఆకలి వలన ఆయన చీకాకు పడతాడేమో? ఇతనితో అతిశయించి మంతనములాడవే (రహస్య సమాలోచనలు) చేయవమ్మా! శ్రీవేంకటేశ్వరుడు అనుకూలుడై నిన్ను కూడినాడు. విడువకమ్మా!

**పద్యవివరణ:**

ఆ.వె|| **నిలువు మేడలోన నిలుచున్న వాడదే**
**పిలువవే రమణుని బ్రేమతోడ**
**పూనిమోవితేనె బువ్వము దొడుకవే**
**వేంకటపతి గూడివెలది! నీవు.**

సంఖ్య: I/329 రాగం : శ్రీరాగం
కీర్తన : కొంచెమును ఘనముగనుగొననేల హరి దలచు

### శ్రీరాగం

**77 కొంచెమును ఘనముఁగనుఁగొననేల హరి దలచుఁ**
**పంచమహాపాతకుఁడే బ్రాహ్మణోత్తముడు** ||పల్లవి||

**వేదములుచదివియును విముఖుఁడై హరికథల-**
**నాదరించని సోమయాజికంటె**
**యేదియును లేనికులహీనుఁడైనను విష్ణు-**
**పాదసేవకుఁడువో బ్రాహ్మణోత్తముఁడు** ||కొంచె||

**పరమమగు వేదాంతపఠన దొరకియు సదా**
**హరిఁదలఁచలేని సన్న్యాసికంటె**
**మరిగి పసురముఁదినెడి మాలయైనను వాఁడె**
**పరమాత్ముఁ గొలిచినను బ్రాహ్మణోత్తముఁడు** ||కొంచె||

**వినియుఁ జదివియు రమావిభునిఁ దలఁపక వృథా**
**తనువు వేఁపుచుఁ దిరుగుతపసికంటె**
**చనవుగలవేంకటేశ్వరుదాసులకు వెంటఁ**
**బనిదిరుగునధముఁడే బ్రాహ్మణోత్తముఁడు** ||కొంచె|| **329**

**ఉపోద్ఘాతము:**

కొంచెముకూడా ఘనముగా కనుగొననక్కరలేదు. ఈ మాట అతిశయోక్తి కాదు. ఎప్పుడూ హరిని దలంచే పంచమహాపాతకుడే బ్రాహ్మణోత్తమునివంటివాడు, అని అంటున్నారు అన్నమయ్య. కులహీనుడైన విష్ణుభక్తుడే గొప్ప సోమయాజులవారికంటే మిన్న. విష్ణుపాదసేవకుడే నిజమైన బ్రాహ్మణోత్తముడు. వేదాంతపఠనం చేస్తూ





కూడా హరిని తలచని సన్యాసి కంటే విష్ణుదాసుడై పశువుల్ని తినే మాలవాడే మేలు. రమావల్లభుని తలవని తపస్వి ఏం సాధిస్తాడు అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

కొంచెముగానైనా ఘనముగా కనుగొననక్కరలేదు. హరిని దలచు (ధ్యానించే) పంచమహాపాతకుడే అసలైన బ్రాహ్మణోత్తముడు.

వేదములనన్నింటిని చదివియునూ వాటియందు విముఖుడై, హరి కథా శ్రవణమును వినని సోమజాయులవారికంటే యేదీలేని కులహీనుడైననూ విష్ణుపాదసేవకుడే నిజమైన బ్రాహ్మణోత్తముడు.

పరమమగు (ముక్తిప్రదమైన) వేదాంతపఠనము లభించికూడా దానియందు ఇచ్ఛలేక, సదా (యెల్లవేళలా) హరిని దలచుకొనని సన్యాసికంటే మరిగి (అందుబాటులోవున్న) పశురము (జంతువును, తిని క్షుద్బాధ తీర్చుకొనే మాలవాడైననూ పరమాత్మను కొలిచే వాడైతే ఆతడే నిజమైన బ్రాహ్మణోత్తముడు.

రమావల్లభుడు (లక్ష్మీపతి) అయిన శ్రీమన్నారాయణుని వినియు చదివియు ఆయనను స్మరించకపోతే ప్రయోజనమేమిటి? వాని జన్మంతా వృథా (వ్యర్థమే)

తనువు వేపుచు (శరీరాన్ని కృశింపజేయుచు) చరించే తపస్వికంటే, అందరికీ అనుకూలుడైన శ్రీవేంకటేశ్వరుని దాసుల వెంటబడి తిరిగే అధముడైన బ్రాహ్మణుడే నిజమైన బ్రాహ్మణోత్తముడు.

**పద్యవివరణ:**

కం|| **కొంచెమును ఘనము కాదుర**
**ఎంచగబనిలేదు హరిని యెపుడుదలంచే**
**పంచమహాపాతకుడున్**
**ముంచిన సద్బ్రాహ్మణోత్తముడె ధాత్రిని పో**

సంఖ్య: XX/450 రాగం : దేవగాంధారి
కీర్తన : తొడిబడసందుసుడిదొంగాడిని

## దేవగాంధారి

**78** **తొడిఁబడ సందుసుడిదొంగాడిని**
**వెడఁగుఁగొప్పుశిరసు వెన్న ముద్దకృష్ణుఁడు** ||పల్లవి||

**ఆదిగొని నేరాఁగా నఱచేతివెన్నముద్ద**
**పాదుకొన నోర నిండాఁ బావుకొన్నాఁడు**
**సాదించీ నామాఁటాడఁ దచ్చుమయ్యినగోలవలె**
**యీదెసఁ జట్టిలో వెన్న యియ్యవచ్చీఁ జేతికి** ||తొడిఁ||

**కుత్తుకబంటిదాఁకా గూనలో పాలెల్లాఁ దాగి**
**యెత్తుకవున్నాఁడు మొగ మిందుదాఁకాను**
**యెత్తుకొనఁ బిలిచితే యెంతైనాఁ గదలఁడు**
**వొత్తిపట్టి వూఁదుకొనీ నొకచేత నేలను** ||తొడిఁ||

**పెరుగుమీఁగడలెల్ల పిన్నవాండ్ల కందిచ్చి**
**దొరవలె లోననుండి తొంగిచూచీని**
**యెరవు లేక శ్రీవేంకటేశుఁడని మొక్కి తేను**
**ఇరవైతినని నవ్వీ నిట్టె సెలవులను** ||తొడిఁ||

**ఉపోద్ఘాతము:**

ఉద్ధగిరిలో వెలసిన వెన్నముద్ద కృష్ణునిపై అన్నమయ్య చక్కటి కీర్తన వినిపిస్తున్నారు. ఇది యెంతకూ అర్ధంకాని తెలుగు కీర్తన. తాత్పర్యవివరణ చూడకుండా దీని భావం వివరించటానికి ప్రయత్నించండి. ముందు 'పల్లవి'ని చూచి చెప్పండి. "ఈ వెన్నముద్ద కృష్ణుడు, వెడగుగొప్పుదాల్చిన (చిన్ని కొప్పు నెత్తిమీద కట్టిన) కృష్ణుడు. వీడు తొడిబడసందుసుడి దొంగాడు, (ఒప్పందాలు చేసికొంటూ అవకాశాన్నిబట్టి చటుక్కున దొంగతనం చేసే) కృష్ణుడు-అంటున్నారు. ఓ వెన్నముద్దకృష్ణా! నీవే మొక్కిన వరములిచ్చే వేంకటేశుడవు అని అనండి. మధురంగా లేత నవ్వులు యిట్టే వొలకబోస్తాడు.





**తాత్పర్య వివరణ:**

ఈ వెన్నముద్దకృష్ణుడు తొడిబడు (ఒప్పందాలు కుదుర్చుకొనే) సందెసుడి దొంగాడు (అవకాశమును బట్టి చటుక్కున దొంగతనంచేసే చోరశిఖామణి). వీడు చూడటానికి బుద్ధిమంతుడే. వెడగు గొప్ప శిరసు (చిన్న కొప్పు నెత్తిమీద కట్టిన తలతో చూచుటకు ముద్దులొలుకుతాడు).

ఆదిగొని (కన్నువేసి) అరచేతిలో దాచుకొని తినబోతున్న వెన్నముద్దను, నేరాగా (నేను రాంగానే) చటుక్కున తెరచిన నోటినిండా కుక్కుకొని ఆ కంగారులో సగం నోటినిండా పాముకొన్నాడు (వ్రాసుకొన్నాడు). నేను సాధిస్తున్నట్లు నిష్ఠూరంగా మాట్లాడగానే అచ్చం గొల్లవానివలె ఉడుక్కొని నేను జట్టిలో (అమ్మకానికి దాచుకొన్న) వెన్న యియ్యవచ్చీ (ఇంద నీవెన్న నీవే తీసికో) అని నావెన్న నాకే ఇస్తాడు.

ఒక రోజున మెల్లగా వంటింట్లోకి వెళ్ళి, గూనీలోని పాలెల్లా (పెద్దకుండలో మేము అమ్మకానికి దాచుకొన్న పాలు అన్నీ) కుత్తుకబంటి దాగి (గొంతుక దాకా త్రాగి) మమ్మల్ని చూడంగానే తడి ఆరిపోయిన పాలవాసన కొట్టకుండునట్లు, నోరు తెరచుకొని మొగమును ఎత్తిపట్టి గాలిలో నిలుచున్నాడు. మేము వెళ్ళి ముద్దుచేసి ఎత్తుకొంటాము దగ్గరకు రమ్మంటే, ఎంతకీ రాడే. పైగా మమ్మల్ని దూరంగా వుంచటానికి తన కొమ్ముబూర యెత్తిపట్టి ఒకచేతితో చెవులు కప్పుకొని ఏలపాట పెద్దగా పాడుతాడు. అన్నీ దొంగవేషాలే.

మేము అమ్మకానికి పెరుగు మీగడను కడవల్లో దాచుకొంటే, దాన్ని తనతోటి గొల్లపిల్లగాండ్లకు అందించి తాను దొరగారిలాగ లోపల నుండి బయటకు తొంగి చూస్తుంటాడు పెద్దవాళ్ళెవరన్నా వస్తున్నారా అన్నట్లు. ఇన్ని చిలిపి పనులు చేసినా ఈ మన శ్రీవేంకటేశ్వరుడే ఆనాటి వెన్నముద్ద కృష్ణుడు. నాకు మొక్కండి ఈనాడు నేనే మీరు ఏమి కోరితే అదిస్తాను అని అన్నట్లు సెలవినవ్వులు (మధురమైన లేత నవ్వులు) చిందిస్తున్నాడు.

**పద్యవివరణ:**

చం|| **తొడిబడసందుచూచికొని దొంగతనంబులు చేయుధూర్తుడున్**
**వెడగుశిరస్సుగొప్పు మన వెన్నలముద్దల దొంగ, వెన్న మీ-**
**గడలను తోటిపిల్లలకు గక్కున పంచును తాను నేతయై**
**ఎడయక వేంకటేశునిగ యెక్కెనుకొండలు వెన్నకృష్ణుడై.**

సంఖ్య: IV/33 రాగం : దేసాళం
కీర్తన : చదివి బ్రతుకరో సర్వజనులు మీరు

**దేసాళం**

**79 చదివి బ్రతుకరో సర్వజనులు మీరు**
**కదిసి నారాయణాష్టాక్షరమిదియే ॥పల్లవి॥**

**సాదించి మున్ను శుకుఁడు చదివినట్టిచదువు**
**వేదవ్యాసులు చదివినచదువు**
**ఆదికాలపువైష్ణవులందరినోటిచదువు**
**గాదిలినారాయణాష్టాక్షర మిదియే ॥చది॥**

**సతతము మునులెల్ల చదివినట్టిచదువు**
**వెతదీర బ్రహ్మ చదివినచదువు**
**జతనమై ప్రహ్లాదుఁడు చదివినట్టిచదువు**
**గతిగా నారాయణాష్టాక్షర మిదియే ॥చది॥**

**చలపట్టి దేవతలు చదివినట్టిచదువు**
**వెలయ విప్రులు చదివేటిచదువు**
**పలుమారు శ్రీవేంకటపతినామమై భువిఁ**
**గలుగు నారాయణాష్టాక్షర మిదియే ॥చది॥ 33**

**ఉపోద్ఘాతము:**

"ఓం నమో నారాయణాయ" అనేది మోక్షప్రదమైన అష్టాక్షరీ మంత్రము. దీనిని ఒక్కదానిని సదాత్రికరణశుద్ధిగా జపించేవానికి వైకుంఠప్రాప్తి తప్పక కలుగుతుందని పెద్దలు చెబుతారు. అయితే ఎంత త్రికరణశుద్ధిగా చేస్తాము అన్నదే ఒక మడతపేచీ. మనకి మనం త్రికరణ శుద్ధిగా చేస్తున్నాం అనుకొంటే సరిపోదు. ఆ శ్రీమన్నారాయణుడు





అనుకోవాలి. శుకమహర్షి, వేదవ్యాసుడు, మునీశ్వరులు, చతుర్ముఖ బ్రహ్మ, ప్రహ్లాదుడు, దేవతలు, వైష్ణవ భక్తులు సద్బ్రాహ్మణులు సదా జపించిన మంత్రము అదే. నేటి కలియుగంలో "ఓం నమో వేంకటేశాయ" అనే అష్టాక్షరీమంత్రము ఆ మంత్రము వంటిదే.

**తాత్పర్య వివరణ:**

ఇదియే కదిసి (చేరువయైన) నారాయణాష్టాక్షరీ మంతము. "ఓం నమో నారాయణాయ" అని దానినే చదివి పఠింపుచూ మీరు సర్వజనులూ బ్రతుకరో.

మున్ను (పూర్వము) శుకుడు (శుకమహర్షి) సాధించి (సాధన చేసి) చదివినట్టి చదువు ఈ మంత్రమే. అష్టాదశ పురాణములను రచించిన వేదవ్యాసులవారు పఠించిన మంత్రము కూడా ఈ చదువే. ఆదికాలపు (అనాదిగా) వైష్ణవులందరూ త్రికరణశుద్ధిగా ప్రేమతో చదివేది ఈ చదువే, ఓం నమో నారాయణాయ.

సతతము (ఎల్లప్పుడూ) ఎల్ల మునులు (మునులందరూ) చదివినట్టి చదువు ఈ అష్టాక్షరీమంత్రమే. దుఃఖించిన బ్రహ్మదేవుడు కూడా చదివినది యీ మంత్రమునే. హిరణ్యకశిపునివల్ల అన్ని బాధలు ప్రహ్లాదుడు ఓర్చినదీ మంత్రము కొరకే. కాబట్టి వారందరికీ గతి అయినది ఈ అష్మాక్షరీ మంత్రమే. ఓం నమో నారాయణాయ.

మేము అమృతం తాగిన వారము అనే చలపట్టి (మత్సరము) కలిగిన దేవతలు కూడా భీతిల్లి పఠించినదీ మంత్రమునే. అన్ని యుగాలలోనూ సద్బ్రాహ్మణులు పఠించినదీ అష్టాక్షరీమంత్రమునే. భువి (నేటి భూమండలంలో) అదే నామము వేంకటేశ్వర అష్టాక్షరీమంత్రముగా మనందరమూ చదువుచున్నాము అట్లు కలిగిన ఈ నారాయణాష్టక్షరీ మంత్రమే తిరుమలలో ఓం నమో వేంకటేశాయ అనే అష్టాక్షరీమంత్రమైనది.

**పద్యవివరణ:**

కం॥ **నారాయణఅష్టాక్షరి**
**మీరినమంత్రంబు వినుడుమేలు స్మరింపన్**
**కూరిమి చదువుచు బతుకరొ**
**ధారుణి సర్వులకు ముక్తిదాయకమదె పో!**

సంఖ్య: XX/339 రాగం : పాడి
కీర్తన : నీవెప్పుడూ ఘనుడవే నేనీచేతిలో దానను

**పాడి**

**80 నీ వెప్పుడూ ఘనుఁడవే నే నీచేతిలోదానను**
**యేవేళ నెట్లున్నా నేమాయ నీకు** ॥పల్లవి॥

**వన్నెల నన్నింత నీవు వలపించినవాఁడవు**
**కన్నులనాచూపులకుఁ గాచుకుందువు**
**పన్ని తాము చేసేపైరుపంట కెదురుచూడరా**
**యెన్ని సేసిన నాయెడ కేమాయ నీకు** ॥నీవె॥

**తలఁపెల్ల నీ వన్నిటా దక్కఁగొన్నట్టివాఁడవు**
**పలుకులు నావెల్లాఁ బాలింతువు**
**మలసి తమచిలుకమాటలు ముద్దుసేయరా**
**యెలమి నాకొరకుఁగా నేమాయ నీకు** ॥నీవె॥

**కందువనారతులను కలసినట్టివాఁడవు**
**మందెమేళములు నావి మన్నింతువు**
**విందారగించేటివారు వేఁడయిన నోర్వరా**
**యిందులో శ్రీవేంకటేశ యేమాయ నీకు** ॥నీవె॥

**ఉపోద్ఘాతము:**

ఓ రమణుడా! నీవు యేవేళనెటులున్నా వచ్చే లోటేముంది? నీవు యెప్పుడునూ ఘనుడవే. నేనేమో నీ చేతిలోనిదానను అంటున్నది నాయిక. ఇది అన్నమయ్య చెప్పిన శృంగార కీర్తన. నెమ్మదిగా చదివితేగాని అర్థంకాదు, మరి. నీవన్నెలన్నీ చూపి నన్నింతగా వలపించేవు స్వామీ! నాకడగంటి చూపుకోసం కాచుకొని వుంటావు. ఈ లోకంలో యెవరైనా తాము సాగుచేసిన పైరుపంటకోసం యెదురు చూడరా? నేను కూడా నీవలపుల పంట కోసం





యెదురు చూస్తున్నదాననే. నీవు నాయెడ (నాపట్ల) యెన్నిచేసినా నేనేమీ అనుకోను. ఏమిటవుతుంది స్వామీ? అంటున్నది నాయిక.

**తాత్పర్య వివరణ:**

ఓ శృంగారరాయా! నీవెప్పుడూ ఘనుడవే. నేనే నీచేతిలో వున్నదానను (నీ ఆజ్ఞాబద్ధురాలను). నీవు జగదేకపతివి. నీవెట్లావున్ననూ చెల్లుతుంది ప్రభూ! నీకు నేమాయ (నీకేమవుతుంది?)

స్వామీ! నీవు నన్నింతగా నీవన్నెలతో (అందచందములతో) వలపించినవాడవు. నీవు కన్నులనాచూపులకు గాచుకొందువు (నా కడగంటి చూపులకై కాచుకొని వేచివుందువు). ఈ లోకంలో ఎవరైనా తాము సాగుచేసే పైరుపంట కోసం యెదురు చూడరా? నేనుకూడా నీ వలపుల పంట కోసం యెదురు చూస్తున్నదాననే. నీవు నాయెడ (నాపట్ల) యెన్ని చేసినా నేనేమీ అనుకోను. ఏమిటవుతుంది ప్రభూ?

ప్రభూ! నీవు నాతలపు అంతటా ఆక్రమించి, నిండిపోయి వున్నావు. నన్ను దక్కగొన్నట్టివాడవు (నన్ను నీవు లోగొనియున్నావు). నాపలుకులు నీవెల్లా పాలింతువు. (నేను చెప్పిందెల్లా నీవు శ్రద్ధగా వింటావని అందరూ భ్రమపడుతున్నారు). కానీ సత్యమేమంటే ఎవరైనా తాము ముద్దుచేసి పెంచుకొనే చిలుకలమాటలు శ్రద్ధగానే వింటారు కదా! నామాటలు కూడా అలాగే వింటున్నావు. నా కొరకుగా (నాకోసము) ఏమి జరుగుతుంది ప్రభూ!

స్వామీ! నీవు నా సురతములలో నన్ను గలసినవాడవు. నా మందెమేళములను (పరిహాస వచనములను మన్నించుము ప్రభూ!) విందు భోజనానికి కూర్చొన్నవారికి ఒకటిరెండు వంటకాలు నోరుకాలేటంతవేడిగా వున్నాయని తిట్టుకొంటారా? ఓ శ్రీవేంకటేశ్వరా! ఇందులో యేముంది ప్రభూ!

**పద్యవివరణ:**

కం॥ **ఘనుడవు నీవెప్పుడునూ**
**కనుగొన నీచేతిలోన కలదాననునే**
**విను యేవేళనునెవ్విధి**
**కనుపించినయేమి ఆయె కమలదళాక్షా!**

సంఖ్య: IV/37 రాగం : సామంతం
కీర్తన : మేలెల్ల నొక్కటేమించుతీలూనొకటే

**సామంతం**

**81 మేలెల్ల నొక్కటే మించుతీలూ నొకటే**
**తాలిమితో ఫలియించు తలఁపూ నొకటే ॥పల్లవి॥**

**ఆఁకలి గడు హెచ్చితే నన్నము రుచి గోరును**
**జోకఁ బాపము హెచ్చితే సుకృతము గోరును**
**పైకొని యవివేకికిఁ బాపమైనా నుపకారి**
**ఆకడ మూర్ఖునకుఁ బుణ్యమైనా బంధకమే ॥మేలె॥**

**యెందు నెండఁబడ్డఁగాని ఇంపునీడఁ గోరఁడు**
**కందువ సంసారియైనఁగాని మోక్షము గోరఁడు**
**చందపు యోగికి సంసారమైనా నుపకారి**
**కందువబద్దున కదే కట్టినట్టి కట్లు ॥మేలె॥**

**కలయఁ జీఁకటియైతేఁగాని దీప మిడుకోఁడు**
**ఇల నజ్ఞుఁడైనఁగాని యెరుక వెదకఁడు**
**తలఁచి శ్రీవేంకటేశుదాసుని కింతా జయమే**
**బలిమిఁ జంచలునికి బహుళ దుఃఖములే ॥మేలె॥**

**ఉపోద్ఘాతము:**

సర్వసంగ పరిత్యాగులైన శ్రీవేంకటేశ్వరుని దాసులు విరక్తులు. అందుచేత వారికి, మేలూ వొక్కటే అధికమైన కీడూ ఒక్కటే. క్షమాగుణముతో సంప్రాప్తమయ్యే వారి ఆలోచనలు కూడా ఒకేలాగ సదా మంచి చేయాలి అన్నట్లే వుంటాయి, అంటున్నారు అన్నమయ్య. ఆకలిలేనివాడికి ఎంత రుచిగల పదార్థాలు పెట్టినా బాగాలేవు అంటాడు. పాపము ఎక్కువగా చేసిన వాడికే సుకృతము కలిగితే మళ్ళీ పాపము చేయడు. అదే అవివేకి వుంటాడనుకోండి





వాడికి పాపమూ ఉపకారిగానే కనబడుతుంది. ఇక మూర్ఖశిఖామణులకైతే పుణ్యముకూడా చెఱసాలలాగానే వుంటుంది, అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

మేలెల్లావొక్కటే (మేలు కలిగినా ఒక్కటే) మించినతీలూ (అధికమైన కీడూ) వొక్కటే. తాలిమితో (క్షమాగుణముతో) ఫలియించు (సంప్రాప్తమయ్యే) తలపూ నొక్కటే ఆలోచనకూడా వొక్కటే. క్షమ కలిగినవారు అపకారికి కూడా ఉపకారం చేస్తారు.

ఆకలి మిక్కిలి అధికమైతేనే అన్నము రుచిగోరును (అన్నము రుచిగా వున్నదా అని చూడరు). జోకపాపము (మొత్తము పాపము) ఎక్కువచేసినవానికే సుకృతము (పుణ్యము) చేస్తే బాగుండును కదా! అనిపిస్తుంది. ఇక అవివేకులకు పాపమూ ఉపకారమే అనిపిస్తుంది. పుణ్యము కూడా మూర్ఖులకు చెఱసాలలాగానేవుంటుంది.

ఎండబడ్డవాడే (అధికమైన ఎండను అనుభవించినవాడే) చక్కటి చల్లని నీడ కోరుకొంటాడు. నీడలో వున్నవాడికి దాని సుఖం ఏం తెలుస్తుంది? సంసారియైనవాడే ముక్తి కోరుకుంటాడు. మరి యోగికి సంసారమూ ద్వేషము కాదు. అదే సంసారబద్ధులైనవారికి (సంసారమంటే తాపత్రయం పడేవారికి) ఆ సంసారమే పెద్ద ప్రతిబంధకమవుతుంది.

చిమ్మచీకటిలోవున్న వారికే కాస్త దీపపు కాంతి వుంటే బాగుండును అనిపిస్తుంది. అజ్ఞానంలో మగ్గినవారే ఎరుక (జ్ఞానము) కోరుకుంటారు. ఇక ఇవన్నీ మాకెందుకులే అని శ్రీవేంకటేశ్వరుని దాసులు నిస్సంగులు, విరక్తులు, నిర్విచారులూ అయివుంటారు కనుక అన్నిట్లోనూ జయమును పొందుతారు. ఇక చంచలబుద్ధివున్న వారి గురించి చెప్పేదేముంది? వారికి యెప్పుడైనా దుఃఖమే మిగులుతుంది.

**పద్యవివరణ:**

కం॥ **వేంకటపతిదాసులకును**
**సంకటమౌ తీలునొకటె సంప్రాప్తంబౌ**
**కొంకని మేలూ నొకటే**
**జంకని క్షమయున్న కలుగు చక్కని తలపుల్.**

సంఖ్య: XX/449 రాగం : గౌళ
కీర్తన : వీధులవీదులనేగే విట్ఠలేశా

### గౌళ

**82 వీదులవీదులనేఁగేవిట్ట (ఠ్ఠ)లేశా । వట్టి -**
**వేదలెల్లాఁ బాసె నిఁక విట్టలేశా ॥పల్లవి॥**

**వేదుకకాఁడవైతివి విట్టలేశా ।నీకు**
**వీడె మందుకోవోయి విట్టలేశా ।**
**వీదుజోడునగవులవిట్టలేశా ।నీపై**
**వేదెవెట్టె మావలపు విట్టలేశా ॥వీదు॥**

**వెలసె నీమోవి గడువిట్టలేశా ।నీకు**
**వెలుపలే లోనయ్య విట్టలేశా**
**వెలలేనిమహిమలవిట్టలేశా ।పూవు -**
**విలుతునిఁగన్న తండ్రి విట్టలేశా । ॥వీదు॥**

**వెన్నెలతేటమాఁటలవిట్టలేశా ।నా-**
**విన్నపానకే కూడితి విట్టలేశా**
**వెన్నతో శ్రీవేంకటాద్రివిట్టలేశా ।నీవు**
**వెన్నుఁడవు వేయినామాలవిట్టలేశా ॥వీదు॥ 449**

**ఉపోద్ఘాతము:**

నేటి బళ్ళారి జిల్లా హోస్పేట తాలూకాలోని పందరంగములో వెలసిన విఠ్ఠల దేవునిపై చక్కటి సరసకీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. విట్ఠలేశుని వూరేగింపు వీధుల వీధుల గుండా పోతున్నది. వేద అంటే వ్యధ లేక బాధ అని అర్థం. ఈ విట్ఠలేశుడు ఇక తనను నమ్మినవారి వ్యధలన్నీ తొలగిస్తాడు అంటున్నారు. ఆయన మాటలు వెన్నెల తేటవలె చల్లగా వుంటాయట. నా





విన్నపాన నన్ను కూడినావు. అనాదిగా నన్ను శ్రీవేంకటాద్రి విట్ఠలుడవై, వేయినామాలుగల వెన్నుడవై ఆర్తత్రాణపరాయణుడవైనావు తండ్రీ! అంటున్నారు. ఆయన వేడుక కాదు అని కీర్తిస్తున్నారు. ఆయనపై వనితలకు కలిగిన వలపు వేడెవెట్టాడుట. సరిగా అర్థం కావాలంటే... తప్పదు మరి.

**తాత్పర్య వివరణ:**

వీధి వీధిలోనూ వూరేగింపుగా వెళుతున్న ఓ విట్ఠలేశా! వట్టి (మమ్మల్ని చేగొని) ఇక మావేదలెల్లా (వేదనలనన్నియునూ) బాసె (వదలిపోయినవి).

ఓ విట్ఠలేశా! నువ్వు వేడుకకాడవైతివి (విలాసపురుషుడవైనావు). నీవు వీడెమందుకోవోయి (తాంబూలము స్వీకరించవయ్యా!) వీడుజోడు నగవుల (ఈడూజోడూ కుదిరిన ప్రేయసీప్రియుల ముసిముసి నవ్వుల వంటి చిరునవ్వులు చిందించే) విట్ఠలేశా! మా వలపు నీపై వేడెవెట్టితిమి (నీపై మా వలపులు చుట్టుముట్టినవి.) కాస్త కనికరించవయ్యా!

ఓ విట్ఠలేశా! నీ మోవి (అధరము) ఎఱ్ఱని రంగుతో కడువెలసె (మిక్కిలి ప్రకాశించినది). నీకు మేము బాహాటంగానే లొంగిపోయినాము. లెక్కించలేనన్ని మహిమలను ప్రదర్శించే ఓ విట్ఠలదేవా! నీవు పూవు విలుతుని (పుష్పబాణుడైన మన్మథుని) కన్నతండ్రివయ్యా!

ఓ విట్ఠలేశా! ఇక నీమాటలెటువంటివంటే అవి వెన్నెలతేటవంటివి. స్వామీ! నీవు నా విన్నపమును మన్నించి నన్ను కూడితివి. నీవు వెన్నతో (చిరుప్రాయమునుండే... అంటే... అనాదిగా శ్రీవేంకటాద్రి విట్ఠలేశుడవు. నీవు వెన్నుడవు (శ్రీకృష్ణుడవు). వేయినామాల దేవుడవు.

**పద్యవివరణ:**

ఆ.వె॥ **విట్ఠలేశుడేగె వీదుల వీదుల**
**వేదలెల్లబాపె విట్ఠలుండు**
**వేయినామములట వెన్నతో నీకయ్యె**
**నీవు వేంకటాద్రి విట్ఠలుడవు.**

సంఖ్య: IV/36 రాగం : గౌళ
కీర్తన : మొదలువేల్ప మామొఱయాలించవె

**గౌళ**

**83 మొదలివేల్ప మా మొఱ యాలించవె**
**యెదుటఁ గావు మము నిదివో దేవా** ॥పల్లవి॥

**ధరపైఁ దపసులతపములు చెరిచెను**
**నిరతపుణ్యముల నీరుసేసె నదె**
**పరకామినులను భంగపెట్టె నదె**
**హిరణ్యకశిపుఁ డిదివో దేవా** ॥మొద॥

**మునులజడ లవిగో మోఁపులకొలఁదులు**
**ఇనచంద్రాదుల నెక్కువగెలిచెను**
**చనవరియింద్రునిస్వర్గము చేకొనె**
**యెనగొని హిరణ్యుఁ డిదివో దేవా** ॥మొద॥

**పలుదిక్పాలులఁ బారఁగఁ దోలెను**
**బలిమినే ప్రహ్లాదుఁ బరచీని**
**యెలమిని శ్రీవేంకటేశ నీవలన**
**యిలఁ గశిపుఁడు చెడె నిదివో దేవా.** ॥మొద॥ **36**

**ఉపోద్ఘాతము:**

దనుజుడు హిరణ్యకశిపునిపై కవిత చెబుతున్నారు అన్నమయ్య. తొల్లి ఇటువంటి ప్రక్రియ జరిగివుంటుందని నేను భావించను. ఇది అన్నమయ్యలాంటి పదకవితాపితామహునికే చెల్లింది. మొదలి వేల్పు అంటే ఆదిదైవమన్నమాట. ఓ దేవా! ఇదివో మమ్ము ఎట్ట యెదుటునె రక్షించవయ్యా! మా మొఱలను ఆలకింపవయ్యా! అని నారసింహుని వేడుకొంటున్నారు. కానీ





కీర్తనకు కథానాయకుడు హిరణ్యకశిపుడు. ధరపై దపసులతపము చెరిచె నిరతపుణ్యములు నీరము సేసెనట. పరకామినులను భంగముసేసెనట. మునుల జడలను మోపులుగా కట్టాడట. సూర్యచంద్రులను కూడా గెలిచి బాధించాడట. ఇంద్రుని స్వర్గం లాక్కున్నాడట. ప్రహ్లాదుని నానా బాధలు పెట్టాడట. ఆదిదేవుడు ఇదిగో ఈ ఆఖరి తప్పుకి మాత్రం దండించకుండా వుంటాడా? నారసింహుడై చీల్చేశాడు.

**తాత్పర్య వివరణ:**

ఓ మొదలివేల్ప! (ఆదిదేవా!) మామొఱ యాలించవే (వినవయ్యా!) ఇదివో దేవా! మమ్ము యెదుట (నీ యెదుటనే) గావుము (రక్షించుము).

దేవా! ఇదివో హిరణ్యకశిపుడు ధరపై (భూలోకంలో) తపసుల (మునీంద్రుల) తపములను చెరచె (చెడగొట్టినాడు). నిరత పుణ్యముల (గొప్ప పుణ్యకార్యములను చేయువారిని నీరుసేసె (నీరుగార్చినాడు). పరకామినులను (పరస్త్రీలను) మానభంగము చేసినాడు.

ఆ హిరణ్యకశిపుడు అవిగో మునుల జడలను మోపులుగా కట్టి పకపక నవ్వుచున్నాడు. సూర్యచంద్రులను కూడా ఎక్కువగా గెలిచి వారి గమనాన్ని కూడా తన ఆధీనంలో పెట్టుకొన్నాడు. చనవరి (బంధువైన) ఇంద్రుని జయించి స్వర్గాన్ని తన స్వాధీనంలోకి తెచ్చుకొన్నాడు. ఓదేవా! అదిగో ఆ దనుజుడు పరమదుర్మార్గుడు.

ఆ హిరణ్యకశిపుడు అనేకమంది దిక్పాలురను వారి స్థానములనుండి బలవంతంగా పారద్రోలినాడు. హరి భక్తుడైన ప్రహ్లాదుని అనేక బాధలు పెట్టాడు. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇన్ని అకృత్యాలు చేసిన వానిని నీవు సంహరించక తప్పదు కదా! ఆ విధంగా కశిపుడు చెడినాడు దేవా!

**పద్యవివరణ:**

తే.గీ॥ **మొదటి వేలుప! వినుము మా మొఱలనెల్ల**
**యెదుట మముగావుమో దేవ! ఇదియె వినతి**
**వింటిమాతొల్లి? అసురుపై వింతకవిత?**
**సిరుల వేంకటేశుడె నారసింహుడంట!!**

సంఖ్య: XX/385 రాగం : సాళంగనాట
కీర్తన : నేరుపరి వౌదువమ్మ నిజలక్ష్మి

## సాళంగనాట

**84 నేరుపరి వౌదువమ్మ నిజలక్ష్మి**
**పేరడిమహిమలను బెరసితివి** ॥పల్లవి॥

**మనసు రంజిల్లఁ జేసి మారుగొండ లెక్కివుండి**
**ననుపుసేసుకొంటివా నాయకునిని**
**చనవిచ్చి తొడమీఁద సరి నాతఁ డిడుకొంటే**
**పెనఁగి కూడితివమ్మ ప్రియురాలవు** ॥నేరు॥

**చేయిచాఁచి రాఁగిలించి చిత్తగించి మోము చూచి**
**ఆయము లంటితివా ఆతనిని**
**చాయలకు నాతఁడు చల్లనినవ్వు నవ్వితే**
**దాయపుమోవిచ్చితమ్మ తగుజాణవు** ॥నేరు॥

**శ్రీవేంకటాద్రి యిది శ్రీనరసింహదేవుని**
**ఆవటించి కూడితివా అవుభళానను**
**వోవరిగా నాతఁడు నిన్నురమునఁ బెట్టుకొంటే**
**భావించి మెచ్చితివమ్మ పంతపుటిందిరవు** ॥నే॥ **385**

**ఉపోద్ఘాతము:**

శ్రీ నరసింహదేవుని దేవేరి అయిన ఆదిలక్ష్మిపై చక్కటి మధుర కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఓ నిజలక్ష్మీ! నీవు మిక్కిలి నేర్పరివి తల్లీ! అంటున్నారు. పేరుగాంచిన మహిమలతో విలసిల్లినావమ్మా! అంటున్నారు. శ్రీ నరసింహుని మనస్సును రంజింపజేయుటకు ఆయన వెలసిన కొండ కెదురుకొండపై వెలసినావు. నీకు చనువు నిచ్చి తన తొడపైనిడుకొనినాడు నరసింహుడు. అవుభళాన తొడపైనిడుకొనినాడు గాని ఆ వేంకటాద్రిపై





తిరుమలరాయుడైన స్వామి, నిన్ను తన వురముపై నిడుకొనినాడమ్మా! అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

నిజలక్ష్మి! (ఆదిలక్ష్మీ!) నీవు మిక్కిలి నేర్పరి (సమర్థురాలవు) అవుదువమ్మా! పేరడి మహిమల (పేరుగాంచిన మహిమాన్వితవై) బెరసితివి (విలసిల్లినావు) తల్లీ!

మనస్సు రంజిల్లజేసి (శ్రీహరి మనస్సుకు ఆనందము కలిగించుటకు) ఆయన నరసింహుడై వెలసిన కొండకు యెదురు కొండపైన వెలసినావు. ఆ విధముగా నాయకుడైన నరసింహుని ననుపుసేసుకొంటివి (అనురాగమూర్తిని చేసికొంటివి). నీ అనురాగమునకు తగినట్లే ఆయన నిన్ను తన యెడమ తొడపై నిడుకొనినాడు. నీవు ఆయన ప్రియురాలవు గనుక ఆయనను పెనగి (చుట్టుకొని) కూడితివి తల్లీ!

తల్లీ! నీవు చేయిచాచి రాగిలించి (రంజింపజేసి) ఆతనిని చిత్తగించి (ఆయన నరసింహుడా లేక శ్రీహరియా అని ఆలోచించి) మోము చూచి (ఆ వదనములో శ్రీహరిని గాంచి) సంతోషముతో) ఆయములంటితివి (ఆయనను అనురాగవశమున పెనవేసితివి). పైకి ఉగ్రరూపియైనను, చాయలకు (రేయి అయినంతనె) తన చల్లని వెన్నెలవంటి నవ్వులతో నిన్ను చూస్తే దాయపు మోవిచ్చితివమ్మా! (నీవు కట్నముగా మధురాధరము నిచ్చినావు తల్లీ!)

ఇది శ్రీవేంకటాద్రి ఇక్కడా మరియు అక్కడ అహోబలంలోనూ ఆయన శ్రీనరసింహుడైన పిదప, ఆవటించికూడితివి (పొందికగా ఏకమైతివి). ఓవరిగా (చంద్రశాలలో) ఆయన నీకు తన వురముపై స్థానము నొసగినాడు. నీవు పంతముగల ఇందిరాదేవివైనా, ఆయన భావమునంగీకరించి ఆయనను మెచ్చుకొన్నావు.

**పద్యవివరణ:**

కం॥ **నేరుపరివౌదువమ్మా**
**నీరజవాసినివి తల్లి! నిజలక్ష్మివిగా**
**పేరడి మహిమల బెరసితి**
**వౌరా!! వో సిరులరాణి! అంబుజపాణీ!**

సంఖ్య: IV/38 రాగం : లలిత
కీర్తన : ఇదియే సులభంబిందరికి

**లలిత**

**85 ఇదియే సులభం బిందరికి**
**కదియఁగ వసమా కరుణనే కాక ॥పల్లవి॥**

**నగధరుండు పన్నగశయనుఁడు భూ-**
**గగనాంతరిక్షగాత్రుడు**
**అగణితుఁడితని నరసి తెలియఁగాఁ**
**దగు నా కనెడిది దాస్యమే కాక ॥ఇదియే॥**

**కమలజజనకుఁడు కామునిజనకుఁడు**
**కమలాసతిపతి ఘనగుణుఁడు**
**విమలుఁడీహరి వెదకి కానఁగను**
**అమరునా శరణాగతిఁగాక ॥ఇదియే॥**

**దేవుఁడు త్రిగునాతీతుఁ దనంతుఁడు**
**కైవల్యమొసఁగుఘనుఁడు**
**శ్రీవేంకటపతి జీవాంతరాత్ముఁడు**
**భావించవసమా భక్తినె కాక ॥ఇదియే॥**

**ఉపోద్ఘాతము:**

ఇందరికీ ఇదియే సులభంబు అంటున్నారు అన్నమయ్య. ఏమిటది? ఈ శ్రీహరి కరుణను పొందుట. దానిని కదియగ వసమా? కరుణనే కాక అంటున్నారు. ఆయన కరుణను పొందాలంటే ఆయన కరుణించవలసినదే. ఆయన భక్తికి తప్ప మరొక విధముగా వశమవడు. భక్తుల శరణాగతి ఆయనను వారివైపు చూచునట్లు చేస్తుంది. శరణాగతితో ఆయనను





కీర్తించినవారికి ఆయన కృప త్వరగా కలుగుతుంది కాబట్టి ఆయన కరుణ పొందాలంటే దాస్యము శరణాగతి భక్తి చక్కటి రాజమార్గాలు. త్రిగుణాతీతుడైన శ్రీవేంకటేశుడై భక్త సులభుడయ్యాడు.

**తాత్పర్య వివరణ:**

ఇందరికి (దాస్యము ద్వారాగానీ, శరణాగతిద్వారాగానీ, భక్తిద్వారా గానీ పరమాత్మను పొందాలని కోరుకొనే వారందరికీ) సులభంబు (అతి సులువైన మార్గము) ఇదియే. భక్తియే అతి సులభమైనది. అది ఆయన కరుణవలన గాక ఇంకొక విధంగా కదియగవసమా? (పొందగలమా?)

స్వామి నగధరుడు (గోవర్ధన నగమును ధరించినవాడు.) ఆదిశేషుడనుపన్నగశయనుడు. భూమి గగనములే ఆయన శరీరముగా ఒప్పినవాడు. ఆయన పరిమితి ఇంత అని నమ్మకంగా ఎవ్వరూ చెప్పలేరు. ఆయనను కనుగొని తెలియాలంటే సులభోపాయము "దాస్యమే".

పద్మసంభవుడైన చతుర్ముఖ బ్రహ్మను కన్నతండ్రి ఈ శ్రీహరియే. మన్మధుని జనకుడు కూడా ఈయనే. కమలాసతియైన శ్రీమహాలక్ష్మి భర్త ఈ నారాయణుడే. గొప్ప సుగుణములు కల విష్ణువు ఇతడే. ఈ హరి (నృసింహరూపుడు) కరుణాంతరంగుడు. శోధించి ఈయన తత్త్వం తెలుసుకోండి. అప్పుడు ఈయనను శరణాగతితో ఆశ్రయించండి. ఆయన తప్పక కరుణిస్తాడు.

ఈ విష్ణుదేవుడు (సత్వ రజ స్తమోగుణములను, త్రిగుణములకు అతీతుడు). అనంతుడు అని ప్రసిద్ధి చెందినవాడు. కైవల్యము నొసగే ఘనుడు. శ్రీవేంకటేశ్వరుడు జీవులకు అంతరాత్ముడు. ఈయనను భక్తి లేకుండా భావించగలమా?

**పద్యవివరణ:**

కం॥ **ఇదియే సులభంబిందరి-**
**కిదివో సత్యంబు వినుడు ఈ శ్రీహరినిన్**
**కదియగ వశమా ఏరికి**
**కొదనెరుగని అతని కరుణ కూడగ వలె, పో!**

సంఖ్య: XX/384 రాగం : శ్రీరాగం
కీర్తన : చిత్తగించురమణుడ చేరి యెడమాటలేల

**శ్రీరాగం**

**86 చిత్తగించు రమణుఁడ చేరి యెడమాటలేల**
**చిత్తరుపతిమను నీచిత్తము నా భాగ్యము ॥పల్లవి॥**

**చొప్పగునావలపు చూపిచెప్పరాదు నన్నుఁ**
**గప్పి కాఁగిలించుకొంటేఁ గానవచ్చీని**
**వుప్పతించ నే నేర వూరకుండఁగాఁ జెమట**
**చిప్పిలీ నా మేనను నీ చిత్తము నా భాగ్యము ॥చిత్త॥**

**అందికూడేతరితీపు అంతిం తనఁగరాదు**
**కందువ నీ వంటఁగానే కానవచ్చీని**
**మందలించ నే నేర మరిగి నే నుండఁగాను**
**చిందేటిజవ్వనిని నీ చిత్తము నా భాగ్యము ॥చిత్త॥**

**చొక్కిననావేడుకలు సూడిదిపట్టఁగరాదు**
**గక్కన నీ వెనసితేఁ గానవచ్చీని**
**వొక్కటైతివి శ్రీవేంకటోత్తమ నే మెచ్చ నేర**
**చిక్కి నీకు నుండఁగా నీచిత్తము నా భాగ్యము ॥చిత్త॥**

**ఉపోద్ఘాతము:**

ఎడమాటలు- అంటే నేటి భాషలో పుల్లవిరుపు మాటలు అన్నమాట. వేంకటరమణుడు తన దేవిపై అలిగినాడు. సంభాషణలు లేవు. ఒకవేళ వున్నా అంటీ ముట్టనట్లు వున్నవి. ఇక ఆమెగారే బ్రతిమిలాడుతున్నది. ఓ వల్లభా! నన్ను చేరి అలరించరాదా? నా విన్నపములను చిత్తగించరాదా? నేనికపై ఏమీ అననులేవయ్యా. చిత్రపటములో బొమ్మలాగా పలుకను





సరేనా? ఇంకా నీ అలుక తీరకపోతే నీ ఇష్టప్రకారమే చేయుము. ఇక నీ చిత్తము మా భాగ్యము. అన్నమయ్య అద్భుత సృష్టి, ఈ కీర్తన.

**తాత్పర్య వివరణ:**

ఓ రమణుడా! చిత్తగించు (నా విన్నపములనాలకింపుము.) చేరి నావద్దకు (చేరి నన్ను) అనునయించరాదా? ఈ ఎడమాటలేల (ఇటువంటి పుల్లవిరుపు మాటలతో నన్ను నొప్పించెదవేల?) నేను చిత్రపటమువలె పలుకను లేవయ్యా! నీ అలుక చాలింపుము ప్రభూ! ఇక నీ చిత్తము నా భాగ్యాము.

అతిశయించి వలపు చూపి చెప్పకూడదా ప్రభూ! నన్ను గుచ్చి కౌగలించరాదా? అప్పుడన్నా నీకు నాపై యెంత ప్రేమవున్నదో తెలుస్తుంది. ఉప్పతించ నేనేర (నాకు ఓర్వలేనితనం లేదయ్యా!) ఊరకనే నాకు చెమటలు చిప్పిల్లినవి. నన్ను నమ్మితే నమ్ము లేకపోతే లేదు. నీ చిత్తము నా భాగ్యము.

నీ కూటమివలన కలిగిన తీపులు ఇంత అని చెప్పలేనయ్యా! నీవు అంటగానే (తాకిన వెంటనే) నా ప్రతిక్రియగా అది నీకు కానవచ్చీని. పోనీ నేను నిన్ను వలదని మందలించితినా చెప్పవయ్యా. నిన్నెన్నడూ పల్లెత్తుమాట అని యెరుగను. నా జవ్వనము (యౌవనమంతా) చిందిపోతున్నది. మరిగి నేనుండగా (తీవ్రమైన తాపముతో వున్న నన్ను) కరుణించమని విన్నపము. చెప్పేది చెప్పాను, ఇక నీ చిత్తము నా భాగ్యము, ప్రభూ!

పారవశ్యముతో నా సంతోషములో నన్నుండనీ. దానిని సూడివట్టుగరాదు (విరోధించుట తగదు స్వామీ!) గక్కున నీవెనసితే (చటుక్కున నన్ను పొంది చూడు) నీకే తెలుస్తుంది. ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ననుగ్రహించి ఎట్టకేలకు ఒక్కటైతివి. నాకు మెచ్చుకోవటం చేతకాదు. పైగా నీకు చిక్కి వుండగా నేను ముగ్ధను. ఆపైన నీ చిత్తము నా భాగ్యము.

**పద్యవివరణ:**

తే.గీ॥ **చిత్తగించుము యెడమాటలిత్తెరగున**
**తగునె రమణుడ? చేరికై తగవులేల?**
**చిత్రప్రతిమను నిలిచెద చెప్పినటుల**
**నీదు చిత్తంబు నా భాగ్యమది నిజంబు.**

సంఖ్య: IV/34 రాగం : భైరవి
కీర్తన : శరణమాతనికే సర్వభావాల

**భైరవి**

**87 శరణ మాతనికే సర్వభావాల**
**యిరవై మమ్ము రక్షించ నీశ్వరుఁడే యెఱుఁగు ||పల్లవి||**

**వచ్చిన త్రోవెఱఁగము వడిఁ బూర్వకాలమందు**
**చొచ్చెటి త్రోవెఱఁగము సోదించి మీఁద**
**కుచ్చిన కర్మములతో గుదియై వేలుకాదేము**
**హెచ్చి మా బ్రదుకుఁదోవ యీశ్వరుఁడే యెరుఁగు ||శర||**

**నన్ను నేనే యెఱఁగను నానాచందములను**
**అన్నిటా నాలోనున్నహరిఁ గానను**
**కన్నులఁ జూచుచు మంచి కాయములో నున్నవాఁడ**
**యెన్నఁగ నాజ్ఞానము యీశ్వరుఁడే యెరుఁగు ||శర||**

**మొదలు దెలియను ముంచి కొన దెలియను**
**చదువుచునున్నవాఁడ సర్వవేదాలు**
**హృదయములోనుండి యిటు నన్ను గావఁగ**
**యిదివో శ్రీవేంకటాద్రియీశ్వరుఁడే యెఱుఁగు ||శర|| 34**

**ఉపోద్ఘాతము:**

ఈశ్వరా! మా బ్రతుకుత్రోవలో అడుగడుగునా నీకృప వుండవలసిందే. మేము ఏ త్రోవలోనుంచి వచ్చి, మా కన్నతల్లి కడుపులో దూరినామో తెలియదు. కానీ కుచ్చితమైన కర్మలనేకము చేసి అవే గుదిబండలా తయారైవేలాడుతున్నాము. మమ్మల్ని రక్షించుటకు మరెవ్వరునూ లేరు. సర్వభావాలూ కూడుకొనగా (త్రికరణశుద్ధిగా) ఆయనకే శరణంటిమి. ఆయనే మమ్ము రక్షించుటెలాగుననో యెఱుగును, అంటున్నారు అన్నమయ్య. ఇక అమ్మ కడుపులోనుంచి బయటపడ్డాక జీవంతో వున్నాము కానీ జీవించుట తెలియదు కదా! అంతిమ క్షణాలలో





ఏమవుతుందో తెలియునా? వేదములన్నీ చదివాను కానీ లాభమేమిటి? నా యెదలోనే వున్న వేంకటేశ్వరుడే నన్ను గావనెరుగును, అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ మానవులారా! సర్వభావాలతోటి (త్రికరణశుద్ధిగా) యిరవై మమ్ము రక్షించ (సుస్థిరుడవై మమ్ముల్ని కాపాడుటకు,) శరణమాతనికి (ఆ సర్వేశ్వరునకు శరణుజొచ్చితిమి). ఎట్లు నిర్వహిస్తాడో ఆ ఈశ్వరుడే యెఱుగును (తెలియగలడు).

ఇక మేము మా అజ్ఞానం గురించి చెప్పేదేముంది? వచ్చిన త్రోవెఱగము (మా కన్నతల్లి గర్భములోనికి ఏ త్రోవనుండి వచ్చామో తెలియదు). అంతకు పూర్వం ఏ జన్మలో చొచ్చితిమో యెఱుగము. ఎంత సోధించినా ప్రయోజనం లేదు. కుచ్చిన కర్మములతో (కుచ్చితమైన పాపకర్మము)లనేకం చేసి, గుదియై వేలుకాడేము (గుదిబండయై వ్రేలాడగా) బ్రతుకుతున్నాము. మా బ్రతుకు త్రోవ ఆ ఈశ్వరుడే యెఱుగును.

ఇక నా యెఱుక (జ్ఞానం) ఎంతటిదో చెప్పాలంటే సిగ్గు వేస్తున్నది. నన్ను నేనే ఎఱుగను. నానా చందాల (అనేక రకములైన భ్రమలలోనూ భ్రాంతులలోనూ బ్రతుకుతుంటాను). అన్ని విధములా నాకు తోడుగా నాలోనే అంతర్యామిగా వున్న శ్రీహరిని కాంచలేకున్నాను. ఆయన ఇచ్చిన మంచి కాయముతో (ఆరోగ్యవంతమైన శరీరంతో) కన్నులతో చూస్తూ జ్ఞానమును పొందుతున్నాను. కనీసం ఇదంతా యెట్లా జరుగుతున్నదో నేనెఱుగుదునా? లేదండీ, ఆ ఈశ్వరుడే యెఱుగును.

మొదలు తెలియను (నా శైశవదశనెఱుగను). కొన తెలియను (ఎలా మరణిస్తానో చెప్పలేను). కాకపోతే వేదములనన్నింటినీ చదివి వడపోశాను. అయినా నన్ను నేను రక్షించుకొనే పరిస్థితి లేదు. ఇదిగో ఈ శ్రీవేంకటేశ్వరుని శరణన్నాను. ఆయన నా హృదయంలోనేవుండి నన్ను రక్షిస్తున్నాడు. అదెట్లాగో ఆయనే యెఱుగును.

**పద్యవివరణ:**

కం|| **శరణం బాతనికే పో!**
**పరగగ గొల్చెదను సర్వభావంబులతో**
**యిరవై మము రక్షింపగ**
**పరదైవం బీశ్వరుండె బాగుగ తెలియున్.**

సంఖ్య: XX/417 రాగం : పాడి
కీర్తన : ఎప్పుడును నాకు లోనైయేరాకృష్ణా

**పాడి**

**88 ఎప్పుడును నాకు లోనె(నై?) యేరా కృష్ణా**
**చెప్పేవు ప్రియ మప్పుడే చెలువపుఁగృష్ణా ॥పల్లవి॥**

**చన్నుల నొరసితిని సాదించేననుచు నిన్ను**
**వెన్నలేల దొంగిలేవు వేసాలకృష్ణా**
**కన్నుల జంకించితిని కాఁగిటఁ బట్టేనని**
**పన్ననేల మాయ లింత బాలకృష్ణా ॥ఎప్పు॥**

**మాటల నిన్నొరసితి మంతనానకు రమ్మని**
**చాటేవేల సరసాలు జంగిలికృష్ణా**
**యీటుతోనే నవ్వితిని యిద్దర మొక్కటేయని**
**వోటమి నీ కెందూ లేదు వున్నతపుకృష్ణా ॥ఎప్పు॥**

**కూడితి కాఁగిట నిన్ను గురుతులు నించి నించి**
**జాడలు దప్పకుమీ జాణకృష్ణా**
**వీడె మిచ్చితిని శ్రీవేంకటాద్రిపయి నీకు**
**వాడికలు మనసొమ్ము వన్నెల వోకృష్ణా ॥ఎప్పు॥ 417**

**ఉపోద్ఘాతము:**

శ్రీకృష్ణునిపై శృంగార కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఒక గోపిక ఈ కీర్తన పాడుతున్నదని భావించాలి. ఓ కృష్ణా! నీవెప్పుడూ నాకు లోనైయే వుంటావు. ఇంత అందగాడు ఈ కృష్ణుడు అనుకున్నా నీకున్న దురలవాటు ప్రియవచనములు అప్పటికప్పుడు చెప్పటమే. నీతో కొద్దిగా మాట్లాడితే చాలు ఆడవాళ్ళని మంతనానికి పిలుస్తావు. నీవు జంగిలి కృష్ణుడివి. నాతో





ఆడిన మంతనాలను నలుగురికి చాటుతావు. నీవు ఇన్ని చేసినా ఈటుతోనే (వేడుకతోనే) మనమిద్దరమూ ఒక్కటేనని నమ్మి నిన్ను చూచి నవ్వినాను. నీవు అసాధ్యుడివి. నీకెందునూ ఓటమిలేదు, అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ కృష్ణా! నీవు నాకు ఎప్పుడూ లోనైయే వుంటావు. కానీ నీతో వచ్చిన చిక్కేమిటంటే నీవెంత చెలువపు (అందమైన)వాడవో, నీ శుష్కప్రియ వచనములు అప్పటికప్పుడే చెప్పే ప్రియవచనములు మాత్రమే.

నన్ను సాధించాలని నాస్తనగిరులను నొక్కెదవు. నిన్నేమన్నాము? వెన్నలేలదొంగిలించేవన్నాము. నీవు వేసాలమారి కృష్ణుడవు. నన్ను కౌగిట పట్టేవని కన్నులతో జంకించితిని (బెదరించితిని). బాల కృష్ణా! నాపై ఇంత మాయాజాలం పన్ననేల?

ఓ కృష్ణా! నీతో కొద్దిగా మాట్లాడితే చాలును, ఆడవాళ్ళని మంతనానికి (ఒప్పందాలకు) రమ్మంటావు. నీవు జంగిలి కృష్ణుడవు (మొరటువాడైన గొల్లడివి). లేకుంటే ఎవరన్నా తమప్రియురాలితో ఆడిన సరసాలను బాహాటంగా చాటుకొంటారా? మనిద్దరమూ ఒక్కటేనని ఈటుతోనె (వేడుకతోనే) నమ్మి, నిన్ను చూచి నవ్వినాను. నీవు అసాధ్యుడివయ్యా కృష్ణా! నీకెందునూ ఓటమిలేదు. ఓ కృష్ణా! నీవు ఉన్నతుడవు.

కృష్ణా! నిన్ను కౌగిట కూడితిని. అదే నేను చేసిన నేరమాయేమి? నాపై నీ గుఱుతులు నించినించి నలుగురికీ తెలిసేట్లు చేశావు. నీవు జాణతనం నేర్చిన టక్కరి కృష్ణుడవు. నేడు జాడలు తప్పకుమీ (నేడు జాడ తెలియకుండా మాయమై పోవద్దు.) నీకు గుర్తువున్నదా? శ్రీవేంకటాద్రిపైన నీకు నేను వీడెము (తాంబూలము) నిచ్చాను. ఓ వన్నెలు చూపే శ్రీకృష్ణా! నేను నీకు వాడిక సొత్తును.

**పద్యవివరణ:**

కం॥ **ఎప్పుడును నాకులోనై**
**చెప్పేవురప్రియములెల్ల చెలువపు కృష్ణా!**
**అప్పటికప్పుడు మరతువు**
**ఇప్పట్టున వేంకటాద్రి ఇరవగు కృష్ణా!**

సంఖ్య: IV/5 రాగం : వసంతవరాళి
కీర్తన : ఏమందు మిందుకు నెఱిగినదే తొల్లి

## వసంతవరాళి

**89 ఏమందు మిందుకు నెఱిఁగినదే తొల్లి**
**శ్రీమాధవుఁడ నీవు సేసినదే తొల్లి** ||పల్లవి||

**వొక మానఁజేఁదూ వొక మానఁ దీపూ**
**కకిపికలై రెండూఁ గలవే తొల్లి**
**వొకనికజ్ఞానము వొకనికి జ్ఞానము**
**సకలానఁ గలుగుట సహజమే తొల్లి** ||ఏమం||

**పగలు వెలుఁగు పైపై రాత్రి చీఁకటి**
**నిగిడి లోకములను నిజమే తొల్లి**
**మొగి సురలకు మేలు ముంచి దైత్యులకుఁ గీడు**
**తగిలి నొసలివ్రాఁత తప్పదిది తొల్లి** ||ఏమం||

**వెన్నెలలు చంద్రునందు వెడ యెండ సూర్యునందు**
**కన్నుల లోకమువారు గన్నదే తొల్లి**
**యెన్నఁగ శ్రీవేంకటేశ యేలినవాఁడవు నీవు**
**వున్నవారు నీకింద నున్నవారు తొల్లి** ||ఏమం|| **5**

**ఉపోద్ఘాతము:**

ఓ ప్రభూ! నీవు శ్రీమాధవుడవు. తొల్లి (అనాదిగా) నీవు సేసిన విడ్డూరములే అన్నియును. తొల్లింటినుండి ఈ కథలన్నీ మేమెరిగినవే. ఇందుకు మేము నిన్నేమనగలమయ్యా? నీవు చేసే విచిత్రాలు అసంఖ్యాకములు కదా? ఒక చెట్టు చేదు ఫలాలనిస్తే, ఒక చెట్టు మధురఫలాలనిస్తున్నది. ఒక పక్షికి కాకిలాంటి కర్కశకంఠాన్నిస్తే ఇంకొకదానికి కోయిలలాంటి మధుర గాత్రమిచ్చావు. ఒకడిని జ్ఞానిని చేసి





ఇంకొకడిని అజ్ఞానిగానే వుంచావు. అనాదిగా ఇదంతా నీ సృష్టిలో వున్నదే. ఇదంతా నీకు సహజమే అంటున్నారు అన్నమయ్య.

**తాత్పర్య వివరణ:**

ఇందుకు (ఈ సృష్టివైచిత్రికి) ఏమందుమయ్యా (ఏమి చెప్పగలము?) తొల్లి (అనాదిగా) ఇదంతా మేమెరిగినదే కదా! శ్రీ మాధవుడా! ఇదంతా పూర్వము నీవు చేసిన విచిత్రమే ప్రభూ!

చెట్ల విషయమే పరిశీలిద్దాము. ఒక చెట్టు చేదు పండ్లనిస్తుంది. ఇంకొక చెట్టు మధురఫలాలను ఇస్తుంది. తొల్లి (అనాదిగా) కాకము పికము అనే రెండు పక్షులూ వున్నాయి. ఒకటి కర్ణకఠోరంగా కా, కా అంటుంది. ఇంకొకటి మధురంగా కుహూకుహూమంటుంది. మానవుల్లోనూ ఒకడు అజ్ఞాని అయితే ఇంకొకడు గొప్పజ్ఞాని అవుతున్నాడు. సృష్టిలో ఇదిట్లా జరుగుట సహజమే. అనాదిగా ఇదంతా ఈశ్వరుని లీల.

అనాదిగా సృష్టిలో చతుర్దశ భువనాలు వున్నాయి. వీటిల్లో పగటిపూట వెలుతురు, రాత్రిపూట చీకటి వ్యాపించి వుంటాయి. అనాదిగా ఇది జరుగుచున్న దిన చక్రమే. సురులకు మంచి జరుగుతుంది. దైత్యులకు కీడు తప్పదు. తొల్లింటినుండి ఇదే జరిగింది. నుదుటన్ వ్రాసిన వ్రాత తప్పదు కదా! నూరేండ్లు చింతించినన్ అన్నారు పెద్దలు. ఎందుకంటే ఈశ్వరుని ఆజ్ఞ అటువంటిది.

రాత్రివేళల్లో చంద్రుడు వెన్నెలనిస్తాడు. సూర్యుడు పగటివేళ తాపము కలిగించే ఎండను ఇస్తాడు. అనాదిగా లోకములో వారంతా కనులతో చూసినది ఇదే. ఓ శ్రీవేంకటేశ్వరా! అనాదిగా ఈ సృష్ఠిలో ఏలికవు నీవే. నీవు వైకుంఠంలో వుంటే నీ దాసులై నీకిందవున్నవారు ఈ మిగిలిన వారంతా.

**పద్యవివరణ:**

కం|| **ఏమందుమయ్య యిందుకు?**
**మేమందర మెరిగినాము మీ కతలెల్లన్**
**శ్రీమాధవుడవునీవే**
**ఈమాదిరి సేసినదిదియె యేపుగ తొల్లిన్.**

సంఖ్య: XX/386 రాగం : పాడి
కీర్తన : అందుకేమి దోసమా అట్టే కానీ కానీవయ్య

**పాడి**

**90 అందుకేమి దోసమా అట్టే కానీ కానీవయ్య**
**చెంది యీపెతోడ నేము చెప్పకుండేమా ॥పల్లవి॥**

**పైపై యీపెకు నిట్టె బత్తులెల్లఁ జేసేవు**
**చూపులఁ దప్పక ఆపెఁ జూడవా నీవు**
**యీపొద్దే అన్నియును బయటవేయరాదుగాక**
**తీపునీగుణా లందరుఁ దెలియనివా ॥అందు॥**

**వంకలొత్తి యీపెతోను వట్టిబాసలు సేసేవు**
**అంకెమాట లాపెతోడ నాడవా తొల్లి**
**బింకాన మీలో వాదులుపెట్ట దోసమనికాక**
**ఇంకా మామరఁగువాఁడ వెఱఁగవా నీవు ॥అందు॥**

**ఇట్టె కాఁగిలించి యీపె నిక్కువకుఁ దీసేవు**
**గట్టున నిట్లా నాపెఁ గూడవా ముందు**
**నట్టనడుమఁ గూడితి నన్ను శ్రీవేంకటేశ**
**రట్టు నిన్నుఁ జేసేనా నెట్టుకొనెఁ బనులు ॥అందు॥ 386**

**ఉపోద్ఘాతము:**

అందులో ఏమితప్పుందిలే. అట్లాగే కానీలే–కానీవయ్యా! కాకపోతే మేము ఆమెకు చెందిన వారము. మేము చూస్తున్న నీ లీలల గురించి ఆమెకు చెప్పకుండా ఎట్లా వుంటాము? అంటున్నారు దేవి చెలికత్తెలు. ఇదంతా మాదేవికి తెలీదయ్యా. నీవు చూపే బత్తి నిజమే అనుకొంటున్నదామె. నీగుణము మేమెరుగుదుము. ఈ పొద్దున అవన్నీ బయటపెట్టమంటావా? నీవీమెను చూస్తున్నట్లు నటిస్తూ ఆ నెలతను చూస్తున్నావు. ఇది నీకు తగునా?





**తాత్పర్య వివరణ:**

ఓ ప్రభూ! అందులో ఏమి దోసము (తప్పు) వున్నది లేవయ్యా! అట్లాగే కానీలే. కానీవయ్యా! మేము ఆమె చెలికత్తెలము. ఆమెకు చెంది, ఆమెతో నీ వ్యవహారం చెప్పకుండా వుంటామా?

నీవేమో ఆమెకు ఆమెపై నీకు బత్తి (భక్తి) వున్నదని మాయమాటలు చెప్పి నమ్మించాలని చూస్తావు. "ఆమె"ను తప్పక చూడకుందువా నీవు? కాని ఈమె మాదేవి నిన్ను నమ్మినది. ఈనాడే నీ వ్యవహారమంతా మేము బయటపెట్టవద్దని మిన్నకున్నాము. తీపు (బాధించే) నీ గుణములు మేమెరిగినవేలే. కానీ అమాయకురాలు మాదేవి నిన్ను నమ్మినది.

వంకలొత్తి (ఆమె పెట్టేవంకలన్నింటికీ తగిన సమాధానాలు చెప్పి) ఆమెతో అనేకమైన వట్టిబాసలు (వుత్తుత్తి వాగ్దానాలు చేస్తావు). తొల్లి (అనాదికాలంలో) నీ వాదినారాయణుడవై ఆపెతోడు (ఆ శ్రీలక్ష్మితో) అంకెమాటలాడవా (శుష్కవచనములను చెప్పలేదా?) ఆలోచించు. మా పట్టుదలకోసం మీలో మీకు తగవులు పెట్టుటయెందుకని దోసమని చూస్తున్నాము. ఇంకా మా మరగుననున్నవాడవా? మేమెరుగమా యేమి?

ఇక ఈపె గురించి (ఈ పద్మావతి వైపునుండి చూస్తే) ఇట్టె కౌగలించి ఈపెను ఇక్కువకు దీసేవు. నీవు కావాలనుకొన్న చోటికి ఈమెను రప్పించుకొనేవు. ముందు (తొలినాళ్ళలో) నీవు గుట్టుగా (రహస్యంగా) ఆ సాగరకన్యను కూడినావు కదా? నట్టనడుమ నన్ను సైతము కూడినావు కదా! ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు నెట్టుకొనేపనులను (చెలరేగే వ్యవహారాలు) ఎన్ని చేసినా నిన్ను రట్టుచేయగలమా?

**పద్యవివరణ:**

ఆ.వె॥ **అందుకేమిదోసమట్టెకానీవయ్య**
**చెందియాపెతోడ చెప్పకుండ**
**యెట్టులుండగలము యానీపనులనెల్ల**
**వేంకటాద్రి రసికవిటుడవాయె**

సంఖ్య: IV/9 రాగం : ముఖారి
కీర్తన : గరిమతో వెరపేల కమలాక్షు దాసులకు

**ముఖారి**

**91 గరిమతో వెరపేల కమలాక్షు దాసులకు**
**పరమపద మొక్కటే ఫలమింతే కాక** ||పల్లవి||

**పాపమెంత పుణ్యమెంత ప్రపన్నాధికారులకు**
**దాఁప నవి నిమిషమాత్రములేకాక**
**లోపలేడ వెలియాడ లోకులకింతేకాక**
**మోపినదంతా యేకముఖమేకాక** ||గరి||

**రాతిరేది పగలేది రమించు సాత్వికులకు**
**యీతల నింతా వెలుఁగింతేకాక**
**ఘాతలఁ గర్మాకర్మగతులు యీసంది వింతే**
**పోతరించి యెక్కనెక్కఁ బొడవేకాక** ||గరి||

**చింతలేల సిలుగేల శ్రీవేంకటేశ్వరుని**
**వంతుల నమ్మినయట్టి వైష్ణవులకు**
**జంతువుల పురుఁడులు జడులకింతేకాక**
**వింతవింతసుద్దులేల విభవమేకాక** ||గరి||

**ఉపోద్ఘాతము:**

ఓ కమలనయనా! నీమహిమలంటే నీదాసులమైన మాకు భయమెందుకయ్యా? నీ దాస్యమువలన చెడినవారెవ్వరూ లేరు. నీదాసులైన వారికి పరమపదమొక్కటే ఫలప్రదమైన లబ్ధి. ఇంతేకాక ఇక గమ్యమే లేదు అంటున్నారు అన్నమయ్య. ఇంత సీదాసాదాగా కనిపించే ఈ కీర్తన వివరించబూనుకొంటే నారాయణుని 'గరిమ' లాగా నన్ను అయోమయంలో పడేసింది. మోపినదంతా ఏకముఖమే అంటే యేమిటి? పోతరించి యెక్కనెక్క బొడవేకాక అంటే ఎలా వివరించాలి? వింతవింత సుద్దులేల విభవమే కాక-





అంటే అర్థమేమిటి? ఈ కీర్తనలో ఇంత తిరకాసువున్నది. నా ప్రయత్నం నేనూ చేస్తాను, ఆపైన భారం మా కొండలరాయడిదే.

**తాత్పర్య వివరణ:**

కమలాక్షుడైన శ్రీహరిదాసులకు గరిమతో ఆయన మహిమలంటే వెరపేల (భయమెందుకు?) వారి గమ్యము వారు ఆశించే ఫలమూ ఆ పరమపదమొక్కటే. ఇంతేకాక మరేమియూ వారు కోరరు.

ప్రపన్నాధికారులకు (శ్రీహరి శరణాగతిని పొందినవారికి) పాపమెంతటిది? పుణ్యమెంతటిది? అవి వారి దాపవగలిగినది కేవలము ఒక్క నిమేషమాత్రమే సుమా! అదే లోకపు తాపత్రయం గల వారికి ఈ అంతః శ్శుద్ధి బాహ్యాశుద్ధి అంటూ వుండవు. వీరికి చిగురించినదంతా ఏకముఖమే. వారికి ప్రపత్తి అంటే పట్టదు.

సాత్విక బుద్ధికల హరిదాసులకు రాత్రీపగలు అంటూ విచక్షణ వుండదు. వారెప్పుడూ శ్రీహరియందు రమించుచునే (తాదాత్మ్యము చెందుతూనే) వుంటారు. వారి ఇటువైపంతా దివ్యతేజస్సుతో కూడిన వెలుగు మాత్రమే తోస్తుంది. ఇక పోతే కర్మలను అకర్మలను చేస్తూ పోతరించి (మదించి) అతిశయించి వున్నవారికి, సాత్త్వికుల మాదిరిగా పరమపదము లభించే అవకాశం యేనాటికీ వుండదు.

శ్రీవేంకటేశ్వరునకు భృత్యులయిన వైష్ణవులు ఆయననే త్రికరణశుద్ధిగా నమ్మియున్నారు. వారికి యే చింతా వుండదు. ఏ సిలుగూ (ఉపద్రవమూ) రాదు. ఇకపోతే జడులైన (మూర్ఖశిఖామణులైన) నాస్తికులుంటారు. వారికి మాత్రం జంతువుల పురుడులు (జన్మలు) తప్పవు. ఎందుకంటే వారికి వైభవం మీదవున్న కాంక్ష తప్పించి శ్రీహరి వింత వింత కథలతో పనియే లేదు.

**పద్యవివరణ:**

తే.గీ॥ **గరిమతో వెరపేలరా? కమలనయన!**
**పరమపదమొక్కటేకాక ఫలము కలదె?**
**వేంకటేశుని భృత్యులు వెరపులేక**
**నమ్మినట్టి వైష్ణవులౌట నెమ్మిమనిరి.**

సంఖ్య: XXIV/191 రాగం : నాదరామక్రియ
కీర్తన : పొలతిదేహమే భూమండలమై

## నాదరామక్రియ

**92 పొలఁతిదేహమే భూమండలమై**
**కలకాలంబునుఁ గాణాచాయ** ||పల్లవి||

**కొమ్మకుచంబులకులపర్వతములు**
**నెమ్మదిఁ గలుగఁగ నేఁ డిదివో**
**పమ్మిన జవ్వనభారము మోపఁగ**
**తమ్మివదన కాధారంబాయ** ||పొలఁ||

**కాంతగమనముల ఘనదిగ్గజములు**
**కంతునిబలమై కలుగఁగను**
**పంతమున పిఱుఁదుభారము మోవఁగ**
**యింతినటనలకు నిది గతియాయ** ||పొలఁ||

**చెలియారనియెడి శేషుఁడు గలుగఁగ**
**అలతురుముభార మానె నిదె**
**వెలయఁ గూడె శ్రీవేంకటపతి యీ-**
**కలికిని యిదియే కడుఁగతలాయ** ||పొలఁ|| **191**

**ఉపోద్ఘాతము:**

ఇది ఒక విశిష్టమైన శృంగారకీర్తన. ఈ సౌందర్యవతి దేమము భూమండలమువలె ఎల్లప్పుడూ సిరులకు ఆటపట్టై ఒప్పుచున్నది అంటున్నారు అన్నమయ్య. ఈమె చనుగవ కులపర్వతములను బోలినెమ్మది కలిగించుచున్నవి. ఆ యవ్వనభారము భరించుటకు ఆ పద్మముఖికి అవే ఆధారమైనవి. గొప్ప దిగ్గజములనడకగల ఆ గజగామిని





మన్మథుని బలముమూర్తీభవించిన దానివలెనున్నది. ఆమె నితంబముల భారమైన కదలిక నాట్యాచార్యుని నాట్యగరిమను స్ఫురింపజేయుచున్నది. ఆమె తురుము ఆదిశేషుని స్ఫురింపజేయుచున్నది, అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఆ పొలతి (వనిత) దేహమే భూమండలమై భాసిల్లినది. కలకాలమూ అది సిరులకు కాణాచి (ఆటపట్టు) అయినది. (ఎందుకంటే ఆమె సిరులరాణి కదా!)

ఈ కొమ్మ (కోమలాంగి) కుచంబులు కులపర్వతములు. (స్తనములు కులపర్వతములవలె సమున్నతమైనవి). నేడు ఆమె ప్రశాంత చిత్తయైయున్నది. పమ్మిన (అతిశయించిన) యౌవన భారములను మోయుటకు, ఆ తమ్మి వదనకు (పద్మముఖికి) ఆధారమైనది.

ఆ కాంతయొక్క గమనము (నడక) గజగమనము. అది ఘనమైన దిగ్గజముల నడకను తలపించును. మన్మథుని బలమువలె అతిశయించి ఆ దిగ్గజములు మిక్కిలి బలమైనవిగా తోచినవి. ఆమె ఘనమైన నితంబముల భారము మోయుటకు ఆ ఇంతి నడక లావణ్యమునకు ఇదె (ఈ నితంబుల కదలికయే) గతియాయ (ఆధారమైనది).

ఆ చెలియొక్క వేణీ భారమనెడి ఆదిశేషుడు కలిగినందున ఆమె తురుము (కొప్పు) అతిభారమై కొద్దిగా తల వెనుకకు వంచినది. ఇంత ముగ్ధమోహన అయిన ఈ అతివను శ్రీవేంకటేశ్వరుడు కూడక వదిలేనా? ఆయన కూటమి ఎన్నో శృంగారగాథలకు ఆలంబనమైనది.

**పద్యవివరణ:**

ఆ.వె|| **పొలతి దేహమదియె భూమండలంబాయె**
**అన్నికాలములలో ఆటపట్టు-**
**ఆయె సిరులకెల్ల, అలరువేంకటపతి**
**కలికిగూడ వచ్చె కౌతుకమున.**

సంఖ్య: IV/44 రాగం : గౌళ
కీర్తన : హరి నీవాడనే కానా ఆదికాలమున నేను

**గౌళ**

**93** **హరి నీవాఁడనే కానా ఆదికాలమున నేను**
**గరిమ నీ మాయలోనే కలగంటిఁగాక ॥పల్లవి॥**

**యీమేనే కాదా హేయమెల్లా మోచినది**
**ఆమీఁదఁ బుణ్యతీర్థము లాడీఁగాక**
**కామించి యీరెంటిసంగాతంబు నేఁ జేసి**
**గామిడినై యెందువాఁడాఁ గానైతిఁగాక ॥హరి॥**

**చిత్త మిదేకాదా చింతించెఁ బాపాలు దొల్లి**
**పొత్తుల పుణ్యాలు దలపోసీఁగాక**
**రిత్తకు రిత్తయి యీరెంటి నడుమను జిక్కి**
**కత్తరపురొంపిలోనికంబ మైతిఁగాక ॥హరి॥**

**యీ నాలుకే కాదా యిందరినిఁ బొగడేది**
**తానకపువేదములు తడవీఁగాక**
**వూనిన శ్రీవేంకటేశ వొంటి నీకు శరణని**
**తోనే యా రెండుఁ గడచి తుద కెక్కేఁగాక ॥హరి॥ 44**

**ఉపోద్ఘాతము:**

ఓ శ్రీహరీ! మేము ఆదికాలము నుండియూ నీవారమే. మధ్యలో నీవు కల్పించిన మాయవలన కలగన్నట్లు ఏవేవో కర్మలు చేసి నిరంతరం వాటి ఫలితములననుభవిస్తూనేవున్నాము, మమ్మల్ని ఉద్ధరించగలిగింది నీవు గాక మరెవ్వరున్నారు అంటున్నారు అన్నమయ్య. అనాదిగా నా జీవుడు జన్మలను పొందుతూనే వున్నాడు. ఆనాటినుంచీ నేను నీవాడనుకానా? మధ్యలో నీ మాయవల్ల కలగంటిని. దానివల్ల నాకు ఆ కలలో జరిగినట్లు అనిపించినవేవీ





గుర్తువుండవు. నా జన్మల వ్యవహారమూ అంతే. నాకు ఒక్కటీ గుర్తు లేదు. ఇన్ని జన్మల తరువాత నేటికి శ్రీవేంకటేశ్వరుడవైన నీ కృపగలిగి సంచితప్రారబ్ధ కర్మములను గడచి మోక్షమార్గము బట్టితని, అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ శ్రీహరీ! నేను ఆదికాలమున (అనాదిగా) నీవాడను కానా (నీవాడనేనయ్యా!) గరిమ (ఈ మధ్యలో) నీమాయకు లోనై కలగంటిగాక! (కలలోవలె పూర్వపు సంగతులన్నీ మఱచిపోయాను).

ఈ నాహేయమైన (మాలిన్యబంధురమైన) మేను (శరీరమును) మోచినది నా జీవుడే. మానసికమైన మాలిన్యములు తేలికగా వదలవు. దానికోసం అనేక పుణ్యతీర్థాలలో స్నానములాచరించాను. ఇది నేను తెలియక చేసినది కాదు. కావాలని చేసినదే. ఈ రెండు సంగాతంబులు (కర్మములు) నేనే చేశాను. కావున గామిడినై (ఘనుడనై) ఎందువాడనుగానైతి (ఎవరికీ చెందక మళ్ళీ జన్మనెత్తాను).

తొల్లి (నా పూర్వజన్మలలో) పాపపు ఆలోచనలు చేసింది ఈ నా చిత్తమే. వాటితోపాటే కొన్ని పుణ్యపు ఆలోచనలనుకూడా చేసింది నా చిత్తము. అనవసరంగా ఈ రెండు రకములైన ఆలోచనలలో చిక్కుకుపోయింది నా చిత్తము. కత్తరపు రొంపిలో కంబమైతినిగాక (అనేక తీరుతెన్నులుగల బురదలో నిలబెట్టిన స్తంభమువలె నుంటిని).

ఈ నా నాలుక పనీపాటాలేనిది. ఇంతకాలం ఇది అనేకమందిని పొగడి పొగడి అలసిపోయింది. అట్లాగే వేదము నేర్చినందున అప్పుడప్పుడూ వేదమునూ వల్లెవేసింది. ఊనిన (పొందిన) శ్రీవేంకటేశ్వరా! నేను ఒంటరివాడనై నిన్ను శరణు అన్నాను, దానివలన ఇటు ధనాపేక్షగానూ, ఇటు జ్ఞానాపేక్షను, రెంటినీ త్యజించి తుదకెక్కితిని (మోక్షగామినయ్యాను).

**పద్యవివరణ:**

కం॥ **హరి నీవారమె తొల్లియు**
**గరిమల నీమాయవల్ల కలగంటిమి పో**
**శరణని వేంకటరమణా**
**వరముగ తుదికెక్కువాడ వనరుహ నయనా!**

సంఖ్య: XXIV/171 రాగం : సామంతం
కీర్తన : నయగారిసటకాడ నారసింహా నీ-

## సామంతం

94 నయగారిసటకాఁడ నారసింహా నీ-
ప్రియమెల్లాఁ గంటి వింటి పెనునారసింహా ||పల్లవి||

వేరేమారురూపై వెలసే వింతిమాటున
చేరి యేమిసేసితివో శ్రీ నారసింహా
సారె నోరు దెరచేవు సతితమ్ములము నీకుఁ
గారమై తోఁచెనోకాక ఘననారసింహా ||నయ||

తీగెనవ్వు నవ్వేవు తెరవ నీమర్మమెత్తి
చేగదేర నేమనెనో శ్రీనారసింహా
వేగమే చెమరించేవు వెలఁదిదగ్గరనుండి
యేగతిఁ గళలంటెనో యిటు నారసింహా ||నయ||

అంతలోనే బుసకొట్టే వంగనకాఁగిట నీవు
చెంత నెట్టు గూడితివో శ్రీనారసింహా
దొంతిగా శ్రీవేంకటాద్రిఁ దొడ నిఁ(నిం)తిఁ బెట్టుకొంటి
పంతమిచ్చితి అవుభళనారసింహా ||నయ|| 171

**ఉపోద్ఘాతము:**

నయగారి అంటే మృదుత్వంకలవాడని అర్థం. సటకారి అంటే మాయలమారివాడు అని అర్థం. ఈ అహోబలనారసింహుడు క్రూర స్వభావుడనుకొంటే పెద్దపొరబాటే. ఈయన మృదువైనవాడు. అంతేకాదు దనుజాంతకుడైన శ్రీహరి కాబట్టి గొప్ప మాయలమారికూడాను. అహోబలమున నెలకొన్న ఓ పెనునారసింహా! నీ ప్రియమెల్లా శ్రీలక్ష్మికిచ్చి ఆమెకు నీతొడపై స్థానమిచ్చినావని వింటిమి. నేడు మాకనులారగంటిమి,





అంటున్నారు అన్నమయ్య. నాటి అహోబలనరకేసరియే నేటి శృంగార రాయడు శ్రీవేంకటేశ్వరుడు. ఈ శృంగార వైభవం ఈనాటిదికాదు, ఆనాటిదే.

**తాత్పర్య వివరణ:**

నయగారివి (మృదుస్వభావం కలవాడు) సటకారి (మాయలమారి అయినవాడు) నీవేనయ్యా! అహోబల నారసింహా! ఈ శ్రీలక్ష్మిపై నీకుగల వలపు గురించి పెక్కు కథలను వింటిమి. నీ లీలలను కంటిమి.

ఈ ఇంతి నీ దగ్గర మాటతీసుకొన్నది. నామనోవల్లభుడైన శ్రీహరిని ఈ ఉగ్రసింహంవలె చూడలేను నా కంటికి ఇందీవరశ్యాముడైన శ్రీహరిగానే కనుపించు ప్రభూ! అని ఆమె కోరినది. మరి నీవేం చేశావో ఆమె నిన్ను వీడలేకున్నది. నీవు నీ నోరు కొద్దిగా తెరచి ఆమెను చూస్తుంటే ఆమె చేతి తాంబూలముపై మనసుగొంటివనిపిస్తున్నది.

ఓ నారసింహా! నీవు నవ్వుతుంటే నీనోటినుండి లాలాజలము తీగెలమాదిరి వెలువడినది. ఆమె నీమర్మమెత్తి (రహస్య వెలువరించి) ఈ నరమృగం హిరణ్యకశిపుని నిర్జించిప్రహ్లాదుని రక్షించుటకు అవతరించిన శ్యామసుదరుడు శ్రీహరి అని గ్రహించినది. ఇక ఆమె నిన్ను చెమరించక మానీనా? నీవావెలది దగ్గర చెమరించేవు. ఓ నృసింహా ఆమె ఏరీతి నీ కళలంటెనోగాని నీవామెకు చేరువైతివి.

ఓ నారసింహా! విచిత్ర మేమంటే, అంగన కౌగిటిలో కూడా నీవు బుసకొట్టే నీ అలవాటు మానలేకున్నావు. అంతలోనే దైత్యుడు తలపునకొచ్చినాడా అనునట్లు పూత్కరించినావు. ఓ శ్రీనారసింహా! శ్రీలక్ష్మిని నీ చెంతనే ఎట్లు గూడినావయ్యా? దొంతిగా (ఇద్దరు దేవేరులను) ఉమ్మడిగా ఉరమున బెట్టిన శ్రీవేంకటేశ్వరుడవు. అహోబలమున ఇంతిని తొడపైబెట్టిన పంతగానికి ముద్దు సతులముచ్చటలు మోదమాయెనేమో!!

**పద్యవివరణ:**

ఆ.వె॥ **నారసింహుడెంత నయగారి సటకారి**
**ప్రియములెల్ల గంటి వింటినయ్య**
**వేంకటపు నృసింహ వెలది నీతొడపైన**
**పంతమౌభళమున బట్టెనయ్య!**

సంఖ్య: IV/20 రాగం : సాళంగనాట
కీర్తన : జగములెల్లా నీడేరెజయవెట్టి రిందరును

### సాళంగనాట

**95** **జగములెల్లా నీడేరె జయ వెట్టి రిందరును**
**తగ నేఁడు కృష్ణావతారమాయ నిదివో** ||**పల్లవి**||

**అచ్చితుఁడు జనించె నద్దమరేతిరికాడ**
**ముచ్చిమి రాకాసులు ముట్టుపడిరి**
**పచ్చిగాను లోకులాల పండుగ సేయరో నేఁడు**
**అచ్చుపుఁ గృష్ణావతారమాయ నిదివో** ||**జగ**||

**గోవిందుఁడు జనియించె గోకులష్టమిదే నేఁడు**
**కావరపు కంసుని గర్వమణఁగె**
**భావించి ప్రజలాల పారణ సేయరో నేఁడు**
**ఆవేళఁ గృష్ణావతారమాయ నిదివో** ||**జగ**||

**అనంతుఁడు శ్రీవేంకటాద్రీశుఁడు జనియించె**
**ఘనశిశుపాలాదులు గతమైరి**
**తనివంది జనులాల ధర్మాన బ్రతుకరో**
**అనుగుఁ గృష్ణావతారమాయ నిదివో** ||**జగ**|| **20**

**ఉపోద్ఘాతము:**

నేడు శ్రీకృష్ణాష్టమి. దుష్టశిక్షణకు శిష్టరక్షణకు స్వయముగా శ్రీమన్నారాయణుడు లీలామానుష విగ్రహుడై దేవకీగర్భమున అష్టమ పుత్రునిగా అవతరించాడు. ఎన్నో లీలలు ప్రదర్శించినాడు. రాకాసులు ముట్టుపడిరట. గోవిందుడు రేపల్లెకు చేర్చబడి గోపకిశోరుడైనాడు. కావరం గలిగిన కంసుడు గడగడలాడాడు. ఘన శిశుపాలాదులు గత





చరిత్రలో మిగిలిపోయారు. తృప్తి చెందిన జనులారా! ఇకనుంచైనా ధర్మవర్తనతో బ్రతకండి అని గీతామృతమనొసగిన గీతాచార్యుడు ఆ ద్వారాకాధినాథుడు. నేడు శ్రీవేంకటేశుడై తిరుమల శిఖరాలపై జనించాడు అని కృష్ణలీలలను కీర్తించారు అన్నమయ్య.

**తాత్పర్య వివరణ:**

నేడు కృష్ణావతారమాయ (ఈ దినముననే కృష్ణుని అవతారము ఆవిర్భవించింది). ఇదిగో, తగ (తగినట్లుగా) జగములెల్లా నీడేరినవి (సఫలత జెందినవి). ఇందరును (ఈ ప్రజలెల్లరును) జయవెట్టిరి (జయజయధ్వానములజేసిరి).

అర్ధరాత్రి వేళలో అచ్చితుడు (అచ్యుతుడు) జన్మించినాడు. ముచ్చిమి రాకాసులు (దొంగబుద్ధికల రాక్షసులంతా) ముట్టుపడిరి (సంకటములను పొందిరి). పచ్చిగాను (బాహాటముగా) జనులెల్లా పండుగ జరుపుకొనండి. ఇదిగో నిజమైన కృష్ణావతారమావిర్భవించినది.

ఓ ప్రజలారా! నేడిదే గోకులాష్టమి. ఈ కృష్ణుడు గోవిందుడై రేపల్లె జేరినాడు. ఆపైన కావరముతో కన్నూమిన్నూగానని కంసుని గర్వమంతా అణగారినది. ఈ దివ్యసందర్భమును తలచుకొని జనులంతా శ్రీకృష్ణ నామామృతమును పారాయణ చేయండి. ఇదిగో ఆవేళ శ్రీకృష్ణావతరణము జరిగినది.

ఇదే కృష్ణాష్టమినాడు అనంతుడైన శ్రీమన్నారాయణుడు శ్రీవేంకటేశ్వరుడై తిరుమల శిఖరాలమీద నావిర్భవించినాడు. శిశుపాలాది ఘనమైన దుష్ట రాజలోకము గతమైరి (గతించిరి లేక గత చరిత్రలో మిగిలిపోయిరి). తృప్తిపడి ప్రజలంతా ధర్మవర్తనులై బ్రతకండి. ఇదివో మీ ప్రియమైన శ్రీకృష్ణావతారము.

**పద్యవివరణ:**

తే.గీ|| **జగములెల్ల యీడేరెను జయమువెట్టి**
**నేడు కృష్ణావతారంబు నిలిచెనెదుట**
**కృష్ణలీలలు పాడేరు కీర్తనముల**
**తిరుమలేశుడు మురియంగ చిరునగవుల.**

సంఖ్య: XXIV/165 రాగం : శంకరాభరణం
కీర్తన : నిక్కమమ్మ యశోద నియ్యాన

## శంకరాభరణం

**96** నిక్కమ్మ యశోద నియ్యాన
అక్కడ నెవ్వరోకాక అటువంటివాఁడా ॥పల్లవి॥

వీఁడుగదె బాలుఁడు వెన్నలు దొంగలీ నేఁడు
కాఁడువో అదేమోసి గబ్బిగొల్లెత
చూడఁగదె నీవు సోయగపు చేతిజిడ్డు
ఆడేవు కల్లలేకాక అటువంటివాఁడా ॥నిక్క॥

చిక్కెఁగదె మీవాఁడే చేరి పెరుగుదొంగ
పొక్కాలదేమోసి బొంకుగొల్లెత
పుక్కిట నిదిగదె పొంగినట్టిమీఁగడలు
అక్కటా నీభ్రమలింతే అటువంటివాఁడా ॥నిక్క॥

యిదివో శ్రీవేంకటేశుఁ డింతేసి సేసినాఁడు
పదవే నీవేమనేవు బద్దుగొల్లెత
అదివో నీమాఁటలైతే అన్నియుఁ జెల్లెనమ్మ
అదనాయ మీకు నాడ నటువంటివాఁడా ॥నిక్క॥ **165**

**ఉపోద్ఘాతము:**

ఈ కీర్తన వివరణ నాకు కత్తిమీద సాము అయింది. ఇది నిజానికి కృష్ణునిపై పితూరీచేయవచ్చిన గోపికతలతో యశోద సంవాదము. అందువల్ల కీర్తన అంత తేలికగా అర్ధంకాదు. ఇంతేకాక కొన్ని జానపదుల సంభాషనలు నేడు చలామణిలో లేవు. "పొక్కాలదేమోసి బొంకు గొల్లెతా" అంటే ఓసి గొల్లెతా! నీకేమి పోయేకాలం వచ్చిందే (నా పిల్లవాడిని ఆడిపోసుకుంటున్నావు, అన్నట్లు.) పల్లవిలో ఉన్న రెండు చరణాలు అంతే. "ఓ యశోదా! నిక్కమమ్మా! నీయాన" అనేది గోపికలు. దానికి యశోద "అక్కడ యెవ్వరున్నారో. మావాడు





అటువంటివాడా?" (ఇది మరీబాగుంది) అన్నది. నా శక్తివంచన లేకుండా వివరణకు ప్రయత్నిస్తాను. ఇది అన్నమయ్య అద్భుత సృష్ఠి.

**తాత్పర్య వివరణ:**

ఓ యశోదా! నిక్కమమ్మా! (మేము నిజం చెబుతున్నామమ్మా!) నియ్యాన (నీయాన, నీమీద ఒట్టు). దానికి యశోద అంటున్నది, అక్కడ నెవ్వరోకాక (అక్కడ ఇంకెవరున్నారో) మావాడు అటువంటివాడా?

ఏమంటున్నావమ్మా! యశోదా! మా ఇళ్ళల్లో వెన్నలు దొంగతనంచేసే బాలుడు నేడు వీడు కాక ఇంకెవరు? ఓసి, గబ్బిగొల్లెతా (కంపు కొట్టే గొల్లదానా! కాడేవో (అది నా పిల్లవాడు కాదే). ఓ యశోదా! మీవాడి సోకైన చేతులకంటిని జిడ్డును చూస్తే తెలీటంలేదా? అన్నారు గోపికలు. యశోద వెంటనే ఎందుకమ్మా కల్లలాడి నా బిడ్డను మాటలంటారు? వాడు అటువంటివాడా?

మీవాడు పెరుగు దొంగతనంగా తింటూ దొరికిపోయాడు, అన్నారు గోపికలు. దానికి యశోద అన్నది "బొంకే గొల్లదానా! పొక్కాలదేమోసి (ఓసీ! నీకేమి పోయేకాలం వచ్చిందే) నా బిడ్డను అంటున్నారు". ఇది మరీ విడ్డూరం ఉబ్బిన మీ కృష్ణుడి పుక్కిలి చూడవమ్మా వేడి వేడి మీగడలు ఇంకా వాడి బుగ్గలలో వున్నాయి, చూసుకోవమ్మా! అన్నారు గోపికలు. అయ్యో! అదంతా మీ భ్రమే.. మా అబ్బాయి అటువంటివాడు కానేకాదు, అన్నది యశోద.

పోనీవమ్మా! యశోదా! దొంగ నీకొడుకు కృష్ణయ్య కాకపోతే తిరుమల వేంకటేశుడు, ఇవన్నీ చేశాడంటావా? పోవే వో బద్ధకస్థురాలవైన గొల్లెత! నీవేమంటున్నావో నీకు తెలుస్తున్నదా? అవునులేవమ్మా! యశోదా! మీరు గొప్పవాళ్ళు. నీవేమన్నా చెల్లుతుంది. ఆ యశోదకూడా తగినట్లు అంటించింది. మీకు అవకాశం వచ్చింది కొండెములు చెబుతున్నారు. నాబిడ్డ అటువంటివాడా?

**పద్యవివరణ:**

కం॥ **ఎనరో సంవాదంబును**
**గొనకొని గోపెమ్మ చెప్పె కొండెములెల్లన్**
**తను ఆ యశోదఘాటుగ**
**వినిపించెను తగు జవాబు వేంకటనాథా!**

సంఖ్య: IV/21 రాగం : మాళవి
కీర్తన : పారిరి దానవులెల్లా పంచబంగాళమైరి

### మాళవి

**97 పారిరి దానవులెల్లా పంచబంగాళమైరి**
**తూరిరి గొందులెల్లాను తుత్తుమురై విరిగి ||పల్లవి||**

**గరుడధ్వజునిదండు గదలె రాకాసులపై**
**అరదము దోలవో చయ్యన దారకా**
**ధరయెల్లఁ గుమ్మెలై పాతాళ మదే కానవచ్చె**
**తురగములఁ దోలవో దుమ్ములు రేఁగను ||పారి||**

**దనుజాంతకునిసేన దగ్గరి నడవఁజొచ్చె**
**చొనిపి రొప్పవో తేరు సుమంతుఁడా**
**గునిసి దిగ్గజములు గొబ్బున మొగ్గతిలెను**
**కినిసి పగ్గములు బిగించవో పయిపైన ||పారి||**

**శ్రీవేంకటేశుబలము చిమ్మిరేఁగి మించఁజొచ్చె**
**సేవించలమేల్మంగను సేనాపతీ**
**దేవతలు మొక్కి రదే దిక్కులు సాధ్యములాయ**
**తావుకు మరలించవో తానముగాను ||పారి||**

**ఉపోద్ఘాతము:**

పంచబంగాళములవటం అంటే చెల్లా చెదరైపోవటమన్నమాట. గరుడ-ధ్వజుడైన శ్రీహరి అదిగో రాకాసులపైకి కదలె. ఓ దారకుడా? ఇంకా చూస్తావే, చయ్యన రథమును తోలుము. అదిగో భూమండలం వెనకబడిపోయి, పాతాళ లోకం కనబడుతోంది. వాళ్ళు అక్కడనే వుంటారు. దుమ్ములేచిపోవునట్లు గుఱ్ఱమును పరుగులెత్తించు అంటున్నారు





అన్నమయ్య. ఇటువంటి కీర్తనలన్నీ తిరుమలేశుని బ్రహ్మోత్సవాలలో శ్రీనివాసుడు రథంపై వూరేగుతుంటే అన్నమయ్య ఆశువుగా పాడినవే. మనం ఆశ్చర్యపోయేది ఆయన పదవిన్యాసానికి. ఆ భాషాసౌష్టవానికి.

**తాత్పర్య వివరణ:**

అదిగో శ్రీవేంకటేశ్వరుని రథము. ఒరే! దానవుల్లారా! మీరంతా పంచబంగాళములై (చెల్లాచెదరై) పారిరి (పారిపోయారు). తుత్తునియలై (బేజారుచెంది) గొందుల (చిన్న చిన్న సందుల్లో) దూరిపోయారు.

రాకాసులపైకి (రాక్షసులపైన) గరుడధ్వజుడైన శ్రీహరి, దండు (సైన్యము) కదిలాయి. చయ్యన (వేగముగా) ఓ దారకుడా! అరథము తోలవో (రథమును నడపవయ్యా!) భూమండలమంతా గుమ్మెలై (వెనకబడిపోయి) అదిగో పాతాళలోకం కనబడుతోంది. దుమ్ములేచిపోవునట్లు, గుఱ్ఱములను తోలవయ్యా! శ్రీకృష్ణుని రథం తోలిన నీ అనుభవం, పూరకనే పోదు.

దనుజాంతకుడైన శ్రీహరిసేన వేగముగా వస్తోంది. అది ఆ రథమునకు దగ్గరయై కదులుతున్నది. ఓ సుమంతుడా! నీకు శ్రీరామచంద్రుని రథం తోలిన అనుభవం ఇప్పుడు చూపించు. నీ వేగానికి దిక్కులను రక్షించే దిగ్గజములు, గొబ్బునమొగ్గతిల్లెను (శీఘ్రముగా మొగ్గవారినవి). నీవు పగ్గములను బిగించి రథమును నడపవయ్యా!

అదిగో భావనాదృష్టితో చూడండి. వేంకటేశుని రథము సాగుతున్నది. ఆయన సైన్యాధిపతి విష్వక్సేనులవారు, చిమ్మిరేగే (మిక్కిలి విజృంభించే) ఆ రథంలోని వేంకటరమణుని, అలమేల్మంగమ్మను సేవిస్తూ వెనువెంటనే వున్నారు. దిక్కులన్నీ స్వాధీనమైన స్వామి దేవతలంతా మొక్కుతున్నారు. ఇక రథాన్ని స్వామిస్థానమునకు మరలించండి.

**పద్యవివరణ:**

కం|| **పారిరి దానవులెల్లెడ**
**పారుచు తామైరి పంచబంగాళంబుల్**
**తూరిరి సందులు గొందులు**
**ఔరా! తుత్తునియలైరి హరిచెండుటచే.**

సంఖ్య: XXIV/54 రాగం : మంగళ కౌసిక
కీర్తన : ఇంత సేయగా నీకిందు యేమివచ్చెనే నీవు

## మంగళ కౌసిక

**98** **ఇంత సేయఁగా నీ కిందు యేమివచ్చెనే నీవు**
**యింతివేకావా చెలి యిదియేమే** ॥పల్లవి॥

**అలరిచేఁతలవిభుఁ డాతఁడేడ నేనేడ**
**చాలుఁజాలు నింత నీకు చలమేఁటికే**
**మూలనుండేవారిఁ దెచ్చి ముంగిటఁ వేసేనంటా**
**యేల యిట్టె బోదించే విదియేమే నీవు** ॥ఇంత॥

**మాయదారివిభుఁ డెంత మరిగిననేనెంత**
**ఆయనాయ నననేల యలయించేవే**
**వోయమ్మ చల్లవేఁడై వున్న నన్ను నతనితో**
**యీయెడనే కూడుమనే విదియేమే నీవు** ॥ఇంత॥

**యింతలోనే శ్రీవేంకటేశుఁడే దక్కె నిట్లు**
**సంతముసేసితిని మెచ్చుఁగవలెనే**
**పంతము పలుకు నొక్కపాటిగా మెలఁగునాపై**
**యెంతకెంతమమకార మిదియేమే నీవు** ॥ఇంత॥ **54**

**ఉపోద్ఘాతము:**

అన్నమయ్య ఈ కీర్తనలో దేవికి అనుంగు చెలికత్తెయై ఆమెను మందలిస్తున్నారు. ఇంత రాద్ధాంతం చేస్తున్నావు, ఇందువల్ల నీకేం ప్రయోజనం కలిగిందమ్మా? అసలు నీవు ఆడదానివేకావా యేమిటే? ఇదేమిటే నీ ప్రవర్తన? అంటున్నారు. సాధ్యాసాధ్యాలను రెంటినీ చేయగల ఆయనెక్కడ నేనెక్కడ? చాలుచాల్లేవమ్మా! ఈ మొండితనం ఇకనైనా



హరి నీమయమే అంతాను

మానుకో. ఎక్కడో మూలనుండాల్సిన వాళ్ళను తెచ్చి నా ముంగిటబెట్టుకొన్నానని యేమిటమ్మా నీ సూటిపోటి మాటలు? నీవు యేల యిట్టే బోధించేవు? ఇదేమే? నీకీ అనుమానమేమిటే? ఆయన జగదేకపతి. నీ స్వంతం అనుకొంటే యెట్లాగే?

**తాత్పర్య వివరణ:**

ఓ చెలీ! ఇంతసేయగ నీకిందు ఏమి ఉపయోగం కలిగిందమా! నీవు ఆడదానివే కావా యేమిటమ్మా? ఇదియేమిటమ్మా?

అలరి (చిలిపి) చేష్టలు చేయుటలో సుప్రసిద్ధుడైన నీ విభుడెక్కడ? నేనెక్కడ ఆలోచించవమ్మా! చాల్చాల్లేవమ్మా! ఇంత మత్సరము నీకు తగునా? ఇదియేమిటమ్మా? ఏల ఇట్లా అందరికీ చెబుతున్నావు? మీ ఆయన మూలనుండే వారిని దెచ్చి ముంగిట వేసెనంటూ, యేమిటమ్మా నీ పుల్లవిరుపు మాటలు?

ఓ చెలీ! మాయాతీతుడైన నీవిభుడెక్కడ? ఆయనను విడచి జీవించలేని మేమెక్కడమ్మా? అయిందేదో అయింది. ఇంకా నన్నెందుకు అలయించేవే? (శ్రమపెడుతున్నావమ్మా?) ఇది తగునా? ఓయమ్మా! నేనాతనిపై ద్వంద్వ భావాలతో వున్నాను. నన్ను ఈయెడ (ఈ సమయమున) అతనిని కూడమనుచున్నావు, నీవు.

ఓ దేవీ! ఇంతలోనే శ్రీవేంకటేశుడు తనంతటతానే నాకు దక్కినాడు. ఆతనిని నా స్వంతము చేసికొందామని నే ననుకొన్నమాట నిజమే. నన్ను నీవు మెచ్చుకొనక తప్పదమ్మా! నీతో పంతము వహించిన నన్ను, మాటకు కట్టుబడివుండే నన్ను ద్వేషించాల్సిందిపోయి, ఇంత మమకారం చూపిస్తున్నావేమిటమ్మా. ఇదియేమే దేవీ?

**పద్యవివరణ:**

తే.గీ॥ **ఇంతసేయగా నీకిందు యేమివచ్చె?**
**ఇంతివేకావ? ఓ చెలీ? యేమిటమ్మ?**
**దక్కె శ్రీవేంకటేశుడు దగ్గరాయె**
**ఎందుకీమమకారంబులేల నాపై?**

సంఖ్య: XXIV/66 రాగం : సాళంగనాట
కీర్తన : మందులు మాకులు మరియేలా

## సాళంగనాట

**99 మందులు మాఁకులు మఱి యేలా**
**అందులనే గుణమయ్యీని ॥పల్లవి॥**

**చుంగులనీతెలిచూపులు రమణుని-**
**కంగజబాణములయి తాఁకె**
**రంగగు వీడెపురసములకారము-**
**లెంగి లనక పతి కియ్యఁగరాదా ॥మందు॥**

**వెడ నీనవ్వులవెన్నెల విభునికి**
**వడిగల యందయు వడదాఁకె**
**ఆదరఁగ నతిరస మమృతరసాయనము**
**వొడలి కిత వతని కొసఁగఁగరాదా ॥మందు॥**

**చెలి నీకుచములు శ్రీవేంకటపతి-**
**కలయిక రుచులయి కళదాఁకె**
**కులికేటిగోళ్లకొనయెచ్చరికల**
**తెలియఁగ మఱపులు దెలుపఁగరాదా ॥మందు॥ 66**

**ఉపోద్ఘాతము:**

పూర్వకాలపు స్త్రీలు కొందరు భర్త తమకు వశుడవక తన ఇచ్చవచ్చినట్లున్నాడని అతనికి మందు బెట్టేవారని ప్రతీతి. ఏదోతీపి పదార్థంలో కలిపి పెడితే భర్త గుర్తించలేక దానిని భుజించి ఆ మందు ప్రభావం వలన ఆమె చెప్పినట్లే నడుచుకొంటాడని ఒక నమ్మకం వుండేది. ఈ కీర్తనలో దేవి చెలికత్తె ఆమెను మందలిస్తున్నది. చెలికత్తె మన అన్నమయ్యేనని నేను ప్రత్యేకించి చెప్పనక్కరలేదు కదా! ఆ చెలికత్తె అంటున్నది ఓ చెలీ! ఏమిటమ్మా నీ వెఱ్ఱితనం? మందులూ మాకులూ మరెందుకమ్మా? అందులో





యేగుణం వుంటుందమ్మా? ఏమిటి నీమూర్ఖత్వం? నీపతి జగన్మోహనుడు. ఆయనను కోరని స్త్రీ వుంటుందా? ఆయన నీకు లొంగివుండాలంటే మన్మథుని తూపులవంటి చూపులు, లేత వెన్నెలవంటి చిరునవ్వు, రుచులదేలే కలలను ప్రదర్శించే బిగి కౌగిలి కావాలి. అవుంటే మందులెందుకమ్మా అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ దేవీ! ఈ పురుషుని వశపరచుకొనే మందులూ మాకులూ మరి యెందుకమ్మా? అందులన్ (దానివల్ల) యేగుణమయ్యీని (ఏమి ప్రయోజనం వుంటుందమ్మా?)

చీరె చుంగల (పమిట చెంగు చాటునుంచి) ఆయనను, తెలిచూపుల (నిర్మలమైన చూపులు) నీ రమణునిపై ప్రయోగించు. వాటితో ఆయనకు అంగజబాణములు తాకుతాయి. రంగగు (ఎఱ్ఱని) వీడెపురసము తాంబూలపు కారపుతమ్మ (ఘాటైన యెంగిలతమ్మ) యెంగిలి గింగిలి అనక నీపతి నోటికి అందించరాదటమ్మా? ఆ రుచి తెలిస్తే నిన్ను వదులుతాడా చెప్పు.

నీ వెడనవ్వుల (సన్నని చిరునవ్వుల) వెన్నెల నీ విభునికి వడిగల (అతిశయించిన) అండవలె వడదాకె (వెచ్చగా తాకవలెను). అదరగ (అతిశయించగా) అతిరసము (ఒక తీయని వంటకము) అనెడి అమృత రసాయనము. ఆయన ఒడలికి (ఒంటికి) మంచిది. దానిని నీ విభునికి యొసగుమమ్మా!

ఓ చెలీ! నీపతి వేంకటవిభుడు. నీ కుచగిరులు మీ కలయికలో ఆయనకు వింత వింత రుచులనందించవలెను. నీ కళానైపుణ్యమును ప్రదర్శించవలెను. నీ కొనగోటి సున్నితమైన వాడి యెచ్చరికలు, మఱచిపోనట్లు ఆయనకు తెలుపవలెను. అట్లా తెలిపి చూడరాదా?

**పద్యవివరణ:**

ఉ॥ **మందులు మాకులేల మఱి మానిని యాకడగంటిచూపులున్**
**మందపువెన్నెలంటి చెలిమత్తుగనవ్విన చాలదే భళా!**
**సుందరి! చన్నుదోయి పతిచొక్కగ కౌగిట నొత్తవే తమిన్**
**అందులనే గుణంబులగు, ఆహరి లొంగున మందుబెట్టినన్?**

సంఖ్య: IV/22 రాగం : లలిత

కీర్తన : ఘనుడాతడే మము గాచుగాక హరి

**లలిత**

**100 ఘనుఁ డాతఁడే మముఁ గాచుఁగాక హరి**
**అనిశము నే మిఁక నతనికె శరణు ||పల్లవి||**

**యెవ్వనినాభిని యీ బ్రహ్మాదులు**
**యెవ్వఁడు రక్షకుఁ డిన్నిటికి**
**యెవ్వనిమూలము యీ సచరాచర-**
**మవ్వలనివ్వల నతనికే శరణు ||ఘనుఁ||**

**పురుషోత్తముఁడని పొగడి రెవ్వరిని**
**కరి నెవ్వఁడు గక్కనఁ గాచె**
**ధర యెవ్వఁడెత్తెదనుజులఁ బొరిగొనె**
**అరుదుగ మే మిఁక నతనికె శరణు ||ఘనుఁ||**

**శ్రీసతి యెవ్వనిఁ జేరి వురమునను**
**భాసిల్లె నెవ్వఁడు పరమంబై**
**దాసులకొరకై తగు శ్రీవేంకట-**
**మాస చూపె నితడతనికె శరణు ||ఘను|| 22**

**ఉపోద్ఘాతము:**

అత్యంత సులభము, సుగమము అయిన శరణాగతి వినిపిస్తున్నారు, అన్నమయ్య. చక్కటి సీసపద్యంలో ఇమిడిన దీని



హరి నీమయమే అంతాను

తాత్పర్యము దీన్ని చదువుతుండగానే అర్థమవుతుంది. నానోటిద్వారా దీన్ని పలికించి నా జన్మతరింపజేసిన వేంకటేశ్వరా! సదా నీ దాసానుదాసుడను తండ్రీ!

**తాత్పర్య వివరణ:**

ఘనుడాతడే మము రక్షించుగాక. హరి అని పిలువబడే ఆతడు, అనిశము (ఎల్లప్పుడూ) మము కాచుగాక! నేమింక (మేమింక) ఆతనికే శరణుజొచ్చెదము.

ఎవ్వని నాభికమలమునుండి చతుర్ముఖ బ్రహ్మ, సనకసనందనాది ఋషులు ఆవిర్భవించిరో, ఈ బ్రహ్మాండములన్నిటికీ రక్షకుడెవ్వరు? ఈ చరాచరములన్నీ ఎవ్వని మూలాధారముగా వర్ధిల్లుచున్నవి? అవ్వల నివ్వల (నేను అవతల వేరే లోకాలలో జీవుడుగానున్నా ఇవ్వల (ఈ భూలోకంలో జీవించివున్నా ఆతనికే శరణంటిని.)

సకలమునులు యోగులు యెవ్వరిని పురుషోత్తముడని కీర్తించినారు? అడవికొలనులో మొసలిచే పీడించబడుచున్న గజేంద్రుని రక్షించినవాడెవ్వడు, ధరలో ఎవ్వడు దనుజుల పొరిగొనియెత్తె (పొడగనిపెటి దండెత్తినాడు)? మేమిక అరుదుగానైనా గ్రహించి అతనికే శరణంటిమి.

శ్రీదేవి ప్రేమతో ఎవ్వని వురమున తిష్టవేసికొనినది? ఎవ్వడు పరబ్రహ్మయై భాసిల్లుతున్నాడు? తన దాసులు ప్రార్థించగా వారి కొరకు ఎవ్వడు శ్రీవేంకటేశ్వరుడై తిరుమల ఏడుకొండలపైనా నెలకొనియున్నాడో, ఎవ్వడు నా పాదములకు సదా మొక్కండి నా శరణార్థులను రక్షింతును అని తన పాదములను చూపుచున్నాడో ఆ దేవదేవునికే నేను శరణుజొచ్చితిని.

ఓం నమో వేంకటేశాయ.

పద్యవివరణ:

సీ॥ ఎవ్వని నాభిలో ఈ బ్రహ్మతను పుట్టె
ఎవ్వడు రక్షకుడిన్నిటికిని
ఎవ్వని మూలము యీచరాచరమెల్ల
పురుషోత్తముండెవ్వరెరుగ జగతి
ఎవ్వడు కరిబ్రోచె నెవ్వడసురవైరి
ఎవ్వడు శ్రీసతినేలు మగడు
ఎవ్వడు భాసిల్లె నిటు పరబ్రహ్మయై
ఏడుకొండలనెక్కె యేలికెవడు?

తే.గీ॥ దాసులకు రక్షకుడు హరి తాననిశము
ఆస చూపెను భక్తుల కందరికిని
"శరణుకోరుదు కాంతును శంకవలదు"
అనుచు చూపెను 'పదముల' అయ్యలార!







101 హరి మంగళము

## మంగళా శాసనం

1 శ్రియః కాంతాయ కల్యాణ నిధయే నిధయేర్థినామ్
శ్రీవేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

2 లక్ష్మీసవిభ్రమాలోక సుభ్రూవిభ్రమ చక్షుషే
చక్షుషే సర్వలోకానం వేంకటేశాయ మంగళం.

3 సర్వావయవ సౌందర్య సంపదా సర్వచేతసామ్
సదా సమ్మోహనాయాస్తు వేంకటేశాయ మంగళమ్

4 నిత్యాయ నిరవద్యాయ సత్యానంద చిదాత్మనే
సర్వాంతరాత్మనే శ్రీమద్వేంకటేశాయ మంగళమ్

5 వైకుంఠ విరక్తాయ స్వామిపుష్కరిణీతటే
రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్

6 ఎమత్సుందర జామాతృమునిమానస వాసినే
సర్వలోక నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

7 మంగళశాసనపరైః మదాచార్యపురోగమైః
సర్వైశ్చపూర్వైః సత్కృతాయాస్తు మంగళమ్

పద్మావతీ సమేత శ్రీశ్రీనివాస పరబ్రహ్మణేనమః